
సత్యమేవ జయతే

సాక్షి


'నా అక్కలూ.. చెల్లెళ్లు..
తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే
నా నిజమైన పుట్టిన రోజు'


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 297

గురువారం 18-1-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చరిత్రాత్మకంగా చైతన్య మూర్తి

19న విజయవాడ స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అంతా స్వచ్ఛందంగా తరలి రావాలని ఏపీ సీఎం వైఎస్ జగన్ సందేశం

- వివరాలు 12లో



అయోధ్యలో కలశ పూజ

అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ కోసం ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. బుధవారం కలశ పూజ చేపట్టారు.

వివరాలు 6లో ▸



ఓటర్ల మనసు గెల్చుకోవాలి

కేరళలో ఓటర్ల మనసులు గెల్చుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ నేతలు, కార్యకర్తలకు సూచించారు.

వివరాలు 6లో ▸



భద్రతా బలగాలపై దాడులు

జాతుల వైరంతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో భద్రతా బలగాలు, కుకీ మిలిటెంట్ల మధ్య కాల్పుల పర్వం కొనసాగుతోంది.

వివరాలు 6లో ▸



పాక్ ఉగ్రస్థావరాలపై..

పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైష్ అల్-అదిల్ ఉగ్రసంస్థ స్థావరాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణి దాడులతో విరుచుకుపడింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

గవర్నర్ 'ఎక్స్' ఖాతా హ్యాక్



రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా హ్యాక్ అయింది. ఖాతాను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు ఆమె డిస్‌ప్లే పిక్చర్ తీసేయడంతో పాటు పాస్‌వర్డ్‌ను సైతం మార్చేశారు. దీనిపై రాజ్‌భవన్ వర్గాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాయి.

- వివరాలు 16లో▶

మేడారం జాతర బస్సుల్లోనూ మహిళలకు ఫ్రీ



మేడారం జాతరకు వచ్చే మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వర్తింపజేస్తామని మంత్రి సీతక్క అన్నారు. మేడారం మహాజాతరపై మరో మంత్రి కొండా సురేఖతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష చేశారు.

- వివరాలు 3లో▶

ఇక 'రింగు' కోసం నిరంతర భూపరిహారం



హైదరాబాద్ రీజనల్ రింగురోడ్డులో నిరంతరాయ భూ పరిహారం పంపిణీకి మార్గం సుగమమైంది. ఇందుకు వీలుగా ఆ మార్గంలో యుటిలిటీ షిఫ్టింగ్ కోసం రూ.364 కోట్ల మొత్తాన్ని డిపాజిట్ చేసేందుకు వీలుగా రాష్ట్రం.. ఎన్‌హెచ్‌ఏఐకి లేఖ ఇచ్చింది.

- వివరాలు 5లో▶

ప్రజ్ఞానంద అద్భుతం



నెదర్లాండ్స్‌లో జరుగుతున్న టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీలో భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద సంచలనం సృష్టించాడు. నాలుగో రౌండ్ గేమ్‌లో 18 ఏళ్ల ప్రజ్ఞానంద 62 ఎత్తుల్లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)ను ఓడించాడు.

- వివరాలు 14లో▶

పెట్టుబడులకు ఎనర్జీ

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, విస్తరణకు ముందుకొచ్చిన కంపెనీలు



దావోస్‌లో గౌతమ్ అదానీని జ్ఞాపికతో సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

దావోస్ సదస్సులో రూ.37,870 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు

- రూ.12,400 కోట్లతో అదానీ గ్రూప్ కార్యకలాపాలకు గ్రీన్‌సిగ్నల్
- స్కిల్ యూనివర్సిటీ, ఎనర్జీ ప్రాజెక్టులపై అదానీ ఆసక్తి
- పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ముందుకొచ్చిన జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ
- గోడి ఇండియా సంస్థ ఆధ్వర్యంలో బ్యాటరీ సెల్ తయారీ యూనిట్
- డేటా సెంటర్లను విస్తరిస్తామన్న వెబ్ వెర్క్స్ కంపెనీ
- ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా సీఎం రేవంత్ బృందం వరుస భేటీలు

సాక్షి, హైదరాబాద్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) 54వ వార్షిక సదస్సులో భాగంగా.. రెండో రోజు బుధవారం పలు దిగ్గజ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. దావోస్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ బృందం.. పలు సంస్థల అధినేతలతో వరుస భేటీలు నిర్వహించి, ఒప్పందాలపై సంతకాలు చేసినట్టు సీఎం కార్యాలయం వెల్లడించింది. మొత్తంగా రూ.37,800 కోట్ల పెట్టుబడులకు సంబంధించి పలు ఒప్పందాలు కుదిరినట్టు, కీలక ప్రకటనలు వెలువడినట్టు తెలిపింది. సీఎంవో తెలిపిన వివరాల మేరకు.. రాష్ట్రంలో రూ.12,400 కోట్ల పెట్టుబడులకు సంబంధించి అదానీ గ్రూప్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఏరోస్పేస్-డిఫెన్స్ విభాగం సీఈఓ ఆశిశ్ రాజ్‌వంశీ ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు.

గ్రీన్ ఎనర్జీ.. స్కిల్స్ డెవలప్‌మెంట్ సెంటర్..

అదానీ గ్రూప్‌తో ఒప్పందాల్లో భాగంగా రూ.5వేల కోట్ల పెట్టుబడితో 1,350 మెగావాట్ల సామర్థ్యంతో రెండు గ్రీన్ ఎనర్జీ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను తెలంగాణలో ఏర్పాటు చేస్తారు. అనుబంధ సంస్థ అదానీ కొనెక్స్ మరో రూ.5వేల కోట్లతో 100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ క్యాంపస్‌ను

మిగతా 3వ పేజీలో ▶

సీఎంతో సీఐఐ ప్రతినిధులు

భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలంగాణ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రానికి చెందిన పలు పరిశ్రమల సీఈవోలు బుధవారం దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబులతో భేటీ అయ్యారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రభుత్వ ప్రయత్నాలను కొనియాడారు. పారిశ్రామికాభివృద్ధి కోసం తీసుకునే అన్నిరకాల నిర్ణయాలకు సీఐఐ పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు.

ఇంకా 'సెట్' కాలేదు!



రాష్ట్రంలో వివిధ కోర్సుల ప్రవేశ పరీక్షలపై మొదలవని కసరత్తు

- జనవరిలోనే షెడ్యూల్ వస్తే.. నిర్దిష్ట తేదీల నాటికి ఏర్పాట్లు పూర్తి
- ఈసారి మూడోవారం ముగుస్తున్నా అడుగు ముందుకు పడని తీరు
- ఎంసెట్ సహా ఏ పరీక్షను ఏ యూనివర్సిటీ నిర్వహించేదీ తేలక అయోమయం
- ఉన్నత విద్యా మండలిలో నెలకొన్న గందరగోళంతో ఇబ్బంది
- చైర్మన్, వైస్ చైర్మన్లను తొలగిస్తున్నట్టు ప్రకటించిన ప్రభుత్వం..
- పాత వాళ్లు వెళ్లలేదు.. కొత్త నియామకాలు జరగలేదు
- సెట్స్ కన్వీనర్ల పేర్లు సూచించడంలో వర్సిటీల వీసీల్లోనూ నిర్లిప్తత
- ఇలాగైతే ప్రవేశపరీక్షల నిర్వహణ జాప్యమవుతుందని నిపుణుల హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఉమ్మడి పరీక్షల (సెట్‌ల)పై ఇంకా కసరత్తు మొదలుకాలేదు. ఎంసెట్ సహా పాలిసెట్, ఈసెట్, ఎడ్‌సెట్, లాసెట్ పరీక్షల షెడ్యూల్‌పై అయోమయం నెలకొంది. ఏ ప్రవేశపరీక్షను ఏ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించాలి? ఏ పరీక్షకు కన్వీనర్ ఎవరనే సందిగ్ధత కొనసాగుతోంది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో నెలకొన్న గందరగోళమే దీనికి కారణమని.. దీంతో ఈసారి ప్రవేశ పరీక్షల నిర్వహణ ఆలస్యం కావొచ్చని అభిప్రాయాలు వెలువడుతున్నాయి.

ఇప్పటికే మొదలుకావాల్సి ఉన్నా..

ఏటా జనవరిలో ఎంసెట్ సహా ఇతర ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. ఆయా పరీక్షలను నిర్వహించే యూనివర్సిటీలను, కన్వీనర్లను ఖరారు చేస్తారు. ఆ వెంటనే ఆయా కన్వీనర్లు, యూనివర్సిటీల ఆధ్వర్యంలో పరీక్షలకు సంబంధించిన కసరత్తు, ఏర్పాట్లు మొదలవుతాయి. కానీ ఈసారి జనవరి మూడోవారం ముగుస్తున్నా.. షెడ్యూల్ విడుదలకు సంబంధించిన ఎలాంటి కసరత్తు మొదలుకాలేదు.

ఎంసెట్‌పై కసరత్తు ఏదీ?

జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష అయిన జేఈఈ మెయిన్స్‌ను ఈ నెల 24 నుంచి నిర్వహిస్తున్నారు. ఐఐటీలు, ఎన్‌ఐటీల్లో ప్రవేశాల కోసం జూన్ నుంచి జోసా కౌన్సెలింగ్ చేపట్టేందుకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. సాధారణంగా జేఈఈ తేదీలకు అనుగుణంగా రాష్ట్ర ఎంసెట్ కౌన్సెలింగ్ తేదీలను ఖరారు చేస్తారు. షెడ్యూల్ ప్రకటన తర్వాత.. ఎంసెట్ జరిగి, ఫలితాలు వచ్చి, కౌన్సెలింగ్ మొదలయ్యే నాటికి విశ్వవిద్యాలయాలు ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో తనిఖీలు చేసి.. అర్హత ఉన్నవాటికి అనుబంధ గుర్తింపు ఇస్తాయి. సాధారణంగా మేలో ఎంసెట్ నిర్వహించి, అదే నెలలో ఫలితాలు వెల్లడిస్తున్నారు. ఈసారి గందరగోళంతో

మిగతా 12వ పేజీలో ▶

త్వరలో నిర్ణయం..



నా కొనసాగింపుపై ప్రభుత్వం త్వరలో స్పష్టత ఇస్తుందని విశ్వసిస్తున్నాను. ఉమ్మడి ప్రవేశ పరీక్షలు సకాలంలోనే నిర్వహించాలనే పట్టుదలతో ఉన్నాం. ఆ దిశగా త్వరలో షెడ్యూల్ ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

- ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యా మండలి చైర్మన్

'గవర్నర్' కోటాపై మెలిక!

హైకోర్టులో కేసు తేలాకే నిర్ణయం

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీ ప్రతిపాదనలపై గవర్నర్ తమిళిసై



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటా కింద ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేయడానికి ముందే గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పీటముడి వేశారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీకి సంబంధించి హైకోర్టులో ఉన్న కేసు పరిష్కారమయ్యే వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకూడదని గవర్నర్ తమిళిసై నిర్ణయించినట్లు బుధవారం రాజ్‌భవన్ ఓ ప్రకటనలో తెలిపింది. గవర్నర్ కోటా కింద దాసోజు శ్రవణ్‌కుమార్, కె.సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా నియమించాలని ప్రతిపాదిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సిఫారసులను సెప్టెంబర్ 19న తిరస్కరిస్తూ గవర్నర్ తమిళిసై ఉత్తర్వులు జారీచేశారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ అభ్యర్థులిద్దరూ వేసిన కేసు ఇటీవల రాష్ట్ర హైకోర్టు ముందుకు

మిగతా 2వ పేజీలో ▶



చేతికర్ర సాయంతో కేసీఆర్ అడుగులు

- 'ఎక్స్'లో వీడియో పోస్ట్ చేసిన ఎంపీ సంతోష్

- వివరాలు 2లో

కాంగ్రెస్ మార్క్ సెలక్షన్!

- విద్యార్థి దశ నుంచి పార్టీలో ఉన్న వారికి ఎమ్మెల్సీ అవకాశం
- బల్మూరి వెంకట్, మహేశ్ కుమార్ గౌడ్‌కు చాన్స్ ఇచ్చిన కాంగ్రెస్
- వెంకట్ పేరును ప్రతిపాదించిన రాహుల్!
- అద్దంకి దయాకర్‌కు చివరి నిమిషంలో అధిష్టానం ఝలక్!
- విధేయతకు పెద్దపీట వేశారని అంటున్న గాంధీభవన్ వర్గాలు



బల్మూరి వెంకట్



మహేశ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ మార్కు స్పష్టంగా కనిపించింది. ఎవరూ ఊహించని విధంగా భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్ఎస్‌యూఐ) రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట నర్సింగరావుకు అవకాశం ఇచ్చింది. వెంకట్‌తో పాటు ముందు నుంచీ ఊహిస్తున్న విధంగానే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మరో అభ్యర్థిగా ఎంపిక చేసింది. ఈ మేరకు ఏఐసీసీ అధికారికంగా ప్రకటించింది. బల్మూరి వెంకట్ ఓసీ (వెలమ) వర్గానికి చెందిన వారు కాగా, మహేశ్‌కుమార్ బీసీ (గౌడ) వర్గానికి చెందిన

మిగతా 2వ పేజీలో ▶

గ్యారంటీల చావు వార్తే

కాంగ్రెస్ హామీలను నెరవేర్చడం అసాధ్యం



- అధికారం కోసం అరచేతిలో వైకుంఠం
- హామీల అమలు కోసం పోరాడుదాం.. కార్యకర్తలు కోరుకున్న రీతిలోనే ఇకపై బీఆర్ఎస్ పనిచేస్తుంది
- కూల్చడం, చీల్చడం కాంగ్రెస్, బీజేపీకి అలవాటు
- బీఆర్ఎస్ లోక్‌సభ సమావేశంలో మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: 'ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే ఏటా రూ. 3.5 లక్షల కోట్లు కావాలి. కర్ణాటకలో ఐదు గ్యారంటీలు అమలు చేస్తే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని ఆ రాష్ట్ర ఆర్థిక సలహాదారు చెప్తున్నారు. తెలంగాణలోనూ గ్యారంటీల చావు వార్త చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవు' అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఎలాగూ అధికారంలోకి రాలేమనే భావనతో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను అరచేతిలో వైకుంఠం చూపేలా తయారు చేసిందని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో వచ్చే ఆదాయానికి మించిన హామీలను కాంగ్రెస్ ఇచ్చిందని, వాటిని నెరవేర్చడం అసాధ్యమని ఆయన తేల్చిచెప్పారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన నాగర్‌కర్నూలు లోక్ సభ

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి!



...ఎన్నికలు పెట్టుకుని ఎవరూ ఆ సాహసం చేయరు సార్!

గగనంలో అద్భుత వీక్షణకు వేళాయె

- నేటి నుంచి బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో వింగ్స్ ఇండియా-2024
- నాలుగు రోజులపాటు లోహ విహంగాల సందడి
- 106 దేశాల నుంచి 1,500 మంది డెలిగేట్స్
- మొదటి 2 రోజులు వ్యాపార, వాణిజ్య వేత్తలకు, ఆ తరువాత రెండు రోజులు సామాన్యులకు అనుమతి

- వివరాలు 2లో



ప్రాజెక్టులు కృష్ణా బోర్డు చేతికి



నెలలోగా అప్పగింతకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి ఆదేశం

- వారంలోగా నాగార్జున సాగర్, శ్రీశైలం అప్పగింత విధానం ఖరారుకు త్రిసభ్య కమిటీకి సూచన
- 15 రోజుల్లోగా రెండు రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులతో సమీక్షిస్తానని వెల్లడి.. సాగర్ వద్ద నవంబర్ 29కి ముందు ఉన్న స్థితిని కొనసాగించాలన్న తెలంగాణ ప్రతిపాదనకు తిరస్కరణ

- వివరాలు 8లో

రోహిత్ సూపర్... భారత్ 'డబుల్ సూపర్'



పలు మలుపులు తిరిగిన చివరి టి20 మ్యాచ్‌లో భారత జట్టు రెండో సూపర్ ఓవర్‌లో అఫ్గానిస్తాన్ జట్టును ఓడించింది. మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. రోహిత్ శర్మ (69 బంతుల్లో 121 నాటౌట్; 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) అంతర్జాతీయ టి20ల్లో ఐదో సెంచరీ చేశాడు. భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 212 పరుగులు చేసింది. అఫ్గానిస్తాన్ జట్టు కూడా 20 ఓవర్లలో 6 వికెట్లకు 212 పరుగులు చేయడంతో ఫలితం తేలడానికి 'సూపర్ ఓవర్' నిర్వహించారు. అయితే ఈ 'సూపర్ ఓవర్' కూడా 'టై' కావడంతో ఫలితం రావడానికి రెండో 'సూపర్ ఓవర్'ను ఆడించారు. ఇందులో భారత్ పైచేయి సాధించి సిరీస్‌ను 3-0తో దక్కించుకుంది.

14లో

క్లుప్తంగా...

ఎప్పుడైనా తెలంగాణ గళం బీఆర్‌ఎస్సే

పార్లమెంటులో కొట్లాడేది మా పార్టీయే: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్‌: పార్లమెంటులో తెలంగాణ గళాన్ని గట్టిగా వినిపించేందుకు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలని పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ పిలుపునిచ్చారు. తెలంగాణ హక్కులు, ప్రయోజనాలకు సంబంధించి 16, 17వ లోక్‌సభలో బీఆర్‌ఎస్‌ ఎంపీలు తమ గళాన్ని గట్టిగా వినిపించారనేందుకు వారు వేసిన ప్రశ్నలు, వినిపించిన వాదనలకు సంబంధించిన గణాంకాలే నిదర్శనమని పేర్కొన్నారు. '2014లో రాష్ట్రం సాధించినపుడు తెలంగాణకు ఉన్న ఏకైక గొంతుక టీఆర్‌ఎస్‌, 2024లో కూడా తెలంగాణకు ఉన్న ఏకైక గళం బీఆర్‌ఎస్‌ మాత్రమే. నాడు, నేడు.., ఏనాడైనా తెలంగాణ గళం, బలం, దళం బీఆర్‌ఎస్‌ పార్టీయే'అని 'ఎక్స్‌'వేదికగా కేటీఆర్‌ పేర్కొన్నారు.

నేడు బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీల భేటీ

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ భవన్‌లో గురువారం బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీలతో ఆ పార్టీ కీలక భేటీ జరగనుంది. ఈ సమావేశానికి పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నారు. ఈ నెల 3 నుంచి జరుగుతున్న లోక్‌సభ నియోజకవర్గాల వారీగా బీఆర్‌ఎస్‌ సన్నాహక సమావేశాలు ఈ నెల 22న ముగియనున్నాయి. పార్టీ ఎమ్మెల్సీలకు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఇన్‌చార్జి బాధ్యతలతోపాటు నూతన జిల్లాల వారీగా పార్టీ సమన్వయకర్తలుగా నియమించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్‌ కబ్జాలన్నీ బయటకు తీస్తాం

ఎక్సైజ్‌ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



వనపర్తి: బీఆర్‌ఎస్‌ పాలనలో జరిగిన ప్రభుత్వ భూముల కబ్జాలన్నింటినీ బహిర్గతం చేయటంతో పాటు ప్రభుత్వ ఖజానాకు గండికొట్టి కొందరు నాయకులు జేబులు నింపుకున్న అంశాలను ప్రజలకు తెలియజేస్తామని రాష్ట్ర ఎక్సైజ్‌ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, వాకిటి శ్రీహరిలతో కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలోని కొందరు నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అడ్డగోలుగా చేసిన భూకబ్జాలను వెలికి తీసి తిరిగి ప్రభుత్వ అధీనంలోకి తీసుకువస్తామని, అక్రమ లీజులు, అభివృద్ధి పేరిట చేసిన దోపిడీపై సమగ్ర విచారణకు ప్రతి నెలా సమీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

'20న పాస్‌పోర్ట్‌ అదాలత్‌'



బన్సీలాల్‌పేట (హైదరాబాద్‌): సికింద్రాబాద్‌ ప్రాంతీయ పాస్‌పోర్ట్‌ కార్యాలయంలో ఈ నెల 20న పాస్‌పోర్టు అదాలత్‌ నిర్వహించనున్నారు. వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అప్పటికప్పుడే క్లియర్‌ చేస్తామని ఆర్‌పీవో స్నేహజ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, దరఖాస్తుదారులు ఒరిజినల్‌ పత్రాలతో నేరుగా సికింద్రాబాద్‌ కార్యాలయానికే రావాలని సూచించారు.

ఇంకా మంచి హోదా ఇచ్చే ఆలోచన ఉందేమో?

ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం చేజారడంపై కాంగ్రెస్‌ నేత అద్దంకి



సాక్షి, హైదరాబాద్‌: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను ఎంపిక చేయనంత మాత్రాన ఎవరూ నిరాశ చెందవద్దని, తనకు ఇంకా మంచి హోదా కల్పించే ఆలోచన పార్టీకి ఉందేమోనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్‌ వ్యాఖ్యానించారు. చివరి నిమిషంలో ఎమ్మెల్సీ టికెట్‌ చేజారిన అనంతరం బుధవారం మధ్యాహ్నం ఆయన ఒక వీడియోను మీడియాకు విడుదల చేశారు. 'నాకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వనందుకు నా అభిమానులు బాధపడుతున్నారు. అలా బాధపడాల్సిన పనిలేదు. ప్రతి సారీ నాకు అన్యాయం జరుగుతోందని, నాపై పార్టీలో కుట్ర జరుగుతోందని భావించాల్సిన పని లేదు. ఇదే విషయాన్ని నాతో మాట్లాడినప్పుడు దీపా దాస్‌మున్షీ కూడా చెప్పారు. పార్టీ నిర్ణయాలను గౌరవించాల్సిన బాధ్యత నాపై ఉంది'అని దయాకర్‌ ఆ వీడియోలో వెల్లడించారు.

'గవర్నర్‌' కోటాపై మెలిక!

▶ మొదటి పేజీ తరువాయి

విచారణకు వచ్చింది. తొలుత కేసు విచారణార్హతను తేల్చాలని నిర్ణయిస్తూ తదుపరి విచారణను ఈ నెల 24కు హైకోర్టు వాయిదా వేసింది. ఈ కేసు పరిష్కారమయ్యే వరకు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోరాదని గవర్నర్‌ తమిళిసై నిర్ణయించారు. గవర్నర్‌ కోటా కింద ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్‌ కోదండరాం, మరొకరి పేరును ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని వార్తలు వచ్చాయి. తాజాగా గవర్నర్‌ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది.

గగనంలో అద్భుత వీక్షణకు వేళాయె..

నేటి నుంచి బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో వింగ్స్‌ ఇండియా-2024

నాలుగు రోజులపాటు లోహ విహంగాల సందడి

106 దేశాల నుంచి 1,500 మంది ప్రతినిధులు

సనత్‌నగర్‌ (హైదరాబాద్‌): గగనంలో గగుర్పొడిచే విన్యాసాలకు మరోసారి బేగంపేట విమానాశ్రయం వేదికైంది. వింగ్స్‌ ఇండియా-2024కు కౌంట్‌డౌన్‌ మొదలైంది. రెండేళ్లకోసారి జరిగే ఈ వేడుకను కేంద్ర పౌర విమానయాన శాఖ, ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా చాంబర్స్‌ ఆఫ్‌ కామర్స్‌ అండ్‌ ఇండస్ట్రీ (ఫిక్కీ) సంయుక్తంగా ఈ నెల 18 నుంచి 21 వరకు నిర్వహిస్తున్నాయి. గురువారం ఉదయం 10 గంటలకు జరిగే వింగ్స్‌ ఇండియా-2024 ప్రారంభోత్సవానికి కేంద్ర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. దాదాపు 25 విమానాలు, హెలికాప్టర్లను ప్రదర్శనకు ఉంచనున్నారు. తొలిసారి ప్రదర్శనకు వస్తున్న బోయింగ్‌తోపాటు ఎయిర్‌ ఇండియా మొదటి హెలికాప్టర్‌ ఏ350 లాంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. మొదటి 2 రోజులు (18, 19 తేదీలు) వ్యాపార, వాణిజ్యవేత్తలను, ఆ తరువాత రెండు రోజులు (20, 21 తేదీలు) సామాన్యులను అనుమతిస్తారు. ఈ షోలో 106 దేశాల నుంచి 1500 మంది డెలిగేట్స్‌, 5,000 మంది బిజినెస్‌ విజిటర్స్‌ పాల్గొననున్నట్లు అంచనా.

ఫ్లయింగ్‌ డిస్‌ప్లే సమయం పెరిగిందోచ్‌..

ఇండియన్‌ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన సారంగ్‌ టీమ్‌తోపాటు మార్క్‌ జాఫరీస్‌ బృందం చేసే వైమానిక విన్యాసాలను కళ్లు ఆర్పకుండా చూడాల్సిందే. గతంలో ఫ్లైయింగ్‌ డిస్‌ప్లే సమయాన్ని కేవలం 15 నిమిషాల చొప్పున రోజుకు రెండు పర్యాయాలు నిర్వహించగా, ఈసారి 45 నిమిషాల చొప్పున రోజుకు రెండు సార్లు విన్యాసాలు చేయనున్నారు. చివరి రోజు ఆదివారం సందర్శకులు ఎక్కువగా విచ్చేయనున్న దృష్ట్యా ఆ రోజు మూడుసార్లు విన్యాసాలు నిర్వహించనున్నారు.

సారంగ్‌ టీమ్‌ వచ్చేసింది.. ముగ్గురు హైదరాబాదీలే..

ఇండియన్‌ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన సారంగ్‌ టీమ్‌ మరోసారి తమ వైమానిక విన్యాసాలు ప్రదర్శించేందుకు రెడీ అయ్యింది. ప్రపంచంలోనే ఏరోబాటిక్స్‌ చేసే ఏకైక జట్టుగా పేరొందిన ఈ టీమ్‌ ఇప్పటికే హైదరాబాద్‌కు చేరుకుంది. ఐదు హెలికాప్టర్లతో ఏరోబాటిక్స్‌ ప్రదర్శించే ఈ బృందానికి సీనియర్‌ గ్రూప్‌ కెప్టెన్‌ ఎస్‌కే మిశ్రా నేతృత్వం వహిస్తున్నారు. ఏరోబాటిక్స్‌ ప్రదర్శన చేసే ఐదుగురిలో ముగ్గురు హైదరాబాదీలే కావడం విశేషం. హైదరాబాదీలైన వింగ్‌ కమాండర్లు టీవీఆర్‌ సింగ్‌, అవినాష్‌ సారంగ్‌ టీమ్‌లో రాణిస్తున్నారు. దేశ, విదేశాల్లో ఈ టీమ్‌ 350 షోలకు పైగా నిర్వహించి రికార్డు సృష్టించింది.

వైమానిక విన్యాసాల వేళలు

- 18వ తేదీన మధ్యాహ్నం 1 – 2 గంటల వరకు, 4.15–5 గంటల వరకు
- 19న ఉదయం 11.30–12.15 వరకు, మధ్యాహ్నం 3.30–4.15 వరకు. అనంతరం డ్రోన్‌ షో జరగనుంది.
- 20న ఉదయం 11.30–12.15 వరకు, మధ్యాహ్నం 3.30–4.15 వరకు..
- 21న ఉదయం 11–11.45 వరకు, మధ్యాహ్నం 3–3.45 వరకు, సాయంత్రం 5–5.45 వరకు



వింగ్స్‌ ఇండియా-2024 ప్రదర్శనలో విమానాలు

అదనపు వనరులపై దృష్టిపెట్టండి

ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించండి

- పెండింగ్‌ బకాయిలను వసూలు చేయండి
- వివిధ శాఖల అధికారులకు ఆర్థికమంత్రి భట్టి ఆదేశం
- మైనింగ్‌ ఆదాయం పెంచే కార్యాచరణ రూపొందించాలని సూచన



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయంతోపాటు అదనపు వనరుల సమీకరణపై దృష్టిపెట్టాలని వివిధ శాఖల అధికారులను ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. శాఖల వారీగా ప్రభుత్వానికి రావాల్సిన పెండింగ్‌ బకాయిలను వసూలు చేయాలని సూచించారు. బుధవారం సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలసి పరిశ్రమలు, గనులు, భూగర్భ వనరులు, హౌజింగ్‌ కార్పొరేషన్‌, బోర్డు, హెచ్‌ఎండీఏ, టీఎస్‌ఐఐసీ ఉన్నతాధికారులతో భట్టి సమీక్షించారు. పరిశ్రమల శాఖ, టీఎస్‌ఐఐసీ, హెచ్‌ఎండీఏల పరిధిలో ఇప్పటివరకు జరిగిన భూముల అమ్మకాలు, వాటితో రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం, రావాల్సిన బకాయిలు, వాటి వసూలు కోసం కార్యాచరణపై చర్చించారు.

ప్రతి పైసా రాబట్టండి

ప్రభుత్వానికి రావాల్సిన ప్రతి పైసానూ సమీకరించే బాధ్యతను ఆయా శాఖల అధికారులు తీసుకోవాలని భట్టి స్పష్టం చేశారు. ఇండస్ట్రియల్‌ పార్కులను వినియోగంలోకి తీసుకురావడానికి అన్ని చర్యలు చేపట్టాలన్నారు. తూప్రాన్‌ ఇండస్ట్రియల్‌ పార్కు కోసం ప్రభుత్వం 325 ఎకరాలు కేటాయించగా.. ఇప్పటివరకు 139 ఎకరాలు అప్పగించారని, మిగతా భూమిని సేకరించాల్సి ఉందని అధికారులు వివరించారు. హౌజింగ్‌ బోర్డ్‌ ఆధ్వర్యంలో చేపట్టిన 12 జాయింట్‌ వెంచర్లలో 6 పూర్తయ్యాయని.. వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.955 కోట్లు రావాల్సి ఉండగా, రూ.430 కోట్లు వచ్చాయని వివరించారు. మైనింగ్‌ రాయల్టీ ద్వారా రావాల్సిన ఆదాయం, దానిని పెంచుకోవడానికి ఉన్న అవకాశాలపై కూడా గనుల శాఖ అధికారులను మంత్రి ఆరా తీశారు. రాష్ట్రంలో ఇసుక కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో గనులు భూగర్భ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి మహేశ్‌దత్‌ ఎక్కా, ఆర్థిక శాఖ జాయింట్‌ సెక్రెటరీ హరిత, పరిశ్రమల శాఖ డైరెక్టర్‌ రెహమాన్‌, హౌసింగ్‌ కార్పొరేషన్‌ ఎండీ విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ మార్క్‌ సెలక్షన్‌!

▶ మొదటి పేజీ తరువాయి

వారు కావడం గమనార్హం. తొలుత బల్మూరితో పాటు దళిత నాయకుడు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ సీటు ఖరారైందనే వార్తలు వెలువడ్డాయి. నామినేషన్‌ పత్రాలు సిద్ధం చేసుకోవాల్సిందిగా చెప్పిందని కూడా ప్రచారం జరిగింది. కానీ చివరి నిమిషంలో కాంగ్రెస్‌ అధిష్టానం ఆయనకు ఝలక్‌ ఇచ్చింది. గవర్నర్‌, స్థానిక సంస్థలు, గ్రాడ్యుయేట్స్‌ కోటా ఎమ్మెల్సీ పదవులను ఎస్సీ, మైనార్టీ వర్గాలకు కేటాయిస్తారని తెలుస్తోంది.

మొదట్నుంచీ పార్టీకి విధేయుడు

ఎన్నికైతే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అతి తక్కువ వయసులో ఎమ్మెల్సీ అయిన నేతగా బల్మూరి వెంకట్‌ రికార్డు సృష్టించనున్నారు. ఇక ఆయన ఎంపికకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. వెంకట్‌ మొదటి నుంచి కాంగ్రెస్‌ పార్టీకి విధేయుడిగా ఉన్నారు. విద్యార్థి స్థాయి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న వారికి ఖచ్చితంగా భవిష్యత్‌ ఉంటుందన్న సంకేతాలు పంపడంలో భాగంగానే వెంకట్‌ను ఎమ్మెల్సీగా ఎంపిక చేశారనే చర్చ జరుగుతోంది. పార్టీ సంస్థాగత నిర్మాణంలో పాలు పంచుకున్న పలువురు నేతలకు కాంగ్రెస్‌ పార్టీ తగిన ప్రాధాన్యత కల్పించిందని, అందులో భాగంగా వెంకట్‌కు ఈ ప్రాధాన్యత లభించిందని చెబుతున్నారు. మరోవైపు పార్టీ పట్ల వెంకట్‌కున్న విధేయత కూడా కలిసి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2021 అక్టోబర్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో హుజూరాబాద్‌ నుంచి వెంకట్‌ను పోటీకి దింపిన కాంగ్రెస్‌ పార్టీ.. అంతకు ముందు 2018 ఎన్నికల్లో పెద్దపల్లి అసెంబ్లీ టికెట్‌ను, ఆ తర్వాత 2023 ఎన్నికల్లో హుజూరాబాద్‌ టికెట్‌ను ఇవ్వలేదు. అయినా పార్టీ పట్ల విధేయతతో వెంకట్‌ అవిశ్రాంతంగా ఉద్యమాలు నిర్వహించారు. టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల భర్తీ, పేపర్‌ లీకేజీలు, పోలీసు ఉద్యోగాల విషయంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంపై పోరాడారు. అనేకసార్లు గాయపడ్డారు. పదుల సంఖ్యలో కేసులు నమోదు కావడంతో జైలుకు కూడా వెళ్లారు. చర్లపల్లి జైల్లో ఉన్న వెంకట్‌ను ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా పరామర్శించారు. ఈ విధేయతే వెంకట్‌కు అనూహ్యంగా పెద్దల సభకు వెళ్లే అవకాశాన్ని కల్పించిందని, 2023 ఎన్నికల కంటే ముందే కేసీ వేణుగోపాల్‌ స్వయంగా వెంకట్‌ భవిష్యత్తుకు హామీ ఇచ్చిన దృష్ట్యా ఆయన్ను ఎమ్మెల్సీగా ఎంపిక చేశారనే చర్చ కాంగ్రెస్‌ వర్గాల్లో జరుగుతోంది. వెంకట్‌ పేరును రాహుల్‌గాంధీ స్వయంగా ప్రతిపాదించారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రెండో ఎమ్మెల్సీగా అద్దంకి దయాకర్‌, మహేశ్‌గౌడ్‌ల పేర్ల పరిశీలన జరిగిందని, చివరకు పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వైపు పార్టీ మొగ్గు చూపిందని చెబుతున్నారు.

సంస్థాగత నిర్మాణంలో మహేశ్‌ సక్సెస్‌

మహేశ్‌కుమార్‌ గౌడ్‌ కూడా విద్యార్థి రాజకీయాల నుంచి కాంగ్రెస్‌ పార్టీలో కొనసాగుతున్నారు. 1986–1990 వరకు నిజామాబాద్‌ జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత యూత్‌ కాంగ్రెస్‌లోనూ పనిచేశారు. అనంతరం పీసీసీ కార్యదర్శిగా నియమితులయ్యారు. 2013–14 వరకు ఉమ్మడి రాష్ట్ర వేర్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌గా పనిచేశారు. ఇక, 2014లో జరిగిన ఎన్నికల్లో నిజామాబాద్‌ అర్బన్‌ స్థానం నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగస్వామి అయిన మహేశ్‌గౌడ్‌ ప్రస్తుతం టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల బాధ్యుడిగా పనిచేస్తున్నారు. 2023 ఎన్నికల్లో నిజామాబాద్‌ అర్బన్‌ టికెట్‌ ఆశించినా కొన్ని సమీకరణల వల్ల సాధ్యం కాలేదు. అయినా పార్టీకి వెన్నుదన్నుగా నిలిచి సంస్థాగత వ్యవహారాలను చక్కదిద్దడంలో సఫలీకృతులయ్యారనే చర్చ కాంగ్రెస్‌ వర్గాల్లో జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్‌ ఇవ్వలేని కారణంగా ఎమ్మెల్సీ లేదా పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తామని గతంలోనే అధిష్టానం మహేశ్‌కు హామీ ఇచ్చిందని, అందుకే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎంపిక చేసిందని గాంధీభవన్‌ వర్గాలంటున్నాయి.

నిస్వార్థంతో చేసిన కష్టానికి గుర్తింపు: వెంకట్‌

ప్రజాసమస్యల పరిష్కారం కోసం, పార్టీ బలోపేతం కోసం నిస్వార్థంతో సేవ చేసినందుకు కాంగ్రెస్‌ పార్టీ ఓ యువ కార్యకర్తకు గుర్తింపునిచ్చిందని బల్మూరి వెంకట్‌ చెప్పారు. తనను ఎమ్మెల్సీగా ఎంపిక చేసిన పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై నమ్మకంతో పెట్టిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు.

ఇన్నాళ్ల ఓపికకు ఫలితం దక్కింది: మహేశ్‌ గౌడ్‌

కాంగ్రెస్‌ గొప్ప పార్టీ అని, కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని, ఇందుకు ఎమ్మెల్సీగా తన అభ్యర్థిత్వమే నిదర్శనమని మహేశ్‌కుమార్‌ గౌడ్‌ అన్నారు. పార్టీ కోసం ఇన్నాళ్లు ఓపికతో పనిచేసినందుకు తగిన ఫలితం దక్కిందని చెప్పారు. ఏఐసీసీ పెద్దలు ఖర్గే, సోనియా, రాహుల్‌, కేసీ వేణుగోపాల్‌, దీపాదాస్‌ మున్షీలతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్‌ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులుగా మహేశ్‌ గౌడ్‌, బల్మూరి

నేడు నామినేషన్ల దాఖలు

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు ఇద్దరిని కాంగ్రెస్‌ అధిష్టానం ఖరారు చేసింది. పీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బి.మహేశ్‌ కుమార్‌ గౌడ్‌, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట నర్సింగరావు (వెంకట్‌) అభ్యర్థిత్వాలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ జగ్గారెడ్డి ఇద్దరికీ పార్టీ బీ ఫారాలు అందజేశారు. కాగా మహేశ్‌కుమార్‌గౌడ్‌, బల్మూరి వెంకట్‌ గురువారం ఉదయం విడివిడిగా తమ నామినేషన్లు దాఖలు చేస్తారని సీఎల్పీ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

బల్మూరి వెంకట్‌

తండ్రి	: మదన్‌మోహన్‌రావు
పుట్టిన తేదీ	: నవంబర్‌ 2, 1992
విద్యార్హత	: ఎంబీబీఎస్‌
పుట్టిన ఊరు	: తారుపల్లి, కాల్వ శ్రీరాంపూర్‌, పెద్దపల్లి జిల్లా
కులం	: ఓసీ (వెలమ)

బొమ్మ మహేశ్‌కుమార్‌ గౌడ్‌

తండ్రి	: బి.గంగాధర్‌ గౌడ్‌
పుట్టిన తేదీ	: ఫిబ్రవరి 24, 1966
విద్యార్హత	: బీకామ్‌
పుట్టిన ఊరు	: రహత్‌నగర్‌, భీంగల్‌ మండలం, నిజామాబాద్‌ జిల్లా
కులం	: బీసీ (గౌడ)

సాక్షి లైఫ్‌.. మీ ఆరోగ్య నేస్తం



వైద్య రంగంలో విశ్వసనీయమైన సమాచారాన్ని అందించేందుకు 'సాక్షి లైఫ్‌'ను తీసుకొచ్చింది సాక్షి మీడియా గ్రూప్‌. సమస్త ఆరోగ్య సమచారాన్ని సమగ్రంగా ఆర్టికల్స్‌, వీడియోల రూపంలో తీర్చిదిద్దింది. ఆరోగ్యం పట్ల అవగాహన పెంచేందుకు నిష్ణాతులైన డాక్టర్ల సూచనలు, సలహాలతో పాటు ఆహారం, వ్యాయామాల గురించి వివరంగా ఇందులో నిక్షిప్తం చేసింది. life.sakshi.com పేరుతో వచ్చిన ఈ వెబ్‌సైట్‌లో వైద్యరంగానికి సంబంధించిన అన్ని అప్‌డేట్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. వివిధ విభాగాలకు సంబంధించి ప్రముఖ వైద్యుల ఇంటర్వ్యూలు, నిపుణుల సలహాలను వీడియోల రూపంలో యూట్యూబ్‌లో sakshi life ఛానల్‌లో అప్‌లోడ్‌ చేసింది.

'సాక్షి' ఇద్దరి స్ఫూర్తితో ఈ ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. వైద్యరంగం నుంచి వచ్చి రాజకీయ నాయకుడిగా ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించిన మహానేత డాక్టర్‌ వై.ఎస్‌.రాజశేఖరరెడ్డి ఒకరు. రూపాయికే వైద్యం అందించి ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోయిన వైఎస్సార్‌.. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆరోగ్యశ్రీ ని తీసుకొచ్చి ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. మరొకరు డాక్టర్‌ ఈ.సీ.గంగిరెడ్డి. నిస్వార్థ వైద్య సేవలకు మారుపేరుగా నిలిచి ప్రజల గుండెల్లో కొలువైన డాక్టర్‌ ఈసీ గంగిరెడ్డి వైద్యం వృత్తి కాదు, ప్రాణం అని నమ్మారు. ఈ ఇద్దరి మహనీయుల స్ఫూర్తితో 'సాక్షి లైఫ్‌ ' తెలుగు ప్రజల ముందుకు వస్తోంది.

ఆరోగ్య సమాచారాన్ని సులువుగా తెలుగు వారందరికీ అందించాలన్నదే 'సాక్షి' లక్ష్యం. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌ గవర్నర్‌ ఎస్‌.అబ్దుల్‌ నజీర్‌, శ్రీమతి వై.ఎస్‌.భారతి రెడ్డి 'సాక్షి లైఫ్‌' వెబ్‌సైట్‌ తోపాటు యూట్యూబ్‌ ఛానెల్‌ ను లాంఛనంగా ఆవిష్కరించారు. సాక్షి లైఫ్‌ ప్రజలందరి ఆరోగ్య నేస్తం. అందుబాటులో ఉన్న వేర్వేరు వైద్య విధానాల గురించి చెప్పడమే కాదు, అసలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి కూడా తెలియజేస్తుంది.

life.sakshi.com

https://www.youtube.com/@life.sakshi

సాక్షి లైఫ్‌ ప్రారంభం సందర్భంగా ప్రముఖ డాక్టర్లు ఏమన్నారంటే...



'హెల్త్‌ కు సంబంధించిన విశ్వసనీయమైన సమాచారం సాక్షి లైఫ్‌లో ఉంది. ఇది సమాజానికి చాలా అవసరం.'
- డా.డి.నాగేశ్వర్‌ రెడ్డి, పద్మభూషణ్‌ అవార్డు గ్రహీత



'జీవనశైలిలో మార్పులే రోగాలకు కారణం, ఈ విషయంపై సాక్షి లైఫ్‌లో నిపుణుల సలహాలున్నాయి.'
- డా.గోపీ చంద్‌ మన్నం, చీఫ్‌ కార్డియో థొరాసిక్‌ సర్జన్‌



'ప్రస్తుతం నమ్మకమైన వైద్య సమాచారం అందుబాటులో లేదు, ఆ లోటును సాక్షి లైఫ్‌ భర్తీ చేస్తుందనుకుంటున్నాను'.
- డా. మంజుల అనగాని, ప్రముఖ గైనకాలజిస్ట్‌



'ఆరోగ్య రంగానికి సంబంధించిన సరైన సమాచారాన్ని నిపుణులైన వైద్యుల ద్వారా అందుబాటులోకి తెచ్చిన 'సాక్షి లైఫ్‌' కు వెల్‌కమ్‌'
- డా.కోనేటి నాగేశ్వరరావు, పీడియాట్రిక్‌ కార్డియాలజిస్ట్‌



'వైద్యరంగంలో పరిశోధనలు, వాటి విశేషాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి. వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా సాక్షి లైఫ్‌ను తీర్చిదిద్దారు'.
- డా. చిన్నబాబు సుంకవల్లి, రోబోటిక్‌ సర్జికల్‌ ఆంకాలజిస్ట్‌



'మానసిక సమస్యలు పైకి చెప్పుకోలేని వారికి సాక్షి లైఫ్‌లో నిపుణుల ఇంటర్వ్యూల ద్వారా మంచి అవగాహన కలుగుతుంది, ఆల్‌ ది బెస్ట్‌'
- డా. పూర్ణిమ నాగరాజు, సైకియాట్రిస్ట్‌



'ప్రతీ ఒక్కరికి గుండె కీలకం, అది ఆరోగ్యంగా ఉండాలంటే ఏం చేయాలన్నది సాక్షి లైఫ్‌లో విపులంగా చెప్పారు'.
- డా. ఎమ్‌.ఎస్‌.ఎస్‌. ముఖర్జీ, సీనియర్‌ ఇంటర్‌ వెన్షనల్‌ కార్డియాలజిస్ట్‌



'ఆర్థరైటిస్‌ సమస్యలు తలెత్తడానికి కారణాలు.. ముందుగా తెలుసుకుంటే అవి రాకుండా జాగ్రత్త పడొచ్చు.. ఇలాంటి సమాచారాన్ని సాక్షి లైఫ్‌ ద్వారా అందిస్తున్నారు.'
- డా.కె. జె.రెడ్డి, జాయింట్‌ రీప్లేస్మెంట్‌ సర్జన్‌

చేతికర్ర సాయంతో కేసీఆర్‌ అడుగులు

'ఎక్స్‌'లో వీడియో పోస్టు చేసిన ఎంపీ సంతోష్‌

సాక్షి, హైదరాబాద్‌: తుంటి ఎముక శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న బీఆర్‌ఎస్‌ అధినేత కె.చంద్రశేఖర్‌రావు చేతికర్ర సాయంతో అడుగులు వేస్తున్నారు. గత నెల రోజులుగా నందినగర్‌లోని తన నివాసంలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న కేసీఆర్‌ నాలుగు రోజుల క్రితం ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. వైద్యుల పర్యవేక్షణలో కేసీఆర్‌ అడుగులు వేస్తున్న వీడియోను రాజ్యసభ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్‌ బుధవారం 'ఎక్స్‌'లో పోస్ట్‌ చేశారు. 'చేతికర్ర సాయంతో వేసే ప్రతి అడుగులో తిరిగి శక్తిని పుంజుకుంటున్నారు. కొద్ది రోజుల్లోనే పూర్తిగా కోలుకుని దృఢ సంకల్పంతో ప్రజల ముందుకు వస్తారు'అని పేర్కొన్నారు. కాగా, బీఆర్‌ఎస్‌ కార్యకలాపాల్లో కేసీఆర్‌ త్వరలోనే పూర్తి స్థాయిలో పాల్గొంటారనే వార్తల నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన వీల్‌ చైర్‌లో వచ్చినా తెలంగాణ భవన్‌లోని తన చాంబర్‌కు వెళ్లేందుకు వీలుగా కొత్తగా ర్యాంప్‌ను నిర్మించారు.

నేడు గజ్వేల్‌లో కృతజ్ఞత సభ

కేసీఆర్‌ గజ్వేల్‌ ఎమ్మెల్యేగా వరుసగా మూడు పర్యాయాలు గెలుపొందిన నేపథ్యంలో గురువారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ కేంద్రంలోని శోభ గార్డెన్‌లో కృతజ్ఞత సభను బీఆర్‌ఎస్‌ పార్టీ నిర్వహిస్తోంది. మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్సీ యాదవరెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

చికిత్సకు స్పందిస్తున్న తమ్మినేని

ఏఐజీ బులెటిన్‌ వెల్లడి



సాక్షి, హైదరాబాద్‌: అనారోగ్యంతో హైదరాబాద్‌ ఏఐజీ ఆసుపత్రిలో చేరిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చికిత్సకు స్పందిస్తున్నారని వైద్యులు వెల్లడించారు. ఈ మేరకు ఏఐజీ బుధవారం బులిటెన్‌ను విడుదల చేసింది. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, మందుల సాయంతో ఆయన బీపీ నియంత్రణలోకి వస్తుందని వివరించింది. రాబోయే 24 గంటల నుంచి 48 గంటలు చాలా కీలకమైనవని, తమ వైద్యుల బృందం ఆయనను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూనే ఉందని తెలిపింది. కాగా, తమ్మినేనిని చూసేందుకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆసుపత్రికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..తమ్మినేని వేగంగా కోలుకుంటున్నారన్నారు. రెండ్రోజుల్లో పూర్తి స్పష్టత వస్తుందన్నారు. బీపీ నియంత్రణ స్థితిలోకి వచ్చిందన్నారు. మూత్రపిండాలు కూడా సాధారణ స్థితిలోకి వచ్చాయన్నారు.

పబ్లిక్‌ గార్డెన్స్‌లో గవర్నర్‌ జెండావిష్కరణ

ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎస్‌ ఆదేశం



సాక్షి, హైదరాబాద్‌: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న పబ్లిక్‌ గార్డెన్స్‌లో రాష్ట్ర గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో వరుసగా రెండేళ్ల పాటు గణతంత్ర దినోత్సవ వేడుకలను రాజ్‌భవన్‌కు పరిమితం చేయడం పట్ల అప్పట్లో గవర్నర్‌ విమర్శలు చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్‌ సర్కారు ఈ ఏడాది పబ్లిక్‌ గార్డెన్స్‌లో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఉత్సవాల ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వేడుకల సందర్భంగా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజ్‌భవన్‌, సచివాలయం, శాసనసభ, హైకోర్టు తదితర ముఖ్యమైన ప్రభుత్వ భవనాలను విద్యుత్‌ దీపాలతో అలంకరించాలని, నిరంతరాయంగా విద్యుత్‌ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. సమీక్షలో డీజీపీ రవిగుప్తా, పొలిటికల్‌ సెక్రటరీ రఘునందన్‌రావు, హోంశాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ జితేందర్‌ పాల్గొన్నారు.

పొగమంచుతో విమానాల రాకపోకలకు అంతరాయం

శంషాబాద్‌: శంషాబాద్‌ విమానాశ్రయంలో బుధవారం ఉదయం విపరీతంగా పొగమంచు కమ్ముకోవడంతో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. శంషాబాద్‌ నుంచి కోల్‌కతా, ముంబై బయలుదేరాల్సిన రెండు విమానాలను ఇండిగో ఎయిర్‌లైన్స్‌ రద్దు చేసింది. వీటితో పాటు మొత్తం 9 విమానాలు నిర్ణీత సమయం కన్నా ఆలస్యంగా బయల్దేరాయి. మరి కొన్ని విమానాలు ఆలస్యంగా శంషాబాద్‌ విమానాశ్రయానికి చేరుకున్నట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు ఓ ప్రకటనలో వెల్లడించాయి.

‘మేడారం’ జాతరకూ మహిళలకు ఫ్రీ బస్సు

సమ్మక్క–సారలమ్మ జాతరపై సమీక్ష


చీరకానుకలతో గద్దెల వద్దకు వస్తున్న మంత్రులు సీతక్క, కొండా సురేఖ

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం జాతరకు వచ్చే ఆర్టీసీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వర్తింపజేస్తామని మంత్రి సీతక్క అన్నారు. మేడారం మహాజాతరపై మరో మంత్రి కొండా సురేఖతో కలిసి బుధవారం ఉన్నత స్థాయిలో సమీక్షించారు. అనంతరం సీతక్క మీడియాతో మాట్లాడుతూ అందరి సహకారంతో జాతరను విజయవంతం చేయాలన్నారు. అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు చూడాలని సూచించారు. కాంట్రాక్టర్లకు వంతపాడే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహాజాతర అంటే ఎన్ని సౌకర్యాలు కల్పించినా, అక్కడక్కడా చిన్నచిన్న పొరపాట్లు జరుగుతాయన్నారు. వాటిని తన దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2014 మేడారం మహాజాతరలో సమ్మక్క–సారలమ్మలు గద్దెనెక్కిన రోజు, తెలంగాణబిల్లు రాజ్యసభలో ఆమోదం పొందిన రోజు ఒక్కటే అన్నారు. తెలంగాణ రాష్ట్రం కూడా తల్లుల దీవెనలతోనే ఏర్పడిందని, సోనియాగాంధీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్రంలో జరిగే మహాజాతరకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సీతక్క వివరించారు.

జాతరను విజయవంతం చేస్తాం: మంత్రి కొండా సురేఖ

మహాజాతరను విజయవంతం చేసేందుకు సమ్మక్క–సారలమ్మల స్ఫూర్తితో మంత్రి సీతక్కతో కలిసి పనిచేస్తానని మంత్రి సురేఖ అన్నారు. వరంగల్ ఆడబిడ్డలుగా జాతరలో పనిచేయడం తమ అదృష్టమన్నారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులు ఈ నెలాఖరు వరకు పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూస్తూ అధికారుల వెంట పడి పరిగెత్తించి పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. దేవాదాయ శాఖ నుంచి రూ.1.50కోట్లతో పూజారుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ప్రతిపక్షాలకు విమర్శించే అర్హత లేదని, సలహాలు, సూచనలు అందించి జాతర విజయవంతానికి సహకరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో యాదాద్రిలో అభివృద్ధి పేరిట మూల విరాట్‌ను కదిలించి యాదాద్రిని నిర్మించారని, అది శాస్త్రీయంగా తప్పిదమని తెలిపారు. గిరిజన జాతరలో పూజారుల పాత్ర కీలకమని, వారి కోసం ప్రభుత్వం 10 గదులతో అతిథి గృహనిర్మాణం చేపడుతుందని, వచ్చే మినీ జాతర నాటికి అతిథి గృహాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి సురేఖ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, అడిషనల్ ఎస్పీ సదానందం, అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, ఐటీడీఏ పీఓఅంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, ఓఎస్డీ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొదలైన భక్తుల సందడి

మేడారం జాతరకు నెల రోజుముందుగానే భక్తుల తాకిడి మొదలైంది. సంక్రాంతి సెలవుల చివరి రోజు కావడంతో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవార్ల గద్దెల వద్ద బంగారం, చీర, సారె, పూలు, పండ్లు, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు సమర్పించారు.

క్లుప్తంగా...

పంటల సాగుపై స్పష్టతనివ్వాలి: నిరంజన్



సాక్షి, హైదరాబాద్: గోదావరి పరీవాహక ప్రాంతంలో పంటల సాగుపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయినా ప్రభుత్వం మీద నమ్మకం లేక విధిలేని పరిస్థితుల్లో రైతులు సాగు విషయంలో వెనకడుగు వేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అధైర్య పరుస్తోందని విమర్శించారు. యూరియా కోసం రైతులు లైన్లలో నిలబడుతున్నారని, కరెంటు కోతలు, రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడం, సాగునీరు లేకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. యాసంగిలో ప్రభుత్వ వ్యవసాయ ప్రణాళికపై స్పష్టతను ఇవ్వాలని డిమాండ్ చేశారు. దావోస్ పర్యటనలో సీఎం రేవంత్ చేస్తున్న అసంబద్ధ వ్యాఖ్యలు రాష్ట్ర పరువును పెంచేలా లేవన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే విజయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు మాఫీ చేయాలి

- వ్యవసాయ శాఖ కమిషనర్‌కు బీజేపీ కిసాన్‌మోర్చా వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్: రైతులకు రూ.2 లక్షల లోపు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామన్న హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. డిసెంబర్ 9వ తేదీనే హామీని నెరవేరుస్తామని చెప్పినా, ఆ గడువు దాటి నెల గడిచినా ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు కనబడటం లేదన్నారు. కేసీఆర్ సర్కార్ గత పదేళ్లలో వ్యవసాయ యంత్ర పరికరాలకు సబ్సిడీ ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ప్రధానమంత్రి పంటల బీమా యోజనను కూడా తెలంగాణలో అమలు చేయలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ కమిషనర్ గోపికి వినతిపత్రం సమర్పించారు. కొత్తగా ఏర్పడిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుల ఆకాంక్షలను నెరవేర్చే దిశలో చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

‘ఉచిత బస్సు’ను రద్దు చేయండి

- హైకోర్టులో పిల్ దాఖలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. లింగ వివక్షకు దారితీస్తున్న జీవో 47ను కొట్టివేయాలని కోరుతూ నాగోల్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి హరేందర్‌కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ‘ఆర్టీసీకి సంబంధించి ఏ నిర్ణయమైనా తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికే తప్ప.. రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ప్రభుత్వ నిర్ణయం పురుషులపై వివక్ష చూపడమే అవుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15కు ఇది విరుద్ధం. ఉచిత ప్రయాణం కారణంగా బస్సుల్లో మహిళలు ముంచెత్తుతున్నారు. టికెట్ కొని ప్రయాణిస్తున్న పురుషులకు సీట్లు దొరకడం లేదు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని జీవోను కొట్టివేయాలి’అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రతివాదులుగా రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్టీసీ చైర్మన్, ఎండీ తదితరులను చేర్చారు. ఈ పిటిషన్‌పై సెలవుల అనంతరం ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

ఏప్రిల్ 17న శ్రీసీతారాముల కల్యాణం

- 9 నుంచి 23 వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు
- షెడ్యూల్ విడుదల చేసిన వైదిక కమిటీ


సీతారాముల కల్యాణం (ఫైల్)

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 17న సీతారాముల కల్యాణమహోత్సవం జరగనుంది. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఏప్రిల్ 9 నుంచి 23వ తేదీ వరకు వసంత పక్ష ప్రయుక్త బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వైదిక కమిటీ బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఏప్రిల్ 9న క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా మూలమూర్తులకు స్నపన తిరుమంజనం, నూతన పంచాంగ శ్రవణంతోపాటు అదే రోజు బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 13న మృత్స్యంగ్రహణం, వాస్తు హోమం, అంకురార్పణ, 14న గరుడ ధ్వజపట లేఖనం, గరుడ ధ్వజ పటా విష్కరణ, గరుడ ధ్వజాధివాసం, 15న ధ్వజారోహణం, దేవతాహ్వానం, బలి సమర్పణ, 16న చతుఃస్థానార్చన, ఎదుర్కోలు ఉత్సవం, 17న సీతారాముల కల్యాణం, 18న మహా పట్టాభిషేకం, 19న మహదాశీర్వచనం, 20న తెప్పోత్సవం, దొంగల దోపు, 21న ఊంజల్ ఉత్సవం, 22న వసంతోత్సవం, 23న పూర్ణాహుతి, శేషవాహన సేవ, ధ్వజావరోహణం, దేవతోద్వాసనం, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధనలు, శ్రీ పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

పెట్టుబడులకు ఎనర్జీ

▶ మొదటి పేజీ తరువాయి


దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబును కలిసిన సీఐఐ తెలంగాణ శాఖ చైర్మన్ శేఖర్‌రెడ్డి, పలు పరిశ్రమల సీఈవోలు

చందన్‌పల్లిలో ఏర్పాటు చేస్తుంది. ఇక అంబుజా సిమెంట్స్ సంస్థ ద్వారా ఏటా 6 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యమున్న సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను రూ.1,400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదిరింది. అదానీ ఏరోస్పేస్, డిఫెన్స్ పార్క్‌లో కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, క్షిపణి అభివృద్ధి తయారీ కేంద్రాల ఏర్పాటుకు రూ.1,000 కోట్లను పెట్టుబడి పెట్టనున్నారు. తెలంగాణలో పెట్టుబడులతోపాటు యువతలో నైపుణ్యాలు (స్కిల్స్) పెంపొందించేందుకు త్వరలోనే అత్యాధునిక సౌకర్యాలతో కూడిన సమీకృత నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు రేవంత్‌తో భేటీ సందర్భంగా అదానీ సంసిద్ధత వ్యక్తం చేశారు.

■ తెలంగాణలో రూ.9వేల కోట్లతో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు జేఎస్ డబ్ల్యూ ఎనర్జీ అనుబంధ సంస్థ ‘జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ’ సంసిద్ధత వ్యక్తం చేసింది. దీనిపై ‘జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ’తో రాష్ట్ర ప్రభుత్వం పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. 1,500 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటయ్యే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్‌తో సీఎం రేవంత్ చర్చించారు.

■ రాష్ట్రంలో రూ.8వేల కోట్ల పెట్టుబడితో 12.5 జీడబ్ల్యూహెచ్ (గిగావాట్ ఫర్ అవర్) సామర్థ్యముండే బ్యాటరీ సెల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు గోడి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రకటించింది. వచ్చే ఐదేళ్లలో తెలంగాణలో లిథియం, సోడియం అయాన్ సంబంధిత సాంకేతిక పరిజ్ఞానంపై పరిశోధన, అభివృద్ధి కేంద్రంతోపాటు, గిగాస్కేల్ బ్యాటరీ సెల్ తయారీ కేంద్రం ఏర్పాటవుతుంది. ప్రాజెక్ట్ మొదటి దశలో 6వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. మొదటి దశలో 2.5 గిగావాట్ల సామర్థ్యముండే సెల్ అసెంబ్లింగ్ లైన్ తయారు చేసి.. రెండో దశలో 10 గిగావాట్లకు విస్తరిస్తారు.

■ డేటా సెంటర్ల నిర్వహణలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన ఐరన్ మౌంటేన్ అనుబంధ సంస్థ వెబ్ వెర్క్స్ తెలంగాణలో రూ.5,200 కోట్లతో డేటా సెంటర్లను నెలకొల్పేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఐరన్ మౌంటేన్ సీఈవో విలియం మీనీ, వెబ్ వెర్క్స్ సీఈవో నిఖిల్ రాఠీలతో సీఎం భేటీలో రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటు, నిర్వహణపై చర్చించారు. హైదరాబాద్‌లో 10 మెగావాట్ల నెట్‌వర్కింగ్–హెవీ డేటా సెంటర్‌లో ఇప్పటికే ఈ కంపెనీ రూ.1,200 కోట్లు పెట్టుబడి పెడుతోంది. దీనికి అదనంగా రూ.4,000 కోట్లకుపైగా పెట్టుబడులతో భవిష్యత్తులో గ్రీన్‌ఫీల్డ్ హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ను విస్తరించేందుకు ఒప్పందం చేసుకుంది.

■ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ మిషన్‌లో ఇప్పటికే భాగస్వామిగా ఉన్న గోద్రెజ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఖమ్మంలో తొలిదశలో రూ.270 కోట్లతో దేశంలోనే అతిపెద్ద సమీకృత ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఖమ్మంలో దేశంలోనే మొట్టమొదటి ఆయిల్‌పామ్ సీడ్ గార్డెన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఈ కొత్త సీడ్ గార్డెన్ ద్వారా ఏటా 70లక్షల మొక్కలను సరఫరా చేయడం ద్వారా పది లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును చేపట్టవచ్చని పేర్కొంది. దీంతోపాటు రూ.వెయ్యి కోట్లతో కెమికల్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేస్తామని గోద్రెజ్ సంస్థ ప్రకటించింది. నైపుణ్య శిక్షణ, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, పాడి పరిశ్రమ విస్తరణ వంటి అంశాలపైనా గోద్రెజ్ సీఎండీ నాదిర్ గోద్రెజ్‌తో సీఎం చర్చించారు.

■ రాష్ట్రంలోని మల్లాపూర్‌లో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న ‘ఆరాజెన్ లైఫ్ సైన్సెస్’ సంస్థ రూ.2వేల కోట్ల పెట్టుబడులు, 1,500 మందికి కొత్త ఉద్యోగాల కల్పన లక్ష్యంగా కార్యకలాపాలను విస్తరించనుంది. సీఎం రేవంత్‌తో ఆరాజెన్ సీఈఓ మణి కంటిపూడి భేటీ సందర్భంగా దీనిపై ఒప్పందం కుదిరింది. ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ విస్తరణతో హైదరాబాద్ దేశంలోనే కాంట్రాక్ట్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ హబ్‌గా మారనుందని ఆ సంస్థ పేర్కొంది.

■ దావోస్ రెండోరోజు పర్యటనలో భాగంగా రేవంత్ బుధవారం హెయినెకెన్ సీఈఓ డాల్ఫ్ వాన్‌డెన్ బ్రింక్, టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖర్, విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషబ్ ప్రేమ్‌జీ తదితరులతోనూ భేటీ అయ్యారు. వరంగల్‌లో ఐటీ కార్యకలాపాల విస్తరణపై రిషబ్ ప్రేమ్‌జీతో చర్చించారు. ఈ భేటీల్లో ఐటీ–పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, పెట్టుబడుల ప్రోత్సాహక విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో విజిలెన్స్ డీజీ విచారణ


రాజీవ్ రతన్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ(లక్ష్మి)బ్యారేజీ, కన్నెపల్లిలోని లక్ష్మి పంపుహౌస్‌లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ రాజీవ్‌రతన్ మళ్లీ విచారణ చేపట్టారు. బుధవారం ఆయన జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరానికి వచ్చారు. మధ్యాహ్నం ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు, ఇతర ఇంజనీరింగ్ అధికారులతో రాజీవ్‌రతన్ మాట్లాడినట్టు తెలిసింది. అనంతరం మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్‌లోని 19, 20, 21 పియర్‌లు కుంగిన తీరును పరిశీలించారు. గురువారం కూడా లక్ష్మి పంపుహౌస్, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల రికార్డులు, డాక్యుమెంట్లు డీజీ పరిశీలిస్తారని సమాచారం.

‘అన్నారం’ మరమ్మతులు పూర్తి

వారం రోజుల్లోనే గ్రౌటింగ్ పనులు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం(సరస్వతీ)బ్యారేజీలో ఏర్పడిన సీపేజీ లీకేజీ బుంగల మరమ్మతు పనులు బుధవారం పూర్తయ్యాయి. మరో వారం పాటు సీపేజీ లీకేజీలపై అబ్జర్వేషన్ ఉండనున్నట్లు తెలిసింది. అన్నారం బ్యారేజీలో గతేడాది అక్టోబర్ చివరి వారంలో డౌన్‌స్ట్రీమ్‌లో సీపేజీ లీకేజీలు ఏర్పడిన సంగతి తెలిసిందే. దీంతో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల 29న మంత్రులతో మేడిగడ్డ వద్ద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ఈఎన్‌సీ మురళీధర్‌రావుతో ఏర్పాటు చేసింది. అదే రోజున మంత్రులు అన్నారం బ్యారేజీని పరిశీలించి లీకేజీలను తక్షణమే చేపట్టాలని, నీటిపారుదశాఖ అధికారులను, సంబంధిత నిర్మాణ సంస్థ అఫ్కాన్ ప్రతినిధులను ఆదేశించారు. దీంతో గత వారం కిందట బ్యారేజీలోని 5వ బ్లాక్‌లో 28,38వ పియర్‌ల వద్ద ఏర్పడ్డ సీపేజీ లీకేజీల బుంగలను పాలీయూరేథీన్ (పీయూ)కెమికల్‌తో భూమిలోకి పంపించి గ్రౌటింగ్ పనులు ప్రారంభించారు. బుధవారంతో పనులు పూర్తి కాగా మరో వారం పాటు అబ్జర్వేషన్‌లో ఉంచనున్నట్లు ఇంజనీరింగ్ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, మరో రెండు చోట్ల చిన్న చిన్న సీపేజీ లీకేజీలు గుర్తించినట్టు సమాచారం. వాటిని కూడా మరో రెండు రోజుల్లో గ్రౌటింగ్ చేసి పూర్తి చేయనున్నట్లు తెలిసింది.

గిరిజనుల అండతోనే కాంగ్రెస్ గెలుపు

- ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని ఆదివాసీ, గిరిజనులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించారని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ పేర్కొన్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో గిరిజనులు కష్టపడి పనిచేసినందువల్లే కాంగ్రెస్ పార్టీకి విజయం దక్కిందన్నారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఎస్టీ సెల్ చైర్మన్ టి.బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మున్షీ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన విధంగానే రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ పనిచేయాలని, రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో న్యాయ్ యాత్ర ఉద్దేశాన్ని రాష్ట్రంలోని ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని కోరారు. సమావేశంలో భాగంగా పలు తీర్మానాలు చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని, ఆదివాసీ కాంగ్రెస్ నేతలను గుర్తించి కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తీర్మానించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌తో పాటు పలువురు ఎస్టీ సెల్ నేతలు పాల్గొన్నారు.

గ్యారంటీల చావు వార్తే

▶ మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ‘అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి తేరుకుని కేవలం నెల రోజుల్లోనే లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పార్టీ సమీక్ష, సన్నాహక సమావేశాలు మొదలుపెట్టాం. కార్యకర్తల నుంచి విలువైన సూచనలు అందుతున్నాయి. కార్యకర్తలు కోరుకున్న రీతిలోనే ఇకపై పార్టీ పనిచేస్తుంది. ప్రతిపక్ష స్థానంలోకి వచ్చినా అధైర్యపడకుండా పోరాడుదాం. సోషల్ మీడియా దుష్ప్రచారాల కాలంలో ప్రభుత్వం మారేందుకు బలమైన కారణాలు అవసరం లేదు. కాంగ్రెస్‌తో సహా ఐదేళ్లలోపే ప్రజావ్యతిరేకత మూటగట్టుకుని ఇంటికి వెళ్లిన సందర్భాలే ఎక్కువ. ఉద్యమానికి ఊపిరి లూదిన వాళ్లం, పేగులు తెగే దాకా మన మాతృభూమి కోసం కొట్లాడిన వాళ్లం. మనకు సత్తువ.. సత్తా ఉంది. ప్రతిపక్ష హోదాలో కూడా మన మట్టి మనుషుల ఆకాంక్షల కోసం ఊపిరి ఉన్నంత వరకు పోరాడుదాం’ అని పిలుపునిచ్చారు.

సంప్రదాయ రాజకీయ పద్ధతులకు దూరం వల్లనే నష్టం

రాజకీయాలకు అతీతంగా కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి చేసినా సంప్రదాయ రాజకీయ పద్ధతులకు దూరంగా ఉండటం వల్లే నష్టం చేసిందనే భావన కార్యకర్తల్లో ఉందని హరీశ్‌రావు అన్నారు. ‘విభజన సమస్యల పరిష్కారంతో పాటు పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదాపై కేంద్రం చేతులెత్తేసింది. కేంద్రంపై పోరు చేయాల్సిన కాంగ్రెస్ ఢిల్లీలో బీజేపీ నాయకులకు దండలు వేస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొనుగోలు చేస్తారని బండి సంజయ్ అనే బ్రహ్మజ్ఞాని చెప్తున్నాడు. పార్టీలను కూల్చడం, చీల్చడం వంటివి కాంగ్రెస్, బీజేపీలకే అలవాటు. కాంగ్రెస్, బీజేపీ మైత్రిని ఒప్పుకుంటూ వార్తల్లో ఉండేందుకు బండి సంజయ్ తాపత్రయ పడుతున్నారు’’అని హరీశ్ ధ్వజమెత్తారు.

హత్యారాజకీయాలు చేస్తోన్న కాంగ్రెస్

‘‘రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై శ్వేతపత్రం ప్రకటించి బీఆర్‌ఎస్‌ను బదనాం చేసేందుకు ప్రయత్నించే క్రమంలో కాంగ్రెస్ తమ గోతిని తామే తీసుకుంది. తెలంగాణ ఆర్థిక పురోగతిని నీతి ఆయోగ్ తాజా నివేదిక కూడా పొగిడింది. దేశంలో పేదరికంలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ దిగువ నుంచి మూడో స్థానంలో ఉంది. దావోస్ వెళ్లడం దండగ అంటూ గతంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇప్పుడు రాష్ట్రం అప్పుల్లో ఉంది పెట్టుబడులు వద్దని కాంగ్రెస్ చెప్తుందా? అని హరీశ్ ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హత్యా రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. సమావేశంలో మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి పాల్గొన్నారు.

మాడ్యూల్స్‌తో మేలేంటి?

ధరణి పోర్టల్‌పై పునర్నిర్మాణ కమిటీ నిశిత పరిశీలన

- మూడు కేటగిరీల్లోనే 35 మాడ్యూల్స్.. రైతులు దరఖాస్తు చేసుకునే విధానంలో అంతర్గత మార్పులపై చర్చ



సాక్షి, హైదరాబాద్: ‘రాష్ట్రంలో భూ రికార్డుల నిర్వహణకు సంబంధించిన ధరణి పోర్టల్‌లో ఎన్ని మాడ్యూల్స్ ఉన్నాయి? రైతులు తమ వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలను ఏ మాడ్యూల్ ద్వారా పరిష్కరించుకోవాల్సి వస్తోంది? అసలు ఈ మాడ్యూల్స్ వల్ల వారికి కలుగుతున్న ప్రయోజనమేంటి?’అనే అంశాలను ధరణి పోర్టల్ పునర్నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ నిశితంగా పరిశీలించింది. బుధవారం సచివాలయంలో జరిగిన కమిటీ రెండో భేటీలో ధరణి పోర్టల్‌లోని మాడ్యూల్స్‌పై క్షుణ్ణంగా చర్చ జరిగింది. కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి (కిసాన్‌సెల్ నేత), ఎం.సునీల్‌కుమార్ (భూచట్టాల నిపుణుడు), రేమండ్ పీటర్ (రిటైర్డ్ ఐఏఎస్ అధికారి), నవీన్ మిత్తల్ (రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి), మధుసూదన్ (రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్)లతో పాటు కమిటీ సమన్వయకర్తగా వ్యవహరిస్తోన్న సీసీఎల్‌ఏ పీడీ వి.లచ్చిరెడ్డిలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కమిటీ కార్యాచరణపై చర్చ

పోర్టల్‌లోని 35 మాడ్యూల్స్‌ను పరిశీలించిన కమిటీ సభ్యులు అన్ని మాడ్యూల్స్ కేవలం మూడు కేటగిరీల్లోనే ఉన్నాయని గుర్తించారు. డీడ్ రిజిస్ట్రేషన్లు, భూ సంబంధిత సమస్యలు, పౌర సేవ (సిటిజెన్ సర్వీసెస్) విభాగాల్లో ఈ మాడ్యూల్స్‌ను రూపొందించామని సీసీఎల్‌ఏ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం రైతులు తమ భూసమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకునే విధానంలో అంతర్గతంగా చేయాల్సిన మార్పుల గురించి కమిటీ చర్చించింది. రైతులు తెలియక ఇతర మాడ్యూల్‌లో దరఖాస్తు చేసుకుంటే, వెంటనే దాన్ని తిరస్కరించకుండా రెవెన్యూ అధికారులే అవసరమైన మాడ్యూల్‌లోకి ఆ దరఖాస్తును మార్పు చేసే అంశంపై సాధ్యాసాధ్యాలను కూడా సభ్యులు సాంకేతిక నిపుణులతో చర్చించారు. అదే విధంగా కమిటీ విధివిధానాలు, కార్యాచరణపై చర్చ జరిగింది. ప్రభుత్వ ఆలోచన మేరకు ధరణి పోర్టల్ పునర్నిర్మాణానికి ఎలాంటి సిఫారసులకు అవకాశముందనే విషయాన్ని చర్చించిన కమిటీ ఇందుకు సంబంధించిన విధివిధానాలపై వచ్చే సోమవారం జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది.

మా మీద పెద్ద బాధ్యత ఉంది: కోదండరెడ్డి

తమపై ప్రభుత్వం పెద్ద బాధ్యత పెట్టిందని సమావేశం అనంతరం ధరణి పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు ఎం. కోదండరెడ్డి చెప్పారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతమైతే రైతాంగం మళ్లీ ఇబ్బందుల పాలవుతుందని, అందుకే క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాతే ముందుకెళ్తామని చెప్పారు.



కలం అనేది మనసు యొక్క నాలుక.

– మిగెల్ డె సెర్వాంటీజ్

సాక్షి

గురువారం, 18 జనవరి 2024

దారితప్పిన మాల్దీవులు

ఏదో యథాలాపంగా, ఎంతో యాదృచ్ఛికంగా మొదలైనట్టు కనబడిన మాల్దీవుల పంచాయితీ ఆంతర్యం మన దేశానికి దూరం జరగటమేనని తాజా పరిణామాలు మరింత తేటతెల్లం చేస్తున్నాయి. భారత వ్యతిరేకతే అస్త్రంగా ఎన్నికల్లో ప్రచారం చేసి మొన్న నవంబర్‌లో అధికారంలో కొచ్చిన అధ్యక్షుడు మహమ్మద్ మొయిజ్జూ ఇప్పటికీ అదే పోకడలు పోతున్నారు. లక్షద్వీప్‌లో పర్యటించిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఒక ఛాయాచిత్రాన్ని పోస్టు చేసినప్పుడు ముగ్గురు మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యలపై రాజుకున్న రగడ తర్వాత ఆ దేశం ఒకటొకటిగా చర్యలు మొదలుపెట్టింది. మన దేశం బహుమతిగా ఇచ్చిన రెండు తేలికపాటి అధునాతన ధ్రువ హెలికాప్టర్లు వెనక్కు తీసుకోవాలని కోరటంతో పాటు వచ్చే మార్చి 15లోపు దేశంలోవున్న భారత సైనిక దళాలను ఉపసంహరించాలని తుదిగడువు విధించారు. కేవలం 88 మంది సైనికుల వల్ల తమ దేశానికి ముప్పు ముంచుకొస్తుందంటూ హడావిడి చేస్తున్నారు. అధికారంలోకొచ్చిన వెంటనే భారత పర్యటనకొచ్చే సంప్రదాయాన్ని పక్కనబెట్టి మొయిజ్జూ టర్కీని ఎంచుకున్నారు. ఆ తర్వాత యూఏఈలో జరిగే కాప్–28 సదస్సుకెళ్లారు. తాజాగా ఈ నెల 8 నుంచి 12 వరకూ చైనాలో పర్యటించారు. 'భౌగోళికంగా ఆకారంలో చిన్నదైనంత మాత్రాన మాల్దీవులు ఎవరి బెదిరింపులకూ లొంగద'ని హెచ్చరించారు. వీటన్నిటి వెనుకా ఉన్నదెవరో సులభంగానే పోల్చుకోవచ్చు.

మనకూ, మాల్దీవులకూ వున్న బంధం చాలా పాతది. అలాగని భారత్‌పై విద్వేషాన్ని వెళ్లగక్కే శక్తులకు అక్కడ కొదవేమీ లేదు. దేశ ప్రజానీకంలోవున్న భారత్ అనుకూలతను ఎలాగైనా పరిమార్చాలని చాలామంది రాజకీయ నాయకులు ప్రయత్నించారు. ప్రత్యర్థుల విధానాలనూ, వారి కార్యాచరణనూ తప్పుబట్టడానికి సందు దొరకని ప్రతిసారీ భారత్ ప్రసక్తి తీసుకొచ్చి విమర్శించటం అక్కడ పరిపాటి. గతంలో అబ్దుల్లా యామీన్ సైతం మూడు దశాబ్దాల తన ఏలుబడిలో భారత్ వ్యతిరేక నిర్ణయాలు తీసుకుని, చైనాతో అంటకాగి దేశాన్ని నిండా ముంచారు. ప్రశ్నించినవారిని ఖైదు చేశారు. ఇది సరికాదంటూ తీర్పునిచ్చిన ఇద్దరు సుప్రీంకోర్టు జడ్జీలను జైలుకు పంపారు. ఆయన నిర్వాకంలో ఆ దేశం చైనా నుంచి భారీగా రుణాలు తీసుకుంది. పెట్టుబడులను ఆహ్వానించింది. వీటివల్ల చెల్లించాల్సిన వడ్డీలే అపరిమితంగా పెరిగిపోయాయి. 2013లో రెండోసారి అధికారంలోకొచ్చాక కూడా యామీన్ తీరు మారలేదు. చివరకు ఆయన విధానాలతో విసిగిన జనం 2018లో ఇబ్రహీం మహ్మద్ సోలిహ్‌ను గద్దెనెక్కించారు. నియంతృత్వ పోకడలకు పోలేదన్న మాటేగానీ... అవినీతిని అంతమొందిస్తానన్న వాగ్దానాన్ని సోలిహ్ నిలుపుకోలేకపోయారు. ఒక అవినీతి కేసులో యామీన్‌కు 11 ఏళ్ల జైలు శిక్ష పడిన మాట వాస్తవమే అయినా, అది మినహా అవినీతి నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోలేకపోయారు. ఉపాధి కల్పనలోనూ సొంత మనుషులకే ప్రాధాన్యమిచ్చారన్న ఆరోపణలు వినబడ్డాయి. ఈ అసంతృప్తిని ప్రస్తుత అధ్యక్షుడు మొయిజ్జూ ఆసరాగా తీసుకుని అధికారానికి రాగలిగారు. అయిదున్నర లక్షలమంది జనాభాగల మాల్దీవుల్లో మూడులక్షలమంది సున్నీ ముస్లిమ్‌లు. మతం పేరుతో వీరిలో అత్యధికులను తనవైపు తిప్పుకోవాలని, జాతీయవాదాన్ని రెచ్చగొట్టాలని అంతక్రితం యామీన్ ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. కాకపోతే ఈ రాజకీయ క్రీడ చివరకు సెక్యులర్ పార్టీల వైఫల్యంగా మారి మతతత్వ శక్తుల ప్రాబల్యం పెరుగుతుందా అన్న సందేహాలు చాలామందిలో ఉన్నాయి. మొయిజ్జూ అయినా, మరొకరైనా దేశాభివృద్ధిలో భారత్ కీలకపాత్రను తోసిపుచ్చలేరు. ప్రస్తుతం దేశ దిగుమతుల్లో అత్యధిక వాటా భారత్‌దే. దీన్ని తగ్గించుకుందామని ప్రయత్నిస్తే వ్యయం పెరగటం మినహా ప్రయోజనం శూన్యం. ఇక మాల్దీవుల విదేశీ రుణాల్లోనూ సింహభాగం మన దేశానిదే. గతంలో చైనాతో సాన్నిహిత్యం పెంచుకుని ఎడాపెడా రుణాలు తీసుకుని శ్రీలంక ఆర్థికంగా ఎంత నష్టపోయిందో, ఎలా దివాలా తీసిందో అక్కడి పరిణామాలే తేటతెల్లం చేశాయి.

అధికారంలోకొచ్చిన నాటి నుంచీ మొయిజ్జూ పాలనపై దృష్టి నిలపడానికి బదులు చైనాను సంతుష్టిపరచటానికి సమయం వెచ్చిస్తున్నారు. అన్ని దేశాల్లోనూ ఒకే తరహా వ్యవస్థలు, రాజకీయ భావాలుండటం సాధ్యం కాదు. ఎన్నికలప్పుడు ఏం మాట్లాడినా అధికారంలో కొచ్చాక బాధ్యతగా మెలగాలి. దేశ గరిష్ఠ ప్రయోజనాలు గీటురాయిగా ఉండాలి తప్ప, మూర్ఖత్వంతో అవతలివారిని నొప్పించటమే ధ్యేయం కాకూడదు. మొయిజ్జూకు ఎన్నికల జాతరలో తలకెక్కిన మత్తు ఇంకా దిగినట్టు లేదు. లోగడ పాలించిన యామీన్‌కు చైనాతో ఉన్న సాన్నిహిత్యం, ఇటీవల గద్దె దిగిన సోలిహ్ భారత్ అనుకూల ధోరణి జగద్విదితమే అయినా వారిద్దరూ ఇరు దేశాలకూ సమాన దూరంలో మెలుగుతామని ప్రకటించేవారు. విధానాల రూపకల్పనలో, నిర్ణయాల్లో ఎంతోకొంత దాన్ని చేసిచూపేవారు. మొయిజ్జూకు ఆ పరిణతి లేదని ఆయన చర్యలు స్పష్టం చేస్తున్నాయి. అది చాలదన్నట్టు ఇటీవల తైవాన్‌లో చైనాను గట్టిగా వ్యతిరేకించే పక్షమే తిరిగి అధికారంలోకి రాగా, తగుదునమ్మా అంటూ తమది 'వన్ చైనా' విధానమేనంటూ ప్రకటించారు. భౌగోళికంగా చూస్తే మాల్దీవులు 1,190 పగడపు దిబ్బల సముదాయం. కానీ అందులో నివాస యోగ్యమైనవి కేవలం 185 దీవులు మాత్రమే. మన దేశానికి 400 కిలోమీటర్ల దూరంలోవుంటూ మన భద్రత రీత్యా హిందూ మహా సముద్రంలో కీలక ప్రాంతంలో ఉన్న మాల్దీవులు భారత్ – చైనాల మధ్య సాగే పందెంలో తలదూర్చి బొప్పి కట్టించుకునే చేష్టలకు దూరంగా ఉండటం అన్నివిధాలా దానికే శ్రేయస్కరం.

ప్రత్యామ్నాయ సాంస్కృతిక శిఖరం

సందర్భం



కత్తి పద్మారావు

ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన అరుదైన భారతీయుడు డా॥ బీఆర్ అంబేడ్కర్. అమానవీయ పరిస్థితులను ఎదుర్కొంటూ, విద్యను ఆయుధంగా ఎంచి ఎన్నో ఉన్నత డిగ్రీలు పొంది దేశానికి రాజ్యాంగ రచనలో దీపధారి అయ్యారు. దళితులూ, ఆదివాసీలూ, మహిళలూ, ఇతర అణగారిన వర్గాలకు ఆయన ఒక ధైర్య వచనం. తన కాలంలోనే గాక, ఆ తరువాత కాలాన్నీ వెలిగించడానికి అక్షర సముచ్చయాన్ని నిర్మించిన మేధావి. భారత ఉపఖండంలో తన సౌజన్యం ద్వారా రక్తపాతాన్ని నివారించి, నిర్మాణాత్మక సామాజిక విప్లవాన్ని నడిపిన ప్రత్యామ్నాయ సాంస్కృతిక శిఖరం ఆయన. ఆ మహానుభావుడి జ్ఞాపకార్థం 125 అడుగుల భారీ విగ్రహాన్నీ, ఓ స్మృతి వనాన్నీ నిర్మించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజారాశుల ఆదరణను చూరగొంటోంది.

జనవరి 19వ తేదీన విజయవాడ 'అంబేడ్కర్ నగర్'గా వెలుగొందుతుంది. ప్రత్యామ్నాయ సంస్కృతీ నిర్మాణంలో స్వాతంత్ర్యం తర్వాత కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు వెలుగొందిన అంబేడ్కర్ శిల్ప నిర్మాణం అత్యున్నతమైంది, విస్తృతమైంది. దక్షిణ భారతదేశానికి నడిబొడ్డున ఉన్న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం, ఆవిష్కరణ, స్మృతివన వికాసం చెరపలేని సంఘటనలు. అశోకుని సాంచీ స్తూపానికి ఎంత పేరు వస్తుందో విజయవాడలోని స్మృతివనానికీ అంతే పేరు వస్తుందనడం అతిశయోక్తి కాదు. బౌద్ధమతాన్ని స్వీకరించి బౌద్ధునిగా మహాపరినిర్వాణం పొందిన అంబేడ్కర్ జ్ఞాపకార్థం నిర్మించిన ఈ విగ్రహం కానీ, స్మృతివనం కానీ ప్రపంచ బౌద్ధ పర్యాటకులను ఆకర్షించడం తథ్యం.



నిజానికి బౌద్ధానికి ఈ ప్రాంతం కొత్తేమీ కాదు. అశోకుని కాలంలోనే ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతానికి బౌద్ధం విస్తరించింది. అమరావతి స్తూపం మొదటి దశ నిర్మాణాలు మౌర్యుల వాస్తు నిర్మాణాలనే పోలి ఉండటం, అనేక విద్ధాంక నాణెములు (పంచ్ మార్క్‌డ్ కాయిన్స్) లభించడం, అశోకుని కాలపు నాటి బ్రాహ్మీ లిపిలోనే కొన్ని శాసనాలు లభించడాన్ని బట్టి ఆయన కాలంలోనే బౌద్ధం ఇక్కడికి వ్యాపించిందని చెప్పవచ్చు. అలాగే అప్పట్లోనే ఇవ్వాళ దళితులుగా వ్యవహరించబడుతున్న జన సమూహాలు బౌద్ధాన్ని అవలంబించాయి. అమరావతి స్తూపంపై ఉన్న... ఓ చర్మకారుడు స్తూపానికి ఇచ్చిన దానాన్ని తెలియచేసే శాసనం ఇందుకు మంచి ఉదాహరణ. దళితులు, కులవృత్తులవారే ఆ నాటి స్తూప నిర్మాణానికి రాళ్లు, మట్టినీ మోశారు. అద్భుత శిల్పాలను మలిచారు. అందుకే భారతదేశ చరిత్రలో మొదటి సాంస్కృతిక విప్లవం బౌద్ధం నుండే ప్రారంభమైందని చెప్పవచ్చు. హిందూ మతోన్మాదం బౌద్ధ శిల్పాలను, స్తూపాలను, చైత్యాలను, ఆశ్రమాలను హింసాత్మకంగా కూల్చివేసింది. కానీ మళ్లీ డా॥ బీఆర్ అంబేడ్కర్ శిల్పంలో ఒక ప్రత్యామ్నాయ ప్రకాశిత, విభాసిత శిల్ప కాంతులు వెల్లివిరుస్తున్నాయి.

అంబేడ్కర్ విగ్రహమే ఒక విశ్వవిద్యాలయంలా ఉంటుంది. ఆయన వేలు ఒక ప్రశ్నోపనిషత్తు. ఆయన విగ్రహం విద్యా వికాసానికి నిలువెత్తు నిదర్శనం. ఆయన ప్రపంచ మానవుడు. లండన్ హౌస్ ఆఫ్ కామన్స్ ముందు డా॥ బీఆర్ అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహం భారత దేశ వ్యక్తిత్వాన్ని ప్రకాశింపచేస్తుంది. లండన్ మ్యూజియం లైబ్రరీలో ఆయన చిత్రపటం ప్రపంచ మేధావుల పంక్తిలో మెరుస్తుంది. లండన్ ఇండియన్ హౌస్‌లో ఆయన బంగారు విగ్రహం ఆయన జీవన సాఫల్యానికి గుర్తుగా వుంది. అంబేడ్కర్ పోరాటం ద్వారానే అధికార ప్రతిష్ఠ జరుగుతుందని నొక్కి వక్కాణించాడు. దళితులను దేవుడిపైన లేక సూపర్ మ్యాన్ పైన ఆధారపడవద్దని హెచ్చరించాడు.

'మీపై మీరు విశ్వాసం ఉంచుకొని నడవండి. ఎవరిపైనా ఆధారపడకండి. నిజాయితీగా ఉండండి. ఎప్పుడూ సత్యాన్ని ఆశ్రయించండి. దేనికీ లోబడకండి. ఎవరికీ తలవంచకండి' అని అంబేడ్కర్ పిలుపునిచ్చాడు. అంబేడ్కర్ ఒక ప్రవక్త, దార్శనికుడు. ఆయన ఒక జీవన వ్యవస్థల నిర్మాత. అణగారిన ప్రజల గుండె దివ్వెలు వెలిగించిన భానుడు. ఆయన జీవించిన కాలంలోనే గాక ఆ తరువాత కాలాన్నీ వెలిగించడానికి అక్షర సముచ్చయాన్ని నిర్మించిన మేధావి. జాన్‌డ్యూయిని అధ్యయనం చేసిన అంబేడ్కర్ ప్రజాస్వామ్య లౌకికవాది. భారత ఉపఖండంలో తన సౌజన్యం ద్వారా, రక్తపాతాన్ని నివారించి, నిర్మాణాత్మక సామాజిక విప్లవాన్ని ఆయన నడిపించారు.

ఇకపోతే అంబేడ్కర్ పార్క్‌ను మాయావతి గవర్నమెంట్ 125 కోట్ల బడ్జెట్‌తో రూపొందించింది. ప్రత్యామ్నాయ సంస్కృతిని ఆ పార్కు విస్తరించింది. అంబేడ్కర్, మహాత్మాఫూలే, పెరియార్, నారాయణ్ గురూ, సాహూ మహరాజ్ వంటి వారినే కాకుండా ఉత్తర ప్రదేశ్‌లో ఉన్న ఎందరో పోరాట వీరుల విగ్రహాలను ఆ పార్క్‌లో ఆవిష్కరించారు. ప్రత్యామ్నాయ సంస్కృతికి ఆ పార్కు నిలువెత్తు సాక్ష్యంగా నిలబడింది. వ్యక్తిత్వ నిర్మాణానికి సాంస్కృతిక విప్లవ పునరుజ్జీవానికి సాహిత్యంతోపాటు శిల్పసంపద కూడా ఎంతో ఉపయుక్తం. కొన్ని శిల్పాలు మానవ మస్తిష్కాన్ని ప్రజ్వలింపచేస్తాయి. భారతదేశంలోని ఆర్కిటెక్చర్ ప్రపంచ దేశాల్లో ఉన్న ఆర్కిటెక్చర్‌లను సమన్వయం చేసుకుంది. భారతదేశానికి వలస వచ్చిన కుషానులు, అరబ్బులు, తురుష్కులు, పారసీకులు ఎందరో భారతీయ శిల్ప సౌందర్యానికి మురిసిపోయారు. వారి శిల్పనైపుణ్యాలు, భారతీయ శిల్ప నైపుణ్యానికి సమన్వయించారు. 'గాంధార శిల్పం' వంటివి రూపు దిద్దుకున్నాయి. మన అమరావతి శిల్పం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. భారతదేశంలో ఈనాడు ప్రత్యామ్నాయ శిల్పసంపద అభివృద్ధి చెందుతోంది.

లండన్ హౌస్ ఆఫ్ కామన్స్ ముందు ఉన్న డా॥ బీఆర్ అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహం స్ఫూర్తితో ప్రతి ఊరిలో అంబేడ్కర్ విగ్రహం ఉండాలని 'ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ' కృషి చేసింది. అనేక గ్రామాలకు ఆ మహానుభావుడి విగ్రహాలను అందించింది కూడా! ఈ సందర్భంగానే అంబేడ్కర్ 150 అడుగుల విగ్రహాన్ని ఉమ్మడి రాష్ట్ర సచివాలయం ముందు నిలపాలని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోరాటం చేసింది. 40 రోజులు సచివాలయం ముందు ధర్నా చేసింది. అంబేడ్కర్ యువజన సంఘాలు, ప్రజా సంఘాలు, అన్ని పార్టీలూ సపోర్ట్ చేశాయి. అయితే అంబేడ్కర్ వ్యతిరేక భావవాది, అగ్రవర్ణ కుల అహంకారి, రాజకీయ కపటి, మానవ వనరుల విధ్వంసకుడు, ప్రకృతి వనరుల దోపిడీదారు, నేర రాజకీయ కోవిదుడు, దళిత ద్రోహి నారా చంద్రబాబు నాయుడు అంబేడ్కర్ విగ్రహానికి బదులు మహాత్మాగాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కేసీఆర్ తెలంగాణ సచివాలయం ముందే అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించారు. ఏపీలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహానికి పూనుకొని నిర్మించింది. జనవరి 19వ తేదీన ఈ విగ్రహ ఆవిష్కరణ జరగడం ఒక చరిత్రాత్మక సంఘటన. అంబేడ్కర్ విగ్రహ నిర్మాణంతో విజయవాడకు ప్రత్యామ్నాయ సంస్కృతి ప్రజ్వలనం వస్తుంది. అంతేగాకుండా చైనా, టిబెట్, థాయ్‌లాండ్, జపాన్, జర్మనీ, బర్మా, శ్రీలంక దేశాల నుండి యాత్రికులు వస్తారు. ఇక విజయవాడ భారతదేశానికే తలమానికమైన నగరంగా వెలుగొందుతుంది. కుల, మత, జాతి, లింగ భేదాలు తరమబడతాయి. ప్రపంచంలో పేరెన్నికగన్న నగరాల్లో ఒకటిగా కీర్తించబడుతుంది. విద్యావ్యాప్తి పెరుగుతుంది. 'బోధించు, సమీకరించు, పోరాడు' అనే అంబేడ్కర్ నినాదాన్ని ఈ నిలువెత్తు విగ్రహం పదే పదే గుర్తుచేసి ప్రజారాశులను చైతన్యవంతం చేస్తుంది.

అంబేడ్కర్ స్మృతివనం ఏమి చెప్తుందంటే పిల్లల్ని విద్యావంతులు చేసుకోండి. కుల, మత భేదాలు లేని సమసమాజాన్ని నిర్మించుకోండి. హింసలేని కరుణ, ప్రజ్ఞ, నీతి, ఆత్మీయత, అనుబంధం కలిగిన భారత రాజ్యాంగ సూత్ర నిబద్ధమైన ఒక సమాజాన్ని నిర్మించుకోండని ఎలుగెత్తి చాటుతుంది. ఇక విజయవాడ అంబేడ్కర్ నగర్ అవుతుంది. ప్రపంచ కీర్తిని పొందుతుంది. అంబేడ్కర్ స్మృతివనంలోని లైబ్రరీ, అంబేడ్కర్ చిత్రపటాల దృశ్య మాలిక సందర్శనం, అంబేడ్కర్ సమావేశ మందిరం ప్రపంచ పర్యాటకులకు దృశ్యమాన సౌందర్యం. జ్ఞానభాండాగార సదృశం. బహుముఖ వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనం. ఇక ఆంధ్రప్రదేశ్ ప్రపంచ పటంలో ఓ వెలుగుతున్న ప్రత్యామ్నాయ వెలుగుల సంద్రం. ఆ వెలుగుల తరంగాలలో మనమూ ప్రకాశిద్దాం. ప్రజ్వరిల్లుదాం, ప్రమోదిద్దాం. ఇక పదండి ముందుకు అంబేడ్కర్ ఆశయాలతో...

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు | 98497 41695

(రేపు విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఏంటి స్పందన?



పాకిస్తాన్ సరిహద్దు అంచుల్లో ఉన్న జైశ్ అదల్ తీవ్రవాద గ్రూపు మీద ఇరాన్ క్షిపణులతో దాడి చేయడం సాహసోపేతమైన ఎత్తుగడ. ఇప్పుడు పాకిస్తాన్ సైనికాధిపతుల మనోభావాలను నేను ఊహించగలను.

– అమ్రుల్లా సలేహ్
అఫ్ఘానిస్తాన్ తిరుగుబాటు నేత

పొంగిన ఉత్సవం



చెన్నైకి వచ్చి అపార్ట్‌మెంట్లలో నివసించేదాకా, అందరూ (తమిళ హిందువులు, క్రైస్తవులు) మాలాగే (తమిళ ముస్లింలు) 16 శాకాహార వంటలతో పొంగల్ జరుపుకొంటారని అనుకునేవాడిని. కొన్ని తరాలుగా మా కుటుంబంలో ఇది సాగుతోంది. కానీ ప్రతి సమాజానికీ ప్రాంతాన్ని బట్టి తమదైన పద్ధతి ఉందని నెమ్మదిగా తెలిసింది. ఈసారి మాత్రం మా ఇంట్లోవాళ్లు భారీగా 24 వంటకాలు చేశారు. పొంగలో పొంగల్!

– సయ్యద్ అన్వర్, రచయిత

అలా మొదలు



హాలీవుడ్ సినిమాలతో ఒక చెడ్డ ధోరణి మొదలైంది. నేరస్థులు, భూమిని లాక్కునేవాళ్లను కూల్ కౌబాయ్స్ గానూ, చట్టాన్ని నడిపేవారిగానూ చూపించారు. అక్కడి మూలవాసులను చంపడాన్ని న్యాయమైనదిగానూ, గొప్పవిషయంగానూ చిత్రించారు.

– సుధీర్ మిశ్రా, దర్శకుడు

పునర్జన్మ భావన



భారతదేశంలో పుట్టిన అన్ని మతాలూ పునర్జన్మను విశ్వసిస్తాయి. వైదిక సంప్రదాయం నుంచి వచ్చిన బౌద్ధం కానీ, జైనం కానీ, అన్నీ దీన్ని నమ్ముతాయి. బౌద్ధంలో ఉన్నట్టుగా బుద్ధుడే ఎన్నో జన్మలు ఎత్తాడు. చివరగా బుద్ధుడు అయ్యాడని చెప్పే కథ కూడా ఒకటి ఉంటుంది.

– ఎస్.ఎల్. భైరప్ప, రచయిత

అంతా రాతే!



ఎడిటింగ్ కూడా రచనలో భాగమేనని మరిచిపోవద్దు. చదవడం కూడా రాయడంలో భాగమేనని మరిచిపోవద్దు. నేల మీద బోర్లా పడుకోవడం, పక్కనున్నవారు ఆందోళన పడేలా చేయడం కూడా రాయడంలో భాగమే.

– నీల్ రెనిక్, పరిశోధకుడు

ఇన్ బాక్స్

సామాజిక న్యాయానికి స్ఫూర్తిప్రదాత

ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహం స్థాపించడం ద్వారా రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయ యోధుడు బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తగిన నివాళి అర్పించినట్లయింది. విజయవాడలో ఈ నెల 19న గౌరవ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా జాతికి అంకితం చేయబడుతున్న ఈ విగ్రహం, విగ్రహం చుట్టూ 18 ఎకరాల్లో నిర్మితమైన సుందరమైన స్మృతివనం ప్రపంచ స్థాయి పర్యాటక స్థలాల్లో ఒకటిగా మారగలదు. ఈ భారీ విగ్రహ స్థాపన ద్వారా జగన్, సామాజిక న్యాయ భావనపై తన అనురక్తినీ, అంబేడ్కర్ సిద్ధాంతాల పట్ల అచంచల విశ్వాసాన్నీ తెలియజేయడమే కాకుండా, ముందు తరాలకు అంబేడ్కర్ చూపిన మార్గం ఎంత అనుసరణీయమో చెప్పకనే చెబుతున్నారు.

బాబా సాహెబ్ జీవితమే కాదు, ఆయన చేసిన ప్రతీ ఒక్క బోధన, రాసిన ప్రతీ మాట కూడా మెరుగైన సమాజ నిర్మాణానికి దారి చూపుతాయి. ఆయన జీవితంలో అధ్య యనానికి ఎంత పాత్ర ఉందో, ఉద్యమ నిర్మాణానికి కూడా అంతే పాత్ర ఉంది. ఒక వైపు ప్రజల్లో ఉండి ఉద్యమ నాయకత్వం వహిస్తూనే, మరోవైపు అత్యున్నత పాలనాయంత్రాంగంతో సిద్ధాంత రీత్యా పోరాడారు. ఒకే సమయంలో ఇటు మహద్ పోరాటం, నాసిక్‌లో కాలారామ్ ఆలయ ప్రవేశ పోరాటం దళితులతో పాటు చేస్తూనే, అటు అత్యున్నత రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటూ దేశానికీ, దళితులకీ నాయకత్వం వహించారు. నమ్మిన సిద్ధాంతం కోసం మహాత్మా గాంధీతోనూ విభేదించారు. స్వాతంత్ర్యం రాక ముందే, 1943లో వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ముందు చూపుతో దళితులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ లాంటి విధానాలు ప్రవేశపెట్టి స్వాతంత్ర్యానంతర దేశాన్ని సామాజిక న్యాయ మార్గం వైపు మళ్లించారు. రాజ్యాంగ నిర్మాతగా ఆ మార్గాన్ని మరింత గట్టిపరచారు.



ప్రభుత్వాలు రాజ్యాంగం చూపిన మార్గంలో యథాలాపంగా నడవడం వేరు, మార్గాన్ని నమ్మి మరింత బలంగా అడుగులు వేయడం వేరు. యథాలాపంగా నడిస్తే సామాజిక న్యాయం దిశగా రాజ్యాంగం ప్రకారం చెయ్యాల్సిన కనీస స్థాయి ప్రయత్నాలు జరుగుతాయి. నమ్మి అడుగులు వేస్తే ఆ స్ఫూర్తితో గరిష్ఠంగా ఎంత మేలు చెయ్యొచ్చు అన్నది ముఖ్యమవుతుంది. వైఎస్ జగన్ ఆధ్వర్యంలో ఏపీ ప్రభుత్వం అలా స్ఫూర్తిదాయకమైన అడుగులే వేస్తున్నట్లు పాలనలో ప్రారంభ దశ నుండే అవగతమైంది. ప్రతీ పథకంలో, అధికార పదవుల కూర్పులో, ఎంపిక ద్వారా కేటాయించే పనుల్లో సైతం సామాజిక న్యాయం, సంతృప్త స్థాయిలో సాధికారత కల్పించడం గీటురాళ్లుగా తీసుకోవడం జరిగింది. విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పనలకు పెద్దపీట వేయడం ద్వారా సమసమాజానికి బాటలు పడ్డాయి. ఈ స్ఫూర్తికి ఆలంబన అంబేడ్కర్ మహాశయుడు. ఆయన ఎత్తైన విగ్రహం ఇప్పుడు విజయవాడ నడిబొడ్డున నిల్చి దేశానికి సరైన మార్గం చూపించనుంది.

– డా॥ డి.వి.జి. శంకరరావు
మాజీ ఎంపీ, ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ | 94408 36931

డిజిటల్ కరెన్సీని సులభతరం చేయాలి!

అభిప్రాయం



బి. నర్సన్

భారతదేశంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా ప్రజలు డిజిటల్ చెల్లింపులకు అలవాటుపడ్డారు. 2010లో ఈ రంగంలోకి దిగిన గూగుల్ పే, అదే సంవత్సరం మొదలైన పేటీఎం, 2015లో ప్రవేశించిన ఫోన్ పే ఒకదానికొకటి పోటీ పడుతూ వచ్చాయి. ఫోన్ పే ఇప్పుడు అగ్రస్థానంలో ఉంది. 2022–23లో ఫోన్ పే ఆదాయం రూ. 2914 కోట్లు. ఒకే సంవత్సరంలో దాని లాభం 77 శాతం పెరిగింది. మార్కెట్‌లో 47 శాతం భాగస్వామ్యం దీనిదే. 28 కోట్ల మంది వాడుతుండగా ఏడాదికి 10 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. వీటిపై వచ్చే కమిషనే దీని ఆదాయవనరు. ఫోన్ రీఛార్జ్ ఒక్కింటికి రూ. 2 కమిషన్ రూపంలో లభిస్తాయి. ఇలా బీమా తదితర కంపెనీల ద్వారా వీటికి వచ్చే రాబడి కూడా ఎక్కువే.

ఇన్నాళ్లకు ఇలాంటి ఎలక్ట్రానిక్ చెల్లింపుల విధానంపై రిజర్వ్ బ్యాంకు కన్నుపడింది. 2021 ఆగస్టు 2న ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రవేశపెట్టిన డిజిటల్ కరెన్సీ నేడు కొన్ని నగరాల వినియోగదారుల అవసరాలు తీర్చే దశకు చేరుకుంది. గత ఏడాది నుండి ప్రయోగాత్మకంగా, దశలవారీగా ఆర్బీఐ డిజిటల్ కరెన్సీ వాడకాన్ని విస్తరిస్తోంది. ఎస్బీఐతో పాటు మరో నాలుగు ప్రయివేటు బ్యాంకుల ద్వారా మొదటి దశ పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించింది. ఇంకా పైలెట్ స్థాయిలోనే ఉన్న డిజిటల్ ఇండియన్ కరెన్సీ దేశంలోని 14 బ్యాంకుల్లో చలామణీలో ఉంది. వీటిలో 5 ప్రభుత్వ రంగ బ్యాంకులున్నాయి. ప్రస్తుతం ఈ సౌకర్యం గల ప్రధాన నగరాల్లో హైదరాబాద్ కూడా ఉంది.

ఇప్పటికే ఉన్న ప్రయివేట్ ఆన్‌లైన్ చెల్లింపుల యాప్‌లకు తోడుగా ప్రభుత్వ నిర్వహణలో నడిచే ఒక ధన మార్పిడి ద్వారం తెరుచుకోవడం ఆర్బీఐ చరిత్రలో విశేషమే. కాగితపు నోట్లు ముద్రించే ఆ బ్యాంక్ ఇప్పుడు ఎలక్ట్రానిక్ నోట్ల పంపిణీ చేస్తోంది. మొబైల్ తెరపై ఇవి కరెన్సీ నోట్ల రూపంలో కనబడతాయి. 2,000, 500, 200, 100, 50, 20, 10, 5, 2 రూపాయల డినామినేషన్లలో ఉంటాయి. కాగితపు నోటుపై ఉన్నట్లే వీటిపై కూడా వరుస సంఖ్య ఉంటుంది. బ్యాంకుకు వెళ్లి లేదా ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేసుకున్నట్లు మన ఖాతాలో ఉన్న సొమ్ములోంచి అవసరమైన నోట్ల బొమ్మలను ముందుగా డిజిటల్ రూపీ వాలెట్‌లోకి లోడ్ చేయాలి. మొబైల్ వాలెట్‌లోని డిజిటల్ నోట్ల ద్వారా జమలు, చెల్లింపులు జరుగుతాయి. నోట్లను తిరిగి బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసే రిడీమ్ సదుపాయం కూడా ఉంది. నోట్ల బొమ్మల పైన వాలెట్‌లో ఏ నోట్లు ఎన్ని ఉన్నాయో తెలిపే సంఖ్య ఉంటుంది. చెల్లింపులు చేస్తే ఆ నంబర్ తగ్గుతుంది. జమ చేస్తే పెరుగుతుంది.



ఆర్బీఐ విడుదల చేసిన డిజిటల్ కరెన్సీ


గూగుల్ పే లాంటి ఇతర యాప్‌ల ద్వారా డైరెక్టుగా బ్యాంకు ఖాతా నుంచి చెల్లింపులు జరిగితే ఆర్బీఐ డిజిటల్ రూపీ విధానంలో కేవలం వాలెట్ ద్వారా జరుగుతాయి. మొబైల్ నంబర్‌కు కాని, క్యూఆర్ కోడ్ ద్వారా కాని చెల్లింపు చేయాలనుకున్నప్పుడు వాలెట్‌లో జమ అయ్యి ఉన్న నోట్లలోంచి అవసరమున్న డినామినేషన్‌ను ఎంచుకోవాలి. ఇది వాడకందారులకు అదనపు శ్రమగానే భావించాలి. 45 గ్రాముల కొత్తిమీర కట్టకు 19.65 రూపాయల బిల్లు వచ్చినా నేరుగా పేమెంట్ చేసే అవకాశం ఇతర యాప్‌లు ఇస్తున్నప్పుడు ఇందులో డిజిటల్ రూపీలను ఎంపిక చేసుకొని పేమెంట్ చెయ్యాలి. క్యూ ఆర్ కోడ్ పై చెల్లింపు చేసినా నోట్ల ఎంపిక తప్పదు. పైన పేర్కొన్నట్లు 19.65 రూపాయలు చెల్లించాలనుకుంటే రూ. 20ని ఎంపిక చేసుకొని చిల్లర వదులుకోవాలి. ఎవరికైనా మొబైల్ యాప్ ద్వారా రూ. 50 వేలు ట్రాన్స్‌ఫర్ చేయాలంటే ఆ సంఖ్యను పే కాలమ్‌లో మార్చితే సరిపోతుంది. డిజిటల్ రూపీ యాప్‌లోనైతే ముందు బ్యాంక్ బ్యాలెన్స్ నుండి రూ. 2 వేల డినామినేషన్ బొమ్మను 25 సార్లు స్వైప్ చేస్తూ వాలెట్‌లో వాటిని పెంచుకోవాలి. ఆ తర్వాత పే చేసే నంబర్ ఎంచుకొని వాటిని అందులోకి లోడ్ చేయాలి. ఇదంతా అనవసర శ్రమతో కూడుకున్న పని.

ఇలా ఆర్బీఐ సృష్టించిన డిజిటల్ రూపీ వల్ల కొత్త చిక్కులు వచ్చే అవకాశముంది. దేశీయ కరెన్సీ ముద్రణ బాధ్యత మోస్తున్నందువల్ల ఆర్బీఐ మనీ ట్రాన్స్‌ఫర్ యాప్‌లో కూడా రూపాయల బొమ్మలుంచడం చాదస్తమే. ప్రస్తుతం ఈ పథకం పైలెట్ రూపంలోనే ఉన్నందువల్ల కష్టమర్ల సమస్యలను తీర్చే మార్గాలు రావచ్చు. మిగతా యాప్‌ల మాదిరే ఆదాయాన్ని ఆశిస్తే చాలా మార్పుల అవసరం ఉంది. ప్రభుత్వ రంగ బ్యాంకు ఖాతాదారులనైనా తమవైపు తిప్పు కోవడంలో సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ రూపీ ఎంత విజయం సాధిస్తుందో చూడాలి.

వ్యాసకర్త ప్రభుత్వ బ్యాంకు విశ్రాంత అధికారి
మొబైల్: 9440128169

దేవుణ్ణి కోరే ముందు...

మనుషులు దేవుణ్ణి ఆరాధించడానికి ప్రధాన కారణం ఆయన వారి కోర్కెలను తీరుస్తాడని నమ్మడమే! భౌతిక సంపదల నుంచి ఇహలోకం నుంచి విముక్తి వరకూ... అనేక రకాల కోర్కెలు మానవ కోర్కెల జాబితాలో ఉంటాయి. కొందరు మేము వ్యవసాయదారులం వర్షం కురిపించమని పూజలూ, యజ్ఞాలూ చేస్తారు. అదే సమయంలో ఇంకొందరు తాము కుండలు తయారు చేసుకుని బతికేవాళ్ళమనీ, వర్షం కురవకుండా చూడమని వేడుకుంటారు. ఎన్నికల్లో పోటీచేసే ప్రతి ఒక్కరూ తాము గెలిచేలా కరుణించమని పూజలు చేస్తారు. దొంగతనానికి వెళ్ళేవారు కూడా దేవుడి వద్దకు వచ్చి తామనుకున్న దోపిడీ సవ్యంగా జరిగేటట్టు అనుగ్రహించాలని కోరు కుంటారు. ఏ ఆటంకం లేకుండా దోపిడీ సాగిపోతే... దోచుకున్న దాంట్లో కొంత ఇస్తామని దేవునికి మొక్కుకుంటారు.



జ్యోతిర్మయం

ఇక్కడ ఎవరికి వారు నిజాయతీతో, భక్తితో దేవునికి తమ కోర్కెలు విన్నవించుకున్నవారే. దేవుడు నిజంగా భక్తవల్లభుడే అయితే వీరందరి కోర్కెలూ తీర్చవలసిందే. కానీ అలా తీర్చడం సాధ్యం కాదు. వర్షం కావాలని ఒకరంటే, వద్దని మరొకరంటున్నారు. మరి ఎవరి కోరిక తీర్చాలి?

నిజానికి మనిషి కోరిన కోరికలను దేవుడు తీర్చడం అసాధ్యం. కోరికలు అనంతం కాబట్టి అవి ఊరుతూనే ఉంటాయి. ఎప్పటికీ మనిషి సంతృప్తి చెందడు. అయితే దేవుణ్ణి ఏమయితే కోరతారో ఆ కోరిక హేతుబద్ధంగా ఉండేలా చూడాలి. దాన్ని పొందడంలో తమ కృషి తాము చేయాలి. మండు వేసవిలో వర్షాన్ని కురిపించాలని దేవుణ్ణి కోరడం న్యాయమేనా? ఏమీ చదవకుండా పరీక్షల్లో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలనుకోవడం సరైన ఆలోచనేనా?

'నువ్వు చెయ్యవలసిన పని నువ్వు చెయ్యి. ఫలితం అదే వస్తుంది' అన్న 'గీతా' సారాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని దేవుని ముందు కోర్కెల చిట్టా విప్పుతాడు సరైన భక్తుడు. అప్పుడే అతడు తగిన ఫలితాన్ని పొందగలుగుతాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.అష్టమి రా.1.06 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** రేవతి ఉ.8.29 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** తె.3.28 నుండి 4.56 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.10.18 నుండి 11.06 వరకు, తదుపరి ప.2.48 నుండి 3.36 వరకు, **అమృత ఘడియలు:** ఉ.6.11 నుండి 7.43 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.43.

● యూ ట్యూబ్ జర్నలిస్ట్ చిలుక ప్రవీణ్‌పై జరిగిన దాడిని మాజీమంత్రి హరీశ్‌రావు తీవ్రం గా ఖండించారు. ప్రభుత్వ వ్యతిరేక వార్తలు ప్రసారం చేస్తున్నారనే ముద్ర వేసి, భౌతిక దాడులకు దిగటం హేయమైన చర్యన్నారు.

ఇక 'రింగు' కోసం నిరంతర భూపరిహారం

- ఎన్‌హెచ్‌ఏఐకి రూ.364 కోట్లు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సమ్మతి లేఖ
- యుటిలిటీస్ తరలింపునకు అంగీకారం
- త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య త్రైపాక్షిక ఆర్థిక ఒప్పందం
- ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు ప్రక్రియ కొనసాగేందుకు మార్గం సుగమం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ రీజినల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్)లో నిరంతరాయ భూ పరిహారం పంపిణీకి మార్గం సుగమమైంది. ఇందుకు వీలుగా ఆ మార్గంలో అడ్డుగా ఉన్న విద్యుత్ టవర్లు, స్తంభాల తరలింపు, నీటి కాలువల మళ్లింపు, అందుకు తగ్గ నిర్మాణాల (యుటిలిటీ షిఫ్టింగ్) కోసం రూ.364 కోట్ల మొత్తాన్ని డిపాజిట్ చేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కి లేఖ ఇచ్చింది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య త్రైపాక్షిక ఆర్థిక ఒప్పందం కుదరనుంది. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ, ఎన్‌హెచ్‌ఏఐతో త్రైపాక్షిక ఒప్పందం త్వరలో జరగనుంది. ఇక రీజినల్ రింగురోడ్డు నిర్మాణంలో భూపరిహారంలో రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాతోపాటు యుటిలిటీ షిఫ్టింగ్‌కు అవసరమయ్యే మొత్తాన్ని చెల్లించేందుకు అంగీకరిస్తున్నట్టుగా ఇందులో సంతకాలు చేస్తారు. దీంతో ఈ ప్రాజెక్టు తదుపరి ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేందుకు మార్గం సుగమమవుతుంది.

ఇక అవార్డ్ జారీకి శ్రీకారం

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి సంబంధించి 158.645 కి.మీ. నిడివిలో భూసేకరణను మూడు నెలల్లో పూర్తి చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. బుధవారం యుటిలిటీ షిఫ్టింగ్ కోసం రూ.364 కోట్లను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతించడంతో భూపరిహారం పంపిణీకి సంబంధించిన అవార్డ్ జారీచేసే కసరత్తుకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. అందుకు సంబంధించి, సేకరిస్తున్న భూముల్లోని నిర్మాణాలు, తోటలకు విలువ కట్టే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఇది పూర్తి కాగానే గ్రామాల వారీగా అవార్డు పాస్ చేస్తారు. ఆయా గ్రామాలకు సంబంధించిన భూపరిహారంలో 50 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వం డిపాజిట్ చేస్తుంది. ఇలా రూ.2,600 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారంలో తన వంతు వాటాగా భరించాల్సి ఉంది. ఆ వెంటనే రోడ్డు నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం–ఎన్‌హెచ్‌ఏఐ మధ్య ఏర్పడ్డ పేచీ కారణంగా దాదాపు 10 నెలలుగా రీజినల్ రింగ్‌రోడ్డు ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు మళ్లీ ప్రారంభం కావటంతో రోడ్డు నిర్మాణ పనులు కూడా త్వరలోనే మొదలయ్యే సూచనలు కనపిస్తున్నాయి. దీంతోపాటు దక్షిణభాగానికి సంబంధించిన ప్రక్రియను కూడా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భారత్‌మాల పరియోజన–1లో ఉత్తర భాగం ఉన్న విషయం తెలిసిందే. దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా గుర్తిస్తూ కేంద్రం ఉత్తర్వు జారీ చేయాల్సి ఉంది. దాన్ని భారత్‌మాల పరియోజన తదుపరి ఫేజ్‌లో చేర్చాల్సి ఉంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయించింది. పార్లమెంటు ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియ జరుగుతుందని భావిస్తున్నారు.

ఇప్పటి వరకు రూ.100 కోట్ల జమ..

భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వ వాటా డబ్బును డిపాజిట్ చేసిన తర్వాత భూపరిహారం ప్రక్రియ ప్రారంభిస్తామని గతంలో ఎన్‌హెచ్‌ఏఐ పేర్కొంది. కానీ దీనికి రాష్ట్ర ప్రభుత్వం సమ్మతించలేదు. మొత్తం డబ్బులు ఒకేసారి డిపాజిట్ చేయటం సరికాదని స్పష్టం చేసింది. దీంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్‌హెచ్‌ఏఐ ఐదుసార్లు లేఖలు రాసినా ఫలితం లేకపోయింది. మరోవైపు గెజిట్ నోటిఫికేషన్ గడువు ముగియబోతుండటంతో ప్రాజెక్టు పెండింగులో పడిపోతుందని ఎన్‌హెచ్‌ఏఐ పేర్కొనటంతో ప్రభుత్వం ఎట్టకేలకు రూ.100 కోట్లు జమ చేసింది. దీంతో గెజిట్‌లు 'సజీవంగా'ఉండి ప్రాజెక్టు మనుగడలో ఉన్నట్టుగా పరిగణించారు.

ప్రలోభాలకు లొంగొద్దు

ఉద్యోగులకు సింగరేణి సీఎండీ బలరాం సూచన



గోదావరిఖని: అత్యంత పారదర్శకంగా మెడికల్ బోర్డు ప్రక్రియ కొనసాగుతోందని సింగరేణి సంస్థ సీఅండ్ఎండీ ఎన్.బలరాం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అనారోగ్య కారణాలతో పనులు చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం సంస్థ చేపట్టిన మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నామన్నారు. అక్రమాలకు తావు లేకుండా చర్యలు చేపట్టామని, మోసగాళ్ల డబ్బు తీసుకొని అన్‌ఫిట్ చేస్తామని ప్రలోభపెడితే నమ్మొద్దని సూచించారు. సింగరేణిలోని మెడికల్ బోర్డులో వైద్యనిపుణులు పరీక్షించి కార్మికులను అన్‌ఫిట్ చేస్తారని, ఇలాంటివారి స్థానంలో కారుణ్య నియామకాలను వెంటనే చేపడుతున్నామని వివరించారు. దళారుల సమాచారాన్ని విజిలెన్స్ విభాగం దృష్టికి తీసుకొస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు 16 వేల మంది వారసులకు మెడికల్ బోర్డు ఆధారంగా ఉద్యోగాలు ఇచ్చామని ఆయన వివరించారు.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తాం

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండలో బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగినట్లు పేపర్ల లీకేజీలకు తావులేకుండా యూపీఎస్సీ తరహాలో గ్రూప్ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. నల్లగొండలో బుధవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మాదిరిగా ఎమ్మెల్యేల చుట్టూ తిరిగినట్లు ఇప్పుడు తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు తులం బంగారం ఇచ్చే అంశంపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 'కారు సర్వీసింగ్ కోసం షెడ్డుకు పోయిందని కేటీఆర్ అంటున్నారు. కానీ ఆ కారు స్క్రాప్‌కు పోయింది. ప్రజలే పాత ఇనుప సామాను మాదిరిగా అమ్మేశారు'అని మంత్రి అన్నారు. కారు బయటకు వచ్చే పరిస్థితి లేదని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 14 సీట్లు గెలవబోతోందని పేర్కొన్నారు. రెండు మూడు సీట్లలో బీజేపీతో పోటీ ఉంటుందని, ఇక బీఆర్ఎస్ తమకు పోటీయే కాదన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ అవినీతిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఒకరు జైలుకు పోకతప్పదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని ఉద్దేశించి ఆయన అన్నారు.

దళితబంధు వివరాలివ్వండి

● 'సాక్షి' కథనంపై స్పందించిన సీఎంఓ

సాక్షి ఎఫెక్ట్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: దళితబంధుపై సమగ్ర వివరాలు అందజేయాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశించింది. ఈనెల 13వ తేదీన 'దళితబంధు ఉంటుందా..? ఉండదా..?' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై సీఎంఓ స్పందించింది. ఈ మేరకు నివేదిక సమర్పించాలని ఎస్సీ కార్పొరేషన్‌ను ఆదేశించినట్లు సమాచారం. దీంతో కరీంనగర్ జిల్లా లో పైలట్ ప్రాజెక్టు అయిన హుజూరాబాద్‌తోపాటు 33 జిల్లాల్లోని దళితబంధు పథకం అమలు, ఇప్పటివరకు విడుదలైన నిధులు, పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, మంజూరైన యూనిట్ల పనితీరు, పురోగతి తదితరాలన్నీ గణాంకాలతో సహా అందించాలని అన్ని జిల్లాలకు ఎస్సీ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ వివరాలు సిద్ధం చేసే పనులు జరుగుతున్నాయి.

'నాకేం కాదు, సీఎం మాబంధువు..'

దళితబంధులో పలువురు రిటైర్డ్ ఉద్యోగులను సలహాదారులుగా అప్పటి ప్రభుత్వం నియమించింది. ఆరునెలలుగా పథకం నిర్వహణ లేకపోయినా.. వారికి రూ.లక్షల్లో, వారి సహాయకులకు రూ. వేలల్లో వేతనాలు చెల్లిస్తూ వస్తోంది. 'సాక్షి'కథనం నేపథ్యంలో.. రిటైర్డ్ ఉద్యోగుల వివరాలు సమర్పించాలని ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగం ఆదేశించిన నేపథ్యంలో ఆ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. కొందరు పథకాన్ని వీడేందుకు సిద్ధపడగా.. ఓ విశ్రాంత అధికారి మాత్రం సీఎం తన బంధువని, తన పోస్టుకు ఏమీ కాదని చెప్పుకుంటుండటం చర్చనీయాంశమైంది.

హార్స్‌షోలో తెలంగాణ, ఏపీ కేడెట్ల హవా

● రిపబ్లిక్ డే గుర్రపుస్వారీ పోటీల్లో పతకాల పంట

సాక్షి, హైదరాబాద్: గుర్రపుస్వారీ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఎన్సీసీ కేడెట్లు సత్తా చాటారు. ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు న్యూఢిల్లీలోని ఎన్సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే హార్స్ షో–2024 పోటీలు జరిగాయి. ఇందులో తెలంగాణ, ఏపీ ఎన్సీసీ కేడెట్లు మూడు బంగారు పతకాలు, నాలుగు రజత పతకాలు, నాలుగు కాంస్య పతకాలు సాధించారు. యువతలో క్రీడా స్ఫూర్తితో పాటు ధైర్యం, ధృడత్వం, క్రమశిక్షణ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్సీసీ కేడెట్లకు గుర్రపుస్వారీలో శిక్షణ ఇస్తారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కేడెట్లకు జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. ఈ మేరకు రిపబ్లిక్ డే హార్స్ షో పోటీల్లో ఏపీ, తెలంగాణ విద్యార్థులు పలు కేటగిరీల్లో ముందు వరుసలో నిలిచారు. అదేవిధంగా ప్రతిష్టాత్మకమైన షో జంపింగ్ చాంపియన్ ఆఫ్ ది డే ట్రోఫీని సైతం కైవసం చేసుకున్నారు.

- షో జంపింగ్ (వెటరన్ గరల్స్) కేటగిరీలో తమన్నా, టార్జాన్‌లు బంగారు, రజత పతకాలను గెలుచుకున్నారు. తమన్నా ప్రతిష్టాత్మకమైన షో జంపింగ్ ఛాంపియన్ ఆఫ్ ది డే ట్రోఫీని కూడా గెలుచుకుంది.
- షో జంపింగ్(నొవైస్ బాయిస్) కేటగిరీలో టార్జాన్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు.
- షో జంపింగ్ (వెటరన్ బాయిస్) కేటగిరీలో తమన్నా కాంస్య పతకాన్ని గెలుచుకుంది.
- జంపింగ్ ఓపెన్ టాప్ క్యాడెట్ కొర్ర గణేష్ సిల్వర్ మెడల్ సాధించాడు
- డ్రస్సేజ్ వెటరన్ (బాలురు) కేటగిరీలో ఎస్.చిట్టేశ్‌రావు బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు
- డ్రెస్సేజ్ (నొవైస్ బాయిస్) కేటగిరీలో జి లోహిత్ రజత పతకాన్ని గెలుచుకున్నాడు
- షో జంపింగ్ (నొవైస్ బాయిస్) కేటగిరీలో జి లోహిత్ రజత పతకాన్ని గెలుచుకున్నాడు
- టెంట్ పెగ్గింగ్ వెటరన్స్ కేటగిరీలో భాను కృష్ణ కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు ● హాక్స్ (బాలురు నొవైస్) జి.లోహిత్ బంగారు పతకాన్ని మెడల్ సాధించాడు

మోదీ మాటలు అబద్ధం: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: గత పదేళ్ల కాలంలో దేశంలోని 25 కోట్ల మంది పేదలను ధనికులను చేశానని ప్రధాని మోదీ చెప్పుకోవడం చూస్తుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదని కాంగ్రెస్ మాజీ ఎంపీ వీహెచ్ వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంతకంటే అబద్ధం ఇంకోటి లేదన్నారు. దేశంలోని రైతులు పండించిన పంటలకు మద్దతు ధర పెంచమని అడిగితే ఇప్పటికీ పెంచలేదని, పెద్ద నోట్ల రద్దు పేరుతో చిన్న చిన్న వ్యాపారులను రోడ్డున పడేసిన మోదీ.. అదానీని మాత్రం అంబానీకి మించిన ఆస్తిపరుడిని చేశాడన్నారు. రాముడి మీద బీజేపీ కి ప్రేమ లేదని, హిందువుల ఓట్ల మీద ప్రేమతో రాముడిని కూడా రాజకీయాల్లోకి లాగాలని బీజేపీ చూస్తోందన్నారు.

'బీజేపీ వైఫల్యాలను ఎండగతాం'

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడతామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి చెప్పారు. యంగ్ ఇండియా కే బోల్ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా గాంధీ భవన్ లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత 4 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ చేపడుతోందని, ఈ కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున యువకులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన యువకుల గొంతును వినిపించేందుకు ఈ కార్యక్రమం వేదికగా ఉపయోగపడుతోందన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి యంగ్ ఇండియా కీ బోల్ 4వ సీజన్ ను ప్రారంభిస్తున్నామని, తెలంగాణ లో 33 జిల్లాల్లో ఉధృతంగా చేపడతామని చెప్పారు.


అయోధ్య వీధుల్లో సూర్యస్తంభ్ సోలార్ దీపాల వెలుగులు


సరయూ నదీ జలాలతో కూడిన కలశాలను తీసుకొస్తున్న భక్తులు


గర్భగుడిలో విగ్రహం ప్రతిష్ఠించే పవిత్రప్రదేశం


బుధవారం గర్భగుడిలో ప్రత్యేక పూజలు

అయోధ్యలో కలశ పూజ

రెండో రోజుకు చేరిన ప్రత్యేక క్రతువులు

సరయూ జలాలను కలశాల్లో నింపిన ఆచార్యులు

అయోధ్య: అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ కోసం ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. పూజరులు నిర్వహిస్తున్న ప్రత్యేక క్రతువులు రెండో రోజుకు చేరాయి. బుధవారం కలశ పూజ చేపట్టారు. రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యుడు అనిల్ మిశ్రా దంపతులు 'యజమానులుగా' సరయూ నది తీరంలో కలశ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కలశాలను సరయూ నదీ జలాలలో నింపి పూజలు చేశారు. రామ్‌లల్లా ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రధాన ఆలయ ప్రాంగణంలోకి ఈ కలశాలను తీసుకెళ్తారు. ప్రతిష్ఠాపన కంటే ముందు ఈ జలాలతో పూజలు చేస్తారు. మొత్తం 121 మంది ఆచార్యులు క్రతువుల్లో పాల్గొంటున్నారు. లక్ష్మీకాంత్ దీక్షిత్ ప్రధాన ఆచార్యుడిగా వ్యవహరిస్తున్నారు. గురువారం గణేశ్ అంబికా పూజ, వరుణ పూజ, మాత్రికా పూజ, వాస్తు పూజ నిర్వహిస్తారు. మంగళవారం ప్రారంభమైన ఈ క్రతువులు ఈ నెల 21వ తేదీ దాకా నిరంతరాయంగా కొనసాగుతాయని ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు.

అయోధ్యకు చేరుకున్న 'రామ్‌లల్లా'

భవ్య మందిరంలో ప్రతిష్ఠించబోయే రామ్‌లల్లా విగ్రహం బుధవారం అయోధ్యకు చేరుకుంది. భక్తుల జయజయ ధ్వానాల మధ్య వాహనంలో ఆలయ ప్రాంగణానికి తీసుకొచ్చారు. గర్భాలయంలోని వేదికపైకి చేర్చారు. కళ్లకు గంతలు కట్టి ఉన్న ఈ విగ్రహం చిత్రాలను తీర్థ క్షేత్ర ట్రస్టు విడుదల చేయలేదు. ఈ నెల 22న ఇదే విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేయబోతున్నారు. ప్రాణప్రతిష్ఠ తర్వాతే రామ్‌లల్లా చిత్రాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, రామ్‌లల్లా ప్రతీకాత్మక (సింబాలిక్) విగ్రహం బుధవారం ఆలయ ప్రాంగణానికి చేరుకుంది.

ప్రాణప్రతిష్ఠకు 'ప్రధాన యజమాని' ప్రధాని మోదీ

అయోధ్య: రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ప్రధాన యజమాని'గా వ్యవహరిస్తారని ప్రధాన ఆచార్యుడు పండిత లక్ష్మీకాంత్ దీక్షిత్ చెప్పారు. మొదట రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యుడు అనిల్ మిశ్రాను ప్రధాన యజమానిగా ఖరారు చేశారు. కానీ, ఈ విషయంలో మార్పు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. గర్భాలయంలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠతోపాటు కీలకమైన పూజలను ప్రధాన యజమాని తన చేతుల మీదుగా నిర్వహిస్తారు.


రామ్‌లల్లా ప్రతీకాత్మక విగ్రహాన్ని రామమందిరానికి తీసుకొస్తున్న దృశ్యం

19 నుంచి 'అఖండ్ పథ్'

అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన కోసం హిందువులతో పాటు ఇతర మతాల ప్రజలు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకూ మూడు రోజులపాటు 'అఖండ్ పథ్' నిర్వహించేందుకు సిక్కు మతస్థులు సిద్ధమవుతున్నారు. అయోధ్యలోని గురుద్వారా బ్రహ్మకుండ్ సాహిబ్‌లో ఈ కార్యక్రమం నిర్వహించబోతున్నారు. రామాలయ ప్రాణప్రతిష్ఠ సజావుగా జరగాలని ఆకాంక్షిస్తూ అఖండ్ పథ్ నిర్వహించనున్నట్లు బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్ చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సిక్కులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేశారు. అయోధ్య శ్రీరాముడితో సిక్కులకు చరిత్రాత్మక అనుబంధం ఉందని వివరించారు. 1510లో గురునానక్ అయోధ్యను దర్శించుకున్నారని గుర్తుచేశారు. 1858లో సిక్కు మత పెద్దలు అయోధ్య రామాలయంలో పూజలు చేశారని, గోడలపై రామ్ అని రాశారని చెప్పారు. సిక్కు మత ఆచారాలు, సంప్రదాయాల్లో అఖండ్ పథ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. పవిత్ర గురుగ్రంథ సాహిబ్‌ను నిరంతరాయంగా భక్తితో పఠించడమే అఖండ్ పథ్. ఇందుకు 48 గంటలకుపైగా సమయం పడుతుంది. సిక్కుల పవిత్ర గ్రంథమైన గురుగ్రంథ సాహిబ్‌లో 'రామ్' అనే పదం 2,533 సార్లు ఉందని ఆర్‌పీ సింగ్ వెల్లడించారు.

రామ భక్తులపై మోసాల వల

సైబర్ నేరగాళ్లు అయోధ్య రామమందిర ప్రారంభోత్సవాన్ని కూడా అక్రమ సంపాదనకు వాడుకుంటున్నారు. అయోధ్య నుంచి రామమందిర ప్రసాదం పంపిస్తామంటూ భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. అమెజాన్ వంటి ఆన్‌లైన్ మార్కెట్ సైట్లలో ఇలాంటి ప్రసాదం కనిపిస్తోంది. డెలివరీ చార్జీల కింద కేవలం రూ.51 ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తే చాలు ఈ నెల 22వ తేదీ నాటికి ఉచితంగా ప్రసాదం పంపిస్తామంటూ మరికొందరు నేరగాళ్లు వల విసురుతున్నారు. నిజానికి దీనికి, అయోధ్య రామమందిరానికి ఎలాంటి సంబంధం లేదు. అదంతా నకిలీ ప్రసాదమని అధికారులు అంటున్నారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. కొందరైతే డొనేషన్లు సేకరిస్తున్నామంటూ రామ్ జన్మభూమి ట్రస్టు పేరిట వాట్సాప్ ద్వారా క్యూఆర్ కోడ్ పంపుతున్నారు. వాటిని స్కాన్ చేస్తే బ్యాంకు ఖాతాల్లో నగదు గల్లంతవుతోంది. అలాగే రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపనను ప్రత్యక్షంగా తిలకించడానికి వీఐపీ పాసులు అందజేస్తామంటూ ఉచ్చులోకి లాగుతున్నారు. 'రామ్ జన్మభూమి గృహ సంపర్క్ అభియాన్-ఏపీకే' పేరిట ఇలాంటి సందేశాలను ఫోన్ల ద్వారా పంపిస్తున్నారు. నగదు బదిలీ చేయించుకొని ఫోన్లు స్విచ్ఛాఫ్ చేస్తున్నారు.

అయోధ్యకు 200కుపైగా ఆస్థా ప్రత్యేక రైళ్లు

అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ తర్వాత భక్తులు పోటెత్తనున్నారు. వారి సౌకర్యార్థం దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి అయోధ్యకు 2 వేల ఆస్థా ప్రత్యేక రైళ్లు నడిపించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. టయర్-1, టయర్-2 నగరాల నుంచి బయలుదేరి ఈ రైళ్లు అయోధ్య ధామ్ స్టేషన్‌కు చేరుకుంటాయి. ఈ నెల 22వ తేదీ నుంచి 100 రోజులపాటు ఈ ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే శాఖ వర్గాలు వెల్లడించాయి. ఇవి పరిమితమైన స్టేషన్లలో మాత్రమే ఆగుతాయి. అయోధ్య ధామ్ స్టేషన్ నుంచి మళ్లీ గమ్యస్థానాలకు చేరుకుంటాయి. ఈ రైళ్లలో ప్రయాణానికి ఐఆర్‌సీటీసీ ద్వారా మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

కొత్తగా 20 వేల ఉద్యోగాలు

అయోధ్య ఇక అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మారనుంది రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ తర్వాత అయోధ్యను ప్రతిఏటా కోట్లాది మంది దర్శించుకోనున్నారు. అదేస్థాయిలో ఇక్కడ ఉద్యోగ, ఉపాధి పెరగడం ఖాయం. ఆతిథ్యం, రవాణా, పర్యాటక రంగాల్లో కలిపి 20 వేల కొత్త ఉద్యోగాల సృష్టి జరిగిందని సమాచారం.

ప్రతిఏటా శ్రీరాముడికి 'సూర్య తిలకం'

అయోధ్య రామ మందిరంలో ప్రతిఏటా చైత్ర మాసంలో శ్రీరామనవమి రోజు భక్తులు అపూర్వమైన దృశ్యాన్ని తిలకించవచ్చు. ఆ రోజు గర్భాలయంలో రాముడి నుదుటన సూర్య కిరణాలు ప్రసరిస్తాయి. సూర్య కిరణాలే తిలకంగా రామయ్యను అలంకరిస్తాయి. దీన్ని సూర్య తిలకంగా పిలుస్తారు. ఈ తిలకం వ్యవస్థను సీఎస్ఐఆర్-సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(సీబీఆర్ఐ) సైంటిస్టులు డిజైన్ చేశారు. ఇందుకోసం ఆలయంలో కటకాలు, అద్దాలు ఏర్పాటు చేస్తున్నారు. శ్రీరామనవమి రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి 6 నిమిషాల పాటు సూర్య తిలకాన్ని దర్శించుకోవచ్చు.

ప్రాణప్రతిష్ఠను నిలిపేయండి

అలహాబాద్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం

అలహాబాద్: అయోధ్య రామాలయంలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిలిపివేయాలని కోరుతూ ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. ఘజియాబాద్ నివాసి భోలాదాస్ అనే వ్యక్తి ఈ వ్యాజ్యం దాఖలు చేశాడు. హిందూ క్యాలెండర్ ప్రకారం పౌష్య మాసంలో మతపరమైన వేడుకలు నిర్వహించకూడదని చెప్పారు. అలాగే అయోధ్యలో రామాలయ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని, అసంపూర్తిగా ఉన్న గుడిలో రాముడి విగ్రహాన్ని ఎలా ప్రతిష్ఠిస్తారని ప్రశ్నించారు. ఇలా చేయడం సనాతన ధర్మానికి విరుద్ధమేనని స్పష్టం చేశారు. అసంపూర్తిగా ఉన్న గుడిలో దేవుడి ప్రతిష్ఠాపన పట్ల పలువురు శంకరాచార్యులు కూడా ఇప్పటికే అభ్యంతరం వ్యక్తం చేశారని వెల్లడించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం బీజేపీ ఆరాటపడుతోందని, అందులో భాగంగానే అయోధ్య ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తోందని భోలాదాస్ ఆరోపించారు.

చైనా జనాభా రెండో ఏడాదీ తగ్గింది

బీజింగ్: అధిక జనాభాతో మన దేశం జనభారత్‌గా దూసుకుపోతుంటే పొరుగు దేశం చైనా జనాభా క్షీణతను చవిచూస్తోంది. వరసగా రెండో ఏడాదీ అక్కడ జనాభా క్షీణత నమోదైంది. గత ఏడాదితో చూస్తే 2023 ఏడాదిలో చైనా జనాభా 20.8 లక్షలు తగ్గి 140.97 కోట్లకు పడిపోయింది. వార్షిక గణాంకాలను బుధవారం చైనా విడుదలచేయడంతో ఈ విషయం వెల్లడైంది. జనాభా నియంత్రణే లక్ష్యంగా ఒకే బిడ్డ విధానాన్ని కఠినంగా కమ్యూనిస్ట్ ప్రభుత్వం అమలుచేయడంతో చైనాలో గత ఆరు దశాబ్దాల్లో ఎరుగని జనాభా క్షీణతను 2022 ఏడాది ఎదుర్కొంది. 2022లో చైనాలో 95.6 లక్షల మంది జన్మిస్తే 2023లో 90.2 లక్షల మంది పుట్టారు. జననాల రేటు అత్యంత కనిష్టానికి పడిపోవడమూ ఇందుకు ఒక కారణం. కోవిడ్ కారణంగా 2023 ఏడాదిలో ఎక్కువ మంది చనిపోవడమూ జనాభా తగ్గుదలకు మరో కారణమైంది. గత ఏడాది ఏకంగా 1.11 కోట్ల మంది చైనాలో చనిపోయారు.

మేనిఫెస్టో కోసం సూచనలు ఇవ్వండి

దేశ ప్రజలకు కాంగ్రెస్ పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రజల నుంచి పొందిన సలహాలు, సూచనలకు అనుగుణంగా ఈసారి లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను సిద్ధంచేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించుకుంది. ఇందుకోసం వారు పంపాల్సిన ఈమెయిల్, వెబ్‌సైట్‌లను బుధవారం ఆవిష్కరించింది. awaazbharatki.in వెబ్‌సైట్‌కు ఓటర్లు తమ సూచనలను పంపొచ్చు. awaazbharatki@inc.in మెయిల్ ఐడీకి సైతం దేశ ప్రజలు తమ సలహాలు, సూచనలను పంపొచ్చు. కేంద్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి పి.చిదంబరం ఛైర్మన్‌గా ఏర్పాటైన మేనిఫెస్టో కమిటీ ఇలా సామాన్య ప్రజలు, వివిధ వర్గాలు, సమూహాలు, సంస్థల నుంచి సలహాలు సూచనలను కోరుతోంది. 'ప్రజాభీష్టానికి అనుగుణంగానే కాంగ్రెస్ మేనిఫెస్టో రూపుదిద్దుకుంటుంది'' అని బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ చిదంబరం, కన్వీనర్ టీఎస్ సింగ్ దేవ్ స్పష్టంచేశారు.

థాయ్‌లాండ్ బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

23 మంది కార్మికుల దుర్మరణం

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లోని సుప్రాన్ బురీ ప్రావిన్స్‌లోని బాణసంచా తయారీ కర్మాగారంలో సంభవించిన భారీ పేలుడులో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది గాయపడ్డారు. పేలుడు ధాటికి కార్మికుల మృతదేహాలు ఛిద్రమై చెల్లాచెదురుగా పడి ఘటనాస్థలి భీతావహంగా మారింది. ఘటన జరిగినపుడు ఫ్యాక్టరీలో దాదాపు 30 మంది కార్మికులు ఉండి ఉంటారని భావిస్తున్నారు. ఫ్యాక్టరీ ఉన్న ప్రాంతం వరిపొలాలకు పెట్టిందిపేరు. పచ్చని పొలాల మధ్య బుధవారం మధ్యాహ్నంవేళ దట్టమైన నల్లని పొగలు ఎగసిపడుతున్న దృశ్యాలను ఆ దేశ ప్రధాన మంత్రి కార్యాలయం ట్వీట్‌చేసింది. చైనీయుల నూతన సంవత్సరం వచ్చే నెలలో థాయిలాండ్‌లోనూ ఘనంగా జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా బాణసంచాకు భారీగా డిమాండ్ పెరగడంతో పెద్దమొత్తంలో బాణసంచాను హడావుడిగా తయారుచేస్తుండటంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

మహారాష్ట్ర స్పీకర్‌కు బాంబే హైకోర్టు నోటీసులు

ముంబై: ఉద్ధవ్ ఠాక్రే వర్గంలోని 14 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాను పెట్టుకున్న పిటిషన్లను మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ కొట్టేయడాన్ని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గం నేత, చీఫ్ విప్ భరత్ గోగావాలే బాంబే హైకోర్టులో సవాల్ చేశారు. దీంతో ఈ విషయంలో మీ స్పందన తెలపాలంటూ స్పీకర్, 14 మంది ఉద్ధవ్ వర్గం ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు పంపింది. అసెంబ్లీ సచివాలయానికీ కోర్టు నోటీసులిచ్చింది. నోటీసులు అందుకున్నవారు తమ స్పందనను అఫిడవిట్ల రూపంలో సమర్పించాలని కోర్టు సూచించింది. కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి ఎనిమిదో 8కి వాయిదావేసింది.

ఇండిగో, ముంబై ఎయిర్‌పోర్ట్‌లకు జరిమానా

ముంబై: విమానం ఆలస్యం కావడంతో ప్రయాణికులు రన్‌వే పక్కనే నేలపై కూర్చుని భోజనంచేసిన ఘటనలో ఇండిగో విమానయాన సంస్థ, ముంబై ఎయిర్‌పోర్ట్‌పై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ), బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ(బీసీఏఎస్) ఆగ్రహం వ్యక్తంచేసి జరిమానా విధించాయి. ప్రయాణికుల అసౌకర్యానికి కారణమైన ఇండిగో సంస్థపై రూ.1.5 కోట్ల జరిమానా, ముంబై ఎయిర్‌పోర్ట్‌పై రూ.90 లక్షల జరిమానా విధించాయి. ఒక పౌరవిమానయాన సంస్థపై ఇంతటి భారీ జరిమానా పడటం ఇటీవలికాలంలో ఇదే తొలిసారికావడం గమనార్హం. జనవరి 15వ తేదీన గోవా నుంచి బయల్దేరిన విమానం ఢిల్లీకి వెళ్లాల్సి ఉంది. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా పొగమంచు కారణంగా ఢిల్లీకి బదులు ముంబైలో దిగింది. చాలాసేపు విమానంలోనే వేచి ఉన్న ప్రయాణికులు విసిగిపోయి కిందకు దిగొచ్చి రన్‌వే పక్కనే కూర్చుని భోజనాలు చేశారు. ఈ ఘటనను పౌరవిమానయాన శాఖ సీరియస్‌గా తీసుకుంది. బీసీఏఎస్ అడిగేదాకా ఈ విషయంలో ఇండిగో వివరణ ఇవ్వకపోవడం గమనార్హం. రన్‌వేపై ప్రయాణికుల కదలికలను నియంత్రించకుండా ముంబై ఎయిర్‌పోర్ట్ సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహించారని డీజీసీఏ ఆక్షేపించింది.

మూడు క్యాంపులపై మావోయిస్టుల దాడి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పామేడు గ్రామం మావోయిస్టులు, జవాన్ల పరస్పర కాల్పుల మోతతో దద్దరిల్లింది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా దండకారణ్య ప్రాంతంలోని బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల్లో ఏర్పాటుచేస్తున్న పోలీసు క్యాంప్‌లపై మావోలు మెరుపుదాడికి దిగారు. పామేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం, చింతవాగులో నిర్మించిన క్యాంప్‌లు, పామేడు పోలీస్ స్టేషన్‌పై మావోయిస్టులు దాడికి దిగారు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో లాంచర్లతో దాడిని ప్రారంభించిన మావోయిస్టులు బుధవారం తెల్లవారుజామున 5 గంటల వరకు కొనసాగించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు ఎదురుదాడికి దిగగా తెల్లవార్లూ ఆ ప్రాంతం బాంబుల మోతతో దద్దరిల్లింది. ఈ దాడుల్లో 300 నుంచి 400 మంది వరకు మావోయిస్టులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. దాడి సమయంలో ఆయా ప్రాంతాల ప్రధాన దారులపై చెట్లు నరికి అడ్డంగా వేసి నిప్పుపెట్టి రహదారిని మూసి వేశారు. ఆ మార్గాల గుండా వస్తున్న గ్రామస్తులను వెనక్కి పంపించారు. మూడు చోట్లా ఏకకాలంలో రాకెట్ లాంచర్లు విసురుతూ, మందుపాతరలు పేల్చుతూ భయోత్పాతం సృష్టించారు. దీంతో సీఆర్‌పీఎఫ్ బలగాలు సైతం ఎదురుదాడికి దిగాయి. ధర్మారం క్యాంపు నిర్మాణ పనులు కొనసాగుతుండగా అందులోని జవాన్లతో పాటు పని చేసేందుకు గుంటూరు నుంచి వచ్చిన 40 మంది కూలీలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. ధర్మారం క్యాంప్‌పై జరిపిన దాడిలో తొమ్మిది మంది జవాన్లు స్వల్పంగా గాయపడినట్లు సమాచారం.

ఓటర్ల మనసులు గెల్చుకోవాలి

- బీజేపీ శ్రేణులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- బూత్ స్థాయిలో విజయం సాధిస్తే రాష్ట్రంలో గెలుపు మనదే
- కేరళలో బీజేపీ 'శక్తి కేంద్రాల' ఇన్‌చార్జీలతో మోదీ సమావేశం

కొచ్చి/త్రిసూర్: కేంద్రంలో ఎవరు అధికారంలో ఉండాలో నిర్దేశించే శక్తి కేరళకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రాష్ట్రంలో ఓటర్ల మనసులు గెల్చుకోవాలని బీజేపీ నేతలు, కార్యకర్తలకు సూచించారు. కేరళ అసెంబ్లీలో పాగా వేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆయన మంగళవారం సాయంత్రం కేరళకు చేరుకున్నారు. రెండు రోజు బుధవారం కొచ్చి నగరంలో బీజేపీ 'శక్తి కేంద్రాల' ఇన్‌చార్జీలతో మోదీ సమావేశమయ్యారు. రెండు నుంచి మూడు పోలింగ్ బూత్‌లను కలిపి ఒక్కో శక్తి కేంద్రంగా పరిగణిస్తారు. మోదీతో భేటీకి దాదాపు 6,000 మంది ఇన్‌చార్జీలు హాజరయ్యారు. బూత్ స్థాయిలో విజయం సాధిస్తే కేరళలో గెలుపు మనదేనని నిర్దేశించారు. ఎవరి బూత్‌ల్లో వారు గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని చెప్పారు.

ఇళ్లలో 'రామజ్యోతి' వెలిగించండి

దేశంలో వేగవంతమైన అభివృద్ధి, భవిష్యత్తు పట్ల స్పష్టమైన విజన్ ఉన్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. ఈ విషయం ఇప్పటికే నిరూపితమైందని అన్నారు. బీజేపీ వైపు యువతను ఆకర్షించాలని, ఇందుకోసం 'మై భారత్' కార్యక్రమం, నమో యాప్‌తోపాటు సోషల్ మీడియా వేదికలను ఉపయోగించుకోవాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రచారం కల్పించాలన్నారు. పార్టీ పట్ల సానుకూలతను వ్యాప్తి చేయాలన్నారు. ఈ నెల 22న అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అన్ని చోట్లా ఆలయాలను శుభ్రం చేయాలని బీజేపీ శ్రేణులను నరేంద్ర మోదీ కోరారు. 22న సాయంత్రం ఇళ్లల్లో 'రామజ్యోతి' వెలిగించాలని, ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని వివరించారు.

గురువాయూర్ ఆలయంలో మోదీ పూజలు

కేరళలో ప్రసిద్ధి చెందిన గురువాయూర్ శ్రీకృష్ణ మందిరంలో ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ ముండు(ధోతీ), తెల్లరంగు శాలువా ధరించి, స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి భారతీయుడు సంతోషంగా ఉండాలని, సౌభాగ్యంతో విలసిల్లాలని గురువాయుర్ శ్రీకృష్ణుడిని ప్రార్థించానని మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆలయ సందర్శన ఫొటోను 'ఎక్స్'లో పోస్టు చేశారు. అనంతరం గురువాయూర్ ఆలయంలో ప్రముఖ మలయాళ సినీ నటుడు, బీజేపీ నేత సురేశ్ గోపీ కుమార్తె వివాహానికి మోదీ హాజరయ్యారు. నూతన దంపతులకు మోదీ స్వయంగా పూల మాలలు అందించారు. వారిద్దరి చేతులను కలిపి ఆశీర్వదించారు. కొత్త దంపతులు మోదీకి పాదాభివందనం చేశారు. ఈ పెళ్లి వేడుకకు హాజరైన సినీ నటులు మమ్ముట్టీ, మోహన్‌లాల్, జయరాం, దిలీప్, ఖుష్బూతో మోదీ విడివిడిగా మాట్లాడారు. ఇదే ఆలయంలో వివాహం చేసుకున్న జంటలను సైతం మోదీ అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారికి మిఠాయిలు బహూకరించారు. ఆ తర్వాత త్రిసూర్ జిల్లాలోని త్రిప్రయార్‌లో శ్రీరామస్వామి ఆలయంలో ప్రధానమంత్రి పూజలు చేశారు. అనంతరం కొచ్చికి బయలుదేరి వెళ్లారు. కొచ్చి సిటీలో భారీ రోడ్ షోలో పాల్గొన్నారు.


గురువాయూర్ ఆలయానికి వస్తున్న మోదీ


గురువాయూర్ ఆలయంలో..


సురేశ్ గోపీ కుమార్తె వివాహ వేడుకలో..

రూ.4,000 కోట్ల ప్రాజెక్టులు అంకితం

అంతర్జాతీయ వాణిజ్యంలో భారతదేశ శక్తిసామర్థ్యాలను, స్థానాన్ని ప్రపంచ దేశాలు గుర్తించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తక్కువ సమయంలో నౌకల రాకపోకల విషయంలో పలు అభివృద్ధి చెందిన దేశాలను సైతం మనం అధిగమించామని చెప్పారు. బుధవారం కేరళలోని కొచ్చి సిటీలో రూ.4,000 కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ జాతికి అంకితం చేశారు. వీటిలో ప్రతిష్ఠాత్మకమైన కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ కూడా ఉంది.

భద్రతా బలగాలపైకి మిలిటెంట్ల దాడులు

- ఇద్దరు పోలీసుల దుర్మరణం
- మణిపూర్‌లోని మోరే పట్టణంలో ఘటన
- కొనసాగుతున్న పరస్పర కాల్పులు

ఇంఫాల్: జాతుల వైరంతో ఘర్షణలమయమైన మణిపూర్‌లో ఈసారి భద్రతా బలగాలు, కుకీ మిలిటెంట్లకు మధ్య పరస్పర కాల్పుల పర్వం కొనసాగుతోంది. తొలుత మయన్మార్ సరిహద్దులోని మోరె పట్టణంలో భద్రతా బలగాల పోస్ట్‌పై మిలిటెంట్లు దాడి చేయడంతో ఈ ఎదురుకాల్పులు మొదలయ్యాయి. గత ఏడాది అక్టోబర్‌లో మోరె సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్ చంగ్‌థమ్ ఆనంద్‌ను కుకీ మిలిటెంట్లు హత్య చేసిన ఘటనలో మంగళవారం మోరె పట్టణంలో పోలీసులు ఇద్దరు అనుమానితులను అరెస్ట్‌చేశారు. ఈ అరెస్ట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ కొందరు మహిళల బృందం పోలీస్‌స్టేషన్ వద్ద నిరసనకు దిగారు. ఈ నేపథ్యంలోనే బుధవారం మోరె పట్టణంలోని భద్రతాబలగాల పోస్ట్‌పై కాల్పులు జరిపారు. రాకెట్ ఆధారిత గ్రనేడ్లు విసిరారు. బలగాల పోస్ట్ వద్ద వాహనాలు సైతం ధ్వంసమయ్యాయి. వెంటనే తేరుకున్న బలగాలు మిలిటెంట్లపై కాల్పులు జరిపాయి. మోరె పట్టణం సహా ఛికిమ్ గ్రామంలో, వార్డ్ నంబర్ ఏడులోనూ ఇలా ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. ఒక ఆలయం సమీపంలో మిలిటెంట్లు జరిపిన మెరుపుదాడిలో స్టేట్ పోలీస్ కమాండో వాంగ్‌కెమ్ సోమర్‌జిత్ మరణించారు. మరో చోట జరిపిన కాల్పుల్లో మరో పోలీస్ తఖెల్లంబమ్ శైలేశ్వర్ ప్రాణాలు కోల్పోయారు. ఉద్రిక్తతల నేపథ్యంలో తెంగ్‌నౌపాల్ జిల్లాలో మణిపూర్ సర్కార్ కర్ఫ్యూను విధించింది. ఇద్దరు నిందితులను జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ తొమ్మిది రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగించారు.

హెలికాప్టర్లు ఇప్పించండి

రోడ్డు మార్గంలో బలగాల తరలింపు సమయంలో మిలిటెంట్ల మెరుపుదాడుల నేపథ్యంలో బలగాల తరలింపు, మొహరింపు, క్షతగాత్రుల తరలింపు, వైద్య సేవల కోసం హెలికాప్టర్లను ఇవ్వాలని కేంద్ర హోం శాఖను మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించింది. రాష్ట్రంలో మళ్లీ మొదలైన ఘర్షణలు, ఉద్రిక్తతలపై ముఖ్యమంత్రి బీరెన్ నేతృత్వంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. తాజా ఉద్రిక్తతల్లో మయన్మార్ శక్తుల ప్రమేయం ఉండొచ్చని సీఎం అనుమానం వ్యక్తంచేశారు.

పాక్ ఉగ్రస్థావరాలపై ఇరాన్ దాడులు

- ఆగ్రహించిన పాకిస్తాన్
- తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిక
- తమ రాయబారిని వెనక్కి పిలిచిన పాక్

జెరూసలేం: పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తూ తమ దేశంలో ఉగ్రదాడులకు తెగబడుతున్న జైష్ అల్-అదిల్ ఉగ్రసంస్థ స్థావరాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణి దాడులతో విరుచుకుపడింది. దీంతో ఇప్పటికే హమాస్-ఇజ్రాయెల్ యుద్ధంతో ఉద్రిక్తతలు పెరిగిన పశ్చిమాసియాలో పరిస్థితి మరింత దిగజారింది. దీంతో ఇన్నాళ్లూ దౌత్య సంబంధాలు మాత్రమే కొనసాగుతున్న పాకిస్తాన్, ఇరాన్‌ల మధ్య ఒక్కసారిగా వైరం ప్రజ్వరిల్లింది. పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని గ్రీన్ మౌంటేన్ పర్వతప్రాంతంలోని జైష్ అల్ అదిల్(ఆర్మీ ఆఫ్ జస్టిస్) సంస్థకు చెందిన రెండు స్థావరాలపై ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ బలగాలు డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడ్డాయి. ఈ దాడిలో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు గాయపడ్డారు. ఇరాన్ విదేశాంగ మంత్రితో పాక్ ఆపద్ధర్మ ప్రధాని అన్వరుల్లా దావోస్ నగరంలో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో మంతనాలు జరిపిన రోజే ఈ దాడులు జరగడం గమనార్హం.

ఇరాన్ రాయబారిపై వేటు

జైష్ అనేది 2012లో పాక్‌లో నెలకొల్పిన సున్నీ ఉగ్రసంస్థ. ఇరాన్‌లో జైష్ తరచూ ఇరాన్ భద్రతాబలగాలపై దాడులకు దిగుతోంది. సైనికులను అపహరిస్తూ ఇరాన్ ప్రభుత్వానికి పెద్దతలనొప్పిగా తయారైంది. పాక్ సరిహద్దు పట్టణం పంజ్‌ఘర్ కేంద్రంగా పనిచేస్తూ జైష్ దాడులకు దిగుతోందని ఇప్పటికే పలుమార్లు ఇరాన్ ఆరోపించింది. ఈనెలలో సున్నీ ఉగ్రసంస్థ ఒకటి సైనిక జనరల్ సులేమానీ సంస్మరణ సభలో జంట ఆత్మాహుతి దాడులకు పాల్పడి వంద మందిని బలితీసుకున్న విషయం తెల్సిందే. దీంతో సున్నీ ఉగ్రసంస్థలపై ఉక్కుపాదం మోపాలని ఇరాన్ నిశ్చయించుకుంది. అందులోభాగంగానే పాక్‌లోని జైష్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. అయితే తమ భూభాగంపై విదేశీ దాడిని పాకిస్తాన్ తీవ్రంగా ఆక్షేపించింది. పాక్‌లోని ఇరాన్ మంత్రిత్వశాఖ ఉన్నతాధికారిని పిలిపించుకుని తన నిరసన వ్యక్తంచేసింది. తమ దేశంలోని ఇరాన్ రాయబారిని బహిష్కరించింది. ఇరాన్‌లోని తమ రాయబారిని వెనక్కి పిలిపించుకుంది. 'పాక్ గగనతలాన్ని అనుమతిలేకుండా వినియోగించడం, దుర్వినియోగం చేయడం ద్వారా ఇరాన్ అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించింది. ఇది పాక్ సార్వభౌమత్వాన్ని అవమానించడమే. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలను అపహాస్యం చేస్తూ ఇలా దాడులకు దిగడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. దీని తీవ్ర పరిణామాలను ఇరాన్ ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని పాక్ ఆగ్రహం వ్యక్తంచేసింది.

ఇరాన్ ఆర్మీ అధికారి కాల్చివేత

జైష్ ఉగ్రస్థావరాలపై దాడి జరిగిన మరుసటి రోజే ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ అధికారిని ఉగ్రవాదులు కాల్చిచంపారు. పాక్, అఫ్గానిస్తాన్‌లతో సరిహద్దు పంచుకుంటున్న సిస్తాన్-బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఈ ఉగ్రదాడి ఘటన జరిగిందని ఇరాన్ అధికార వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ బుధవారం తెలిపింది.

రాజన్న హుండీ ఆదాయం రూ.2.52కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడఅర్బన్: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి (రాజన్న)వారి 21 రోజుల హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. రూ.2,52,29,580 నగదు, 277.100 గ్రాముల బంగారం, 13.280 కిలోల వెండి వచ్చినట్లు ఈవో కృష్ణప్రసాద్ ఓ ప్రకటనలో వివరించారు. లెక్కింపులో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

చంద్రుగొండ (భద్రాద్రి కొత్తగూడెం): విద్యుదాఘాతంతో రైతు పొలంలోనే మృతిచెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం రావికంపాడులో బుధవారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుక్కల శ్రీనివాసరావు(51) యాసంగి సీజన్‌లో వరి సాగు నిమిత్తం దుక్కి దున్నేందుకు పొలంలో నీళ్లు పెడుతున్నాడు. అక్కడే ఉన్న విద్యుత్ స్తంభానికి సపోర్ట్ వైరు వేలాడుతుండగా దాన్ని పక్కకు జరిపేందుకు పట్టుకున్నాడు. అయితే వైర్‌కు విద్యుత్ సరఫరా అవుతుండటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ నర్సింహారావు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు.

సిరిసిల్లలో సాంచాలు బంద్
నిలిచిన వస్త్రోత్పత్తి

అందని సర్కారు బతుకమ్మ చీరల బిల్లులు

- ప్రభుత్వ బకాయిలు రూ.200 కోట్లు
- మార్కెట్‌లో బట్టకు గిట్టుబాటు లేని దుస్థితి
- ఉపాధి కోల్పోతున్న నేత కార్మికులు
- సంక్షోభంపై నివేదిక కోరిన మంత్రి తుమ్మల



సిరిసిల్లలో బంద్ అయిన సాంచాలు

సిరిసిల్ల: వస్త్రోత్పత్తి ఖిల్లా.. సిరిసిల్లలో సాంచాల సప్పుడాగింది. మార్కెట్‌లో బట్టకు గిట్టుబాటు ధర రాకపోవడం.. సిరిసిల్లలో పేరుకుపోయిన వస్త్రం నిల్వలు.. ప్రభుత్వం నుంచి రావాల్సిన బతుకమ్మ చీరల బకాయిలు.. విద్యుత్ సబ్సిడీ సమస్యలు.. వెరసి సమస్యలన్నీ ఒక్కసారిగా సిరిసిల్ల వస్త్రపరిశ్రమను చుట్టుముట్టడంతో వస్త్రోత్పత్తిదారులు సాంచాలను బంద్ చేశారు. ఫలితంగా క్షేత్రస్థాయిలో శ్రమించే నేత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు.



సిరిసిల్లలో వస్త్రోత్పత్తిదారుడి ఇంట్లో నిల్వ ఉన్న వస్త్రం

వస్త్రోత్పత్తి ఆ'ధారం'

రాష్ట్రంలోనే అత్యధికంగా 32 వేల మరమగ్గాలు(పవర్‌లూమ్స్) సిరిసిల్లలో ఉన్నాయి. ఇక్కడ పాలిస్టర్, కాటన్ వస్త్రాలు ఉత్పత్తి అవుతాయి. సిరిసిల్లలో 26వేల మరమగ్గాలపై పాలిస్టర్ బట్ట ఉత్పత్తి అవుతుండగా.. ఆరు వేల మగ్గాలపై కాటన్ వస్త్రం ఉత్పత్తి సాగుతోంది. వస్త్రపరిశ్రమపై ఆధారపడి 20వేల మంది ఉపాధి పొందుతున్నారు. నిత్యం 26 లక్షల మీటర్ల బట్ట ఉత్పత్తి అవుతుంది. ఒక్కో కార్మికుడు పాలిస్టర్ బట్టను ఉత్పత్తి చేస్తూ నెలకు రూ.10 నుంచి రూ.12వేలు సంపాదిస్తారు. అదే బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేస్తే రూ.15వేల నుంచి రూ.18వేల వరకు ఉపాధి లభిస్తుంది. ఇప్పుడు సాంచాలు బంద్ అవడంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు.

కారణాలు ఇవీ..

- టెక్స్‌టైల్ రంగంలో దేశవ్యాప్తంగా వచ్చిన మాంద్యం(సంక్షోభం)తో ఉత్పత్తి చేసిన బట్టకు గిట్టుబాటు ధర మార్కెట్‌లో లభించడం లేదు. ఒక్క మీటర్ బట్ట ఉత్పత్తికి రూ.10 ఖర్చయితే.. ఆ మేరకు ధర మార్కెట్‌లో రాక నష్టపోతున్నారు.
- దేశ వ్యాప్తంగా ఎయిర్‌జెట్, వాటర్‌జెట్, ర్యాపియర్ వంటి ఆధునిక మగ్గాలపై వేగంగా నాణ్యతతో బట్టను ఉత్పత్తి చేస్తుండగా.. సిరిసిల్ల బట్ట ఆ కార్పొరేట్ రంగాలతో పోటీ పడలేక పోతోంది.
- సిరిసిల్లకు గత ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వగా.. వాటికి సంబంధించిన రూ.200కోట్ల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. బిల్లులు రాక వస్త్రోత్పత్తిదారులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు.
- చిన్నతరహా పరిశ్రమలు(ఎస్ఎస్ఐ) యూనిట్లకు 50 శాతం విద్యుత్ రాయితీని తొలగించాలని ఆదేశాలు ఉండడంతో ఆ ప్రభావం వస్త్రపరిశ్రమపై పడింది.
- బతుకమ్మ చీరల ఆర్డర్‌పై ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ప్రస్తుతం సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సందిగ్ధంలో ఉంది. ఫలితంగా పరిశ్రమను బంద్ చేశారు.

వస్త్రపరిశ్రమపై నివేదిక కోరిన మంత్రి

సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో సంక్షోభంపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణిని ఆదేశించారు. అంతకుముందు సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు పరిశ్రమను ఆదుకోవాలని ట్విట్టర్ వేదికగా కోరారు. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నివేదిక కోరారు.

వారం రోజులుగా ఖాళీగా ఉంటున్న



నేను సిరిసిల్ల నెహ్రూనగర్‌లో ఉంటాను. శివనగర్‌లో బూట్ల శ్రీనివాస కార్ఖానాలో పనిచేస్తాను. 12 సాంచాలు నడుపుతూ పాలిస్టర్ బట్టను ఉత్పత్తి చేస్తే వారానికి రూ.3వేల నుంచి రూ.3200 వస్తాయి. వారం రోజులుగా కార్ఖాన బంద్ పడింది. పని లేక ఖాళీగా ఉంటున్న. నా భార్య ఉమ బీడీలు చేస్తుంది. కార్ఖానాలు తెరిస్తేనే బతుకుదెరువు.

– ఎక్కలదేవి సతీశ్, కార్మికుడు, సిరిసిల్ల

బీములు ఇస్తలేరు



నాకు ఎనిమిది సాంచాలు ఉన్నాయి. ఇంట్లోనే నేను, మా కొడుకు నడిపించుకుంటాం. 15 రోజులుగా సేట్లు బీములు ఇస్తలేరు. బట్ట అమ్ముతలేదని ఉత్పత్తిని ఆపేశారు. పని లేక ఇద్దరం ఉట్టిగానే ఉంటున్నాం. సాంచాలు నడుపుతూ బట్టను ఉత్పత్తి చేస్తేనే మాకు బతుకుదెరువు. ఇప్పుడు ఉట్టిగ ఉంటే ఇల్లు గడవడం కష్టంగా ఉంటుంది.

– లగిశెట్టి సుదర్శన్, ఆసామి, సిరిసిల్ల

ప్రభుత్వ ఆర్డర్లు వస్తే గాడిలో పడుతుంది



సిరిసిల్లలో బట్టల నిల్వలు పేరుకుపోయాయి. మార్కెట్‌లో బట్టకు ధర రావడం లేదు. ప్రభుత్వ ఆర్డర్లతో ఆరు నెలలు, ప్రైవేటు మార్కెట్‌తో మరో ఆరు నెలలు పని ఉంటుంది. ప్రభుత్వం రాజీవ్ విద్యామిషన్(ఆర్వీఎం) ఆర్డర్లు త్వరలో ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. ప్రభుత్వ ఆర్డర్లు వస్తే పరిశ్రమ గాడిలో పడుతుంది.

– మండల సత్యం, పాలిస్టర్ అసోసియేషన్, అధ్యక్షుడు

44 కిలోల గంజాయి పట్టివేత

శంకర్‌పల్లి: గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని మోకిల సీఐ వీరబాబు పేర్కొన్నారు. సర్వీస్ రోడ్డులో ముగ్గురు వ్యక్తులు గంజాయితో ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందడంతో బుధవారం ఉదయం చెక్ చేయగా వారి వద్ద ఉన్న సంచుల్లో బ్రౌన్ కలర్ పార్సిల్ ప్యాకెట్లు లభించాయి. వాటిని చెక్ చేయగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

రాజాసింగ్ విద్వేష ప్రసంగాలు చేయకుండా చూడండి

- ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అధికారులకు సుప్రీంకోర్టు ఆదేశాలు



సాక్షి, న్యూఢిల్లీ: బహిరంగ సభలు, ర్యాలీల్లో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ విద్వేష ప్రసంగాలు చేయకుండా చూడాలని ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అధికారులను సుప్రీంకోర్టు ఆదేశించింది. భవిష్యత్తులో ఆయన చేసే ప్రసంగాలపై ముందస్తు చర్యలు తీసుకోలేమని స్పష్టం చేసింది. గురువారం నుంచి వారం రోజుల పాటు ఎమ్మెల్యే రాజాసింగ్ ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలలో వివిధ ర్యాలీలు, సభల్లో పాల్గొననున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తొలుత ఆయన గురువారం మహారాష్ట్రలోని యావత్‌మల్‌లో పర్యటించనున్నారు. అనంతరం హిందూ జనజాగృతి సమితి శుక్రవారం నుంచి ఈనెల 25 వరకు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించనున్న ర్యాలీల్లో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో రాజాసింగ్ ఇదివరకే పలుమార్లు విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని, ఛత్తీస్‌గఢ్‌లో హెచ్‌జేఎస్ నిర్వహించనున్న ర్యాలీల్లో కూడా ఆయన అలాంటి ప్రసంగాలు చేసే అవకాశముందని ఆరోపిస్తూ కేరళలోని కోజికోడ్‌కు చెందిన షాహీన్ అబ్దుల్లా సుప్రీంకోర్టులో పిల్ వేశారు. హిందూ జనజాగృతి నిర్వహించే ర్యాలీలను రద్దు చేయాలని కూడా ఆ పిటిషన్‌లో కోరారు. బుధవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. రాజాసింగ్ గతంలో చేసిన కొన్ని ప్రసంగాలు 'కచ్చితంగా అభ్యంతరకరం'అని కోర్టు అంగీకరించింది. అయితే.. భవిష్యత్తులో ఆయన చేసే ప్రసంగాలపై ముందస్తు చర్యలు తీసుకోలేమని, తమ ముందున్న కేసులో అతడిని పార్టీగా చేర్చలేదని ధర్మాసనం పేర్కొంది. ర్యాలీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తద్వారా విద్వేషపూరిత ప్రసంగాలు రికార్డ్ కావడంతోపాటు నిందితులను పట్టుకునేందుకు వీలుగా ఉంటుందని ఆయా ప్రాంతాల నోడల్ అధికారులు, ఎస్పీలు, కలెక్టర్లను ఆదేశించింది. అయితే ర్యాలీలను రద్దు చేసేలా ఆదేశాలు ఇవ్వలేమని పేర్కొంటూ.. కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేసింది. పిటిషనర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు.

బీసీటీఏ కేలండర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బీసీటీఏ) కేలండర్, డైరీని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎస్.విజయకుమార్, రాములు, రాఘవేందర్, మల్లేశ్, ధనుంజయ వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. బీసీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ ఉద్యోగ ఉపాధ్యాయుల పైన ఉన్న క్రీమీలేయర్‌ను తొలగించాలని ఈ సందర్భంగా సంఘం నేతలు మంత్రిని కోరారు.

చేనేత కార్మికులను ఆదుకోండి

- సీఎం రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ లేఖ




కరీంనగర్ టౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో వస్త్ర పరిశ్రమ తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని, యుద్ధ ప్రాతిపదికన కార్మికులను ఆదుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. ఈ రంగంపై ఆధారపడ్డ 20 వేల మంది కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ ప్రాంతంలో మొత్తం 33 వేల మరమగ్గాలుండగా, ఇందులో 28 వేల మగ్గాలపై పాలిస్టర్, 5 వేల మగ్గాలపై కాటన్ వస్త్రాలు తయారవుతున్నాయని తెలిపారు. ఉత్పత్తి వ్యయం పెరగడం, పాలిస్టర్ బట్టకు గిట్టుబాటు ధర, సరైన మార్కెట్ లేకపోవడంతో సిరిసిల్లలో సాంచాలను బంద్ పెట్టారన్నారు. ఏడేళ్లుగా ప్రభుత్వ ఆర్డర్లపైనే ఆధారపడి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మనుగడ సాగిస్తోందన్నారు. ప్రధానంగా బతుకమ్మ చీరలకు సంబంధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు రూ.220 కోట్లను బకాయి పెట్టిందని, దీంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో మునిగిపోయిందని చెప్పారు. అందువల్ల వెంటనే బకాయిలను చెల్లించాలని కోరారు. ప్రభుత్వ ఆర్డర్లతో సిరిసిల్ల కార్మికులు ఉపాధి పొందుతున్న నేపథ్యంలో సీఎం ప్రత్యేక చొరవ తీసుకొని భారీగా ప్రభుత్వ ఆర్డర్లను ఇచ్చి కార్మికులను ఆదుకోవాలని కోరారు. సిరిసిల్లలో మరమగ్గాల ఆధునీకరణకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నందున.. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే దీన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని బండి పేర్కొన్నారు.

గొంతుకోసిన వారే పోరాడతామంటే ఎలా?

- కేటీఆర్‌కు తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: పదవీకాలం ముగుస్తున్న దశలో బిల్లుల విడుదలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పోరాడుతానని అనడమంటే సర్పంచ్‌ల పట్ల కపట ప్రేమ చూపడమేనని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ మండిపడింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో సర్పంచ్‌ల గొంతుకోసిందని, 60 మందికి పైగా సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు, వందల మంది సర్పంచ్‌లు వాచ్‌మన్‌లు, కూలీలుగా మారినప్పుడు స్పందించని కేటీఆర్ ఇప్పుడు స్పందించడం ఏమిటని ప్రశ్నించింది. గతంలో సర్పంచ్‌ల సమస్యలు ప్రస్తావించేందుకు సమయం కోరితే నాటి సీఎం కేసీఆర్, కేటీఆర్ అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా, ఇప్పుడు ఆ తప్పులను కాంగ్రెస్ సర్కార్‌పై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమన్న విషయం గుర్తించాలని హితవు పలికారు. సర్పంచ్‌లపై కేటీఆర్‌కు నిజంగా ప్రేమ ఉంటే ఏదైనా ఒక తేదీని ఆయనే నిర్ణయిస్తే ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ఆ ధర్నాకు హాజరై మద్దతు తెలపాలని సూచించారు.

బడ్జెట్లో వ్యవసాయరంగానికి ప్రాధాన్యం: తుమ్మల



సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రాబోయే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి మరింత ప్రాధాన్యత కల్పించి బలోపేతం చేసుకుని ముందుకు సాగుతామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం తెలంగాణ అగ్రిడాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డైరీ ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో పోరాడి సాధించుకున్న తెలంగాణలో అనుకున్న రీతిలో రాష్ట్రం ముందుకు వెళ్లలేకపోయిందనే భావన అన్ని శాఖల్లో ఉందని తెలిపారు. గతంలో నాలుగు ప్రభుత్వాల్లో పనిచేశానని, కానీ వ్యవసాయరంగం ఇంత చిత్రమైన పరిస్థితి తాను ఎన్నడూ చూడలేదని చెప్పారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని, ఇప్పటికే వ్యవసాయశాఖ డైరెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చానని తెలిపారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆగ్రోస్ ఎండీ కె.రాములు మాట్లాడుతూ, యువ వ్యవసాయ అధికారులు నిరంతరం సైనికుల్లా పని చేయడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను సంఘం ప్రతినిధులు మంత్రికి విన్నవించారు. అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు టి.రాజరత్నం, కార్యదర్శి తిరుపతి నాయక్, కోశాధికారి మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

● ఓయూ దూరవిద్యా కేంద్రంలో ప్రారంభించిన ఆరు నెలల యోగా సర్టిఫికెట్ కోర్సుకు విశేష స్పందన లభించిందని డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి తెలిపారు. గత ఏడాది ప్రవేశపెట్టిన యోగా కోర్సులో 35 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్లు పేర్కొన్నారు.

నెలలోగా ప్రాజెక్టులు కృష్ణా బోర్డు చేతికి

- కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఆదేశం
- వారంలోగా సాగర్, శ్రీశైలం అప్పగింత విధానం ఖరారుకు త్రిసభ్య కమిటీకి సూచన
- 15 రోజుల్లోగా రెండు రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులతో సమీక్షిస్తానని వెల్లడి
- సాగర్ వద్ద నవంబర్ 29కి ముందు ఉన్న స్థితిని కొనసాగించాలన్న తెలంగాణ ప్రతిపాదనకు తిరస్కరణ



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను నెలలోగా కృష్ణా బోర్డుకు అప్పగించాలని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ తెలంగాణ, ఏపీ రాష్ట్రాలను ఆదేశించారు. రెండు ప్రాజెక్టుల్లో ఏపీ భూభాగంలోని 6, తెలంగాణలోని 9 అవుట్ లెట్లను బోర్డుకు అప్పగించేందుకు విధివిధానాలను (హ్యాండింగ్ ఓవర్ ప్రొటోకాల్) వారంలోగా ఖరారు చేయాలని త్రిసభ్య కమిటీకి సూచించారు. కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే నేతృత్వంలో, రెండు రాష్ట్రాల ఈఎన్సీలు సభ్యులుగా ఈ కమిటీ ఏర్పాటయ్యింది. ఈ త్రిసభ్య కమిటీ ఖరారు చేసిన విధానాన్ని 15 రోజుల్లోగా రెండు రాష్ట్రాల జలవనరుల శాఖల ముఖ్య కార్యదర్శులతో సమీక్షించి.. ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు సగభాగాన్ని గతేడాది నవంబర్ 30న ఏపీ తన అధీనంలో తీసుకోవడంతో రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన విషయం తెలిసిందే. కాగా కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ బల్లా ఆదేశాల మేరకు.. కృష్ణా జలాల వివాదాల పరిష్కారానికి కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్ కుమార్, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా తదితరులతో కలిసి బుధవారం ఢిల్లీలో దేబశ్రీ ముఖర్జీ సమావేశం నిర్వహించారు. తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ మురళీధర్, ఏపీ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్సీ సి.నారాయణరెడ్డి పాల్గొన్నారు. కేంద్రం ఆదేశాల మేరకు డిసెంబర్ 1 నుంచి సాగర్ సీఆర్పీఎఫ్ పహారాలో ఉందని.. ఈ నెలలో కుడి కాలువ ద్వారా ఏపీకి 5 టీఎంసీలు విడుదల చేశామని శివ్‌నందన్ కుమార్ ఈ సందర్భంగా చెప్పారు.

అప్పటివరకు మాకే అప్పగించండి: రాహుల్ బొజ్జా

కృష్ణా బోర్డు పరిధి నిర్దేశించే వరకూ శ్రీశైలం నిర్వహణను ఏపీకి, సాగర్ నిర్వహణను తమకు అప్పగించాలని తెలంగాణ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా కోరారు. నవంబర్ 30న ఏపీ భూభాగంలోని సాగర్ స్పిల్ వేలో సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను ఆ రాష్ట్ర అధికారులు అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని, సాగర్‌పై నవంబర్ 29 నాటికి ఉన్న స్థితిని కొనసాగించాలని కోరారు. దీనిపై ఏపీ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ నిర్వహణలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాన్ని 2014లో అధీనంలోకి తీసుకున్నప్పటి నుంచి గత నవంబర్ 30 వరకు తొమ్మిదేళ్లపాటు తెలంగాణ సర్కార్ తమ హక్కులను కాలరాసిందని, హక్కుల పరిరక్షణ కోసమే తమ భూభాగంలోని సాగర్ స్పిల్ వే సగం, కుడి హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకున్నామని స్పష్టం చేశారు. దేబశ్రీ ముఖర్జీ స్పందిస్తూ.. తొలుత సాగర్ నిర్వహణను కృష్ణా బోర్డుకు అప్పగిస్తామని, ఆ తర్వాత ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అయితే సాగర్‌ను మాత్రమే బోర్డుకు అప్పగించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, సాగర్, శ్రీశైలం రెండిటినీ ఒకేసారి బోర్డుకు అప్పగిస్తేనే రెండు రాష్ట్రాల హక్కులను పరిరక్షించవచ్చునని శశిభూషణ్‌కుమార్ సూచించారు. దీనిపై తమ ప్రభుత్వ నిర్ణయాన్ని తర్వాత తెలియజేస్తామని రాహుల్ బొజ్జా అన్నారు.

అప్పగింత తర్వాతే నిర్వహణ నియమావళి

కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021, జూలై 15న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్, రెండున్నరేళ్లైనా అమల్లోకి రాకపోవడంపై దేబశ్రీ ముఖర్జీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌లకు చెందిన తమ పరిధిలోని అవుట్ లెట్లను బోర్డుకు అప్పగించడానికి రెండు రాష్ట్రాలు అంగీకరించాయని, అయితే ఆ తర్వాత తెలంగాణ మాట మార్చిందని శివ్‌నందన్ కుమార్ చెప్పారు. ఈ నేపథ్యంలో ముఖర్జీ మాట్లాడుతూ..అవుట్‌లెట్ల అప్పగింతపై విధివిధానాల ఖరారుకు ఆదేశించారు. కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయలేదని, ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్వహణ నియమావళి (ఆపరేషన్ ప్రొటోకాల్)ను ఖరారు చేయలేమని తెలంగాణ అధికారులు చెప్పారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకి వచ్చాక ఉన్నటువంటి ఆపరేషన్ ప్రొటోకాల్‌ను ఖరారు చేయాలని వారు చేసిన సూచనను సీడబ్ల్యూసీ చైర్మన్ వ్యతిరేకించారు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు కేటాయింపుల ఆధారంగానే 2015లో రెండు రాష్ట్రాలకు నీటిని పంపిణీ చేస్తూ తాత్కాలిక సర్దుబాటు చేశామని.. వాటికి అనుగుణంగానే శ్రీశైలం, సాగర్ ఆపరేషన్ ప్రొటోకాల్ ముసాయిదాను రూపొందించామని వివరించారు. దీనిపై ముఖర్జీ స్పందిస్తూ.. ప్రాజెక్టుల అప్పగింత తర్వాత ఆపరేషన్ ప్రొటోకాల్ ఖరారుపై నిర్ణయం తీసుకుందామని చెప్పారు.

కృష్ణా బోర్డుకు నిధులు ఇవ్వండి

కృష్ణా బోర్డు నిర్వహణకు నిధులు విడుదల చేయడంలో 2 రాష్ట్రాలు జాప్యం చేస్తున్నాయని శివ్‌నందన్‌కుమార్ సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై శశిభూషణ్‌కుమార్ స్పందిస్తూ.. తెలంగాణ కంటే తాము రూ.8.5 కోట్లు అధికంగా ఇచ్చామని చెప్పారు. తెలంగాణ వాటా నిధులు ఇచ్చాకనే తాము విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కాగా తక్షణమే వాటా నిధుల విడుదలకు 2 రాష్ట్రాలకు దేబశ్రీ ముఖర్జీ ఆదేశించారు.

హైదరాబాద్ నుంచి ఫ్రాంక్‌ఫర్ట్‌కు విమానం

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ బుధవారం నుంచి తన సర్వీసులను ప్రారంభించింది. సోమ, మంగళ, బుధ, గురు, శనివారాల్లో ఎల్‌హెచ్–753 విమానం ఇక్కడి నుంచి ఫ్రాంక్‌ఫర్ట్‌కు బయల్దేరుతుందని, తిరిగి అక్కడి నుంచి హైదరాబాద్‌కు విమాన సర్వీసులుంటాయని ఎయిర్‌లైన్స్‌వర్గాలు, జీఎంఆర్ ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అంతర్జాతీయంగా మరో గమ్యస్థానానికి సర్వీసులు ప్రారంభించడంతో ప్రయాణికులకు మరింత సౌలభ్యం చేకూరుతుందని ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ పేర్కొన్నారు. హైదరా బాద్ నుంచి యూరోప్‌కు ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని లుఫ్తాన్సా గ్రూప్ దక్షిణాసియా సీనియర్ డైరెక్టర్ జార్జ్ ఎటియల్ తెలిపారు.

మరో 'మార్పిడి' యత్నం!

ఇటీవల బంజారాహిల్స్ మసీదు వద్ద ప్రమాదం

- మితిమీరిన వేగంతో గోడను ఢీ కొన్న ఖరీదైన కారు
- అప్పుడు డ్రైవింగ్ చేసిన వ్యక్తి స్థానంలో స్నేహితుడు
- దర్యాప్తులో గుర్తించిన అధికారులు, ఇరువురూ అరెస్టు


మసీదు గోడను ఢీ కొట్టిన బీఎండబ్ల్యూ కారు

సాక్షి, సిటీబ్యూరో/బంజారాహిల్స్: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్ ఉదంతం స్ఫూర్తితో ఓ యువ వ్యాపారవేత్త కూడా ఇలాంటి ఎస్కేప్‌కే ప్లాన్ చేశాడు. ప్రమాదం చేసిన తన స్థానంలో స్నేహితుడిని ఉంచాలని చూశాడు. పోలీసుల అప్రమత్తత, దర్యాప్తు నేపథ్యంలో అసలు విషయం వెలుగులోకి వచ్చి ఇద్దరూ జైలుకు వెళ్లారు. గత ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాదాపూర్‌కు చెందిన యువ వ్యాపారి యల్లందు శ్రీకాంత్ అక్కడి నోవాటెల్‌లో ఉన్న పబ్‌లో మద్యం తాగాడు. ఆదివారం తెల్లవారుజామున స్నేహితుడిని దిగబెట్టడానికి పంజగుట్టకు తన బీఎండబ్ల్యూ కారులో (టీఎస్07సీహెచ్2345) వచ్చాడు. అతడిని దించిన తర్వాత తిరిగి మాదాపూర్‌కు మితిమీరిన వేగంతో వెళ్తున్నాడు. తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ఈ వాహనం బంజారాహిల్స్ రోడ్డు నెం.3లో ఉన్న మసీదు వద్దకు వచ్చేసరికి అదుపు తప్పింది. మద్యం మత్తులో ఉన్న శ్రీకాంత్ కారు అదుపు చేయలేకపోయాడు. దీంతో వాహనం వేగంగా మసీదు గోడను ఢీ కొట్టింది. ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో శ్రీకాంత్ ప్రాణాలతో బయటపడ్డాడు. తాను మద్యం తాగి ఉండటంతో పోలీసులకు చిక్కితే ఇబ్బందులు వస్తాయని భావించాడు. ఈ ప్రమాదం విషయం తన స్నేహితుడైన అమీర్‌పేట వాసి నాగార్జునకు ఫోన్ చేసి చెప్పాడు. కేవలం 15 నిమిషాల్లోనే అక్కడకు చేరుకున్నాడు. తన స్థానంలో పోలీసుస్టేషన్‌కు వెళ్లాలని, కోర్టు ఖర్చులతో పాటు ఇతర అంశాలను తాను చూసుకుంటానని చెప్పాడు. దీనికి అంగీకరించిన నాగార్జున అక్కడే ఉండిపోగా..శ్రీకాంత్ కాస్త దూరం వెళ్లి కాపుకాశాడు. ఆ సమయంలో ఘటనాస్థలికి వచ్చిన బంజారాహిల్స్ పోలీసులతో ప్రమాదం జరిగిన సమయంలో తానే వాహనం నడుపుతున్నట్లు నాగార్జున చెప్పాడు. ఓ పబ్ నుంచి మాదాపూర్ వెళ్తుండగా అదుపు తప్పి ఇలా జరిగిందని చెప్పాడు. దీంతో పోలీసులు నాగార్జునను బంజారాహిల్స్ ఠాణాకు తరలించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ) జాకీర్ హుస్సేన్ నాగార్జునకు శ్వాస పరీక్షలు నిర్వహించి, మద్యం తాగి ఉన్నాడా? లేదా? అనేది తెలుసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీసు సిబ్బంది ఈ ప్రయత్నాల్లో ఉండగా శ్రీకాంత్ ఠాణా వద్దకు చేరుకున్నాడు. అతడిని చూసిన జాకీర్ హుస్సేన్ ఎవరంటూ ప్రశ్నించారు. దీంతో తన పేరు శ్రీకాంత్ అని, నాగార్జున స్నేహితుడినని, ప్రమాదం విషయం తెలిసి వచ్చానని చెప్పాడు. ఇటీవల జరిగిన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్ ఉదంతం నేపథ్యంలో శ్రీకాంత్ వ్యవహారశైలినీ అనుమానించి డీఐ జాకీర్ హుస్సేన్ లోతుగా ఆరా తీయాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని ఘటనాస్థలితో పాటు ఇతర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫుటేజ్ పరిశీలించారు. ఈ నేపథ్యంలోనే ప్రమాదం జరిగిన సమయంలో కారును శ్రీకాంత్ నడిపాడని, ప్రమాదం తర్వాత నాగార్జున అక్కడకు వచ్చాడని గుర్తించారు. వెంటనే ఇద్దరినీ పోలీసుస్టేషన్‌కు తరలించి విచారించారు. తాను ప్రమాదం చేశానని, అయితే మద్యం తాగి ఉండటంతో కేసుకు భయపడ్డానని చెప్పాడు. మద్యం తాగి లేని నాగార్జునను తన స్థానంలో ఉంచాలని ప్రయత్నించానని అంగీకరించాడు. దీంతో జాకీర్ హుస్సేన్ ఆ సమయంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ డి.సంతోష్‌కుమార్‌ను ఇరువురిపైనా ఫిర్యాదు చేయాల్సిందిగా ఆదేశించారు. ఈయన ఫిర్యాదు మేరకు శ్రీకాంత్, నాగార్జునలపై ఐపీసీలోని 308, 427, 279, 203, 419, 34, మోటారు వాహనాల చట్టంలోని 184, 185, 187 కింద కేసు నమోదు చేశారు. ఇద్దరినీ అరెస్టు చేసిన బంజారాహిల్స్ అధికారులు కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.


29 నుంచి రామదర్శన్ అభియాన్'

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 29 నుంచి వచ్చేనెల 29 వరకు 'అయోధ్య రామ దర్శన్ అభియాన్'కు బీజేపీ సిద్ధమైంది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల నుంచి రెండేసి చొప్పున మొత్తం 34 ప్రత్యేక రైళ్లు నడిపించాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఒక్కో రైల్లో 1,400 మందిని అయోధ్యకు తీసుకెళ్లనున్నారు. ముందుగా ఈ నెల 29న సికింద్రాబాద్ నుంచి అయోధ్యకు ప్రత్యేక రైలును ప్రారంభిస్తారు. ఈ ప్రత్యేక రైలులో వెళ్లి అయోధ్యలోని రామాలయాన్ని సందర్శించాలని ఆసక్తి ఉన్నవారు ఒక్కొక్కరు రూ.1,900 (దర్శనం, వసతి, భోజనం, రానుపోను ప్రయాణ టికెట్ ఖర్చులు కలిపి) చెల్లించాల్సి ఉంటుంది.

'రోడ్డు ప్రమాదం' కేసులో బోధన్ మాజీ ఎమ్మెల్యే

కుమారుడి ఎస్కేప్‌లో తండ్రి షకీల్ పాత్ర రూఢీ

- దీంతో నిందితుడిగా చేర్చిన పంజగుట్ట పోలీసులు
- పది మంది సహకరించినట్లు పక్కా ఆధారాలు
- ఇద్దరి అరెస్టు, మరో ఇరువురు దుబాయ్‌లో ఉన్నట్లు గుర్తింపు
- షకీల్ సహా వీరిద్దరిపైనా లుక్ ఔట్ సర్క్యులర్ జారీ



సాక్షి, హైదరాబాద్: పంజగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రజాభవన్ ఎదురుగా గత నెల ఆఖరివారంలో చోటు చేసుకున్న 'బీఎండబ్ల్యూ కారు ప్రమాదం'కేసులో బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అమీర్ నిందితుడిగా మారారు. కుమారుడు రహీల్ అమీర్‌ను ఈ కేసు నుంచి తప్పించేందుకు చేసిన కుట్రకు ఆయనే సూత్రధారని దర్యాప్తు అధికారులు తేల్చారు. ఈ 'ఎస్కేప్ ఎపిసోడ్'లో మాజీ ఎమ్మెల్యే సహా పదిమంది పాత్ర ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

అసలేం జరిగిందంటే..

రహీల్ అతడి స్నేహితుడితో పాటు ఇద్దరు యువతులతో కలిసి గత నెల 24వ తేదీ తెల్లవారుజామున బీఎండబ్ల్యూ కారులో (టీఎస్ 13 ఈటీ 0777) బేగంపేట వైపు నుంచి పంజగుట్ట వైపు వస్తున్నారు. ఆ సమయంలో కారును రహీల్‌నే నడుపుతున్నాడు. తెల్లవారుజామున 2.45 గంటల ప్రాంతంలో ఈ కారు ప్రజాభవన్ ఎదురుగా ఉన్న ఫ్లై ఓవర్ వద్ద బారికేడ్లను మితిమీరిన వేగంతో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు, బారికేడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడంతో అందులో ఉన్న నలుగురూ సురక్షితంగా బయటపడ్డారు. అక్కడకు చేరుకున్న పంజగుట్ట పోలీసులు రహీల్‌ను ఠాణాకు తీసుకువచ్చారు. ఈలోపు విషయం ఫోన్ ద్వారా దుబాయ్‌లో ఉన్న తండ్రి షకీల్‌కు రహీల్ చెప్పాడు. ఆయన రంగంలోకి దిగి తన కుమారుడి స్థానంలో తన ఇంట్లో డ్రైవర్ అబ్దుల్ ఆరిఫ్‌ను ఉంచాలని పథకం వేశారు. దీన్ని అమలులో పెట్టడం కోసం రహీల్ స్నేహితులైన అర్బాజ్, సాహిల్‌తో పాటు మరి కొందరిని రంగంలోకి దింపారు. అర్బాజ్, సోహైల్‌లు మాజీ ఎమ్మెల్యే షకీల్ ఇంటికి వెళ్లి అక్కడున్న ఆరిఫ్‌ను తీసుకుని పంజగుట్ట ట్రాఫిక్ ఠాణా వద్దకు వచ్చారు. పోలీసులూ సహకరించడంతో అప్పటికే సిద్ధం చేసుకున్న పథకం ప్రకారం రహీల్ స్థానంలో ఆరిఫ్‌ను ఉంచారు.

సీసీ ఫుటేజ్‌తో అసలు వాస్తవం వెలుగులోకి

ఈ అంశంపై అనుమానాలు వ్యక్తం కావడంతో కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి సమగ్ర విచారణకు ఆదేశించారు. రంగంలోకి దిగిన వెస్ట్‌జోన్ డీసీపీ ఎం.విజయ్‌కుమార్ సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి ముందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో అసలు కథ వెలుగులోకి వచ్చి పంజగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన దుర్గారావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఆరిఫ్‌ను అప్పుడే అరెస్టు చేసి రహీల్‌పై అదనపు సెక్షన్ల కింద ఆరోపణలు చేర్చారు. ఈ ఎస్కేప్ వ్యవహారం దర్యాప్తు నేపథ్యంలో షకీల్‌తో పాటు అర్బాజ్, సాహిల్, మరో ఏడుగురి పాత్ర తాజాగా వెలుగులోకి వచ్చింది. దీంతో అర్బాజ్, సోహైల్‌ను సోమవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో షకీల్‌ను నిందితుడిగా చేరుస్తూ కోర్టుకు సమాచారం ఇచ్చారు.

నిందితులపై అదనపు సెక్షన్లతో కేసులు

ఇప్పటికే రహీల్‌పై లుక్‌ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) జారీ అయి ఉంది. తాజాగా షకీల్‌తో పాటు రహీల్ ఎస్కేప్‌కు సహకరించి, దుబాయ్ పారిపోయిన మరో ఇద్దరి పైనా బుధవారం జారీ చేశారు. తొలుత పంజగుట్ట పోలీసులు ఆరిఫ్‌పై మూడు సెక్షన్లతో కేసు నమోదు చేశారు. సమగ్ర దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల నేపథ్యంలో నిందితులపై ఐపీసీ, ఎంవీ యాక్ట్‌ల్లోని మరో 14 సెక్షన్లను జోడించారు.

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం

వెంగళరావునగర్: ఇద్దరు పిల్లలతో కలిసి ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రహమత్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉండే లత (26) తన ఇద్దరు కుమార్తెలు అక్షిత (7), నిహారిక (5)ల ఆరోగ్యం బాగా లేకపోవడంతో వారిని తీసుకొని ఎల్లారెడ్డి గూడలో పిల్లలకు తాయత్తు కట్టించి వస్తానని ఇంటి నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరింది. గంట తరువాత లత తల్లి విజయ ఫోన్ చేయగా..పది నిమిషాల్లో ఇంటికి వస్తానని పేర్కొంది. అరగంట అయినా రాకపోవడంతో తిరిగి ఫోన్ చేయగా..తన భర్త రోజూ మద్యం తాగి వచ్చి వేధిస్తున్నాడని, ఆ వేధింపులు భరించలేకపోతున్నానని ఏడుస్తూ చెప్పి ఫోన్ కట్ చేసింది. ఆ తర్వాత ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది. సాయంత్రం నాలుగు గంటల వరకూ ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
చట్టం 30/2013 లోని సెక్షన్ 19 (1) లోని సబ్ రూల్ (1) రూల్ 25 ప్రకారం
కలెక్టర్/సంయుక్త కలెక్టర్, /స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)
ఫారము-VII
రూఢీ ప్రకటన

గెజిట్ నెం. 37/2023 తేది: 23.12.2023
ఫైల్ నం. సి/849/2017 తేది: -.12.2023
జిల్లా కలెక్టర్. ఫైల్ నం. జి/3207/2023 తేది: 23.12.2023

[illegible]

DIPR No.816/LA-PP/Advt/Pub/2023-24

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూ సేకరణ)
యూనిట్-I, నాగర్‌కర్నూల్ జిల్లా
ఫారం–VII
(Declaration) రూఢీ ప్రకటన

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

Gaz. No. 139/2023
తేది: 06.11.2023

[illegible]

DIPR RO No.810/LA-PP/ADVT/PUB/2023-24

తెలంగాణ ప్రభుత్వము
కలెక్టరు కార్యాలయము, నిర్మల్
రెవిన్యూ (భూ సేకరణ) శాఖ
ఫారం-VII
(మాదము సబ్ రూల్-1, రూల్-25(1) సెక్షన్ 19(1) చట్టం 30/2013)

కలెక్టరు ఫైలు నెం. G1/632/2021-2 తేది: 30.12.2023
రా.మం.అ.నెం.ఎల్.ఎ. /252/2021-2 తేది: 19.12.2023
గెజిట్ నెం. 17/2023 తేది: 30.12.2023

[illegible]

DIPR No. 786/LA-PP/ADVT/PUB/2023-24

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రెవిన్యూ (భూ సేకరణ) విభాగము
జిల్లా కలెక్టర్ గారి కార్యాలయము, వరంగల్
ఫారం-VII

[illegible]

DIPR No. 824/LA-PP/ADVT/PUB/2023-24

సాక్షి కరీంనగర్

గురువారం । 18 । జనవరి । 2024



ఎల్ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్ఎండీకి నీటివిడుదల కొనసాగుతోంది. ఎల్ఎండీకి 500, కుడికాల్వ ద్వారా 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



రాజన్న సేవలో కోదండరాం

వేములవాడఅర్బన్: రాజన్నను ప్రొఫెసర్ కోందరాం బుధవారం దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారి ప్రసాదం అందించారు. ఏఈవో శ్రీనివాస్, అల్లి శంకర్ పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

బీఆర్ఎస్‌కు 'ఆకారపు' రాజీనామా



విద్యానగర్(కరీంనగర్): బీఆర్ఎస్ నాయకుడు, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బుధవారం పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ.. ఐదేళ్లక్రితం వందలాది మంది సీనియర్ కార్యకర్తలతో బీఆర్ఎస్ పార్టీలో చేరినప్పటికీ, తనకు తగిన గుర్తింపు ఇవ్వలేదని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండకుండా, ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. త్వరలోనే తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మరో వైఎస్.రాజశేఖరరెడ్డి మాదిరిగా ప్రజాపాలన సాగిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో వాసాల రవీందర్, ఎంఏ.కరీం, ఎండీ.ఆసిఫ్, తాళ్లపల్లి అంజయ్య గౌడ్, ఎండీ సలీం, ఖదీర్, సయ్యద్ గౌస్, ఎంఏ.నహీం, కె.జగన్‌రెడ్డి, కుర్షిద్ అలీ, ఎంఏ.రెహమాన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పత్తి కొనుగోళ్లు



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. బుధవారం మార్కెట్‌కు 39 వాహనాల్లో 422 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.6,550, కనిష్ట ధర రూ.6,000 పలికింది. గన్నీసంచుల్లో ఏడుగురు రైతులు 10క్వింటాళ్ల పత్తిని తేగా.. గరిష్ట ధర రూ.6,250, మోడల్ ధర రూ.6,100, కనిష్ట ధర రూ.5,200కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 70మంది రైతుల నుంచి 1,043.90 క్వింటాళ్ల పత్తిని సంస్థ కొనుగోలు చేసింది. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,920 పలికింది. మార్కెట్ యార్డు పరిధిలో క్రయవిక్రయాలను కార్యదర్శి గగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

'సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు ఇవ్వని బీఆర్ఎస్'



చిగురుమామిడి: సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు ఇవ్వని ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. బిల్లులు రాక ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశాలను బహిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన 15వ ఆర్థిక సంఘం బిల్లుల పైనా బీఆర్ఎస్ ప్రభుత్వం ఫ్రీజింగ్ చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన ప్రజాపాలనతో గ్రామపంచాయతీల ప్రాధాన్యత పెరిగిందన్నారు. కాంగ్రెస్ నాయకులు కోనేటి రాములు, వంగ కనుకయ్య, గట్టు ప్రశాంత్, పోటు మల్లారెడ్డి, గుజ్జుల రాజు పాల్గొన్నారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్, ఆపై చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు 2023–24 సంవత్సరానికి గానూ పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు ఫ్రెష్, రెన్యూవల్ దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31వ తేదీ వరకు గడువు ఉందని మహిళా, పిల్లల, దివ్యాంగుల, వయోవృద్ధులశాఖ జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. దరఖాస్తుకు ఈనెల 31వ తేదీ చివరి గడువు అని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు వీబీఎస్‌పై లైవ్‌షో

చొప్పదండి: పట్టణంలోని మార్కెట్ యార్డు రోడ్డులో గురువారం ఉదయం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కార్యక్రమాన్ని లైవ్‌షో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి, ఎంపీ బండి సంజయ్‌తో పాటు, కేంద్ర హోంఎఫైర్స్‌శాఖకు చెందిన దీక్షిత్ పాల్గొంటారని, ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వీబీఎస్‌పై పథకంపై అవగాహన ఉంటుందని తెలిపారు.

'సిట్' వేట షురూ!

- ఆక్రమణలపై సీరియస్ ఫోకస్
- భూ వివాదంలో కార్పొరేటర్ అరెస్టు
- త్వరలో బుల్డోజర్ గ్యాంగులపైనా నజర్
- శివారులో ఇళ్లు కూల్చుతున్న వారి చిట్టా సేకరణ
- భూ బాధితులు ముందుకు రావాలంటున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ క్రైం: భూకబ్జాదారులకు తొలిసారి ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది. విస్తరిస్తున్న నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో భూములకు ధరలు పెరగడంతో త్వరగా కోట్లకు పడగలెత్తాలని భావించిన కొందరు అధికార బలం, అంగబలంతో భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. కొందరు ఇంకా కబ్జాలకు పాల్పడుతూనే ఉన్నారు. వారిపై బాధితులు ప్రజాప్రతినిధులు మొదలు ఉన్నతస్థాయి అధికారులకు మొర పెట్టుకున్నప్పటికీ పట్టించుకున్నవారు లేరు. ఇదే ఆక్రమణదారులకు కలిసివచ్చిన అంశంగా మార్చుకుని మరింత రెచ్చిపోయారు. కనిపించిన భూమినల్లా ఆక్రమిస్తూ తమకు అడ్డు ఎవరూరారనే స్థితికి చేరారు. భూ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై సీపీ అభిషేక్ మహంతి ఏర్పాటు చేసిన సిట్(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం) ప్రత్యేక దృష్టి సారించింది. కొందరి అక్రమాలను తవ్వి, పక్కా ఆధారాలతో కటకటాలకు పంపింది.

ఫిర్యాదుల వెల్లువ

కరీంనగర్‌లో భూ కబ్జాలు, ఆక్రమణలపై సీపీ అభిషేక్ మహంతి ఏర్పాటు చేసిన సిట్ తొలి అడుగు వేసింది. వాస్తవానికి ఈ సిట్‌ను కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న ఆర్థిక నేరాలను దర్యాప్తు చేసేందుకు ఏర్పాటు చేశారు. నగరంలో కార్పొరేటర్లు చాలా మంది భూదందాలు చేసి రూ.కోట్లు గడించి, అమాయక ప్రజలకు అన్యాయం చేశారన్న ఫిర్యాదులు సీపీకి అందాయి. కొందరు అడిగినంత సమర్పించుకోకపోతే కట్టుకున్న ఇళ్లను సైతం కూల్చిన సందర్భాలు ఉన్నాయి. మరికొందరు బెదిరింపులకు గురిచేసి ముప్పతిప్పలు పెట్టి వసూలు చేశారు. ఇలాంటి ఫిర్యాదులపై సిట్ గురిపెట్టింది. నిందితులు తప్పించుకోకుండా పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తోంది. భూ బాధితులు కూడా ధైర్యంగా ముందుకు రావాలని పోలీసులు సూచిస్తున్నారు.



ఈ నెలలో తీగలగుట్టపల్లిలో ఓ ఇంటిని కూలుస్తున్న దుండగులు (ఫైల్)

కటకటాలకు కార్పొరేటర్

కరీంనగర్ పోలీసు కమిషనర్ నగర పరిధిలోని భూ దందాలపై ఏర్పాటు చేసిన సిట్ బోణీ కొట్టింది. ఓ భూ వివాదంలో బాధితుడిని ఇబ్బంది పెట్టిన కార్పొరేటర్, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి, కార్పొరేటర్‌తో పాటు మరో వ్యక్తిని బుధవారం అరెస్టు చేశారు. మరో వ్యక్తిని త్వరలోనే అదుపులోకి తీసుకోనున్నారు. కరీంనగర్ భగత్‌నగర్‌లోని కొత్త రాజిరెడ్డి తన భూమి విషయంలో జోక్యం చేసుకుని, ఇల్లు నిర్మించుకోకుండా రెండేళ్లుగా కార్పొరేటర్ తోట రాములు, చీటి రామారావు, నిమ్మశెట్టి శ్యాం ఇబ్బంది పెడుతున్నారని గతనెలలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టీఎస్ బీపాస్ ద్వారా అనుమతి వచ్చినా ఇంతకాలం అధికారబలంతో తనను ఇబ్బందులకు గురిచేశారని ఇటీవల



పోలీసుల అదుపులో కార్పొరేటర్ రాములు

హైదరాబాద్‌లోని ప్రజావాణికి హాజరై సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో పాటు కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతిని కలిసి తనగోడు వెళ్లబోసుకున్నాడు. రంగంలోకి దిగిన సిట్‌బృందం విచారణ ప్రారంభించింది. బుధవారం ఈ కేసు విషయంలో కార్పొరేటర్ తోటరాములుతో పాటు చీటి రామారావును అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా 14రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

బుల్డోజర్ గ్యాంగ్‌లపైనా ఆరా

నగర శివారులో ఒకరిద్దరు కార్పొరేటర్లు బుల్డోజర్ గ్యాంగులను నిర్వహిస్తున్నారని సమాచారం. తమ పరిధిలో నూతన ఇంటి నిర్మాణానికి వీరు అడిగినంత ఇవ్వకపోయినా, కబ్జాలు పెడితే ఎదురుతిరిగినా, వారి ఇళ్లు నిమిషాల్లో నేలమట్టం చేస్తారు. వీరికి రాజకీయ అండదండలు పుష్కలంగా ఉండడంతో పోలీసులూ ఏమీ చేయలేకపోయారు. ఈ గ్యాంగులను నియంత్రించలేక గతంలో ఒక పోలీసు కమిషనరే ఇక్కడ నుంచి బదిలీ అయ్యారన్న విమర్శలున్నాయి. తీగలగుట్టపల్లిలో ఇదేదందా ఏళ్లుగా సాగుతోంది. స్థానికంగా ఒక సామాజికవర్గానికి చెందిన యువకులతో కొందరు కార్పొరేటర్లు బుల్డోజర్ గ్యాంగ్‌లను నడిపిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. సదరు డివిజన్లలో కొత్త ఇళ్ల నిర్మాణాల వద్దకు వెళ్లి బెదిరించడం, భయపడకుంటే రాత్రి పూట బుల్డోజర్లు తీసుకుని వెళ్లి ఇల్లు కూలుస్తుంటారు. వీరు ఏ స్థాయికి వెళ్లారంటే.. చట్టానికి, పోలీసుల భయం లేకుండా, సీసీ కెమెరాల్లో రికార్డు అవుతున్నా, కేసులు నమోదవుతున్నా ఖాతరు చేయడం లేదంటే అతిశయోక్తి కాదు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం కరీంనగర్‌లో భూకబ్జాలపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో పోలీసులు సిట్ ఏర్పాటు చేయడం, భూ కబ్జాదారుల అరెస్టుకు రంగం సిద్ధం చేస్తుండటం గమనార్హం.

బల్దియాలో బదిలీలు తప్పవా!

- ఏళ్లకాలంగా తిష్ట వేసుకుని ఉన్నవారికి స్థాన చలనం
- మున్సిపాలిటీలకు సర్కారు ఉత్తర్వులు
- బదిలీ కోసమే సెలవులో నగరపాలక కమిషనర్..?



కరీంనగర్ నగరపాలక సంస్థ

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థలో దీర్ఘకాలికంగా తిష్ట వేసుకొని ఉన్న ఉద్యోగులకు స్థానచలనం తప్పేట్లు లేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, మున్సిపాలిటీలను కాస్త ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో బదిలీలపై సర్వత్రా చర్చమొదలైంది. నగరపాలక సంస్థలో సంవత్సరాలుగా పాతుకుపోయిన ఉద్యోగులు బదిలీ కానున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కొత్తగా పాలనాపగ్గాలు చేపట్టగానే, మూడు సంవత్సరాలకు మించి ఒకేచోట ఉన్న ఉద్యోగులను బదిలీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని మున్సిపాలిటీలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలోనే నగరపాలకసంస్థ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగుల్లో మూడు సంవత్సరాలకు మించి ఎంతమంది ఉన్నారనే లెక్కలు తీస్తున్నారు. కార్యాలయంలో దాదాపు 150 వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా, ఇందులో 20మంది వరకు దీర్ఘకాలికంగా ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నట్లు సమాచారం. నగరపాలకసంస్థలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, రెవెన్యూ, పారిశుధ్యం ప్రధాన విభాగాలుగా ఉన్నాయి. ఇందులో కొంతమంది ఇక్కడే తిష్ట వేసి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. తమకు ఏర్పడిన పరిచయాలతో సదరు ఉద్యోగులు అక్రమాలకు తోవ వేసుకుంటున్నారని, స్థాన చలనంతోనే దీనికి అడ్డుకట్ట వేయొచ్చని ఉన్నతాధికారులు సైతం భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే మూడు సంవత్సరాలు పైబడి పనిచేస్తున్న ఉద్యోగుల జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రజాపాలన కార్యక్రమాలు, అనంతరం దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడంపైనే అధికారులు దృష్టి సారించారు. ఈ సమయంలో ఉద్యోగులను బదిలీ చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని ఇన్నాళ్లు ఆగిన అధికారులు. సంక్రాంతి సెలవులు సైతం ముగియడంతో త్వరలోనే బదిలీపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. కొంతమంది అధికారులు మాత్రం స్వచ్ఛందంగానే బదిలీపై వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ విభాగంలో ఉన్న అధికారులు ఎక్కువగా బదిలీపై ఆసక్తి చూపుతున్నారు.

బదిలీకోసమే సెలవులో బల్దియా కమిషనర్..?

నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ సెలవులో వెళ్లారు. ఈనెల 17 నుంచి 24 వరకు సెలవులో ఉన్నట్లు బల్దియా వర్గాలు తెలిపాయి. అయితే బదిలీ కోసమే కమిషనర్ సెలవులో వెళ్లారని, హైదరాబాద్‌కు చుట్టుపక్కల ఉన్న మున్సిపాలిటీల్లో పనిచేసేందుకు ఉత్సాహం చూపుతున్నారని తెలిసింది. తన వ్యక్తిగత కారణాలు, కుటుంబం నేపథ్యంలో కరీంనగర్ నుంచి బదిలీ అయ్యేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఈ క్రమంలోనే సెలవులో వెళ్లినట్లు నగరపాలక సంస్థ వర్గాల నుంచి సమాచారం.

పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

హుజూరాబాద్: పేదల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మోడీ ప్రభుత్వ హామీలు, పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి అందేవిధంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, పోషణ్ అభియాన్, ఉజ్వల, ఆవాస్ యోజన తదితర పథకాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్లు పైళ్ల వెంకట్‌రెడ్డి, కేసిరెడ్డి లావణ్య, మారవెల్లి సుశీల, మున్సిపల్ మేనేజర్ రామ్ మోహన్‌రాయ్, ఏఈవో సతీశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కృష్ణారెడ్డి, తదితరులు

టీచర్ల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న జి.హర్షవర్ధన్‌రెడ్డి

- పీఆర్‌టీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి జి.హర్షవర్ధన్‌రెడ్డి

కరీంనగర్: కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలంగాణ పీఆర్టీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా సమావేశం ఫిలింభవన్‌లో జిల్లా అధ్యక్షులు గోనె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు కృతనిశ్చయంతో ఉన్నారని వెల్లడించారు. అనంతరం పీఆర్టీయూ నాయకులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని హర్షవర్ధన్‌రెడ్డికి అందజేశారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మంచిరెడ్డి అనంత్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, నాయకులు పాతూరి రాజిరెడ్డి, కేతిరి తిరుపతిరెడ్డి, అట్ల శ్రీనివాస్‌రెడ్డి, చొల్లేటి శ్రీనివాస్, కిషన్, హరికృష్ణ పాల్గొన్నారు.

బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయాలి

అక్టోబర్ 2023లో స్కూల్ అసిస్టెంట్, ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టర్ బదిలీలు జరిగాయని, వెంటనే వారందరినీ రిలీవ్ చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతూ ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జి.హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్, గిరి సురేశ్, శంకర్ నాయక్, శ్రీనివాస్, రమేశ్‌నాయక్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో గాలి నాణ్యత కేంద్రం

- ఏర్పాటుకు ప్రతిపాదన
- స్థలాన్వేషణలో యంత్రాంగం



రామగుండంలోని గాలి నాణ్యత కేంద్రం

కరీంనగర్‌లో ఆరు నెలలుగా గాలిలోని సూక్ష్మ ధూళికణాలు (మైక్రోగ్రాముల్లో)			
ఆగస్టు:	63	నవంబర్:	70
సెప్టెంబర్:	75	డిసెంబర్:	69
అక్టోబర్:	68	జనవరి:	64

కరీంనగర్ అర్బన్: కరీంనగర్‌లో వాయు నాణ్యత కేంద్రం ఏర్పాటు కానుంది. ఇన్నాళ్లు రామగుండం కేంద్రంగా ఫిర్యాదులు చేయగా.. అన్నీ అనుకూలిస్తే మరో రెండు నెలల్లో నగరంలో ఏర్పాటుకానుంది. కేంద్ర ఏర్పాటుకు కొత్తపల్లితో పాటు నగరంలోని పలు ప్రాంతాలను గుర్తించిన జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. రాష్ట్ర వాయు కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) ఆమోదమే తరువాయి. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 27 వాయు నాణ్యత నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పీసీబీ ప్రకటించగా.. అందులో కరీంనగర్ కూడా ఉంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే రామగుండంలో ఉండగా, కరీంనగర్‌లో మరోకేంద్రం ఏర్పాటు చేయనున్నారు. పట్టణ జనాభా, వాహనాల సంఖ్య పెరగడం, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం అంచనా వేయడంతోపాటు ప్రజలను అప్రమత్తం చేసేందుకు వీలుగా కేంద్రం పని చేయనుంది.

కలుషితం.. ప్రమాదకరం

కాలుష్య నియంత్రణ మండలి లెక్కల మేరకు సూక్ష్మ ధూళికణాల పరిమితి ఘనపు మీటరు గాలిలో 60, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం 40 మైక్రో గ్రాములు దాటకూడదు. ఉమ్మడి జిల్లాలో అంతకన్నా ఎక్కువే నమోదవుతోంది. ఒకప్పుడు పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితమైన వాయు కాలుష్యం ఇప్పుడు జిల్లాలకు పాకుతోంది. వాహనాల సంఖ్య పెరగడం, పరిశ్రమలు ఏర్పడటంతో వేగంగా విస్తరిస్తోంది. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) గణాంకాల ప్రకారం.. గతంతో పోలిస్తే జిల్లాలో 15శాతం పెరుగుదల ఉంది. అవసరమైన చర్యలు చేపట్టకపోతే కాలుష్య ముప్పు విస్తరించే అవకాశం ఉంది. ఇందులో భాగంగా గాలి నాణ్యతను తెలుసుకునేందుకు నమోదు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.

కారణాలు అనేకం

నగరంలో భారీ వాహనాలు 25వేలు, ఆటోలు 32వేలు, కార్లు 80వేలు, మోటారు సైకిళ్లు 2.10 లక్షలు ఉన్నాయి. జిల్లాలో 180 ఆర్టీసీ బస్సులు రోజు 50వేల కి.మీలు తిరుగుతుండగా ఈ లెక్కన నిత్యం సగటున 2.5 లక్షల లీటర్లకు పైగా పెట్రోల్, డీజిల్ తదితర ఇంధనాలు వినియోగిస్తున్నారు. లీటర్ ఇంధనం ఉపయోగిస్తే 2.30 కిలోల విషవాయువులు ఏర్పడతాయి. ఈ లెక్కన జిల్లాలో వినియోగిస్తున్న వాహనాలు లక్షల కిలోల్లో విషవాయువులు విడుదల చేస్తున్నాయి. పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడుతున్న ప్రమాదకర వాయువులు, ప్లాస్టిక్ వినియోగం పర్యావరణంపై ప్రభావం చూపుతున్నాయి.

రోజువారీగా నమోదు

జిల్లాకేంద్రంలో వాయు నాణ్యత కేంద్రం ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉంది. దాదాపుగా ఇది ఖరారైనట్లేనని అధికారులు చెబుతున్నారు. తద్వారా పీల్చే గాలి స్వచ్ఛమైనదా. లేదా? కాలుష్య కారకాలు ఏమైనా ఉన్నాయా అనే విషయంలో స్పష్టత వస్తుంది. ఆ మేరకు ప్రజలను అప్రమత్తం చేయనున్నారు. గాలి నాణ్యత 0.5 పాయింట్లు ఉంటే ఉత్తమం. 401 నుంచి 500 పాయింట్లు ఉంటే ప్రమాదకర పరిస్థితి.

రండీ.. చూసుకుందాం

నగరంలో వానరసైన్యం పెరిగిపోతోంది. గుంపులుగా తిరుగుతూ ఇళ్లలోకి ప్రవేశించి రచ్చ చేస్తున్నాయి. అడ్డుకునేవారిపై ఎదురుదాడికి దిగుతున్నాయి. కోతుల బెడద నుంచి తప్పించుకునేందుకు సిటీలో కొందరు కొండెంగలను తీసుకొచ్చారు. ఇల్లు, వ్యాపార సముదాయం ఆవరణలో ఉంచడంతో కోతుల నుంచి కాస్త ఉపశమనం కలిగినా.. వీధికుక్కలు కొండెంగల పాలిట శత్రువులుగా మారాయి. వాటి వెంటపడి దాడులకు పాల్పడుతున్నాయి. నగరంలోని కెప్టెన్ విజయ రఘునందన్‌రావు రోడ్డులోని ఓ ఇంటి ఆవరణలో కొండెంగలు.. వీధికుక్కలకు మధ్య పెద్ద యుద్ధమే జరిగింది. దాదాపు అరగంటకు పైగా దాడి.. ప్రతిదాడులకు దిగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



యథేచ్ఛగా ఏఆర్టీ అకౌంట్ లావాదేవీలు?

కరీంనగర్ టౌన్: జిల్లా ఆస్పత్రి మెడికల్ కళాశాల ఏర్పాటుతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా మారినప్పటికీ అధికారుల తీరు మారడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి అనుసంధానంగా నడుస్తున్న ఏఆర్టీ సెంటర్‌ను 2023 నవంబర్ 1వ తేదీన డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ద్వారా నియమితులైన సూపరింటెండెంట్‌కు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అప్పగించారు. ఏఆర్టీ సెంటర్‌కు సంబంధించిన అకౌంట్ లావాదేవీలు టీవీవీపి అధికారులే నడిపినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. లక్షల్లో లావాదేలు జరిగినట్లు ఆసుపత్రిలో ప్రచారం జరుగుతోంది. ఏఆర్టీ సెంటర్‌ను అప్పగించినప్పటికీ దేనికోసం లావాదేవీలు జరిగాయనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇప్పటికే ఆరోపణలు, ప్రత్యారోపణలు, కలెక్టర్ చర్యలతో ఆసుపత్రి పరువుబజారున పడగా, ఏఆర్టీ అకౌంట్ లావాదేవీల విషయం ఎటు దారితీస్తుందో అనే చర్చ జరుగుతోంది.


సంక్రాంతి కిక్కు రూ.21కోట్లు

- పెరిగిన బీర్లు, లిక్కర్ అమ్మకాలు

కరీంనగర్‌క్రైం: మందుబాబులు పండగ చేసుకున్నారు. సంక్రాంతికి తాగి తూగారు. ఎక్సైజ్‌శాఖకు కాసుల వర్షం కురిపించారు. పండక్కి మూడు రోజుల పాటు మద్యం అమ్మకాలు పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. సంక్రాంతి పండగవేళ మూడు రోజుల్లో కలిపి రూ.21కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. పలు వైన్స్‌ల వద్ద జనాలు క్యూ కట్టడం కనిపించింది. మరికొన్ని వైన్స్‌ల్లో స్టాక్ దొరక్కపోవడంతో ఇతర మద్యం దుకాణాలకు వెళ్లినట్లు తెలిసింది. పండగరోజు సాయంత్రానికి కొన్నివైన్స్‌ల్లో బీర్లు లభించలేకపోవడంతో మందుబాబులు నిరాశతో వెనుదిరిగారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 94మద్యం దుకాణాలు, 32బార్లలో కలిపి సంక్రాంతికి రూ.21కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్‌శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

జిల్లావ్యాప్తంగా జరిగిన మద్యం అమ్మకాలు ఇలా

ఎక్సైజ్‌స్టేషన్	లిక్కర్(కేస్‌లు)	బీర్లు(కేస్‌లు)	విలువ(రూ.కోట్లలో)
కరీంనగర్ అర్బన్	5,438	8,801	6.14
కరీంనగర్ రూరల్	5,404	9,076	5.41
తిమ్మాపూర్	3,070	5,367	3.24
హుజూరాబాద్	2,989	5,716	3.21
జమ్మికుంట	2,919	4.651	3.00
మొత్తం	19,820	33,611	21.00



క్లుప్తంగా

వచ్చే నెల 11న రాష్ట్రస్థాయి కరాటే పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్ రెడ్డి తదితరులు

కరీంనగర్ స్పోర్ట్స్/కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ఫిబ్రవరి 11న నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి, అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె.వసంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం అల్ఫోర్స్ పాఠశాలలో సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. కటాస్, స్పారింగ్, టీమ్ కటా విభాగాల్లో పోటీలు జరుగుతాయని, విజేతలకు బంగారు, రజత, కాంస్య పతకాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌స్ట్రక్టర్లు పుల్లూరి శ్రీనివాస్, బి.ప్రవీణ్ గౌడ్, తిరుపతి, రాజశేఖర్ రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

21 నుంచి ఖోఖో జట్టుకు శిక్షణ శిబిరం

కరీంనగర్ స్పోర్ట్స్: ఈ నెల 21 నుంచి కోరుట్ల మండలంలోని అయిలాపూర్‌లో సీనియర్స్ పురుషుల ఖోఖో జట్టుకు శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఖోఖో సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నటరాజు రవి, వై.మహేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను శిక్షణకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. శిబిరం నిర్వాహకుడు మంగ సంతోష్‌కు ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు రిపోర్టు చేయాలన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు నల్గొండ జిల్లా భువనగిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖోఖో పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు..

నరేశ్, శశికుమార్, కిశోర్, ఉదయ్‌కుమార్, గణేశ్, నవీన్ రాజు, శ్రీరామ్, పి.వెంకటేశ్, సీహెచ్.రాహుల్, ఎల్.రాకేశ్, టి.శ్రీనాథ్, ఎ.విజయ్, కె.శ్రీపాల్, వి.గణేశ్, బి.రాజు, ఎల్.మహేందర్, వి.పవన్, సీహెచ్.అఖిల్, ఎం.రాహుల్, ఆర్.అరవింద్, జి.తిరుమలేశ్, ఆర్.అజయ్.

గంజాయి విక్రేత అరెస్టు



నిందితుడిని చూపుతున్న ఎస్సై అజయ్

రాయికల్(జగిత్యాల): గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు రాయికల్ ఎస్సై అజయ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ మండలానికి చెందిన ఆత్రం సోనేరావు గతంలో భూపతిపూర్‌కి చెందిన వ్యక్తులకు గంజాయి విక్రయించాడు. బుధవారం మళ్లీ అమ్మేందుకు రాయికల్ పట్టణంలోని భరతమాత విగ్రహం వద్దకు వచ్చాడు. పోలీసులు పట్టుకొని, అతని వద్ద నుంచి రూ.50 వేల విలువైన 2.03 కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సోనేరావుపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితున్ని చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుళ్లు సాగర్, సంతోష్, ప్రశాంత్‌లను సీఐ ఆరిఫ్ అలీఖాన్ అభినందించారు.

పుట్టగొడుగులకు డిమాండ్

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం
- పెంచేందుకు ముందుకువస్తున్న రైతులు
- ప్రాజెక్టులో భాగంగా పెంచుతున్న పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు



పుట్టగొడుగులతో వ్యవసాయ కళాశాల విద్యార్థులు



పాలిథిన్ కవర్లలో పుట్టగొడుగుల పెంపకం

జగిత్యాల అగ్రికల్చర్: ఇటీవల పుట్టగొడుగులకు మార్కెట్లో డిమాండ్ పెరిగింది. చాలామంది ఔత్సాహిక రైతులు పెంచేందుకు ముందుకు వస్తున్నారు. పొలాస వ్యవసాయ కళాశాల ఫైనలియర్ విద్యార్థులు సైతం తమ ప్రాజెక్టులో భాగంగా పుట్టగొడుగులు పెంచుతున్నారు. కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్లాగౌడ్ గైడ్‌గా వ్యవహరిస్తున్నారు.

చాలా రకాలున్నాయి..

పుట్టగొడుగుల్లో చాలా రకాలు ఉన్నాయి. అయినా, వాటిలో తినేందుకు వరి గడ్డి, బటన్, అయిస్టర్, పాల పుట్టగొడుగులు మాత్రమే అనువైనవి. వీటిలో అనేక రకాల పోషకాలున్నాయి. ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన వివిధ రకాల పుట్టగొడుగులు అందుబాటులో ఉండటంతో సాగుకు ఎంతోమంది ఆసక్తి చూపుతున్నారు. పుట్టగొడుగులను తక్కువ వ్యవధిలో, వ్యవసాయ వ్యర్థ పదార్థాలైన వరిగడ్డి, చొప్ప, ఇతర పదార్థాలతో తక్కువ ఖర్చుతో పెంచి, మంచి ఆదాయం పొందవచ్చు.

ఎలా పెంచుతారంటే..

పుట్టగొడుగులను పెంచేందుకు 6–12 నెలల వయసున్న గడ్డిని ముక్కలు ముక్కలు చేయాలి. తర్వాత దానిపై నీళ్లు చల్లి, తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. ఒక కేజీ వరి గడ్డికి 50 గ్రాముల స్పాన్ కలిపి, పాలిథిన్ సంచుల్లో నింపి, రబ్బర్ బ్యాండ్ వేయాలి. ఈ సంచులను తగినంత తేమ, ఉష్ణోగ్రత ఉన్న గదుల్లోకి తీసుకెళ్లాలి. 3–4 వారాలకు గడ్డిపై తెల్లని శిలీంధ్రం వస్తుంది. ఇలా చేసిన 6–7 రోజులకు తొలి పంట వస్తుంది. రంగు మారిన, మచ్చలు కలిగిన గడ్డిని ఉపయోగించవద్దు. పుట్టగొడుగులు పెంచే గదుల్లోకి పురుగులు, కీటకాలు, ఎలుకలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గదిలో ఉష్ణోగ్రత, తేమ శాతం తటస్థంగా ఉండాలి.

లాభాలివే..

పుట్టగొడుగులను 30–40 రోజుల్లో పెంచవచ్చు. వీటిల్లో ప్రోటీన్స్ వరి, గోధుమ, కూరగాయలతో పోల్చితే అధికంగా ఉంటాయి. తాజా పుట్టగొడుగుల్లో విటమిన్–డి ఎక్కువగా ఉంటుంది. పొటాషియం, సోడియం నిష్పత్తి, పీచు పదార్థాలు అధికంగా ఉండటం వల్ల బీపీ, ఎసిడిటీ బాధపడే వారికి చాలా ఉపయోగపడుతాయి. విటమిన్–బి, విటమిన్–సి, ఫాంటొథెనిక్, నియాసిన్లు అధికంగా ఉంటాయి.

శాఖాహారులకు మాంసాహారంగా..

పుట్టగొడుగులపై ప్రజలకు అవగాహన పెరగడం వల్ల మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ప్రొటీన్ ఎక్కువగా ఉండటంతో శాఖాహారులకు మాంసాహారంగా ఉపయోగపడుతాయి. గ్రామీణ నిరుద్యోగ యువత, మహిళలు, సన్నకారు రైతులు పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టితే అధిక దిగుబడి, ఆదాయం పొందవచ్చు. పుట్టగొడుగుల ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి, ఇతర దేశాలకు ఎగుమతి చేయవచ్చు. పచ్చళ్లు, బిర్యానీ, సూప్ పౌడర్, కెచప్ వంటివి తయారు చేయవచ్చు.

15 రోజుల వ్యవధిలో 3 పంటలు



ఎప్పుడూ తేమ ఉండేలా చూస్తే పుట్టుగొడుగులు పెరిగి, 15 రోజుల వ్యవధిలోనే 3 పంటలు వస్తాయి. ప్రతీ కిలో ఎండుగడ్డి నుంచి దాదాపు కిలో పచ్చి పుట్టగొడుగులు వస్తాయి. రైతులకు లాభాసాటిగా ఉంటుంది.

– వినితా రెడ్డి, వ్యవసాయ విద్యార్థిని

తాజాగా ఉంటే మంచి ధర



పుట్టగొడుగులు తాజాగా ఉన్నప్పు విక్రయిస్తే మంచి ధర వస్తుంది. ఫ్రిజ్‌లో అయితే మరో 3 రోజులు నిల్వ ఉంటాయి. ఏడాదికి 9 పంటలు తీయవచ్చు. పుట్టుగొడుగుల్లో నలుపు, ఆకుపచ్చ, పసుపుపచ్చవి వస్తే తీసివేయాలి.

– మనోజ్ కుమార్, వ్యవసాయ విద్యార్థి

రైతులకు శిక్షణ ఇస్తాం



పుట్టగొడుగులు పెంచాలనుకునే రైతులు బృందాలుగా వస్తే వ్యవసాయ కళాశాలలో శిక్షణ ఇస్తాం. విద్యార్థులు తమ ప్రాజెక్టులో తయారు చేసి, సక్సెస్ అయ్యారు. పుట్టగొడుగులను పెంచడం తేలిక, తక్కువ ఖర్చు.

– డాక్టర్ ఎల్లాగౌడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పొలాస

దాడి ఘటనలో 8 మందిపై కేసు

ముత్తారం(మంథని): దంపతులపై దాడి ఘటనలో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఈ నెల 16న ముత్తారం మండలంలోని లక్కారంలో దొరి మంజుల–శ్రీనివాస్ దంపతులపై అదే గ్రామానికి చెందిన వీరగోని శ్రీనాథ్, రాజేశం, విజయ్, శేఖర్, శివ, భాగ్యమ్మ, గొట్టెముక్కల సౌజన్య, రాజమణి దాడి చేశారు. బాధితురాలు మంజుల బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చామనపల్లికి చెందిన ఆవారి బక్కమ్మ(80) చికిత్స పొందుతూ మృతిచెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బక్కమ్మ గత శనివారం తన ఇంటి ముందున్న రాళ్లను తొలగిస్తుండగా నాగుపాము కాటు వేసింది. కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయింది.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న మల్లేశం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్‌కు చెందిన గీత కార్మికుడు మడ్డి మల్లేశం తాటిచెట్టు పైనుంచి పడి, తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మల్లేశం మంగళవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారడంతో కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని ఛాతి, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు వెన్నెముక విరిగినట్లు నిర్ధారించారు. వారి సూచనల మేరకు అదేరోజు రాత్రి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఆలయాల్లో దొంగల బీభత్సం

- బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని మూడు గ్రామాల్లో దొంగలు బీభత్సం సృష్టించారు. మంగళవారం అర్ధరాత్రి జగ్గాసాగర్, రామలచ్చక్కపేట, ఆత్మనగర్‌లలోని ఆరు ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఆత్మనగర్‌లో హనుమాన్, మల్లన్న ఆలయాల్లో స్వామివార్ల విగ్రహాలకు ఉన్న సుమారు 50 తులాల వెండి ఆభరణాలు, రామలచ్చక్కపేట–జగ్గాసాగర్ మధ్యలో గల పెద్దమ్మ ఆలయంలో తులం విలువైన బంగారు ఆభరణాలు, జగ్గాసాగర్ రామాలయం, గంగమ్మ ఆలయం, రామలచ్చక్కపేటలో శివాలయంలోని హుండీలను పగులగొట్టి, నగదు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు ఆయా ఆలయాలకు వెళ్లి, పరిశీలించారు. క్లూస్ టీం సహాయంతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చీకోడు గ్రామంలో..



పగిలిన కుండలు చూపుతున్న గీత కార్మికులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని చీకోడు గ్రామంలో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. ఎల్లమ్మ ఆలయ తలుపులు బద్దలు కొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. గీత కార్మికులకు ఇది వార్నింగ్ మాత్రమే అంటూ బొగ్గుతో రాయడంపై కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కల్లు దుకాణంలో రూ.40 వేల విలువైన కల్లు కుండలను ధ్వంసం చేశారు. గ్రామంలోని ఒక కిరాణా దుకాణం, హోటల్ తలుపులను బద్దలుకొట్టి, వస్తువులను చిందరవందర చేశారు. కిరాణా దుకాణంలోని రూ.20 వేల విలువైన కిరాణ సామగ్రి చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. గొర్రెల మందలోని నాలుగు గొర్రెలను ఎత్తుకెళ్లారని కాపరులు పేర్కొన్నారు. గ్రామ శివారులో ఆరబెట్టిన 50 కిలోల మిరపకాయలను దొంగతనం చేశారని బాధితుడు చిన్ని రవీందర్‌రెడ్డి తెలిపారు. ఇదంతా దొంగలు చేశారా.. లేక ఎవరైనా ఆకతాయిల పనా.. అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని గీత కార్మికులు గున్నాల గణేశ్‌గౌడ్, చంద్రాగౌడ్, నాగరాజు గౌడ్ కోరారు.

ఒడిశా కార్మికురాలి మృతి



భారతి భాగ్ (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: ఒడిశాకు చెందిన ఓ కార్మికురాలు మృతిచెందింది. ఎస్సారెస్పీ కెనాల్‌లో ఆమె మృతదేహం లభ్యమైంది. పోలీసులు, తోటి కార్మికుల వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన బోధరాజ్, అతని భార్య భారతి భాగ్(20) సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి పూసాల శివారులోని ఎంబీసీ ఇటుకల బట్టీలో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో గత సోమవారం దంపతుల మధ్య గొడవ జరగడంతో భారతి భాగ్ అదే రోజు రాత్రి బయటకు వెళ్లిపోయింది. బోధరాజ్ చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం సుల్తానాబాద్ మార్కండేయ కాలనీ సమీపంలో గల ఎస్సారెస్పీ కెనాల్‌లో ఆమె మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతురాలి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చావుబతుకుల్లో పేదింటి బిడ్డ

- రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు
- వైద్యానికి రూ.10 లక్షలు అవసరం
- దాతలు ఆదుకోవాలని కుటుంబసభ్యుల వేడుకోలు



చికిత్స పొందుతున్న సందీప్

మానకొండూర్ రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన పేదింటి బిడ్డ మామిండ్ల సందీప్ చావుబతుకుల్లో ఉన్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రెండు రోజుల క్రితం కరీంనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో సందీప్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతన్ని కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. తలకు బలమైన గాయాలవడంతో వైద్యానికి రూ.10 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. కడు పేదరికంలో ఉన్న తాము అంత మొత్తం చెల్లించలేమని, దాతలు ముందుకు వచ్చి, ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్ష మాయం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని యాదవనగర్‌కు చెందిన బండ రాజు ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ.లక్ష మాయమయ్యాయి. బాధితుడు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 10 రోజుల్లో రూ.10 వేల చొప్పున అకౌంట్ నుంచి ఏఈపీఎస్ ద్వారా డబ్బులు పోయాయని తెలిపాడు. దీనిపై సైబర్ క్రైంలోనూ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. డబ్బులు రికవరీ చేసి, ఇప్పించాలని పోలీసులను కోరాడు.

గుడిసెవాసులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- సీపీఎం జాతీయ, రాష్ట్ర కమిటీల సభ్యులు జి.నాగయ్య, భూపాల్



మాట్లాడుతున్న నాగయ్య, భూపాల్

కరీంనగర్: జగిత్యాలలో గుడిసెవాసులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని సీపీఎం జాతీయ, రాష్ట్ర కమిటీల సభ్యులు జి.నాగయ్య, భూపాల్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జగిత్యాలలో 6 నెలలుగా సీపీఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరుపేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని, జీవిస్తున్నారని తెలిపారు. నిరుపయోగంగా ఉన్న ఈ స్థలంలో పేదలు గుడిసెలు వేస్తే తప్పేంటని ప్రశ్నించారు. పేదలు, సీపీఎం నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి, జైల్లో వేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. జగిత్యాల పోలీసులు అత్యుత్సాహంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తూ పేదలపై దౌర్జన్యంగా వ్యవహరించారని ఆరోపించారు. అరెస్టు చేసినవారిని విడుదల చేయకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం సీపీఎం బృందం జైలు వద్దకు వెళ్లి, అరెస్టయిన నాయకులు తిరుపతి నాయక్, బాలకృష్ణ, సులోచన, రమేశ్, రజియా సుల్తానా తదితరులను పరామర్శించింది. రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటరమణ, జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకట రెడ్డి, గుడికందుల సత్యం, జి.బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు ఎడ్ల రమేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు, స్థలాలు మంజూరు చేయాలి

జగిత్యాలటౌన్: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ శివారులోని టీఆర్‌నగర్‌లో గుడిసెవాసులపై పోలీసులు దాడిని ఖండిస్తున్నామని సీపీఎం రాష్ట్ర నాయకుడు గీట్ల ముకుందరెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాలలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బాలకృష్ణతోపాటు 20 మంది సీపీఎం నాయకులను రిమాండ్ చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జా చేస్తుంటే చూసీచూడనట్లు వ్యవహస్తున్న అధికారులు పేదలపై తమ ప్రతాపం చూపిస్తున్నారని మండిపడ్డారు. సీపీఎం నాయకులను విడుదల చేయడంతోపాటు గుడిసెలను కూల్చిన స్థలంలోనే పేదలకు ఇళ్లు నిర్మించి, ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, సీపీఎం జిల్లా నాయకులు సారంగపాణి, శారద, హరీశ్, ఎండీ.సలీం తదితరులున్నారు.

కరీంనగర్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న గీత

కరీంనగర్: గన్నేరువరం మండలంలోని హన్మాజీపల్లికి చెందిన కూరపాటి గీత బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. గన్నేరువరం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి తన భర్త సంపత్‌ను వేధిస్తున్నాడని, పోలీసులచే కేసులు నమోదు చేయిస్తూ బెల్ట్‌షాప్‌ను నడవకుండా చేశాడని బాధితురాలు ఆరోపించింది. ఎంపీపీ ప్రోద్బలంతోనే తన భర్తను తిమ్మాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బైండోవర్ చేశారని తెలిపింది. అబ్కారీ అధికారులచే వేధించడంతో ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఎంపీపీ వేధింపులు తట్టుకోలేమని, తమ కుటుంబానికి ప్రాణభయం ఉందంటూ కన్నీటిపర్యంతమైంది. ఒంటిపై పెట్రోల్ పోసుకుంటుండగా పోలీసులు అడ్డుకొని, ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తర్వాత అక్కడినుంచి పంపించారు.

గొడవ పడుతుంటే అడ్డొచ్చాడని దాడి

- వ్యక్తికి తీవ్ర గాయాలు




గాయపడిన రవి


మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): తమ్ముడికి, మరో వ్యక్తికి గొడవ జరుగుతుండగా ఆపేందుకు ప్రయత్నించాడు ఓ అన్న.. ఇది మనసులో పెట్టుకున్న అవతలి వ్యక్తి అతనిపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలంలోని కొండ్రికర్లలో రోడ్డు నిర్మాణ పనుల బిల్లుల చెల్లింపులో జాప్యంపై గ్రామానికే చెందిన బీజేపీ నాయకుడు ఆకుల శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ నాయకులు గడ్డం రాజారెడ్డి, మెండె రమేశ్‌లు ఈ నెల 11న నిలదీశారు. ఇది గొడవకు దారితీయడంతో అక్కడే ఉన్న రమేశ్ అన్న రవి ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేశాడు. ఈ విషయంలో కక్ష పెంచుకున్న శ్రీనివాస్ బుధవారం రవి పొలం పనులను ముగించుకొని గ్రామంలోకి వస్తుండగా రాడ్డుతో దాడి చేశాడు. అతని తలకు తీవ్ర గాయాలవగా కుటుంబసభ్యులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ తీసుకెళ్లారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మృత్యువుతో పోరాడి ఓడిన యువకుడు

- రూ.3 లక్షలు ఖర్చు చేసినా దక్కని ప్రాణం
- గుండెలో ఇన్‌ఫెక్షన్‌తో మృతి
- నారాయణపూర్‌లో విషాదం
- రోడ్డున పడ్డ కుటుంబం



రాజు (ఫైల్)



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గుండె దగ్గర ఇన్‌ఫెక్షన్‌తో ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరి మూడు రోజులపాటు మృత్యువుతో పోరాడిన యువకుడు చివరికి ప్రాణాలు వదిలాడు. దాతలు స్పందించి సాయం అందించి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చినప్పటికీ మృత్యువును గెలువలేకపోయాడు. కుటుంబ పెద్ద మృతితో అతనిపై ఆధారపడ్డ భార్య, ఇద్దరు పిల్లలు రోడ్డున పడ్డారు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో బుధవారం విషాదం నింపింది. నారాయణపూర్‌కు చెందిన అనుప రాజు(25) ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న రాజును కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చూపించగా, గుండె వద్ద ఇన్‌ఫెక్షన్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే వైద్యం చేయించకుంటే ప్రాణాలకు ప్రమాదం ఉందని తెలపడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చేతిలో చిల్లి గవ్వ లేకపోవడంతో రాజు ప్రాణాలు దక్కించుకునేందుకు కుటుంబ సభ్యులు తెలిసిన వ్యక్తుల వద్ద అప్పులు చేసి పెట్టారు. దాదాపు రూ.3లక్షల వరకు వెచ్చించారు. కుటుంబ పరిస్థితి అంతంతే కావడంతో అప్పటికే గ్రామస్తులు తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించారు. అయినా ఇన్‌ఫెక్షన్ తీవ్రత పెరిగి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. రెండు రోజుల్లో రూ.3 లక్షలు ఖర్చు చేసిన ప్రాణాలు దక్కకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతునికి తండ్రి మల్లయ్య, భార్య శిరీష, మూడేళ్ల కూతురు మనుశ్రీ, నాలుగు నెలల కుమారుడు మన్విత్ ఉన్నారు. కడుపేదరికం అనుభవిస్తున్న రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నవోదయలో ప్రవేశం భవితకు పునాది

- 20న ప్రవేశ పరీక్ష
- ప్రిన్సిపాల్ మంగతాయారు



మంగతాయారు

చొప్పదండి: నవోదయలో ప్రవేశం విద్యార్థుల భవితకు పునాది అని చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ మంగతాయారు అన్నారు. విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఏర్పాట్లపై బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2024–25 విద్యాసంవత్సరానికి గానూ విద్యాలయంలోని 80 సీట్ల భర్తీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20న ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందని, ఇప్పటికే హాల్ టికెట్ల జారీ ఆన్‌లైన్ ద్వారా పూర్తయిందన్నారు. ఆరోతరగతిలో ప్రవేశం పొందినవారికి 12వ తరగతి వరకు ఉచిత విద్య, వసతి, పౌష్టికాహారం, క్రీడలు, సంగీతం, నృత్యం తదితర విభాగాల్లో శిక్షణ పొందుతారని పేర్కొన్నారు. సీబీఎస్ఈ సిలబస్‌తో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 7,105 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారని, శనివారం ఉదయం 11.30 గంటల నుంచి 2 గంటలపాటు పరీక్ష నిర్వహిస్తామన్నారు. కరీంనగర్‌లో 12, జగిత్యాలలో 11, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో 5 చొప్పున, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్, హన్మకొండ జిల్లా ముల్కనూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లలో ఒక్కొక్కటి చొప్పున పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలో 80 ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయని, ఓఎంఆర్ షీట్‌లో పరీక్ష రాయాలని, నెగెటివ్ మార్కులు ఉండవని తెలిపారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టికెట్ వెంట ఏదైనా గుర్తింపు పత్రం తెచ్చుకోవాలని సూచించారు. 11 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. సందేహాలు ఉన్నవారు 94903 95216, 99667 59402 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అయోధ్య నిర్మాణంలో మనోళ్లు

- అయోధ్యలో 22న కొలువుదీరనున్న శ్రీరాముడు
- ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్న జిల్లావాసులు

విద్యానగర్(కరీంనగర్): ఐదు శతాబ్దాల అపురూప స్వప్నం.. అయోధ్యలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం.. యావత్ భారతావనిలో సంబరం అంబరాన్నంటుతున్న శుభ తరుణం.. ఒక మహా పోరాటం తరువాత నిర్మితమైన భవ్య మందిరంలో శ్రీరాముడు ఈనెల 22న కొలువుదీరనున్నాడు. అయోధ్య రామాలయం అంటే ఇటుకలు, కాంక్రీట్ స్తంభాల నిర్మాణం కాదు.. అది హిందువుల ఆత్మగౌరవ వ్యక్తీకరణ. రామ మందిరం నిర్మాణ విషయంలో 1980 డిసెంబర్ 6న జరిగిన కరసేవలో మన జిల్లా నుంచి పలువురు పాల్గొన్నారు.

అయోధ్య..

అయోధ్య కోసలరాజ్య రాజధాని. సాక్షాత్తు దైవ స్వరూపుడైన శ్రీరామచంద్రుడి జన్మభూమి. ప్రస్తుతం రామ మందిర నిర్మాణం జరిగిన ప్రదేశంలో రామ మందిర నిర్మాణం కావాలనే ఉద్యమం 19వ శతాబ్దంలో మొదలైంది. అక్కడ మసీదు నిర్మించి ఉండడం వల్ల అది వివాదాస్పదంగా మారింది. 1980లో విశ్వహిందూ పరిషత్, బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. తర్వాత



కరసేవలో పాల్గొన్న బండి సంజయ్(బాక్స్‌లో)

పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా ఈ స్థలంలో పరిశోధించి ఆలయ అవశేషాలున్నాయనే ఆధారాలను కనుగొన్నారు.

కరసేవ..

అయోధ్యలో రామాలయం నిర్మాణానికి తొలిసారి 1989 నవంబర్ 9న కరసేవ జరిగింది. మలిసారి 1990 అక్టోబర్ 30న కరసేవ జరగగా.. 1992 డిసెంబర్ 6న రామకథా కుంజ్‌లో జరిగిన సమావేశంలో దాదాపు 70వేల మంది పాల్గొన్నారు. కుంజ్‌లో ప్రసంగాలు సాగుతూ ఉండగానే కొంతమంది బయటకు వచ్చి పోలీసులతో ఘర్షణ పడ్డారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో దాదాపు 80మంది వరకు కట్టడం పైకెక్కి గుమ్మటాలను ధ్వంసం చేశారు.

కరీంనగర్ నుంచి తరలిన వారిలో..

బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ నుంచి గుజ్జ శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీరాముల సురేష్, రాజన్‌బాబు, మిర్యాల్‌కార్ నరేందర్, ఆంజనేయులు, కల్లెం తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, దయ్యాల రవి, హనుమండ్ల శ్రీనివాస్‌రెడ్డి, కాసర్ల వేణుగోపాల్, కోక్కుల శ్రీనివాస్, పసుల మహిపాల్, మందాడి శ్రీనివాస్‌రావు, సురభి వెంకటేశ్వర్‌రావు, బెజ్జంకి సుభాష్, ఆకుల శ్రీనివాస్, గుజ్జ సతీష్, మిర్యాల్‌కార్ ఆనంద్ తదితరులున్నారు.

చరిత్రాత్మక తీర్పు

వివాదాస్పద కట్టడం కూలిన తరువాత అక్కడి స్థలం మీద యాజమాన్యపు హక్కుపై 9 నవంబర్ 2019న భారత అత్యున్నత న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పును వెలువరించి.. 130 ఏళ్ల న్యాయ పోరాటాన్ని సుఖాంతం చేసింది.

భూమి పూజ..

సుప్రీంకోర్టు తీర్పు తరువాత కర్ణాటకలోని బెళగావి సిద్ధాంతి ఎన్ఆర్ విజయేంద్ర 2020 ఆగస్టు 5న మధ్యాహ్నం 12.44 అభిజిత్ లగ్నంలో ముహూర్తం నిర్ణయించగా.. 176 మంది ఆహ్వానితుల సమక్షంలో ప్రధాని నరేంద్ర మోదీ భూమి పూజ చేశారు.



కరసేవలో పాల్గొన్న వారు

కాంక్రీటు, ఇనుము లేకుండా..

ఆలయ నిర్మాణంలో ఎక్కడా కాంక్రీటు గానీ, ఇనుము గానీ ఉపయోగించలేదు. రాళ్లు మాత్రమే వినియోగించి పూర్తి ఆలయ నిర్మాణం సాగింది. మరో వెయ్యి సంవత్సరాల పాటు ఈ ఆలయానికి మరమ్మతుల అవసరం పడకపోవచ్చని నిపుణుల అంచనా.

ఆలయ విశేషాలు..

రామ మందిరం 2.7 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ఆలయం మొత్తం పొడవు 360 అడగులు. శిఖరంతో కలిసి ఆలయం మొత్తం ఎత్తు 161 అడుగులు. మూడు అంతస్తుల నిర్మాణం. ఒక్కో అంతస్తు ఎత్తు 20 అడుగులు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 160



విభాగాలుగా, రెండో అంతస్తు 132 విభాగాలుగా నిలువు వరుసల్లో విభజించబడి ఉంటుంది. ఆలయానికి మొత్తం 12 ద్వారాలుంటాయి. ఇలా ఎన్నెన్నో విశేషాలతో అయోధ్య రామ మందిరం ఒక అద్భుత కట్టడంగా విరాజిల్లనుంది.

కరీంనగర్ వారికే ప్రాధాన్యం



అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు సొంత జిల్లా కరీంనగర్ కావడంతో కరీంనగర్ నుంచి తొలి బృందం వెళ్లాలని పార్టీ నిర్దేశించింది. దీంతో 15మంది కరసేవకులం తరలివెళ్లాం. తరువాత దేశం నలుమూలల నుంచి కరసేవకులు వచ్చారు. నాటి జ్ఞాపకం ఎప్పటికి మదిలో చిరస్థాయిగా ఉంటుంది.

- బండి సంజయ్‌కుమార్, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు

ఈ జన్మకు దక్కిన అదృష్టం



కరీంనగర్ నుంచి వెళ్లిన కరసేవ బృందంలో బండి సంజయ్‌కుమార్‌తో నేనూ ఉన్నాను. కరసేవలో పాల్గొనడం.. ఇప్పుడు రామ మందిరాన్ని చూడడం ఈ జన్మలో నాకు దక్కిన అదృష్టం. పూర్వజన్మలో చేసుకున్న పుణ్యమిది. నా జన్మ సార్థకమయింది.

- రఘునందన్‌రావు భూపల్‌రావు, కరీంనగర్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

జన్మ ధన్యమైంది



కరసేవ కోసం 12 రోజుల ముందే వెళ్లి అక్కడ ఏర్పాట్లు చేసినం. మందిర నిర్మాణం కోసం కరీంనగర్‌లో ఇంటింటా రామ ఇటుకలను సేకరించడం.. రామ మందిర నిర్మాణంలో పాల్గొనడం.. రామ మందిర నిర్మాణం పూర్తి కావడం.. ఈనెల 22న శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరగనుండడంతో నా జన్మ ధన్యమైంది.

- గుజ్జ శ్రీనివాస్, హిందూవాహిని కార్యకర్త, కరీంనగర్

గర్వంగా ఉంది



అయోధ్యలో రామ మందిర నిర్మాణంలో కరసేవకుల్లో నేనూ భాగస్వామిని కావడం గర్వంగా ఉంది. ఇప్పుడు అయోధ్యంతా రామ నామమయం కావడం చాలా ఆనందంగా ఉంది.

- మిర్యాల్‌కార్ ఆనంద్, కేశవనగర్, కరీంనగర్

జాతి గౌరవం



అయోధ్యలో రామ మందిర నిర్మాణం హిందూ జాతి గౌరవం. కరసేవలో కూలిన గుమ్మటాలలో నుంచి దుమ్ము లేచింది. ఆ క్షణంలో జయజయ నినాదాలతో వ్యక్తమైన ఆనందం వర్ణనాతీతం. ఈ జన్మకు లభించిన అదృష్టం. కరసేవలో పాల్గొన్నందుకు నా జన్మ ధన్యమైంది. నేను బతికి ఉండగా రామ మందిర నిర్మాణం కావడం నా అదృష్టం.

- మిర్యాల్‌కార్ నరేందర్, కాపువాడ, కరీంనగర్

క్లుప్తంగా

రక్తదానం 23సార్లు..



రక్తదానం చేస్తున్న ఆంజనేయులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త గాలన్నకు అవసరమైన ఓ ప్లస్ రక్తాన్ని బొమ్మకల్‌కు చెందిన సామాజిక సేవకుడు ఆసిరి ఆంజనేయులు అందించారు. ఇటీవల అత్తగారు మృతిచెందినా.. మానవతా దృక్పథంతో ఆంజనేయులు 23వసారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఆంజనేయులును శోభతో పాటు పలువురు అభినందించారు.

మొగి పురుగు నియంత్రణకు గుళికలు వాడాలి



రైతులతో మాట్లాడుతున్న రణధీర్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: వరి పంటలో ఆశిస్తున్న మొగి పురుగు నివారణకు 3జీ కార్బోఫ్యురాన్ గుళికలను వినియోగించాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.రణధీర్‌రెడ్డి రైతులకు సూచించారు. మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్‌లో ఏఈవో స్వర్ణలతతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. వరి పంటలో ఆశిస్తున్న తెగుళ్లను రైతులనడిగి తెలుసుకున్నారు. మొగి పురుగు ఆశిస్తే గుళికలను వినియోగించాలని, ఎక్కువ మోతాదులో యూరియా వాడొద్దని సూచించారు. చెర్లభూత్కూర్‌లో ఇజ్జగిరి శ్రీనివాస్ సాగు చేసిన బెండ తోటను సందర్శించారు. బెండ సాగు విధానం, సస్యరక్షణ చర్యలపై రైతుకు అవగాహన కల్పించారు.

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణ శివారులో రోడ్డు పక్కన గుడిసెల్లో నివసిస్తున్న సంచారజాతి ప్రజలకు బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లను చైర్మన్ పి.కేశవరెడ్డి, సెక్రటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి పంపిణీ చేశారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

కరీంనగర్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుట్ర చేస్తున్నాడంటూ ఎంపీ బండి సంజయ్ వెల్లడించిన విషయాలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి పెంచాల లక్ష్మణ్‌రావు రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. బుధవారం లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చివేయాలని కేసీఆర్ చేస్తున్న కుట్ర తనకెలా తెలిసిందో సంజయ్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కుట్రకు సంబంధించిన ఆధారాలను పోలీసులకివ్వాలని సూచించారు. 2014, 2019 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో కేసీఆర్ చేర్చుకున్నారని ఆరోపించారు.

గెస్ట్‌హౌస్ పేరు మార్చాలి



డీఆర్‌వోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కరీంనగర్‌కార్పొరేషన్: రాజకీయ కారణాలతో జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను కేసీఆర్ హౌస్‌గా మార్చారని, పేరు మార్చాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో) పవన్‌కుమార్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. గతంలో మాదిరిగానే ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌గా పేరు తిరిగి మార్చాలని వారు కోరారు. ప్రజల అభిప్రాయానికి విరుద్ధంగా రాజకీయ నాయకుడి పేరును గెస్ట్‌హౌస్‌కు పెట్టడం సరికాదన్నారు. పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహమ్మద్ అమీర్, నాయకుడు మహమ్మద్ ఇమ్రాన్, కంకణాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



క్రీడాకారులతో టీఎన్జీవో సంఘం నేతలు

కరీంనగర్‌స్పోర్ట్స్: ప్రస్తుత కాలంలో శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని, వృత్తిరీత్యా ప్రతిరోజు బీజీగా ఉండే ప్రతి ఒక్కరూ క్రీడాపోటీల్లో పాల్గొని ఉల్లాసం పొందాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 2రోజులుగా కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియం, ఎస్సారార్ కళాశాల మైదానంలో జరగుతున్న యూనిటీ కప్ 2024 క్రికెట్ లీగ్ పోటీలు హోరాహోరీగా, ఉత్కంఠభరిత వాతావరణంలో జరుగుతున్నాయి. బుధవారం మ్యాచ్‌లను దారం శ్రీనివాస్‌రెడ్డి బ్యాటింగ్ చేసి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఉద్యోగులందరూ మానసికోల్లాసానికి క్రీడాపోటీల్లో ఉల్లాసంగా పాల్గొంటున్నారన్నారు. క్రేజీ గేమ్ క్రికెట్ అని, క్రికెట్‌లో రాణించిన క్రీడాకారులు స్టార్లుగా ఎదుగుతారన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రికెట్‌లో రాణిస్తున్న క్రీడాకారులు ఈ టోర్నమెంట్ ద్వారా వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని, ఇలాంటి టోర్నమెంట్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెద్దఎత్తున సీజన్ లీగ్ పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కరీంనగర్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు యాదగిరి, నిర్వాహకుడు సురేష్ మాట్లాడుతూ.. ఈనెల 20 లోపు లీగ్ దశ పోటీలు ముగుస్తాయని, 21న క్వార్టర్స్, సెమీఫైనల్ పోటీలు జరగనున్నట్లు తెలిపారు. టీఎన్జీవో రాష్ట్ర సహాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, సహాధ్యక్షుడు రాగి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, రూరల్ అధ్యక్షులు మారుపాక రాజేశ్, సుమంత్‌రావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామస్వామి, కాంతయ్య, కృష్ణమోహన్, కరీంనగర్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి పుల్లమల్ల ప్రసాద్, సుల్తానాబాద్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి సిలివేరి మహేందర్, నిర్వాహకులు అమన్, మహర్షి పాల్గొన్నారు.

మురుగు నీటికి దారేది..?

- కొత్తపల్లిలో ప్రధాన రహదారి వెంట డ్రెయినేజీ కష్టాలు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణ పరిధిలోని కొత్తపల్లి–కరీంనగర్ ప్రధాన రహదారి వెంట డ్రెయినేజీ సమస్య నెలకొంది. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. కొత్తపల్లి పట్టణంలోని రెడ్డిరామయ్యపల్లి నుంచి శ్రీసత్యనారాయణస్వామి దేవాలయం వరకు ప్రధాన రహదారి వెంట డ్రెయినేజీ నిర్మించాల్సి ఉంది. అయితే రెడ్డిరామయ్యపల్లి నుంచి వచ్చే మురుగు నీటి మళ్లింపు లేక మురుగు నీరు అక్కడే నిలుస్తోంది. బస్టాండ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు చెరువులోకి వదులుతున్నారు. గాంధీ విగ్రహం నుంచి శ్రీసత్యనారాయణస్వామి దేవాలయం వరకు మళ్లీ డ్రెయినేజీ సమస్య తలెత్తుతోంది. వీటన్నంటికి శాశ్వత ప్రాతిపదికన డ్రెయినేజీ నిర్మించాలని గత ప్రభుత్వంలో రూ.47కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఆ ప్రతిపాదనలు అమలుకు నోచుకోకపోవడంతో సమస్యకు పరిష్కారం దొరికే పరిస్థితులు కనిపించడం లేదు. రోడ్డు విస్తరణ కూడా డ్రెయినేజీ నిర్మాణానికి సమస్యగా మారినట్లు సమాచారం. తొలుత రహదారి విస్తరణ చేపడితే గాని డ్రెయినేజీ చేపట్టే అవకాశాల్లేవని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి రహదారి విస్తరణ పనులతో పాటు డ్రెయినేజీ పనులు చేపడితే బాగుంటుందని పట్టణ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కొత్తపల్లిలో డ్రెయినేజీ వ్యవస్థ లేక నిలిచిన మురుగు నీరు

తొలిదశ సెంట్రల్ లైటింగ్‌కు టెండర్

రేకుర్తి బ్రిడ్జి నుంచి వెలిచాల ఎక్స్ రోడ్ వరకు సుడా నిధులతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టనున్నట్లు అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రకటించారు. అయితే ఎన్నికల నియమావళి అమల్లోకి రావడం.. తద్వారా ప్రభుత్వం మారడంతో దీనిపై సందిగ్ధత నెలకొంది. అయితే ప్రస్తుతం తొలి విడతగా రేకుర్తి బ్రిడ్జి నుంచి కొత్తపల్లిలోని వీరబ్రహ్మేంద్ర స్వామి(శ్రీ సత్యనారాయణ స్వామి) దేవాలయం వరకు రూ.85లక్షలతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు సమాచారం. అయితే కొత్తపల్లి పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేపడితేనే మిగిలిన సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టనున్నట్లు తెలిసింది.

బ్యాంకు నుంచే ఉపాధి చెల్లింపులు

- కూలీల ఖాతాల్లో డబ్బులు జమ

కరీంనగర్‌రూరల్: ఉపాధిహామీ పథకం కూలీలకు ఈనెల నుంచి నేరుగా బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లింపుల ప్రక్రియ ప్రారంభమైంది. గత నెలలో పనులు చేసిన కూలీలకు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయి. ఉపాధి కూలీల జాబ్ కార్డులకు బ్యాంకు ఖాతాలను ఆధార్ లింక్ ప్రక్రియను గత నెలాఖరు వరకు అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. కరీంనగర్ మండలంలో మొత్తం 6వేల ఉపాధిహామీ జాబ్ కార్డులుండగా.. వీరిలో క్రియాశీల కూలీలు 4,353 ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పనుల్లో పారదర్శకత కోసం ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థను ఈ ఏడాది నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. గతేడాది ఫిబ్రవరి నుంచి జాబ్ కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతాలను లింక్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ముందుగా గత సెప్టెంబరు 1 వరకు గడువు విధించినా.. లింకేజీలో నెలకొన్న సాంకేతిక సమస్యలతో మరోసారి డిసెంబరు 31 వరకు గడువు పొడిగించింది. అయితే పలు సాంకేతిక కారణాలతో సుమారు 30 మంది కూలీల వరకు ఆధార్ లింక్ పూర్తి కాలేదు. ఈనెల 7 నుంచి బ్యాంకు ఖాతాల్లో గత నెలకు సంబంధించిన కూలీ డబ్బులు జమయ్యాయి. అయితే కొంతమందికి జమ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఆధార్ లింక్ బ్యాంకు ఖాతా వివరాలు కూలీలకు తెలియకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్ల చుట్టు తిరుగుతున్నారు. అయితే గతంలో ఆధార్ లింక్ సమయంలో కూలీలు ఇచ్చిన పోస్టల్, బ్యాంకు ఖాతాలోనే డబ్బులు జమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. కూలీలందరికీ విడతలవారీగా ఖాతాల్లో డబ్బులు జమయ్యే అవకాశముందని తెలిపారు.



మొగ్దుంపూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వారంలో పూర్తి

సాంకేతిక సమస్యలతో 12 మంది కూలీల బ్యాంకు ఖాతాలు ఆధార్ లింక్ చేయలేదు. స్థానికంగా 20 మంది కూలీలు ఉండకపోవడంతో నమోదు కాలేదు. వారం రోజుల్లో కూలీలందరి బ్యాంకు ఖాతాలను ఆధార్ లింక్ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం.

- శోభారాణి, ఏపీవో, ఉపాధిహామీ పథకం

ఆధ్యాత్మికం

శ్రీరామ పాదుకలతో పాదయాత్ర



పాదుకలతో సర్పంచ్ రమణారెడ్డి తదితరులు

కరీంనగర్‌రూరల్: చెర్లభూత్కూర్‌లో అయోధ్య శ్రీరాముడి పూజిత పాదుకల పాదయాత్ర నిర్వహించారు. శ్రీరాముడి పూజిత పాదుకలను తెలంగాణలో ప్రతిష్ఠించాలని శ్రీరామ మఠం వంశజులు చిలుకూరి శివాలయ ప్రధాన అర్చకులు శ్రీరామ దాసి సురేశ్ ఆత్మరామ్ మహారాజ్ ఈనెల 7న అయోధ్య నుంచి చేపట్టిన పాదయాత్రలో భాగంగా శిష్యుడైన మామిడాల సుమంత్ పాదుకలను తీసుకొచ్చారు. సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి పాదుకలను తలపై పెట్టుకొని పాదయాత్ర చేపట్టగా.. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు శ్రీనివాస్‌శర్మ, ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతి, కిష్టయ్య, రాజ్‌కుమార్, రాజశేఖర్, అనిల్, ఆదిత్య, గోపాల్, రాజగోపాల్, రాములు, నర్సయ్య, సునీత, రాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతర కమిటీ ఎన్నిక

కరీంనగర్‌రూరల్: నగునూరు సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బత్తిని దిలీప్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కన్నమల్ల కోటేశ్వర్, కోశాధికారిగా వెంకన్న ఎన్నికయ్యారు. ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క జాతరను కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పుల శ్రీధర్, ఎంపీటీసీ సభ్యులు అంకమల్ల శ్రీనివాస్, వినయ్‌సాగర్, మాజీ ఎంపీటీసీలు భద్రయ్య, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విక్రంగౌడ్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ కార్యవర్గం ఎన్నిక



రాజశేఖర్



హరీష్

కరీంనగర్: జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్ఆర్‌సీ) నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బత్తుల రాజశేఖర్, ద్యాగతి హరీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య, ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీరాముల రమేశ్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రాజశేఖర్, హరీష్ మాట్లాడుతూ.. పేద ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు వినియోగించుకునేలా కృషి చేస్తామని అన్నారు. తమ నియామకానికి సహకరించిన మొగుళ్ల భద్రయ్య, శ్రీరాముల రమేశ్, సుధాకర్, పృథ్వీ, స్వరూపకు కృతజ్ఞతలు తెలిపారు.

బల్దియా కమిషనర్ సోదరికి పీహెచ్‌డీ

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ సోదరి శ్రీదేవి పీహెచ్‌డీ పొందింది. మానవాళికి సవాల్‌గా మారిన డయాబెటిక్ సమస్యను మొక్కలతో నయం చేసే విధానంపై అధ్యయనం చేసింది. హైదరాబాద్ జేఎన్‌టీయూ ఈ పీహెచ్‌డీని ప్రకటించగా, ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్ చేతులమీదుగా శ్రీదేవి డాక్టరేట్ అందుకున్నారు. శ్రీదేవి ప్రస్తుతం తీగలరాంరెడ్డి ఫార్మసీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.



ఇస్రో చైర్మన్ చేతులమీదుగా పీహెచ్‌డీ అందుకుంటున్న శ్రీదేవి

చరిత్రాత్మకంగా చైతన్యమూర్తి

ఆకాశమంతటి వ్యక్తిత్వంతో దేశ గతిని మార్చిన బాబా సాహెబ్ అంబేడ్కర్: ఏపీ సీఎం జగన్

పెత్తందారీ భావాలపై తిరుగుబాటుకు స్ఫూర్తినిచ్చేలా 'సామాజిక న్యాయ మహా శిల్పం'
అంబరాన్ని తాకేలా విజయవాడలో 206 అడుగులతో అతి పెద్ద విగ్రహం
19న స్వరాజ్య మైదానంలో విగ్రహావిష్కరణకు అంతా స్వచ్ఛందంగా తరలి రావాలని ఏపీ సీఎం సందేశం

దేశానికే తలమానికం



- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: విజయవాడలో మనందరి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాశిల్పం రాష్ట్రానికే కాదు.. దేశానికే తలమానికం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. చరిత్రను తిరగరాసేలా మరెందరికో వందల ఏళ్ల పాటు 'స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్' స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ నెల 19వతేదీన విజయవాడలో బాబా సాహెబ్ అంబేడ్కర్ మహా శిల్పం విగ్రహావిష్కరణకు అందరూ స్వచ్ఛందంగా తరలి రావాలని కోరుతూ సీఎం జగన్ బుధవారం ట్వీట్ చేశారు.

సాక్షి, అమరావతి: అంబరాన్ని తాకేలా విజయవాడలో మనం ఏర్పాటు చేసుకుంటున్న రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోవటమే కాకుండా శతాబ్దాల పాటు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అది 'స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్' (సామాజిక న్యాయ మహా శిల్పం) అని అభివర్ణించారు. మన సమాజ గతిని సమతా భావాల వైపు మరల్చటానికి, సంఘ సంస్కరణలకు, పెత్తందారీ భావాలపై తిరుగుబాటుకు, రాజ్యాధికారంలో పేదల స్థానాన్ని సుస్థిరం చేసేందుకు ఆ మహా శిల్పం నిరంతరం స్ఫూర్తి ఇస్తుందని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. విజయవాడలోని చారిత్రక స్వరాజ్య మైదానంలో ఈ నెల 19వ తేదీన ఆవిష్కరించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అతి పెద్దదన్నారు. అంబేడ్కర్ మహా శిల్పాన్ని ఆవిష్కరించనున్న సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ బుధవారం రాష్ట్ర ప్రజలకు ఈమేరకు సందేశం ఇచ్చారు. 'అది 81 అడుగుల వేదికపై ఏర్పాటు చేసిన 125 అడుగుల మహా శిల్పం. అంటే.. 206 అడుగుల ఎత్తైన విగ్రహం. ఆ మహానుభావుడి ఆకాశమంతటి వ్యక్తిత్వం, దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, మహిళా చరిత్రను మార్చేలా దాదాపు 100 ఏళ్ల క్రితమే ఆయన వ్యక్తం చేసిన భావాలు కలకాలం మన దేశాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఆయన భావాల పట్ల అచంచల విశ్వాసంతో, బాధ్యతతో వాటిని మన నవరత్నాల్లో అనుసరిస్తున్న ప్రభుత్వంగా ఏర్పాటు చేసిన ఈ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా 19వ తేదీన అందరూ స్వచ్ఛందంగా తరలి రావాలని కోరుతున్నా' అని తన సందేశంలో సీఎం జగన్ పేర్కొన్నారు.

నిరంతరం కాపాడే మహాశక్తి

- ఆయన.. అణగారిన వర్గాలకు చదువులు చేరువ చేసిన మహనీయుడు!
- అంటరానితనం, ఆధిపత్య భావజాలంపై తిరుగుబాటు చేసిన మహానుభావుడు!
- సమ సమాజ భావాలకు నిలువెత్తు రూపం!
- రాజ్యాంగం, రాజ్యాంగ హక్కుల ద్వారా నిరంతరం మనల్ని కాపాడే ఓ మహాశక్తి!
- ప్రతి వాడలో ఉన్న ఆయన విగ్రహం అణగారిన వర్గాలకు నిరంతరం ధైర్యాన్ని, అండని ప్రసాదించే ఓ మహా స్ఫూర్తి!
- దళితులతో పాటు కులాలు, మతాలకు అతీతంగా పేదలందరి జీవితాల్లో ఈ 77 ఏళ్లలో వచ్చిన అనేక మార్పులకు మూలం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ భావాలే!

బెజవాడ నడిబొడ్డున.. 'సోషల్ జస్టిస్ స్ఫూర్తికుడు'



సాక్షి, అమరావతి: బెజవాడ పేరు చెబితే అందరికీ గుర్తొచ్చేది కొండపై కొలువైన దుర్గమ్మ. అదే బెజవాడకు మరో ప్రత్యేక మణిహారంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కరుడు నిలవనున్నారు. నగరం నడిబొడ్డున గొప్ప చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకున్న స్వరాజ్ మైదానంలో రూపుదిద్దుకున్న బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం, స్మృతివనం దేశంలోనే ప్రత్యేక గుర్తింపును తీసుకురానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నత సంకల్పంతో నిర్మించిన 'సామాజిక న్యాయ మహా శిల్పం' దర్శనీయ ప్రాంతంగా మారనుంది. విజయవాడలో నిర్మించింది అంబేడ్కర్ స్మృతివనం మాత్రమే కాదు.. భావితరాలకు అంబేడ్కర్ ఆదర్శాలు, ఆలోచనలను అందించే గొప్ప ప్రయత్నం కూడా. దానికి సంబంధించిన మరికొన్ని విశేషాలు..

- స్వరాజ్ మైదానంలో 81 అడుగుల పెడస్టల్‌పై 125 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటుతో మొత్తం 206 అడుగుల ఎత్తు వస్తుంది. ఇది దేశంలోనే అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహంగా రికార్డు సృష్టించింది.
- కాంస్య విగ్రహాన్ని ఢిల్లీలో తయారు చేయించారు. దాన్ని భాగాలుగా విజయవాడకు తరలించి స్మృతివనంలో క్రమ పద్ధతిలో అతికించి అద్భుతంగా తీర్చిదిద్దారు. విగ్రహం తయారీలో షూ దగ్గర్నుంచి బెల్ట్ వరకు హనుమాన్ జంక్షన్ వద్ద శిల్పి ప్రసాద్ ఆధ్వర్యంలో కాస్టింగ్ చేశారు.
- ఢిల్లీ నుంచి వచ్చిన డిజైనర్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ తుది దశ పనులు చేస్తున్నారు.
- అంబేడ్కర్ విగ్రహం బేస్(పెడస్టల్)లో గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లున్నాయి.
- గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు హాళ్లుండగా.. ఒక్కోటి నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటాయి. అందులో ఒకటి సినిమా హాలు, మిగిలిన మూడు హాళ్లలో ఆయన చరిత్రను తెలిపే డిజిటల్ మ్యూజియం ఉంటుంది.
- మొదటి అంతస్తు(ఫస్ట్ ఫ్లోర్)లో 2,250 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన నాలుగు హాళ్లుంటాయి. ఒక హాల్లో.. అంబేడ్కర్‌కు దక్షిణ భారత దేశంతో ఉన్న అనుబంధాన్ని చిత్రాల ద్వారా డిస్‌ప్లే చేస్తారు.
- రెండో అంతస్తు(సెకండ్ ఫ్లోర్) వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు హాళ్లుంటాయి.
- అంబేడ్కర్ స్మృతివనంలో విగ్రహం ఉన్న ప్రాంతానికి ఒక వైపు నుంచి వెళ్లి.. మరో వైపు నుంచి తిరిగి వచ్చేలా విశాలమైన హాలు మాదిరిగా నిర్మాణాలను పూర్తి చేశారు. వాటి గోడలకు అంబేడ్కర్ జీవిత విశేషాలు, ఆయన చరిత్రకు సంబంధించిన ఘట్టాలను ప్రతిబింబించేలా శిల్పాలను అద్దారు.
- లోపలి భాగంలోని హాళ్లలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అంబేడ్కర్ పాల్గొన్న సమావేశాలు, సభలకు సంబంధించిన పాత చిత్రాలను భారీ చిత్రాలుగా డిజిటలైజ్ చేసి డిస్‌ప్లే చేశారు. ఆయన రాసిన కీలకమైన లేఖలు, ఉపన్యాసాలను ఆయా ఘట్టాలకు అనుగుణంగా ఫొటోలతో పాటు డిస్‌ప్లే చేశారు.
- అంబేడ్కర్ ఆశయాలు, ఆదర్శాలు, సందేశాలను సైతం క్లుప్తంగా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో డిజిటల్ బోర్డులపై డిస్‌ప్లే చేశారు. 'చదువు.. సమీకరించు.. బోధించు' వంటి ప్రధానమైన సందేశాలను ప్రముఖంగా ఏర్పాటు చేశారు.
- స్మృతివనం ఆవరణను పచ్చని తివాచీ పరిచినట్టు గరిక, మొక్కలతో అందంగా తీర్చిదిద్దారు. అంబేడ్కర్ విగ్రహానికి ముందు ఏర్పాటు చేసిన నెమళ్ల ప్రతిరూపాలు ఆకట్టుకుంటున్నాయి.
- మ్యూజిక్‌కు అనుగుణంగా ప్రవహించే వాటర్ ఫౌంటెయిన్‌లను ఏర్పాటు చేశారు. పెడస్టల్ చుట్టూ ఉన్న ప్రాంతంలో వాటర్ కొలను మాదిరిగా ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేశారు. ఇంకా మరెన్నో ప్రత్యేకతలు అంబేడ్కర్ స్మృతివనంలో దర్శనం ఇవ్వనున్నాయి

ఇంకా సెట్ కాలేదు!

మొదటి పేజీ తరువాయి

ఎంసెట్ సహా ఇతర ప్రవేశ పరీక్షలు కూడా ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోందని విద్యావేత్తలు చెప్తున్నారు.

హడావుడిగా జరిగితే ఇబ్బందులే..

సాధారణంగా ఉమ్మడి ప్రవేశపరీక్షల ప్రక్రియ ఏటా నవంబర్ నుంచే మొదలవుతుంది. వర్సిటీల వీసీలతో ఉన్నత విద్యా మండలి సమావేశం ఏర్పాటు చేసి.. సెట్స్‌కు కన్వీనర్లను ఎంపిక చేయాలి. వారు ప్రశ్నపత్రాల తయారీపై దృష్టి పెడతారు. ప్రశ్నల రూపకల్పనకు సంబంధించి నిపుణులను పిలిపిస్తారు. కంప్యూటర్ బేస్డ్‌గా దాదాపు పది రకాల ప్రశ్నపత్రాలను రూపొందిస్తారు. ఇందులో కఠినమైనవి, తేలికైనవి అత్యంత గోప్యంగా తయారు చేయాలి. తర్వాత వాటన్నింటినీ కలిపి కంప్యూటర్ సాయంతో ఫైనల్ పేపర్‌ను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తారు. తర్వాత పరీక్ష కేంద్రాల ఎంపిక, ప్రశ్నపత్రాల సగటు పరిశీలన ఉంటాయి. పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, ర్యాంకుల క్రోడీకరణకు ఎక్కువ సమయం పడుతుంది. పలు దఫాలుగా వీసీలు, ప్రొఫెసర్లు సమావేశాలు జరుపుతూ ఉంటే.. ఇవన్నీ సాఫీగా సాగుతాయి. ఈసారి ఇప్పటికీ విద్యా మండలి సమావేశమే జరగలేదు. ఆలస్యంగా ప్రక్రియ మొదలుపెట్టి హడావుడిగా చేస్తే.. ఎక్కడైనా లోపం జరిగితే.. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విద్యార్థుల సన్నద్ధతకూ ఇబ్బంది

ఎంసెట్ ఆలస్యం వల్ల విద్యార్థుల సన్నద్ధతకు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు ఇబ్బంది రావొచ్చని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంసెట్ రాసే విద్యార్థుల్లో చాలా వరకు జేఈఈ మెయిన్స్‌కు కూడా సిద్ధమవుతారు. మెయిన్స్ రెండో దశ ఏప్రిల్‌లో జరుగుతుంది. అది పూర్తయ్యాక మేలో ఎంసెట్ రాస్తుంటారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎంసెట్ కోసం ప్రత్యేక కోచింగ్ తీసుకుంటారు. ఎంసెట్ ఆలస్యమైతే ఇబ్బందులు వస్తాయని, కోచింగ్ కేంద్రాల వారు అదనపు ఫీజులు వసూలు చేస్తారని విద్యార్థులు వాపోతున్నారు. ఎన్ఐటీల్లో సీట్ల కౌన్సెలింగ్ నాటికి ఎంసెట్ కౌన్సెలింగ్ మొదలవకపోతే.. కోరుకున్న కాలేజీలో సీట్లు వస్తాయా? రావా? అన్న ఆందోళన కూడా ఉంటుందని పేర్కొంటున్నారు.

ఉన్నత విద్యా మండలిలో గందరగోళం!

రాష్ట్రంలో ఉమ్మడి ప్రవేశపరీక్షలకు సంబంధించి డిసెంబర్‌లోనే యూనివర్సిటీల వీసీలతో ఉన్నత విద్యా మండలి అధికారులు సమావేశం కావాలని నిర్ణయించారు. తేదీ కూడా ఖరారు చేశారు. సెట్ కన్వీనర్ల ఎంపికకూ రంగం సిద్ధమైంది. ఈలోగా కొత్త ప్రభుత్వం మండలి చైర్మన్‌తోపాటు, వైస్ చైర్మన్‌ను తొలగిస్తున్నట్టు ప్రకటించడంతో.. వీసీలతో సమావేశం వాయిదా పడింది. అయితే ప్రభుత్వం కొత్తవారిని నియమించలేదు. తొలగిస్తున్నట్టు ప్రకటించిన చైర్మన్, వైస్ చైర్మన్ ఇంకా అదే స్థానాల్లో కొనసాగుతున్నారు. ఉన్నత విద్యకు సంబంధించి సీఎం సమీక్షల్లో సరైన సమాచారం ఇవ్వడానికి మండలిలో ఎవరూ లేకపోవడంతో.. వారిని కొనసాగిస్తున్నట్టు ఉన్నతాధికారులు చెప్తున్నారు. వీరినే తిరిగి నియమించే అవకాశం ఉందనీ అంటున్నారు.

సమావేశాలకు వీసీల విముఖత

ఉన్నత విద్యా మండలి చైర్మన్, వైస్ చైర్మన్లను తొలగించిన నేపథ్యంలో.. అధికారికంగా సమావేశాలు నిర్వహించేందుకు వీలుకావడం లేదని మండలి వర్గాలు చెప్తున్నాయి. దీనికి తోడు ఉమ్మడి ప్రవేశపరీక్షలపై చర్చించేందుకు వెళ్లడానికి వర్సిటీల వీసీలూ సుముఖత వ్యక్తం చేయడం లేదని అంటున్నాయి. సెట్స్ కోసం కన్వీనర్లను సూచించాలని మండలి నుంచి లేఖలు వచ్చినా.. యూనివర్సిటీల వీసీలు నిర్లిప్తంగా ఉంటున్నారు. ''ముందు చైర్మన్, వైస్ చైర్మన్లను కొనసాగిస్తారా? కొత్తవారిని తెస్తారా? అనే దానిపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు మేం సెట్స్ కన్వీనర్ల పేర్లు ఇచ్చినా.. కొత్త చైర్మన్ వస్తే మార్పులు ఉంటాయి..'' అని ఓ వర్సిటీ వీసీ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆదరణ పెరుగుతున్నా..!

కొన్నేళ్లుగా ఎంసెట్ రాసే వారి సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రస్థాయిలో సీట్లు ఎక్కువగా ఉండటం, ఉపాధి కోసం, విదేశాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లడానికి అవకాశం ఉండటంతో చాలా మంది ఇంజనీరింగ్‌లో చేరుతున్నారు. 2018లో 2.20 లక్షల మంది ఎంసెట్ రాస్తే.. 2023 నాటికి ఈ సంఖ్య 3 లక్షలు దాటింది. పరీక్ష రాసేవారి సంఖ్య ఏటా 20శాతం దాకా పెరుగుతోంది. నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి కూడా ఎంసెట్ (మెడికల్ అండ్ అగ్రికల్చర్) తప్పనిసరి చేయడంతోనూ అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

ఎంసెట్‌కు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య ఇదీ..

ఏడాది	ఇంజనీరింగ్	అగ్రికల్చర్
2018	1,47,912	73,078
2019	1,42,218	74,981
2020	1,43,326	78,981
2021	1,64,963	86,641
2022	1,61,552	88,156
2023	1,95,275	1,06,514

'కొయ్యబొమ్మ'కు కొత్త ఆశ

- అమ్మకాలు పెంచే దిశగా అధికారులు
- ఆన్‌లైన్‌లో విక్రయాలపై కసరత్తు
- ఇప్పటికే పొనికివనం పెంపకం
- క్రమేపీ తగ్గుతున్న కళాకారులు
- పట్టించుకోవాలని వేడుకోలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న కొయ్యబొమ్మలు

నిర్మల్: ప్రపంచ ప్రసిద్ధి చెందిన నిర్మల్ కొయ్యబొమ్మలకు ఇప్పటికీ మంచి గుర్తింపు ఉంది. కానీ.. సరైన మార్కెటింగ్ సౌకర్యం లేక అరుదైన కళ కనుమరుగయ్యే దిశగా వెళ్తోంది. దాదాపు 450 ఏళ్లుగా పదుల సంఖ్యలో నకాషీ కుటుంబాలు ఈ కళను నమ్ముకునే బతుకుతున్నాయి. ఒకప్పుడు అన్ని కుటుంబాలూ కొయ్యబొమ్మలపైనే ఆధారపడేవి. కాలక్రమంలో పాలకుల పట్టింపులేక ఈ కళకు ఆదరణ తగ్గడం, కొయ్యబొమ్మ తయారయ్యే 'పొనికి' చెట్లు తగ్గిపోవడంతో పని తగ్గిపోతూ వచ్చింది. ఈక్రమంలో కొన్నికుటుంబాలే ఈ కళను కొనసాగిస్తున్నాయి. మిగతా నకాషీలంతా వివిధ ఉపాధి, ఉద్యోగాలు వెతుక్కుంటూ జీవనం సాగిస్తున్నారు. సరిపడా కర్ర, సరైన ప్రచారం, మార్కెటింగ్ సదుపాయం లేక కొయ్యబొమ్మకు శాపంగా మారింది. ఇక ఆశలు కోల్పోతున్న కొయ్యబొమ్మకు ఇప్పుడిప్పుడే కొత్తఆశలు చిగురిస్తున్నాయి. గతేడాది డీఆర్డీవో విజయలక్ష్మి ప్రత్యేక చొరవతో పొనికివనం ప్రారంభించారు. తాజాగా కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ ఆన్‌లైన్‌లో కొయ్యబొమ్మల విక్రయాలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో కొయ్యబొమ్మకు ఆదరణ పెరగడంతో పాటు దానిపై ఆధారపడ్డ కళాకారులకూ ఆసరాగా నిలువనుంది.

పట్టించుకునేవారు లేక..

'మా చేతులతో చేసుకున్న బొమ్మలు పెట్టే అన్నం తప్పా.. ఇప్పటిదాకా ప్రత్యేకంగా రూపాయి అందడం లేదు..' అన్న కళాకారుల మాటలే ప్రస్తుత పరిస్థితికి నిదర్శనం. నిమ్మనాయుడి కాలంలో నకాషీల చేతుల్లో పురుడుపోసుకున్న కొయ్యబొమ్మలు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా నిర్మల్ కీర్తిని తీసుకెళ్తున్నాయి. కళాకారులంతా కలిసి 1955లో కొయ్యబొమ్మల పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేసుకున్నారు. కొయ్యబొమ్మను నమ్ముకుని అప్పట్లో వందల కుటుంబాలుండేవి. ఇప్పుడు సుమారు 50 కుటుంబాలు మాత్రమే బొమ్మలు తయారు చేస్తున్నాయి. నేటితరమంతా వివిధ రంగాల్లో ఉపాధి, ఉద్యోగాలు చూసుకున్నారు. ఇప్పుడు పనిచేస్తున్న కళాకారులంతా 25–30ఏళ్ల నుంచి వృత్తిని కొనసాగిస్తున్నవారే. వారికి కనీసం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక ప్రోత్సాహం, పింఛన్ లభించడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మించిన షెడ్డు మాత్రమే ఉంది.

'పొనికి' లేకపోవడంతో..

కొయ్యబొమ్మకు పొనికి కర్రే ముడిపదార్థం. మృదువుగా ఉండే పొనికిచెట్టు కర్రతోనే ఈ బొమ్మలు చేస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ అడవుల్లో పొనికి చెట్లు విపరీతంగా ఉండేవి. అడవులతో పాటు పొనికి చెట్లు కూడా తగ్గిపోయాయి. కర్ర కొరత ఏర్పడటంతో బొమ్మలు చేసేవాళ్లకు చేతినిండా పని ఉండటం లేదు. గతేడాది అప్పటి కలెక్టర్‌గా ఉన్న వరుణ్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకుని సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ తండా సమీపంలో పొనికి వనాన్ని ప్రారంభించారు.

ఆదరణతో పాటు..

కొయ్యబొమ్మల తయారీ కళ కొనసాగాలంటే కళాకారులనూ ప్రభుత్వం కనీసం ఆదరించాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా బొమ్మల తయారీకి కావాల్సినంత పొనికి కర్ర లభించేలా చూడాలని వారు కోరుతున్నారు. ప్రతీ కళాకారుడి కుటుంబ ఆరోగ్యభద్రతకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందేలా హెల్త్‌కార్డులివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సబ్సిడీ కింద రుణాలిప్పించాలని, కళాకారులకు ప్రత్యేకంగా పింఛన్ ఇవ్వాలని, ప్రతీ కళాకారుడి కుటుంబానికి డబుల్‌బెడ్రూం ఇల్లు ఇవ్వాలని కోరుతున్నారు. కళను మెరుగుపర్చేలా ఆరునెలలకోసారి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని ఏళ్లుగా కోరుతూనే ఉన్నారు.

పూర్వవైభవం తెచ్చేందుకు..

కొయ్యబొమ్మలకు పూర్వవైభవం తీసుకురావడానికి గత కలెక్టర్ వరుణ్‌రెడ్డి కొంత ప్రయత్నం ప్రారంభించారు. అంతలోనే బదిలీ అయ్యారు. ఇక జిల్లాకు రెండునెలల క్రితం కొత్త కలెక్టర్‌గా వచ్చిన ఆశిష్‌సంగ్వాన్ కూడా కొయ్యబొమ్మలకు ఆదరణ పెంచే దిశగా ప్రయత్నం ప్రారంభించడం హర్షణీయం. పొనికి వనాలు పెంచడంతో పాటు ప్రధానంగా కొయ్యబొమ్మల విక్రయాలూ పెంచాలని, ఇందుకు ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు చేపట్టాలని కలెక్టర్ నిర్ణయించారు. ఈమేరకు కనుమ పండుగ రోజైన మంగళవారం డీఎఫ్‌వో, డీఆర్డీవో తదితర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. పొనికివనాల పెంపకాన్ని అటవీశాఖ చూసుకోవాలని, ఆన్‌లైన్‌లో వచ్చిన ఆర్డర్లకు సంబంధించి కొయ్యబొమ్మల ప్యాకింగ్ మహిళాసంఘాల ద్వారా చేపట్టేలా చూడాలని డీఆర్డీవో, ఈడీఎంలను ఆదేశించారు. ఇప్పటికైనా కొయ్యబొమ్మలకు సరైన ప్రోత్సాహం అందుతుందన్న ఆశాభావాన్ని కళాకారులు వ్యక్తంచేస్తున్నారు.

40ఏళ్ల నుంచి కళలోనే..



దాదాపు 40ఏళ్లుగా కొయ్యబొమ్మల కళలోనే ఉన్నా. మా తాతముత్తాతల నుంచి ఇదే ఉపాధి. పొనికి కర్ర కొరతతో చాలామందికి పనిలేకుండా పోతోంది. సంఘం ఖాళీగా కనిపిస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రోత్సాహం అందించి కళను కాపాడాలని కోరుతున్నాం.
– రాచర్ల కిషన్, నకాషీ కళాకారుడు

ప్రోత్సాహం ఉంటేనే..



ప్రస్తుత కళాకారులంతా 30–40ఏళ్ల నుంచి చేస్తున్నవారే. కొత్తగా ఎవరూ ఇటువైపు రావడం లేదు. ఇలాగే ఉంటే కొన్నేళ్లలోనే కళ కనుమరుగవుతుందేమోనన్న ఆందోళన ఉంది. ప్రస్తుత జిల్లా అధికారులు కొయ్యబొమ్మలపై దృష్టిపెట్టడం హర్షణీయం. ఇప్పటికైనా మళ్లీ నిర్మల్ కళకు పూర్వవైభవం వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నాం. – శంకర్, కొయ్యబొమ్మల పారిశ్రామిక సంఘం మేనేజర్

సాలెవాడకు 'మెస్రం' ప్రచార రథం

ఇంద్రవెల్లి: నాగోబా జాతరకు సంబంధించిన ప్రచార రథాన్ని మెస్రం వంశీయులు ఈనెల 14న కేస్లాపూర్‌లో ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈమేరకు యాత్ర బుధవారం ఇంద్రవెల్లి మండలం గిన్నెర నుంచి ఉట్నూర్ మండలం సాలెవాడ గ్రామానికి చేరుకుంది. అక్కడి నుంచి ఈ నెల 18న పొల్లుగూడ, 19న వడగామ్ గ్రామాల మీదుగా 20న కేస్లాపూర్‌లోని మడావి వంశీయుల ఇళ్లకు చేరనుంది. అలాగే 21న పవిత్ర గంగాజల యాత్ర ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు.

సాలెవాడ గ్రామానికి బయల్దేరిన ప్రచార రథం



నాణ్యమైన విద్యుత్ అందించాలి

- ఎన్‌పీడీసీఎల్ ఎండీ వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎన్‌పీడీసీఎల్ ఎండీ వరుణ్‌రెడ్డి

జగిత్యాలజోన్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించి, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఎన్‌పీడీసీఎల్ ఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. జగిత్యాల కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి, సంస్థకు నష్టం రాకుండా చూడాలన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను వీలైనంత త్వరగా తీర్చాలని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్ యాప్ ద్వారా చెల్లించేలా క్షేత్రస్థాయి సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లు అధికంగా కాలిపోతున్నందున వాటికి అవసరమైన లైటనింగ్ అరెస్టలు, ఎర్తింగ్, ఏబీ స్విచ్‌లు, స్పేసర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏఈలు, ఏడీఈలు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, కొత్త కనెక్షన్లు మంజూరు చేయాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కొందరు ఉద్యోగులను హెచ్చరించారు. సమావేశంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారి సత్యనారాయణ, విద్యుత్ ఆపరేషన్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, ఐపీసీ డైరెక్టర్ గణపతి, కమర్షియల్ డైరెక్టర్ సంధ్యారాణి, ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, జిల్లాలోని డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కొండగట్టుకు రాములోరి పాదుకలు

- కొంతదూరం మోసిన ఎంపీ సంజయ్



శ్రీరాముని పాదుకలు మోస్తున్న ఎంపీ సంజయ్

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు గిరి ప్రదక్షిణ రూపకర్త సురేశ్ ఆత్మారామ్ మహరాజ్ బృందం కొన్ని రోజుల క్రితం అయోధ్య రామాలయాన్ని సందర్శించింది. ఈ నెల 6న రాములోరి పాదుకలతో కొండగట్టుకు పాదయాత్ర ప్రారంభించారు. సుమారు 1,000 కిలోమీటర్ల మేర పూర్తి చేసుకొని, బుధవారం కొండగట్టు దిగువ ఆంజనేయ స్వామి విగ్రహం వద్దకు చేరుకున్నారు. వారిని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కలిసి, రాములోరి పాదుకలను తలపై పెట్టుకొని, కొంతదూరం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోధ్య రామాలయ నిర్మాణం ఏ ఒక్క రాజకీయ పార్టీకీ సంబంధించిన అంశం కాదని, ప్రపంచంలోని ప్రతీ హిందువుకు సంబంధించిన అతి ముఖ్యమైన ఘట్టమని పేర్కొన్నారు. పాదయాత్ర బృందంలో కొడిమ్యాల మండలంలోని పూడూర్‌కు చెందిన ముస్లిం వ్యక్తి యూసఫ్ కూడా ఉన్నాడు. కార్యక్రమంలో నాయకులు నేరెళ్ల శ్రవణ్, గాజుల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'వేద పరిపాలన'

ధర్మపురి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో లోక కల్యాణార్థం నిర్వహించనున్న వేద పరిపాలన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయంలోని శేషప్ప కళావేదిక వద్ద గురువారం నుంచి ఈ నెల 24 వరకు హైదరాబాద్‌కు చెందిన 21 మంది వేద పండితుల ఆధ్వర్యంలో ప్రేమిక వరద వేద పరిపాలన సభ నిర్వహించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ల సూచనల మేరకు వేదపారాయణం, సప్తాహ్నిక దీక్షగా వేద హవనం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాస్ తెలిపారు. ధర్మపురి పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, రేనవేషన్ కమిటీ సభ్యులు, అర్చకులు, వేదపండితుల సహకారంతో విజయవంతం చేస్తామన్నారు.

కల్లు దుకాణం సమీపంలో ఇద్దరు యువకుల మృతి

- మృతిపై కుటుంబసభ్యుల అనుమానాలు
- కల్తీకల్లు కారణమని బంధువుల ఆరోపణ



నవీన్ మృతదేహం



రమేశ్ మృతదేహం



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

గోదావరిఖని(రామగుండం): మేషన్ పనిచేస్తున్న ఇద్దరు కల్లు కోసం వెళ్లి మృత్యు ఒడికి చేరారు. కారణాలు ఏమైనా.. అడ్డగుంటపల్లి కల్లు దుకాణానికి కొద్దిదూరం వరకు నడుచుకుంటూ వెళ్లి అకస్మాత్తుగా కిందపడి విగతజీవులుగా మారారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవించే మామిడి రమేశ్ (50), నాంపల్లి నవీన్(23) బుధవారం నడుచుకుంటూ వెళ్తూ కిందపడి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆస్పత్రికి తరలించినా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మామిడి రమేశ్ స్థానిక ఎన్టీఆర్‌నగర్‌లో నివాసముంటుండగా, నాంపల్లి నవీన్ కాగజ్‌నగర్ సమీప గన్నారం గ్రామానికి చెందిన వ్యక్తి. మేషన్ పనికోసం ఇక్కడకు వచ్చి అడ్డగుంటపల్లిలో నివాసముంటున్నాడు. బుధవారం అడ్డగుంటపల్లి సమీపంలో మేషన్ పనిచేసిన అనంతరం కల్లు తాగేందుకు ఇద్దరూ తెల్లకల్లు దుకాణానికి వెళ్లారు. దానికి కొద్ది దూరంలో నడుచుకుంటూ వస్తూనే కిందపడి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆస్పత్రికి తరలించినా.. అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు ప్రకటించారు. అయితే పోస్టుమార్టం రిపోర్టు వస్తే తప్ప వాస్తవాలు చెప్పలేమని పోలీసులు తెలిపారు. మరోవైపు.. తెల్లకల్లు తాగడంతోనే మృతి చెందాడని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య కేసు నమోదు చేసుకున్నారు. రమేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నవీన్‌కు అవివాహితుడు. కూలీ పనికోసం వెళ్లి ఇద్దరు చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.





కాఫీ విత్ అజిత



మనలో చాలా మందికి కొన్ని ఇష్టమైన ఆసక్తులు ఉంటాయి. వాటిని వ్యాపకంగా మార్చుకుంటారు కొందరు. వ్యాపారంగా కూడా మార్చుకోవచ్చు అని నిరూపించి చూపుతున్నారు హైదరాబాద్ వాసి అజిత చల్లా. నిద్రలేస్తూనే ఫిల్టర్ కాఫీ రుచిని ఆస్వాదించకుండా ఆ రోజు గడవదనే అజిత దేశీ విదేశీ కాఫీ రుచులను కరఫా పేరుతో నగరవాసులకు పరిచయం చేస్తున్నారు. కాఫీ ఫ్లేవర్స్ గురించి మాట్లాడుతూ ఉంటే ఎనిమిదేళ్ల తన కాఫీ జర్నీని ఇలా ఆనందంగా మన ముందుంచారు.

‘‘మా ఇంట్లో నా చిన్నప్పటి నుంచి ఉదయం లేస్తూనే ఒక దృశ్యాన్ని చూస్తూ, నేనూ ఆస్వాదిస్తూ పెరిగాను. అదే, ఉదయాన్నే ఫిల్టర్ కాఫీతో రోజును మొదలుపెట్టడం. రాత్రి నిద్రపోయేటప్పుడు కాఫీ ఇచ్చినా కాదనను. అలాంటి ఇష్టం ఏ ఊరు వెళ్లినా నా రోజువారీ ప్లాన్‌లో సరైన కాఫీ కోసం అన్వేషణ సాగుతూనే ఉండేది.

కుటుంబం నేర్పిన పాఠం

నేను పుట్టి పెరిగింది విజయవాడ. ఇంజినీరింగ్ పూర్తిచేశాను. ఉద్యోగినిగా కన్నా బిజినెస్ ఉమన్‌గా నన్ను నేను ప్రూవ్ చేసుకోవాలని ఉండేది. మా నాన్న కన్‌స్ట్రక్షన్ బిజినెస్‌లో ఉన్నారు. నాకు అది సూట్ కాదనిపించింది. పెళ్లయ్యాక హైదరాబాద్ రావడం, మా అత్తింటి వారు ఇన్‌స్టంట్ కాఫీ ఎక్స్‌పోర్ట్



బిజినెస్‌లో ఉండటంతో నా ఆసక్తికి కొంచెం ఊతం వచ్చి ఉంటుంది. కాకపోతే ఎనిమిదేళ్ల క్రితం వరకు ఆ విషయం నాకు స్ఫురణకు రాలేదు. ఎక్కడకు వెళ్లినా కాఫీ గురించి వెతుక్కోవడం. కాఫీ రుచి గురించి మా వాళ్లతో మాట్లాడటం తరచూ జరుగుతుండేది. టూర్స్‌కి విదేశాలకు వెళ్లినా అక్కడ కూడా వివిధ రకాల కాఫీలు టేస్ట్ చేసే నా అలవాటను మానేదాన్ని కాదు. ఓ రెండేళ్ల క్రితం స్వయంగా ఏదైనా వ్యాపారం చేయాలనే ఆలోచన చేస్తున్నప్పుడు నా చేతిలో ఉన్న కాఫీ కప్పు నాకు సమాధానంలా అనిపించింది.

నేనెప్పుడూ ఫిల్టర్ కాఫీనే తాగేదాన్ని. పాలు, బెల్లం, డికాషన్ కలిపి చేసే ఆ కాఫీ నాకు చాలా ఇష్టమైనది. కానీ, మరొకరు ఇంకో రుచికరమైన కాఫీ కోసం అన్వేషించవచ్చు. మనకు తెలిసి కాఫీ అంటే చిరుచేదుగా ఉంటుందని చాలామంది మైండ్‌లో ఉంటుంది. కానీ, ఆ మాత్రం చేదు కూడా లేకుండా కాఫీని పరిచయం చేయచ్చు అని చాలా ప్రయోగాలు చేశాను. కాంబినేషన్స్ మారుతున్నకొద్దీ కాఫీ రుచి ఎలా మారుతుందో తెలుసుకుంటూ వచ్చాను. ఏది బెస్ట్ అని ఒక్క మాటలో చెప్పలేం. రోస్ట్ చేయడం, గ్రైండ్ చేసే విధానాన్ని బట్టి రుచిలో మార్పు వస్తుంటుంది. బ్లాక్ కాఫీలోనే పదుల సంఖ్యలో వెరైటీలు ఉన్నాయి. వాటిలో ఆరింటిని మేం పరిచయం చేస్తున్నాం. మరో పది దేశ విదేశీ కాఫీలు టేస్ట్ చేయచ్చు.



ప్రాజెక్ట్ వర్క్


కాఫీ ఆలోచనను మా కుటుంబ సభ్యుల ముందుంచినప్పుడు వారి నుంచి సపోర్ట్ రావడంతో నేననుకున్న కల నా ముందుకు వచ్చింది. వ్యాపారం ఆలోచన వచ్చాక రెండేళ్లుగా చాలా కసరత్తులు చేశాను. కాఫీ గింజలు ఎక్కడెక్కడి నుంచి తెప్పించాలి, వాటిని ఏ పద్ధతిలో రోస్ట్ చేయాలి, కాఫీకి అనుబంధంగా ఎలాంటి ఫుడ్ ఉంటే బాగుంటుంది, మిషనరీ ఏంటి... ఇలా ఒక పెద్ద ప్రాజెక్ట్ వర్క్ ప్రిపరేషన్ మొదలుపెట్టాను. ఆ ప్రయత్నానికి ఫ్రెంచ్ కాఫీ అండ్ టీ కెటిల్ పేరు ‘కరఫా’ అనేది ఫైనల్ అయ్యింది.



ప్రత్యేకంగా..

మొదట ఇండియన్, వియత్నాం కాఫీ రుచులతో ప్రారంభించి, ఆ తర్వాత నుంచి భిన్న రుచులతో కొత్తదనాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. కెనడియన్, కొలంబియన్, ఇథోపియన్, ఇండియన్.. దేనికదే ప్రత్యేకత. మెక్సికన్లు





దాల్చినచెక్క వేసుకొని కాఫీ తాగుతారు. ఇథోపియన్లు కాఫీతో పాటు పాప్ కార్న్ తీసుకుంటారు. వాళ్లలాగే మనమూ చేస్తే నచ్చకపోవచ్చు. కానీ, వాటి మీద ప్రయోగాలు చేస్తూ మనవారి టేస్ట్‌కు తగ్గట్టు ఇక్కడి కాఫీ ప్రియులకు నచ్చినట్టు పరిచయం చేయడానికి నిత్యం ప్రయత్నిస్తూనే ఉంటాం. అలాగే, వియత్నాంతో పాటు ఇంకొన్ని దేశాల్లో కాఫీ తోటలు వాటంతటవే పెరుగుతాయి. మన దగ్గర ఒక నిర్మాణాత్మకంగా పెంచుతారు. అక్కడి వాతావరణ పరిస్థితుల్లో పెరిగిన కాఫీ గింజలకి, ఇక్కడికి తేడా ఉంటుంది. అందుకే, ఈ కాఫీ టేస్ట్ మాత్రమే బాగుంటుందని చెప్పలేం. అన్నీ టేస్ట్ చేయాల్సిందే.

కాఫీతో పాటు...

ఫుడ్ కూడా ఉంటుంది. కాఫీ సేవిస్తూ తినడానికి ఇష్టపడే ఐటమ్స్ ఏమేం ఉంటాయో వాటన్నింటినీ పరిచయం చేస్తున్నాం. కొందరికి బ్రేక్‌ఫాస్ట్‌తోనూ, లంచ్ టైమ్ మీల్స్‌తోనూ కాఫీ తాగే అలవాటు ఉంటుంది. దానిని కూడా ఇక్కడ అదే మెనూగా అందిస్తున్నాం. ప్రతి ఆలోచనా కాఫీతో పాటు కాఫీ చుట్టూతానే ఉంటుంది. ఇదంతా బ్యాలెన్స్‌డ్‌గా ఉండేలా చూసుకుంటున్నాం. ఈ రోజు వాతావరణం చల్లగా ఉంటే ఒక రకమైన కాఫీ తాగాలనిపిస్తుంది. మరుసటి రోజు ఎండగా ఉంటే ఇంకోరకం కాఫీ తాగాలని ఉంటుంది. ఎవరు రెగ్యులర్‌గా తాగే కాఫీ వాళ్లకు బాగా నచ్చుతుంది. మిగతా వాళ్లకు ఆ ఫ్లేవర్ నచ్చకపోవచ్చు. అలాగే, ఎప్పటికప్పుడు డిఫరెంట్ టేస్ట్ ట్రై చేయాలనే ఆసక్తి గలవారుంటారు. అందుకే, భిన్న రకాల రుచులతో కాఫీలను పరిచయం చేస్తూ నేనూ ఈ కాఫీ ప్రపంచంలో మమేకం అవుతున్నాను’ అని వివరించారు అజిత.

– నిర్మలారెడ్డి



బ్యూటిప్స్

టొమాటో ఫేషియల్

పార్లర్‌లో ఫేషియల్‌తో పనిలేకుండా, ఖరీదైన క్రీములు కొనకుండా ముఖం చక్కగా మెరవాలంటే ఇంట్లోనే టొమాటో ఫేషియల్‌ను ప్రయత్నించండి. పెళ్లికూతురులా మెరిసిపోతారు.

- టొమాటోను గుండ్రని ముక్కలుగా కోయాలి. ఒక ముక్కను తీసుకుని పైన టీస్పూను పంచదార, టీస్పూను కాఫీ పొడి వేసి ఐదు నిమిషాలపాటు ముఖంపైన రుద్దాలి. తరువాత చేతులతో మర్దన చేసి కడిగేయాలి.
- ఇప్పుడు మరో టొమాటో ముక్కపై టీస్పూను అలో వెరా జెల్ వేసి ఐదు నిమిషాలపాటు మర్దన చేయాలి. ఈ మర్దన అయిన వెంటనే మరో టొమాటో ముక్కపై రెండు టీస్పూన్ల పసుపు వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి.
- పసుపు పూర్తిగా ఆరాక నీటితో కడిగేసి, తడిలేకుండా తుడిచి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఈ టొమాటో ఫేషియల్‌లోని ప్రతి స్టెప్‌ను జాగ్రత్తగా అనుసరిస్తే ముఖం కాంతిమంతంగా మెరిసిపోతుంది.



- అరటిపండు గుజ్జులో కొద్దిగా కొబ్బరినూనె కలిపి ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తరువాత మర్దన చేసి నీటితో కడిగేయాలి. ఇది మంచి క్లెన్సర్‌లా పని చేయడమేగాక, చర్మానికి తేమనందిస్తుంది.



- పూరీలు, పకోడీలు వేయించే నూనెలో చిటికెడు ఉప్పు వేస్తే సరి... పూరీలు, పకోడీలు పెద్దగా నూనె పీల్చవు.



- కప్పు నీటిలో రెండు టేబుల్ స్పూన్ల తేనె వేసి కలపాలి. ఈ నీటిలో యాపిల్ ముక్కలు నానబెడితే రంగు మారకుండా ఎక్కువ గంటల పాటు తాజాగా ఉంటాయి.

ఇంటిప్స్



గ్లాసు పుల్లటి మజ్జిగలో ఐదు గ్లాసులు నీళ్ల పోసి కలపాలి. ఈ నీటిని స్ప్రే బాటిల్‌లో పోసి మొక్కలపై చల్లాలి. ఉదయం సాయంత్రం ఒకసారి ఈ నీటిని మొక్కలపై పిచికారీ చేయడం వల్ల చీడపీడలు పోయి మొక్కలు చక్కగా ఆరోగ్యంగా పెరుగుతాయి.



బఠాణితొక్క కూడానూ..

పచ్చిబఠాణి మనకు ఎంత మేలు చేస్తుందో తెలిసిందే. అయితే బఠాణి గింజలు ఒలిచిన తర్వాత తొక్కలను పారేస్తుంటాము. కానీ ఈ తొక్కలు మొక్కలకు చక్కని పోషకాలను అందిస్తాయి. అందుకే బఠాణీ తొక్కలను మిక్సీజార్‌లో వేసి పేస్టు చేయాలి. ఈ పేస్టులో కాసిన్ని నీళ్ల పోసి వడగట్టాలి. ఈ నీటిని గార్డెన్ లోని మొక్కలకు పోయాలి. ఈ నీరు మొక్కలకు మంచి బలవర్థకంగా పనిచేసి అవి చక్కగా పెరిగేందుకు దోహద పడుతుంది.

మల్టీ టాలెంట్

మల్టీ టాలెంట్ అంటే మాటలు కాదు. ఎంచుకున్న రంగాల్లో సమాన ప్రతిభ చాటాలి. తేడా జరిగితే అన్నిట్లో ‘జీరో’ తప్ప ఏమీ మిగలదు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, రైటర్, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌గా తన ప్రతిభను చాటుకున్న ఆరతి కదవ్ గురించి....

చిన్నప్పటి నుంచి ఆరతికి ఫాంటసీ జానర్ అంటే ఇష్టం. ‘పంచతంత్ర’ ‘మహాభారత’ కథల పుస్తకాలు చదువుతున్నప్పుడు వాటికి తన ఊహాలోకంలో తనదైన ఫాంటసీ జోడించేది. ఆ తరువాత సైన్స్–ఫిక్షన్ తన ఆసక్తిగా మారింది. ‘ఈ జీవితానికి అర్థం ఏమిటి? పుట్టడం, గిట్టడమేనా ఇంకేదైనా పరమావధి ఉందా?’ ఇలాంటి ప్రశ్నలతో చావుపుట్టుకల గురించి ఎన్నో కోణాలలో ఆలోచించేది. మరణానంతర జీవితం గురించి కథలు రాసేది.

సాఫ్ట్‌వేర్ టు సైన్స్–ఫిక్షన్ డైరెక్టర్



ఆరతి కదవ్

సైన్స్–ఫిక్షన్ ఫిల్మ్‌మేకర్‌గా ఆరతి గుర్తింపు తెచ్చుకోవడానికి ఈ ఊహలే పునాదిగా ఉపయోగపడ్డాయి. డైరెక్టర్‌గా తనకు ఎంతో పేరు తెచ్చిన ఫిలసాఫికల్ సైన్స్ ఫిక్షన్, బ్లాక్‌కామెడీ ఫిల్మ్ ‘కార్గో’కు ముందు రోబోలను దృష్టిలో పెట్టుకొని ‘టైమ్ మెషిన్’ అనే షార్ట్ ఫిల్మ్ తీసింది ఆరతి. ఈ చిన్న చిత్రం తనకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. మన పురాణాలలో నుంచి ఊహాజనితమైన కథలతో హాలీవుడ్ స్థాయిలో సినిమాలు తీయాలనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకునేలా చేసింది.,

మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఆరతి కదవ్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేసింది. సాంకేతిక విషయాలకు తప్ప కాల్పనిక ఊహలకు బుర్రలో కాసింత చోటు దొరకనంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా ‘ఫాంటసీ’ కోసం కొంత స్థలం రిజర్వ్ చేసుకునేది. కొంతకాలం తరువాత ఉద్యోగాన్ని వదిలి ఫిల్మ్ డైరెక్షన్ కోర్సులో చేరింది.

కాల్పనిక విషయాల మీద ఆసక్తి ఆరతిని సైన్స్‌కు దూరం చేయలేదు. సందర్భాన్ని బట్టి శాస్త్రీయ విషయాలపై రచనలు చేస్తుంటుంది. చిత్రరంగంలో కృత్రిమ మేధ(ఏఐ)కి సంబంధించి ‘విల్ ఏఐ మీన్ ది డెత్ ఆఫ్ క్రియేటివిటీ’ పేరుతో రాసిన వ్యాసానికి మంచి స్పందన వచ్చింది.

రచయిత్రిగా కలం పట్టినప్పుడు తనలోని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బయటకు వచ్చి ‘రిసెర్చ్’ చేయమంటూ సలహా ఇస్తుంది. దీంతో ఊహలకు విరామం ఇచ్చి తాను ఏ సబ్జెక్ట్ గురించి అయితే రాస్తుందో ఆ సబ్జెక్ట్‌కు సంబంధించిన వ్యక్తులతో మాట్లాడి సాధికారమైన సమాచారాన్ని పోగు చేస్తుంది. దీని ఆధారంగా మళ్లీ రచన చేస్తుంది. డైరెక్టర్‌గా ఉన్నప్పుడు తనలోని రచయిత్రి బయటకు వచ్చి సీన్–డైలాగ్‌లను ఇంకా ఎలా మెరుగుపెట్టవచ్చో సలహా ఇస్తుంది. ఇక ప్రొడ్యూసర్‌గా ఉన్నప్పుడు బడ్జెట్‌ను సమర్థవంతంగా వాడుకోవాలనే విషయంలో సలహాలు ఇవ్వడానికి తనలోని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, రైటర్, డైరెక్టర్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ‘కార్గో’ సినిమా అయిదుగురు నిర్మాతలలో ఆరతి ఒకరు. ‘నేర్చుకున్న విద్య ఏదీ వృథా పోదు’ అని చెప్పడానికి ఆరతి బహుముఖ ప్రజ్ఞ సాక్ష్యంగా నిలుస్తుంది.

స్ఫూర్తి

మీనా – రీనా



ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ అరుణాచల్ సిస్టర్స్ మాయాజాలం చేశారు. కొండల్ని మాయం చేశారా? బండలలో రాగాలు పలికించారా? అలాంటిదేమీ లేదు. లైబ్రరీ ముఖం ఎప్పుడూ చూడని వారిని కూడా రోజు తప్పకుండా లైబ్రరీకి వచ్చేలా చేశారు. బొమ్మల పుస్తకాలు మాత్రమే చదివే వాళ్లను దినపత్రికల నుంచి సామాజిక, సాంకేతిక పుస్తకాలు చదివేలా చేశారు. పుస్తకాలు చదివితే ఎంత శక్తి వస్తుందో స్వయంగా తెలుసుకునేలా చేశారు అరుణాచల్ సిస్టర్స్ ఎన్గురంగ్ మీనా, రీనా. ఎన్గురంగ్ లెర్నింగ్ ఇనిస్టిట్యూట్(ఎన్ఎల్ఐ)తో మారుమూల ప్రాంతాలలో విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నారు. జీవననైపుణ్యాలను పెంపొందిస్తున్నారు...

దారి చూపుతున్న రోడ్డు సైడ్ లైబ్రరీలు

ఫేస్‌బుక్‌లోని ఒక పోస్ట్ మీనాను బాగా ఆకట్టుకుంది. మిజోరంలోని రోడ్డుసైడ్ లైబ్రరీలకు సంబంధించిన పోస్ట్ అది. తన గ్రామంలోనూ అలాంటి లైబ్రరీ ఒకటి ఏర్పాటు చేయాలని సోదరి రీనాతో మాట్లాడింది. రీనాకు కూడా ఈ రోడ్డు సైడ్ లైబ్రరీ కాన్సెప్ట్ బాగా నచ్చింది. అయితే అది అంత సులువైన విషయం కాదని మెల్లగా అర్థమైంది. మిజోరంతో పోల్చితే అరుణాచల్‌ప్రదేశ్ అక్షరాస్యతలో వెనుకబడి ఉంది. నాణ్యమైన విద్యను అందించడంలో అత్యల్ప పనితీరు ప్రదర్శించిన రాష్ట్రంగా కూడా పేరు ఉంది. ఈ నేపథ్యంలో మీనా, రీనాలు మాట్లాడుకొని తుది నిర్ణయానికి వచ్చారు.

‘ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మన ప్రాజెక్ట్ రోడ్డు ఎక్కాల్సిందే’

తమ ఊళ్లో ప్రారంభించిన రోడ్డు సైడ్ లైబ్రరీ వివిధ జిల్లాలకు విస్తరించడానికి మూడు సంవత్సరాలు పట్టింది. మూడు సంవత్సరాలు ఒక విషయం మీద దృష్టి పెట్టడానికి చాలా ఓపిక కావాలి. ఆ ఓపికను ఎప్పుడూ మీనా, రీనా సిస్టర్స్ కోల్పోలేదు. మొదట్లో ఈ లైబ్రరీల వైపు ఎవరూ కన్నెత్తి చూసేవారు కాదు. ఇవి కాలేజీ విద్యార్థులు ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ కావడానికి ఉద్దేశించినవి అనే భావన ఉండేది.

‘ఇవి అందరి కోసం’ అనే వాస్తవం తెలిశాక ఒక్కొక్కరు రావడం మొదలు పెట్టారు. చదువుకున్న వాళ్ల నుంచి అక్షరాలు కూడబలుక్కొని చదివే వారి వరకు ఈ లైబ్రరీ దగ్గర కూర్చుని పత్రికలు తిరగేయడమో, కథల పుస్తకం చదవడమో చేసేవారు. ఈ ఓపెన్ షెల్ఫ్ లైబ్రరీలకు వచ్చే వాళ్లలో పదేళ్ల వయసు నుంచి అరవై దాటిన వాళ్లు కూడా ఉండేవారు. మరిన్ని ప్రాంతాలలో మరిన్ని లైబ్రరీలు ఏర్పాటు చేయడానికి సోషల్ మీడియా వేదికగా విరాళాలు అడిగినప్పుడు దాతల నుంచి మంచి స్పందన వచ్చింది.

మొదట్లో ప్రకృతి వైపరీత్యాల వల్ల ఈ లైబ్రరీలు దెబ్బతినేవి. పుస్తకాలు దొంగతనానికి గురయ్యేవి. ఆ తరువాత మాత్రం ప్రజలే వీటిని సొంతం చేసుకున్నారు. పుస్తకాలు దొంగతనానికి గురికాకుండా చూడడం నుంచి దెబ్బతిన్న లైబ్రరీలను పునర్నిర్మించడం వరకు ప్రజలు బాధ్యత తీసుకున్నారు. ఈ ఉత్సాహంలో ప్రధాన పట్టణాలలోనే కాదు మారుమూల పల్లెలోనూ ఇలాంటి లైబ్రరీలు ఏర్పాటు చేయాలని మీనా, రీనాలు నిర్ణయించుకున్నారు.



‘నిజాయితీగా కష్టపడితే తప్పకుండా మనం చేసే పని సఫలం అవుతుందని చెప్పడానికి ఈ రోడ్‌సైడ్ లైబ్రరీలు ఒక ఉదాహరణ. ఇక్కడికి వచ్చేవారు కొత్తపుస్తకాలు అడుగుతున్నప్పుడల్లా మా ఉత్సాహం రెట్టింపు అవుతుంది. మా పనికి స్నేహితులు, సామాజిక సేవకులు, రచయితలు, ఉద్యమ కార్యకర్తలు ఎంతోమంది సహకారం అందించారు. మా కృషిని ఐక్యరాజ్య సమితి గుర్తించింది. ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్‌లో మా ప్రయత్నాలను ప్రశంసించారు’ అంటుంది మీనా.

మీనా ఒక స్కూల్లో టీచర్‌గా పనిచేస్తోంది.

నిజానికి ఆమె చదివిన చదువుకు పెద్ద ఉద్యోగాలు రావడం కష్టం కాదు. విదేశాల్లో కూడా ఉద్యోగం చేసే అవకాశాలు వచ్చాయి. అయితే తనకు పిల్లల మధ్య గడపడం ఇష్టం. టీచర్‌గా పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించడంలో విజయం సాధించింది మీనా. మొదట్లో పిల్లలను ఆకట్టుకోడానికి ‘ఈ పుస్తకం చదివి సారాంశం చెబితే గిఫ్ట్ ఇస్తాను’ అని చెప్పేది. అయితే ఏ ఒక్క విద్యార్థికీ గిఫ్ట్ రాకుండా ఉండలేదు. అంటే... ప్రతి ఒక్కరూ బుక్ చదివి అందులోని విషయాన్ని చెప్పేవారు. ఆ తరువాత మాత్రం గిఫ్ట్‌లతో పనిలేకుండానే పుస్తకాలు విరివిగా చదవడం మొదలుపెట్టారు.

ఒకప్పుడు గిఫ్ట్ గురించి ఆరా తీసేవారు.

ఇప్పుడు ‘కొత్త పుస్తకం ఏది ఇస్తారు?’ అని అడుగుతున్నారు!

తమ కుటుంబంలో పెద్ద చదువు చదువుకున్న తొలి వ్యక్తి మీనా. తనకు చదువుపై ఆసక్తి పెరగడానికి కారణం పుస్తకాలు. మొదట్లో బొమ్మల పుస్తకాలు. ఆ తరువాత పాఠ్యపుస్తకాలు. అయితే తాను చదువుకునే రోజుల్లో పుస్తకాలు చదవాలనే ఆశ తప్ప లైబ్రరీలు ఉండేవి కావు.

మీనా, రీనా తల్లిదండ్రులు చదువుకోలేదు. ఇల్లు ఎప్పుడూ పేదరికం, అశాంతితో ఉండేది. ఢిల్లీ, బెంగళూరులో ఉన్నత చదువులు చదువుకున్న మీనా, రీనాలు తమ గతాన్ని మరిచిపోలేదు. ఒకప్పుడు తమ కుటుంబాన్ని పోలిన కుటుంబాలు అరుణాచల్‌ప్రదేశ్‌లో ఎన్నో ఉన్నాయి. వారిని జాగృతం చేసి చదువు ద్వారా ముందుకు తీసుకు వెళ్లడాన్ని ముఖ్యలక్ష్యంగా చేసుకొని ప్రయాణం చేస్తున్నారు. ఎన్గురంగు లెర్నింగ్ ఇనిస్టిట్యూట్(ఎన్ఎల్ఐ) ఎంతోమంది నిరాక్షరాస్యుల జీవితాలలో అక్షర దీపాలు వెలిగించింది. జీవన నైపుణ్యాలు పెంపొందించింది.

గొప్ప విజయాలు సాధించేలా...

పఠనం అనేది టైమ్‌పాస్ కోసం కాదు. ఈ అభిరుచి జీవితాన్నే మార్చేస్తుంది. గొప్ప విజయాలు సాధించేలా చేస్తుంది. మనం ఒక పుస్తకం చదువుతున్నాం అంటే మరో ప్రపంచంలో ఉన్నట్లు. మనలో నిద్రాణంగా ఉన్న అనేక శక్తులు మేల్కొంటాయి. ప్రపంచంలో ఎన్నో రంగాలలో విజయం సాధించిన వారికి కాస్త టైమ్ దొరకడం కూడా కష్టం. ఇలాంటి పరిస్థితుల్లోనూ ‘ఈ నెలలో నేను తప్పకుండా చదవాల్సిన బుక్స్’ అని ఒక జాబితాను సిద్ధం చేసుకుంటారు. దీన్నిబట్టి పుస్తకానికి వారు ఇచ్చే విలువ ఏమిటో అర్థమవుతుంది.

– మీనా



'పారిస్' బెర్త్ లక్ష్యంగా... నేడు జర్మనీతో భారత మహిళల హాకీ జట్టు సెమీఫైనల్

మరో మ్యాచ్ కోసం ఎదురు చూడకుండా... పటిష్టమైన జర్మనీపై గెలిచి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలనే లక్ష్యంతో భారత మహిళల హాకీ జట్టు ఉంది. రాంచీలో జరుగుతున్న ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా ఈరోజు జర్మనీతో భారత్; అమెరికాతో జపాన్ తలపడనున్నాయి. సెమీఫైనల్లో గెలిచి ఫైనల్ చేరిన రెండు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్లో ఓడిన జట్ల మధ్య మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌లో నెగ్గిన జట్టుకు మాత్రమే చివరిదైన మూడో బెర్త్ ఖరారవుతుంది. దాంతో భారత్‌తోపాటు మిగతా మూడు జట్లు కూడా సెమీఫైనల్లో గెలవాలని పట్టుదలతో ఉన్నాయి. 2006 నుంచి జర్మనీతో ఏడుసార్లు తలపడ్డ భారత్ ఐదుసార్లు ఓడిపోయి, కేవలం రెండుసార్లు మాత్రమే గెలిచింది. ఈ నేపథ్యంలో జర్మనీపై గెలవాలంటే భారత్ సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. రాత్రి గం. 7:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

రోహిత్ సూపర్... భారత్ 'డబుల్ సూపర్'...

- టి20 సిరీస్‌కు ఉత్కంఠభరిత ముగింపు
- రెండు సూపర్ ఓవర్ల తర్వాత తేలిన ఫలితం
- విజయంతో ముగించిన టీమిండియా
- అఫ్గానిస్తాన్‌పై 3-0తో సిరీస్ సొంతం
- రోహిత్ ఐదో టి20 సెంచరీ

ఏమా ఉత్కంఠ... ఏమిటా మలుపులు... ఒక టి20 సమరం అభిమానులందరినీ కట్టిపడేసింది. ఒక ద్వైపాక్షిక సిరీస్‌లో, అదీ అఫ్గానిస్తాన్‌తో పోరు ఏకపక్షం అనుకుంటే నరాలు తెగే పరిస్థితి వచ్చింది. 212 పరుగులు చేశాక భారత్ గెలుపు ఖాయమనిపించి నిశ్చింతగా ఉండగా... అఫ్గానిస్తాన్ మేమేమీ తక్కువ కాదన్నట్లుగా స్కోరు సమం చేసేసింది. 'సూపర్ ఓవర్'లో ఫలితం తేలుతుందనుకుంటే అక్కడా ఇరు జట్లూ సమమే. చివరకు అంతా రెండో సూపర్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది... ఇక్కడ చివరకు పైచేయి సాధించిన టీమిండియా గట్టెక్కింది. తుది ఫలితంతో గెలుపు భారత్‌దే అయినా ఆఖరి వరకు అఫ్గాన్ చూపిన పోరాటపటిమ అసమానం.


రోహిత్

బెంగళూరు: టి20 ప్రపంచకప్‌కు ముందు తాము ఆడిన ఆఖరి సిరీస్‌ను భారత్ ఘనంగా ముగించింది. అఫ్గానిస్తాన్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల పోరును టీమిండియా 3-0తో సొంతం చేసుకుంది. చిన్నస్వామి స్టేడియంలో బుధవారం జరిగిన చివరి టి20లో భారత్ రెండో 'సూపర్ ఓవర్'లో విజయం సాధించింది. తొలి సూపర్ ఓవర్ ఓవర్లో ఇరు జట్లు 16 పరుగులతో సమంగా నిలిచాయి. రెండో సూపర్ ఓవర్‌లో ముందుగా భారత్ 11 పరుగులు చేయగా... అఫ్గాన్ 1 పరుగుకే 2 వికెట్లు కోల్పోయింది. నిబంధనల ప్రకారం 'సూపర్ ఓవర్'లో రెండు వికెట్లు పడితే ఇన్నింగ్స్ ముగిసినట్టే కావడంతో భారత విజయం ఖరారైంది.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ శర్మ (69 బంతుల్లో 121 నాటౌట్; 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) అంతర్జాతీయ టి20ల్లో ఐదో సెంచరీతో చెలరేగగా... రింకూ సింగ్ (39 బంతుల్లో 69 నాటౌట్; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) మరో మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 95 బంతుల్లోనే అభేద్యంగా 190 పరుగులు జోడించారు. అనంతరం అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 212 పరుగులు సాధించింది. గుల్బదిన్ (23 బంతుల్లో 55 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), గుర్బాజ్ (32 బంతుల్లో 50; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇబ్రహీమ్ జద్రాన్ (41 బంతుల్లో 50; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు.


రింకూ సింగ్

శతక భాగస్వామ్యం...

ఫరీద్ వేసిన మూడో బంతిని భారీ షాట్ ఆడబోయి వెనుదిరిగిన యశస్వి... కోహ్లి తొలి బంతికి డకౌట్... అంతా నిశ్శబ్దం... ఫామ్‌లో ఉన్న శివమ్ దూబే కూడా కీపర్‌కు క్యాచ్ ఇవ్వగా, తర్వాతి ఓవర్లో తన తొలి బంతికే సామ్సన్ కూడా సున్నాకే అవుట్! ఐదో ఓవర్ మూడో బంతి ముగిసేసరికి టీమిండియా స్కోరు 21/4... అయితే రోహిత్, రింకూ భాగస్వామ్యం జట్టుకు భారీ స్కోరు అందించింది. 15 ఓవర్లు ముగిసేసరికి 109/4తో స్కోరు మరీ గొప్పగా ఏమీ లేదు. అయితే చివరి ఐదు ఓవర్లలో 22, 13, 10, 22, 36 స్కోర్లతో భారత్ ఏకంగా 103 పరుగులు సాధించింది. 6 ఫోర్లు, 5 సిక్సర్లతో రోహిత్ వీర విధ్వంసం ప్రదర్శించగా... 1 సిక్స్, 4 ఫోర్లతో రింకూ చెలరేగిపోయాడు. 64 బంతుల్లోనే శతకం అందుకొని అంతర్జాతీయ టి20ల్లో ఐదో సెంచరీ సాధించిన తొలి ఆటగాడిగా రోహిత్ నిలవగా... రింకూ ఖాతాలో రెండో అర్ధ సెంచరీ చేరింది. వీరిద్దరి దెబ్బకు అఫ్గాన్ కుదేలైంది. రోహిత్ తన శైలికి భిన్నంగా ఈసారి కొన్ని వైవిధ్యమైన షాట్లతో అలరించడం విశేషం. కరీమ్ వేసిన చివరి ఓవర్లో తొలి మూడు బంతుల్లో రోహిత్ 4, 6 (నోబాల్), 6 కొట్టగా... చివరి మూడు బంతుల్లో రింకూ 6, 6, 6 బాదాడు. అనంతరం అఫ్గాన్ ఓపెనర్లు గుర్బాజ్, ఇబ్రహీమ్ 66 బంతుల్లోనే 93 పరుగులు జోడించి తమ జట్టుకు శుభారంభం అందించారు. వీరు వెనుదిరగడంతో పరిస్థితి మారిపోయింది. ఆ తర్వాత గుల్బదిన్, నబీ (16 బంతుల్లో 34; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) కలిసి జట్టుకు విజయానికి చేరువగా తెచ్చారు. విజయం కోసం చివరి ఓవర్లో 19 పరుగులు అవసరం కాగా, అఫ్గాన్ 18 పరుగులు చేయడంతో స్కోరు సమమైంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) నబీ (బి) ఫరీద్ 4; రోహిత్ (నాటౌట్) 121; కోహ్లి (సి) ఇబ్రహీమ్ (బి) ఫరీద్ 0; దూబే (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 1; సామ్సన్ (సి) నబీ (బి) ఫరీద్ 0; రింకూ (నాటౌట్) 69; ఎక్స్‌ట్రాలు 17; మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 212. వికెట్ల పతనం: 1-18, 2-18, 3-21, 4-22. బౌలింగ్: ఫరీద్ 4-0-20-3, అజ్మతుల్లా 4-0-33-1, ఖైస్ 4-0-28-0, సలీమ్ 3-0-43-0, షరాఫుద్దీన్ 2-0-25-0, కరీమ్ 3-0-54-0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) సుందర్ (బి) కుల్దీప్ 50; ఇబ్రహీమ్ (స్టంప్డ్) సామ్సన్ (బి) సుందర్ 50; గుల్బదిన్ (నాటౌట్) 55; అజ్మతుల్లా (సి) రవి బిష్ణోయ్ (బి) సుందర్ 0; నబీ (సి) అవేశ్ (బి) సుందర్ 34; కరీమ్ (రనౌట్) 2; నజీబుల్లా (సి) కోహ్లి (బి) అవేశ్ 5; షరాఫుద్దీన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 212. వికెట్ల పతనం: 1-93, 2-107, 3-107, 4-163, 5-167, 6-182. బౌలింగ్: ముకేశ్ 4-0-44-0, అవేశ్ 4-0-55-1, బిష్ణోయ్ 4-0-38-0, సుందర్ 3-0-18-3, దూబే 2-0-25-0, కుల్దీప్ 3-0-31-1.

సూపర్ ఓవర్లలో ఇలా...

ముకేశ్ వేసిన తొలి సూపర్ ఓవర్లో అఫ్గానిస్తాన్ 1 సిక్స్, 1 ఫోర్‌తో 16 పరుగులు చేసింది. ఛేదన లో రోహిత్ 2 సిక్స్‌లు కొట్టినా చివరకు భారత్ కూడా 16 పరుగులకే పరిమితమైంది. అవసరమైతే చివరి బంతికి వేగంగా పరుగు తీయాల్సి వస్తుందనే ఆలోచనతో రోహిత్ ఐదో బంతి తర్వాత రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగి రింకూను పంపించాడు. అయితే ఆఖరి బంతికి యశస్వి 2 పరుగులు రాబట్టలేకపోయాడు. ఫరీద్ వేసిన రెండో సూపర్ ఓవర్లో రోహిత్ 4, 6తో భారత్ 11 పరుగులు చేసింది. అయితే బిష్ణోయ్ వేసిన ఈ ఓవర్ తొలి 3 బంతుల్లోనే అఫ్గాన్ 2 వికెట్లు కోల్పోవడంతో భారత్ గెలుపు ఖాయమైంది.

రిలీఫ్..!

'ఏంటి వీరూ... లెగ్‌బై ఇచ్చావా, బ్యాట్‌కు అంత బలంగా బంతి తగిలింది... అసలే ఇక్కడ రెండు సున్నాలు ఉన్నాయి'... తను ఆడిన తొలి బంతి లెగ్‌సైడ్ దిశగా ఆడి బౌండరీని తాకగా, అంపైర్ లెగ్‌బై ఇవ్వడంతో అంపైర్ వీరేందర్ శర్మతో రోహిత్ అన్న మాట ఇది! అతని దృష్టిలో ఆ పరుగులు ఎంత విలువైనవో ఇది చెబుతుంది. నిజంగానే టి20ల్లో చాలా కాలంగా రోహిత్ ఫామ్ బాగా లేదు. వన్డేల్లో అద్భుతంగా ఆడుతున్నా 2022 నుంచి అంతర్జాతీయ టి20ల్లో ఈ మ్యాచ్‌కు ముందు 31 ఇన్నింగ్స్‌లలో అతను 3 అర్ధ సెంచరీలే చేశాడు. ఐపీఎల్‌లో కూడా అంతంతమాత్రంగానే ఆడాడు. ఇటీవలి పరిణామాలు సహజంగానే అతడిని ఇబ్బంది పెట్టాయి. ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ పోవడంతో పాటు టీమిండియా కెప్టెన్సీపై కూడా సందేహాలు వచ్చాయి. అసలు వచ్చే టి20 వరల్డ్ కప్‌లో అతను ఆడతాడా అన్నట్లుగా కూడా చర్చ సాగింది. దానికి తోడు తొలి రెండు మ్యాచ్‌లలో డకౌట్. ఇలాంటి స్థితిలో ఈ ఇన్నింగ్స్ అతని స్థాయిని చూపించింది. అఫ్గాన్ మరీ బలమైన ప్రత్యర్థి కాకపోయినా... ఇక్కడా విఫలమైతే పరిస్థితి ఇంకా జటిలంగా మారేంది. ఈ నేపథ్యంలో సరైన లెక్కలతో చేసిన సెంచరీ రోహిత్‌కు ఊరటనిచ్చిందనడంలో సందేహం లేదు.

ప్రజ్ఞానంద అద్భుతం

- ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్‌పై 62 ఎత్తుల్లో విజయం
- ఆనంద్‌ను దాటేసి భారత నంబర్‌వన్‌గా తమిళనాడు టీనేజ్ గ్రాండ్‌మాస్టర్


ప్రజ్ఞానంద


డింగ్ లిరెన్

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): గత ఏడాది గొప్పగా రాణించిన భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద కొత్త సంవత్సరంలోనూ తన జోరు కొనసాగిస్తున్నాడు. ప్రతిష్టాత్మక టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీలో 18 ఏళ్ల ప్రజ్ఞానంద నాలుగో రౌండ్ గేమ్‌లో సంచలనం సృష్టించాడు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ డింగ్ లిరెన్ (చైనా)పై ప్రజ్ఞానంద గెలుపొందాడు. తమిళనాడుకు చెందిన ప్రజ్ఞానంద ఈ గేమ్‌లో నల్ల పావులతో ఆడుతూ 62 ఎత్తుల్లో డింగ్ లిరెన్‌ను ఓడించాడు. తాజా ఫలితంతో ప్రజ్ఞానంద లైవ్ రేటింగ్స్‌లో 2748.3 పాయింట్లకు చేరుకున్నాడు. దాంతో 2748 పాయింట్లతో భారత నంబర్‌వన్‌గా కొనసాగుతున్న దిగ్గజ ప్లేయర్ విశ్వనాథన్ ఆనంద్‌ను రెండో స్థానానికి పంపించి భారత కొత్త నంబర్‌వన్‌గా ప్రజ్ఞానంద అవతరించాడు. అంతేకాకుండా విశ్వనాథన్ ఆనంద్ తర్వాత క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్‌ను ఓడించిన రెండో భారతీయ ప్లేయర్‌గానూ ప్రజ్ఞానంద ఘనత సాధించాడు. వాస్తవానికి ప్రతి నెలాఖరుకు అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) వరల్డ్ రేటింగ్స్‌ను విడుదల చేస్తుంది. టోర్నీ జరుగుతున్న సమయంలో లైవ్ రేటింగ్స్ మార్పులు ఉంటాయి. ప్రస్తుత టాటా స్టీల్ టోర్నీలోని తదుపరి రౌండ్‌లలో ప్రజ్ఞానంద తడబడితే మళ్లీ ఆనంద్ నంబర్‌వన్ అయ్యే అవకాశాలున్నాయి. 14 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య 13 రౌండ్లపాటు టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీని నిర్వహిస్తున్నారు. నాలుగో రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద 2.5 పాయింట్లతో మరో ముగ్గురితో కలిసి ఉమ్మడిగా మూడో స్థానంలో ఉన్నాడు. భారత్‌కే చెందిన విదిత్ 2 పాయింట్లతో ఏడో ర్యాంక్‌లో, గుకేశ్ 1.5 పాయింట్లతో పదో ర్యాంక్‌లో ఉన్నారు. గత ఏడాది జనవరిలోనే జరిగిన టాటా స్టీల్ చెస్ టోర్నీలో డింగ్ లిరెన్‌పై ప్రజ్ఞానంద గెలిచాడు. ఆ తర్వాత ఏప్రిల్‌లో ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో రష్యా గ్రాండ్‌మాస్టర్ నెపోమ్‌నిషిని ఓడించి డింగ్ లిరెన్ కొత్త ప్రపంచ చాంపియన్‌గా అవతరించాడు.

'అర్జున' అందుకున్న ఇషా



సాక్షి, న్యూఢిల్లీ: భారత మహిళా షూటింగ్ రైజింగ్ స్టార్, తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ 2023 సంవత్సరానికిగాను జాతీయ క్రీడా పురస్కారం 'అర్జున అవార్డు'ను బుధవారం అందుకుంది. కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ ఈ అవార్డును ఇషా సింగ్‌కు బహూకరించారు. ఈనెల 9న రాష్ట్రపతి భవన్‌లో జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. అయితే అదే సమయంలో ఇషా జకార్తాలో ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఆడుతుండటంతో ఆమె హాజరుకాలేకపోయింది. ఇషాకు 'అర్జున' అందించిన అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ పారిస్ ఒలింపిక్స్ నుంచి ఇషా పతకంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

విండీస్ 188 ఆలౌట్


హాజల్‌వుడ్

అడిలైడ్: పేస్ బౌలర్లు హాజల్‌వుడ్ (4/44), ప్యాట్ కమిన్స్ (4/41) హడలెత్తించడంతో... ఆస్ట్రేలియాతో బుధవారం మొదలైన తొలి టెస్టులో వెస్టిండీస్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 62.1 ఓవర్లలో 188 పరుగులకే ఆలౌటైంది. కిర్క్ మెకంజీ (50; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ చేయగా... తొలి టెస్టు ఆడుతున్న షమర్ జోసెఫ్ (36; 3 ఫోర్లు, 1 సిక్స్) చివరి వికెట్‌కు కీమర్ రోచ్ (17 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి 55 పరుగులు జోడించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 21 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 59 పరుగులు సాధించింది. తన 106వ టెస్టులో తొలిసారి ఓపెనర్‌గా వచ్చిన స్టీవ్ స్మిత్ (26 బంతుల్లో 12; 2 ఫోర్లు), లబుషేన్ (10; 1 ఫోర్)లను షమర్ జోసెఫ్ అవుట్ చేశాడు. ఉస్మాన్ ఖ్వాజా (30 బ్యాటింగ్; 4 ఫోర్లు), గ్రీన్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

తొలి రౌండ్‌లోనే శ్రీకాంత్ ఓటమి

- ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ
- ఇండియా ఓపెన్ టోర్నీ


శ్రీకాంత్

న్యూఢిల్లీ: కొత్త ఏడాదిలోని రెండో టోర్నమెంట్‌లోనూ భారత బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్‌కు నిరాశ ఎదురైంది. ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీ నుంచి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. 47 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ 22–24, 13–21తో ప్రపంచ 18వ ర్యాంకర్ లీ చెయుక్ యి (హాంకాంగ్) చేతిలో ఓడిపోయాడు. ఈ టోర్నీకంటే ముందు మలేసియా ఓపెన్‌లో ఆడిన శ్రీకాంత్ రెండో రౌండ్‌లో ఓటమి చవిచూశాడు. మరోవైపు పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 78 నిమిషాల్లో 21–15, 19–21, 21–16తో ఫాంగ్ చి లీ–ఫాంగ్ జెన్ లీ (చైనీస్ తైపీ) జోడీపై కష్టపడి గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో తనీషా క్రాస్టో–అశ్విని పొన్నప్ప (భారత్) జంట 5–21, 21–18, 11–21తో జాంగ్‌కోల్పన్–ప్రజోంగ్‌జాయ్ (థాయ్‌లాండ్) జోడీ చేతిలో ఓడిపోయింది.

అండ్రీవా సంచలనం

ఆరో సీడ్ జెబర్‌పై విజయం


అండ్రీవా


జెబర్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో సంచలనాలు నమోదయ్యాయి. రష్యాకు చెందిన 16 ఏళ్ల మిరా అండ్రీవా అద్భుత ఆటతో ప్రపంచ ఆరో ర్యాంకర్, ఆరో సీడ్ ఆన్స్ జెబర్ (ట్యునీషియా)ను ఇంటిదారి పట్టించగా... ఎలీనా అవనెస్యాన్ (రష్యా) ఎనిమిదో సీడ్ మరియా సాకరి (గ్రీస్)ను బోల్తా కొట్టించింది. కేవలం 54 నిమిషాల్లో ముగిసిన ఈ రెండో రౌండ్ మ్యాచ్‌లో అండ్రీవా 6–0, 6–2తో ఆన్స్ జెబర్‌పై, ఎలీనా 6–4, 6–4తో సాకరిపై గెలిచి మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్) 6–3, 6–2తో ప్రువిర్తోవా (చెక్ రిపబ్లిక్)పై, నాలుగో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 7–6 (7/2), 6–2తో డొలెహిడె (అమెరికా)పై, తొమ్మిదో సీడ్ క్రిచికోవా (చెక్ రిపబ్లిక్) 6–2, 6–2తో తమారా (జర్మనీ)పై గెలిచారు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ 3 గంటల 11 నిమిషాల్లో 6–3, 4–6, 7–6 (7/4), 6–3తో అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు.

అలెన్ 16 సిక్స్‌లు



డ్యూనెడిన్: పాకిస్తాన్‌తో జరిగిన మూడో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. పాక్ బౌలర్ల భరతం పట్టిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అలెన్ (62 బంతుల్లో 137; 5 ఫోర్లు, 16 సిక్స్‌లు) అంతర్జాతీయ టి20ల్లో రెండో సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో ఒకే టి20 ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన అఫ్గానిస్తాన్ బ్యాటర్ హజ్రతుల్లా జజాయ్ (16 సిక్స్‌లు; ఐర్లాండ్‌పై 2019లో) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును అలెన్ సమం చేశాడు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ అలెన్ వీర విధ్వంసంతో 20 ఓవర్లలో 7 వికెట్లకు 224 పరుగులు చేసింది. అనంతరం పాకిస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 179 పరుగులకే పరిమితం కావడంతో న్యూజిలాండ్ 45 పరుగులతో గెలిచింది. బాబర్ ఆజమ్ (37 బంతుల్లో 58; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేశాడు. ఈ గెలుపుతో న్యూజిలాండ్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3–0తో సొంతం చేసుకుంది.

సినిమా

గ్రహాంతరవాసి వస్తున్నాడు


● రకుల్, శివ కార్తికేయన్

తమిళ చిత్రం 'అయలాన్' తెలుగులో విడుదల కానుంది. శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా ఆర్. రవికుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'అయలాన్'. కోటపాడి జె. రాజేశ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న తమిళ్‌లో విడుదలైంది. ఈ నెల 26న తెలుగులో విడుదల చేయనున్నట్లు గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ప్రకటించింది. ''ఫ్యాంటసీ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'అయలాన్'. ఏలియన్ (గ్రహాంతర వాసి) ప్రధాన పాత్రలో దక్షిణాది భాషల్లో వచ్చిన తొలి సినిమా మాదే. వీఎఫ్ఎక్స్ షాట్స్‌కి సుమారు రెండేళ్లు పట్టింది. తమిళ్‌లో కేవలం నాలుగు రోజుల్లో రూ. 50 కోట్లు వసూలు చేసింది. తెలుగు ప్రేక్షకులకు కూడా ఈ సినిమా చూపించాలని ఈ నెల 26న రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు కోటపాడి జె. రాజేశ్.

చావునే చెండాడు ధీరుడు...


● మానుషీ చిల్లర్, వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటించిన తొలి హిందీ చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మానుషీ చిల్లర్ హీరోయిన్‌గా నటించారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్‌పై సందీప్ ముద్దా నిర్మించిన ఈ మూవీ తెలుగు, హిందీలో ఫిబ్రవరి 16న విడుదల కానుంది. మిక్కీ జె. మేయర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'వందేమాతరం..' అంటూ సాగే తొలి పాటని అమృతసర్‌లోని వాఘా సరిహద్దులో విడుదల చేశారు. 'చూడరా సంగ్రామ శూరుడు.. మండె రా మధ్యాహ్న సూర్యుడు.. చావునే చెండాడు ధీరుడు.. నిప్పులు కురిశాడు.. వందేమాతరం..' అంటూ ఈ పాట సాగుతుంది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటని తెలుగులో అనురాగ్ కులకర్ణి, హిందీలో సుఖ్వీందర్ సింగ్ ఆలపించారు. ''ఎయిర్ ఫోర్స్ యాక్షన్ అడ్వెంచరస్ మూవీగా 'ఆపరేషన్ వాలెంటైన్' రూపొందింది. దేశ స్ఫూర్తిని చాటే దేశభక్తి గీతమైన 'వందేమాతరం..'ని వాఘా సరిహద్దులో విడుదల చేశాం. ఇక్కడ రిలీజ్ చేసిన తొలి పాటగా 'వందేమాతరం..' చరిత్ర సృష్టించింది'' అని మేకర్స్ తెలిపారు. ఈ పాట ఆవిష్కరణలో వరుణ్ తేజ్, మానుషీ చిల్లర్‌తో సహా టీమ్ పాల్గొన్నారు.

ఎర దొరికింది


● ధనుష్

'**తె**ల్ల దొరలకి దొంగవి.. నీలాగ నేను కూడా ఒక హంతకురాల్ని అయ్యుంటే వాడ్ని నేనే చంపేదాన్ని.. నా కోసం వాడు చావాలి' అనే డైలాగ్స్‌తో 'కెప్టెన్ మిల్లర్' సినిమా ట్రైలర్ విడుదలైంది. ధనుష్ హీరోగా ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటించగా, శివ రాజ్‌కుమార్, సందీప్ కిషన్ కీలక పాత్రల్లో నటించారు. టీజీ త్యాగరాజన్ సమర్పణలో సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్, జి. శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న తమిళంలో విడుదలైంది. ఈ సినిమాని ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ ఈ నెల 25న తెలుగులో విడుదల చేస్తున్నాయి. ఈ సందర్భంగా ట్రైలర్‌ని హీరోలు నాగార్జున, వెంకటేశ్ సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. 'ఆకలి మీద ఉన్న ఒక సింహానికి ఎర దొరికింది.. దాన్ని ఎలాగైనా సరే కొట్టేయాలని ఒక గాడిద పులి గుంపు కాచుకుని ఉంది.. అప్పుడు ఆ ఎరని తోడేళ్లు లాక్కెళితే... ఏమవుతుంది?' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి.

ఇటు గందరగోళం... అటు ఆశ్చర్యం


● సెంథిల్ రామ్మూర్తి, విద్యా బాలన్, ప్రతీక్ గాంధీ, ఇలియానా

'**ప్రే**మ మిమ్మల్ని ఇటు గందరగోళానికి గురి చేస్తుంది.. అటు ఆశ్చర్యపరుస్తుంది' అని అంటున్నారు ఇలియానా. హిందీ చిత్రం 'దో ఔర్ దో ప్యార్' సినిమా గురించే ఇలియానా ఇలా అన్నారు. ఈ సినిమాలో ఇలియానాతో పాటు విద్యా బాలన్, ప్రతీక్ గాంధీ, సెంథిల్ రామ్మూర్తి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. దర్శకురాలు శిర్షా గుహ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టైటిల్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేసి, ఈ చిత్రాన్ని మార్చి 29న థియేటర్స్‌లో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని సమాచారం.

సస్పెన్స్‌తో భయం


● వేదిక

'**ము**ని, బాణం, కాంచన 3, రూలర్' వంటి పలు చిత్రాలతో తనకంటూ గుర్తింపు పొందిన హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో 'ఫియర్' సినిమా ఆరంభం అయింది. హరిత గోగినేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నటుడు అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. దత్తాత్రేయ మీడియా బ్యానర్‌పై ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి డైరెక్టర్ కరుణాకరన్ క్లాప్ ఇవ్వగా, నటుడు, నిర్మాత మురళీ మోహన్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. వేదిక మాట్లాడుతూ– ''సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలతో రూపొందుతోన్న చిత్రమిది'' అన్నారు. ''ప్రేక్షకులకు ఎలాంటి సినిమా నచ్చుతుందా అని ఆలోచించి ఏడాది కష్టపడి 'ఫియర్' (భయం) కథ రెడీ చేశాను'' అన్నారు హరిత గోగినేని. ''హరిత నా భార్య. మా సంస్థలో 'లక్కీ లక్ష్మణ్' సినిమాకు పని చేసింది. డైరెక్షన్ కూడా పర్ఫెక్ట్‌గా చేయగలననే నమ్మకంతో 'ఫియర్' చేస్తోంది'' అన్నారు ఏఆర్ అభి. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, సహనిర్మాత: సుజాత రెడ్డి.

వేసవిలో పతంగ్


● ప్రీతి పగడాల

ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల హీరోయిన్‌గా పరిచయమవుతున్న చిత్రం 'పతంగ్'. తన ఫొటోలు, వీడియోలు, అమెరికన్ యాక్సెంట్‌లో తెలుగు మాట్లాడుతూ ఎంటర్‌టైన్ చేస్తుంటారామె. 'పతంగ్'కి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహిస్తున్నారు. 'జీ సరిగమప' రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్, ప్రముఖ సింగర్ ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ– ''సికింద్రాబాద్ బస్తీ నేపథ్యంలో రూపొందుతోన్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా ఇది. వినోదం, భావోద్వేగాలు.. ఇలా అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉంటాయి. ప్రస్తుతం చివరి షెడ్యూల్ షూటింగ్ జరుగుతోంది'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,628	460
71,501	21,572

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,784	▽ 161
డోజోన్స్	37,237	▽ 124
ఎఫ్‌టీఎస్ఈ 100	7,446	▽ 112
డాక్స్	16,432	▽ 140
షాంఘై	2,834	▽ 60
నికాయ్	35,477	▽ 141

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,277	▽ 331
బంగారం (99.5 స్వచ్ఛత)	62,028	▽ 329
వెండి (కేజీ)	71,171	▽ 475

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.73	83.75
£	బ్రిటన్ పౌండ్		103.77	106.34
€	యూరో		89.28	91.64
¥	జపాన్ ఎన్ (100)		55.85	57.12
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.75	55.67
S$	సింగపూర్ డాలర్		61.21	62.67
SAR	సౌదీ రియాల్		21.21	22.84
UAE D	యూఏఈ దిర్హామ్		21.74	23.53
¥	చైనా యువాన్		10.43	12.51

క్రాష్ మార్కెట్..!



18 నెలల్లో అతిపెద్ద పతనం

- 2% పైగా క్షీణించిన సెన్సెక్స్, నిఫ్టీ
- ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు
- బ్యాంకింగ్, మెటల్, ఆయిల్ షేర్లలో అమ్మకాలు
- రూ. 4.69 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: స్టాక్ మార్కెట్‌పై బేర్ ప్రతాపం చూపింది. ఫలితంగా కొత్త ఏడాదిలో జీవితకాల గరిష్టాల వద్ద ట్రేడవుతున్న సెన్సెక్స్ గత, 18 నెలల్లో భారీ పతనాన్ని బుధవారం చవిచూసింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు(8.46%)పతనం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఆందోళనలు, అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం గతేడాది (2023) చైనా ఆర్థిక వృద్ధి నిరాశపరచడం తదితర పరిణామాలు ఇందుకు కారణమయ్యాయి. సెన్సెక్స్ ఒకటిన్నర శాతానికి పైగా నష్టపోవడంతో బీఎస్ఈలో రూ.4.69 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.370 లక్షల కోట్లకు దిగివచ్చింది. కాగా గడిచిన 2 రోజుల్లో రూ.5.73 లక్షల కోట్ల సంపద ఆవిరైంది.

హెచ్‌డీఎఫ్‌సీకి.. రూ.1.07 లక్షల కోట్ల నష్టం

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు డిసెంబర్ క్వార్టర్ ఫలితాలు నిరాశపరిచాయి. రుణ వృద్ధి, లిక్విడిటీ కవరేజ్ రేషియో(ఎల్‌సీఆర్)లపై ఆందోళన వ్యక్తం చేస్తూ బ్రోకరేజ్ సంస్థలైన సీఎల్ఎస్ఏ, మోర్గాన్ స్టాన్లీలు షేరు రేటింగ్ తగ్గించాయి. దీంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు 8.46% నష్టపోయి రూ.1,537 వద్ద ముగిసింది. బ్యాంకు మార్కెట్ విలువ ఒక్క రోజులోనే రూ.1.07 లక్షల కోట్లు ఆవిరై రూ.11.66 లక్షల కోట్లకు దిగివచ్చింది.

అత్యంత విలువైన పీఎస్‌యూగా ఎల్ఐసీ

ఎల్ఐసీ కంపెనీ అరుదైన రికార్డు సృష్టించింది. ప్రభుత్వ రంగ లిస్టెడ్ కంపెనీల్లో అత్యంత విలువైనదిగా అవతరించింది. ఈ షేరు ఇంట్రాడేలో 3% లాభపడి రూ.919 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో 1% నష్టంతో రూ.887 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ.5.60 లక్షల కోట్లకు చేరింది. ఎస్‌బీఐ షేరు 1.67% తగ్గింది. మార్కెట్ క్యాప్ రూ.5.58 లక్షల కోట్లుగా నమోదై రెండో స్థానానికి దిగివచ్చింది.

బ్యాంకింగ్, మెటల్, ఆయిల్ రంగ షేర్లు భారీగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

రోజంతా నష్టాల్లోనే ట్రేడింగ్

ఉదయం సెన్సెక్స్ 1,130 పాయింట్ల పతనంతో 71,999 వద్ద, నిఫ్టీ 385 పాయింట్ల నష్టంతో 21,647 వద్ద మొదలయ్యాయి. తర్వాత ఏ దశలోనూ కోలుకోలేదు. ఒకానొక దశలో సెన్సెక్స్ 1,699 పాయింట్లు క్షీణించి 71,429 వద్ద, నిఫ్టీ 482 పాయింట్లు దిగివచ్చి 21,550 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు పడ్డాయి. చివరికి సెన్సెక్స్ 1,628 పాయింట్లు నష్టపోయి 71,501 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 460 పాయింట్లు పతనమై 21,572 వద్ద స్థిరపడ్డాయి.

2022 జూన్ 13 తర్వాత సూచీలకిదే అత్యంత భారీ పతనం కావడం గమనార్హం.

- చైనా ఆర్థిక వృద్ధి రేటు 2023లో (5.2%) అంచనాలు అందుకోలేకపోవడం, డాలర్ ఇండెక్స్ నెల గరిష్టానికి చేరుకోవడంతో మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెయిల్ 5%, టాటా స్టీల్, నాల్కో, జిందాల్ స్టీల్ షేర్లు 4% పతనమయ్యాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో, ఎన్ఎండీసీ, వేదాంత, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు 3%, హిందుస్తాన్ కాపర్, హిందాల్కో జింక్ షేర్లు 2.5% నుంచి ఒకశాతం చొప్పున నష్టపోయాయి.

కుప్పకూలింది ఇందుకే...

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పతన ప్రభావం

అధిక వెయిటేజీ కలిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు (8.46%) నష్టం పతనం సూచీల భారీ పతనానికి ప్రధాన కారణంగా నిలిచింది. నిఫ్టీ కోల్పోయిన మొత్తం 460 పాయింట్లలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వాటాయే 235 పాయింట్లు కావడం గమనార్హం.

ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు వాయిదా ఆందోళన

యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లపై ప్రభావం చూపించే అమెరికా డిసెంబర్ ద్రవ్యోల్బణ డేటా, ఉపాధి కల్పన గణాంకాలు అంచనాలకు మించి నమోదడవడంతో 'వడ్డీ రేట్ల తగ్గింపు వాయిదా' అంచనాలు తెరపైకి వచ్చాయి. దీంతో అమెరికాలో పదేళ్ల కాల పరిమితి కలిగిన బాండ్లపై రాబడులు(4.04%) ఒక్కసారిగా పెరిగాయి. విదేశీ పెట్టుబడులు ఈక్విటీల నుంచి బాండ్లలోకి తరలిపోతాయనే ఆందోళనలు అధికమయ్యాయి. అలాగే క్రూడాయిల్‌తో పాటు ఇతర కమోడిటీల ధరల పెంపునకు కారణమయ్యే డాలర్ ఇండెక్స్ సైతం నెలరోజుల గరిష్టానికి చేరడమూ ప్రతికూల ప్రభావాన్ని చూపింది.

ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల డీలా

ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు వడ్డీరేట్ల తగ్గింపు వాయిదా అంచనాలు, చైనా ఆర్థిక వ్యవస్థ బలహీన సంకేతాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడయ్యాయి. ఆసియా మార్కెట్లు 2% క్షీణించి నెల రోజుల కనిష్టానికి దిగివచ్చాయి. యూరప్ మార్కెట్లు 2 శాతం మేర క్షీణించాయి. అమెరికా ఒక శాతానికి పైగా నష్టంతో ట్రేడవుతున్నాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల పతన ప్రభావం దలాల్ స్ట్రీట్‌పైనా పడింది.

టాటా పంచ్ ఈవీ వచ్చేసింది



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ పంచ్ ఎలక్ట్రిక్‌ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూం ధర రూ.10.99 లక్షలతో మొదలై రూ.14.49 లక్షల వరకు ఉంది. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 9.5 సెకన్లలో చేరుకుంటుంది. రెండు బ్యాటరీ ప్యాక్ ఆప్షన్స్‌తో లభిస్తుంది. ఒకసారి చార్జింగ్‌తో 25 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 315 కిలోమీటర్లు, 35 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 421 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ వెల్లడించింది. 190 ఎన్ఎం టార్క్‌తో 120 బీహెచ్‌పీ, అలాగే 114 ఎన్ఎం టార్క్‌తో 80 బీహెచ్‌పీ వర్షన్స్‌లో తయారైంది. 6 ఎయిర్‌బ్యాగ్స్, 360 డిగ్రీ కెమెరా, ఏబీఎస్, ఈఎస్‌సీ, ఈఎస్‌పీ, క్రూజ్ కంట్రోల్, 360 లీటర్ల బూట్ స్పేస్ వంటి హంగులు ఉన్నాయి. ఎనిమిదేళ్లు లేదా 1,60,000 కిలోమీటర్ల వరకు వ్యారంటీ ఉంది. డెలివరీలు జనవరి 22 నుంచి ప్రారంభం.

ఏషియన్ పెయింట్స్ లాభం 34 శాతం అప్

క్యూ3లో రూ. 1,475 కోట్లు


న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఏషియన్ పెయింట్స్ లాభం 34 శాతం ఎగిసి రూ. 1,475 కోట్లకు చేరింది. ముడి వస్తువుల ధరలు తగ్గడం, సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం ఇందుకు తోడ్పడ్డాయి. గతేడాది క్యూ3లో కంపెనీ లాభం రూ. 1,097 కోట్లు. సమీక్షాకాలంలో ఆదాయం 5 శాతం వృద్ధి చెంది రూ. 8,637 కోట్ల నుంచి రూ. 9,103 కోట్లకు చేరింది. కంపెనీ వ్యయాలు స్వల్పంగా పెరిగి రూ. 7,322 కోట్లకు చేరాయి. సుదీర్ఘ పండుగ సీజన్ సైతం ఆదాయ, లాభాల వృద్ధికి దోహదపడినట్లు ఏషియన్ పెయింట్స్ డైరెక్టర్ అమిత్ సింగ్లే తెలిపారు. దక్షిణాసియా, ఈజిప్ట్ వంటి కీలక మార్కెట్లలో స్థూల ఆర్థిక ప్రతికూలతలు నెలకొనడంతో అంతర్జాతీయ వ్యాపార విభాగం ఆదాయం దాదాపు గత క్యూ3 స్థాయిలో రూ. 779 కోట్లుగా నమోదైంది.



బుధవారం ఏషియన్ పెయింట్స్ షేరు 1.67 శాతం క్షీణించి రూ. 3,242 వద్ద ముగిసింది.

ఎన్‌పీసీఐతో గూగుల్ పే ఒప్పందం

భారత్ వెలుపల యూపీఐ చెల్లింపులకు వీలు



న్యూఢిల్లీ: గూగుల్ ఇండియా డిజిటల్ సర్వీసెస్, ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్) అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. దీంతో గూగుల్ పే తన యూపీఐ చెల్లింపుల సేవలను భారత్ వెలుపల కూడా ఆఫర్ చేసేందుకు వీలవుతుంది. ఈ ఒప్పందంతో భారతీయులు విదేశాలకు వెళ్లినప్పుడు గూగుల్ పే (జీపే)తో చెల్లింపులు చేసుకోవచ్చని, వెంట నగదు తీసుకెళ్లాల్సిన అవసరం కానీ, అంతర్జాతీయ పేమెంట్ గేట్‌వేల అవసరం ఉండదని గూగుల్ పే ప్రకటించింది. యూపీఐ ద్వారా విదేశాల నుంచి స్వదేశానికి నగదు బదిలీ సులభతరం అవుతుందని పేర్కొంది.

'బెంగళూరు గోల్డ్ షాపింగ్ ఫెస్టివల్'లో మెరిసిన జీఆర్‌టీ కస్టమర్లు



బెంగళూరు: అతిపెద్ద గోల్డ్ షాపింగ్ పండుగ 'బెంగళూరు గోల్డ్ షాపింగ్ ఫెస్టివల్'లో జీఆర్‌టీ జ్యువెలర్స్ కస్టమర్లు మెరిశారు. పండుగ సీజన్‌లో 'జ్యువెలర్స్ అసోసియేషన్ బెంగళూర్' నిర్వహించిన బంపర్ ప్రైజ్, లక్కీ డ్రా పోటీల్లో 177 మంది జీఆర్‌టీ జ్యువెలర్స్ కస్టమర్లు 20 గ్రాముల బంగారం నాణేల నుంచి 1 కేజీ వెండి వరకూ బహుమతులు గెలుపొందినట్లు కంపెనీ తెలిపింది. విజేతలందరికీ జీఆర్‌టీ జ్యువెలర్స్ సంస్థ ఎండీలు జీఆర్ ఆనంద్ అనంతపద్మనాభన్, జీఆర్ రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు.



జోయాలుక్కాస్‌కు అవార్డులు

'ద రిటైల్ జ్యువెలర్ గ్రూప్' ముంబైలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో సినీ నటులు సన్యా మల్హోత్రా, జోయా అఫ్రోజ్‌ల చేతుల మీద 'బెస్ట్ డిజిటల్/సోషల్ మీడియా మార్కెటింగ్ ఆఫ్ ది ఇయర్, నేషనల్ రిటైల్ చైన్ ఆఫ్ ది ఇయర్' అవార్డులు అందుకుంటున్న జోయాలుక్కాస్ సంస్థ సీఎండీ జాయ్ అలుక్కాస్.

ఎన్‌కోర్-ఆల్కమ్ కొత్త ప్లాంట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అల్యూమినియం డోర్స్, విండోస్ తయారీ కంపెనీ ఎన్‌కోర్-ఆల్కమ్ రూ.60 కోట్లతో గుజరాత్‌లోని సూరత్ వద్ద అత్యాధునిక ప్లాంటు నెలకొల్పుతోంది. అల్యూమినియం డోర్స్, విండోస్ విభాగంలో భారత్‌లో తొలి ఆటో రోబోటిక్ ఫెసిలిటీ ఇదేనని సంస్థ ఫౌండర్, సీఎండీ అవుతు శివకోటిరెడ్డి బుధవారం తెలిపారు. '1,80,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలో అతిపెద్ద కేంద్రం ఇదే. జర్మనీ సాంకేతికతతో రోజుకు 30,000 చదరపు అడుగుల తయారీ సామర్థ్యంతో మార్చికల్లా రెడీ అవుతుంది. ఇప్పటికే సూరత్‌లో అల్యూమినియం డోర్స్, విండోస్ ప్లాంటు ఉంది. కస్టమర్ కోరుకున్నట్టు ఆర్కిటెక్చరల్ ఉత్పాదనలు మా ప్రత్యేకత. 60 కంపెనీలు క్లయింట్లుగా ఉన్నాయి. హైదరాబాద్ సమీపంలోని మోకిల వద్ద ఫ్యాబ్రికేషన్ యూనిట్, ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ మార్చికల్లా ప్రారంభం అవుతాయి.



ఎన్‌కోర్-ఆల్కమ్ ఫౌండర్ అవుతు శివకోటిరెడ్డి

ఎన్‌కోర్ ఇప్పటికే వుడ్ డోర్స్ తయారీలో ఉంది. దక్షిణాదిన ఎన్‌కోర్, ఉత్తరాదిన ఆల్కమ్ బ్రాండ్‌లో కార్యకలాపాలు సాగిస్తున్నాం' అని వివరించారు. హైటెక్స్‌లో జనవరి 19 నుంచి జరిగే ఏస్‌టెక్ ట్రేడ్ ఫెయిర్‌లో విభిన్న ఉత్పత్తులను ప్రదర్శిస్తామని ఆల్కమ్ డైరెక్టర్ జయంతి భాయ్ మనుభాయ్ తెలిపారు.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ జ్యుడిషియల్ సర్వీస్‌లో సివిల్ జడ్జి పోస్టులు

ఏపీ స్టేట్ జ్యుడిషియల్ సర్వీస్‌లో సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్)ఉద్యోగాల భర్తీకి అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **పోస్టు పేరు:** సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్).
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 39(డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ -32, ట్రాన్స్‌ఫర్-7)
» **అర్హతలు:**లాలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
» **వయసు:** 35ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్‌లకు ఐదేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో పదేళ్ల సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** నెలకు రూ.77840-రూ.1,36,520 పే స్కేల్ అందుతుంది.
» **ఎంపిక ప్రక్రియ:** స్క్రీనింగ్ టెస్ట్, రాత పరీక్ష, వైవా-వాయిస్ టెస్ట్‌ల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:**31.01.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:**01.03.2024
» **స్క్రీనింగ్ పరీక్ష తేది(కంప్యూటర్ ఆధారిత పరీక్ష):** 13.04.2024
» **వెబ్‌సైట్:** https://aphc.gov.in/recruitment.html

ఇండియన్ ఆర్మీలో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 56వ కోర్సు

ఇండియన్ ఆర్మీ షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 56వ కోర్సులో ప్రవేశాలకు అర్హులైన అవివాహిత పురుషులు, మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **కేటగిరీ వారీగా ఖాళీలు:** ఎన్‌సీసీ పురుషులు-50, ఎన్‌సీసీ మహిళలు-05. ఈ రెండు విభాగాల్లోనూ 6(పురుషులు5, మహిళలు1) పోస్టులు యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు దక్కుతాయి.
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ప్రస్తుతం ఆఖరు సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మూడు అకడమిక్ సంవత్సరాలు ఎన్‌సీసీ సీనియర్ డివిజన్ వింగ్‌లో కొనసాగి ఉండాలి. ఎన్‌సీసీ సి సర్టిఫికేట్‌లో కనీసం బిగ్రేడ్ పొంది ఉండాలి. యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు ఎన్‌సీసీ సి సర్టిఫికేట్ అవసరం లేదు. **వయసు:** 01.07.2024 నాటికి 19 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** అప్లికేషన్ షార్ట్‌లిస్ట్, స్టేజ్-1, స్టేజ్-2 టెస్టులు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **శిక్షణ, వేతనం:** ఎంపికైన అభ్యర్థులకు ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ చెన్నైలో 49 వారాల శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో ప్రతి నెలా రూ.56,100 స్టైపెండ్ చెల్లిస్తారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారికి పీజీ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ డిగ్రీని మద్రాస్ యూనివర్శిటీ ప్రదానం చేస్తుంది. వీరిని లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**06.02.2024
» **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in.

జీఎంయూ, గుజరాత్‌లో ఎంబీఏ, ఎల్ఎల్ఎం ప్రవేశాలు

గాంధీనగర్‌లోని గుజరాత్ మారిటైమ్ యూనివర్శిటీ (జీఎంయూ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **ఎంబీఏ(షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్):** 60 సీట్లు. **అర్హత:** ఏదైనా విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్(మారిటైమ్ లా అండ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ లా):** 30 సీట్లు. **అర్హత:** ఎల్ఎల్‌బీ/లాలో తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 05.06.2024.
» **ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్ తేది:** 09.06.2024.
» **ఇంటర్వ్యూ తేదీలు:**12.06.2024, 13.06.2024
» **వెబ్‌సైట్:** gmu.edu.in

తెలంగాణ బీసీ గురుకులాల్లో 6, 7, 8 తరగతుల బ్యాక్‌లాగ్ ప్రవేశాలు

మహాత్మా జ్యోతిబాపులే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహించే బీసీ గురుకుల పాఠశాలల్లో.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అర్హులైన తెలంగాణకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, అనాథ బాలబాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** విద్యార్థులు సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2022-23 లేదా 2023-24లో విద్యను అభ్యసించి ఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రూ.1,50,000, పట్టణ ప్రాంత విద్యార్థులకు రూ.2,00,000కు మించకూడదు.
» **వయసు:** 31.08.2024 నాటికి ఆరో తరగతికి పన్నెండేళ్లు, ఏడో తరగతికి పదమూడేళ్లు, ఎనిమిదో తరగతికి పద్నాలుగేళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.02.2024
» **హాల్ టికెట్ డౌన్‌లోడ్ తేది:** 23.02.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 03.03.2024.
» **అడ్మిషన్ ప్రక్రియ ముగింపుతేది:** 31.07.2024
» **వెబ్‌సైట్:** mjpabcwreis.cgg.gov.in

గేట్‌లో బెస్ట్ స్కోర్ ఇలా!

» ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో గేట్ పరీక్ష
» కొనసాగుతున్న హాల్ టికెట్ డౌన్‌లోడ్
» వేగం, కచ్చితత్వంతో బెస్ట్ స్కోర్‌కు ఆస్కారం
» రివిజన్‌పై దృష్టిపెట్టాలంటున్న నిపుణులు

గేట్.. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్! ఇది దేశంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు పరిచయం అక్కర్లేని పరీక్ష! ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+పీహెచ్‌డీలో ప్రవేశాలకు నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్!! దీంతోపాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలకు సైతం గేట్ స్కోర్ ప్రామాణికంగా నిలుస్తోంది. గేట్-2024 ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో జరుగనుంది. ఈ నేపథ్యంలో.. ఈ పరీక్షలో బెస్ట్ స్కోర్ సాధించేందుకు నిపుణుల సలహాలు..

ఎంట్రన్స్ టెస్ట్‌లైనా.. అకడమిక్ పరీక్షలైనా.. ఎన్ని రోజులు చదివాం అనేదాని కంటే.. పరీక్ష రోజు ఎలాంటి ప్రదర్శన ఇచ్చామన్నదే ముఖ్యం. నెలల తరబడి సాగించే ప్రిపరేషన్ ఒక ఎత్తైతే.. పరీక్షకు పది రోజుల ముందు చేసే రివిజన్, ప్రాక్టీస్ నిర్ణయాత్మకంగా మారుతోంది. అన్నింటికంటే ముఖ్యంగా పరీక్ష హాల్లో చూపే ప్రతిభ అత్యంత కీలకం అంటున్నారు నిపుణులు.

గేట్ పరీక్ష ఇలా

గేట్ పరీక్షలో 65 ప్రశ్నలు-వంద మార్కులకు ఉంటాయి. ఇందులో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి. అవి.. జనరల్ ఆప్టిట్యూడ్, ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్, సంబంధిత సబ్జెక్ట్. పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు.

రివిజన్

గేట్-2024 అభ్యర్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ పదిహేను రోజుల సమయాన్ని పూర్తిగా పునశ్చరణకే కేటాయించాలి. ఇప్పటి వరకు చదివిన అంశాలు, వాటికి సంబంధించిన ముఖ్యమైన పాయింట్లు, ఫార్ములాలతో రూపొందించుకున్న సొంత నోట్స్‌ను పరిశీలిస్తూ వేగంగా రివిజన్ కొనసాగించాలి. దీనివల్ల తక్కువ సమయంలోనే ఇప్పటి వరకు చదివిన అన్ని అంశాలను మరోసారి రీక్యాప్ చేసేందుకు వీలవుతుంది.

వేగం, కచ్చితత్వం

గేట్ అభ్యర్థులు ప్రస్తుత సమయంలో వేగంగా సమాధానాలు ఇచ్చేలా ప్రాక్టీస్ చేయాలి. అదే సమయంలో కచ్చితత్వం ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం ముఖ్యమైన ఫార్ములాలతో రాసుకున్న నోట్స్‌ను పునరావలోకనం చేసుకోవడం మేలు. ఒక ప్రశ్నను చూస్తూనే.. దానికి సంబంధించిన మూల భావన మదిలో మెదిలేలా.. సంబంధిత ఫార్ములాలతో భిన్నమైన ప్రశ్నలను సాధన చేయాలి. అదే విధంగా మాక్ టెస్ట్‌లకు హాజరై.. పొరపాట్లకు కారణాలను విశ్లేషించుకోవాలి.

ఫార్ములాలు, కాన్సెప్టులు

గేట్ అభ్యర్థులు ప్రస్తుత సమయంలో ఆయా సబ్జెక్ట్‌లు, టాపిక్‌లకు సంబంధించి ముఖ్యమైన ఫార్ములాలు, కాన్సెప్ట్‌లను మరోసారి అవలోకనం చేసుకోవాలి. ముఖ్యంగా మెకానికల్, సీఎస్ఈ, ఈసీఈ అభ్యర్థులకు ఇది ఎంతో అవసరం. అదే విధంగా ఇతర సబ్జెక్ట్‌ల విషయంలోనూ ఈ విధానం పరీక్ష హాల్లో మెరుగైన ప్రతిభ కనబర్చేందుకు ఎంతో దోహదం చేస్తుంది. ప్రిపరేషన్‌లో అప్లికేషన్ అప్రోచ్‌ను అనుసరిస్తే పరీక్ష హాల్లో ఎలాంటి ప్రశ్న అడిగినా.. సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది. తద్వారా మంచి స్కోర్ సాధనలో ముందంజలో నిలిచే ఆస్కారం ఉంటుంది.

మాక్ టెస్ట్‌లు

గేట్ అభ్యర్థులు ప్రస్తుత సమయంలో మాక్ టెస్ట్‌లకు హాజరై, వాటి ఫలితాలను విశ్లేషించుకోవాలి. ఏదైనా టాపిక్‌లో తక్కువ మార్కులు వచ్చినా.. కొత్తగా వాటిని చదివే ప్రయత్నం చేయడం సరి కాదు. దీనికి బదులు ఇప్పటికే బాగా పట్టున్న విభాగంలో మరింత మెరుగ్గా రాణించేందుకు కృషి చేయాలి. అదేవిధంగా అభ్యర్థులు గేట్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న 'మాక్ టెస్ట్' సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఎందుకంటే.. అధికారిక వెబ్‌సైట్‌లోని మాక్ టెస్ట్‌లు.. పరీక్ష విధానంతోపాటు ప్రశ్నలు అడిగే తీరుపైనా అవగాహన పెంచుతాయి.

వర్చువల్ కాలిక్యులేటర్

మూడు గంటల వ్యవధిలో జరిగే గేట్ పరీక్షలో అంచెల వారీగా సాధన చేసి సమాధానం రాబట్టే ప్రశ్నలు కూడా ఉంటాయి. అంతేకాకుండా మొత్తం 65 ప్రశ్నల్లో అధిక శాతం ప్రశ్నలు కాలిక్యులేటర్‌ను వినియోగించాల్సిన విధంగా ఉంటున్నాయి. కాబట్టి వర్చువల్ కాలిక్యులేటర్‌ను వేగంగా వినియోగించే నైపుణ్యం పెంచుకోవాలి. ఫలితంగా ఒక ప్రశ్నకు వీలైనంత త్వరగా సమాధానం ఇచ్చే నేర్పు లభిస్తుంది.

పరీక్ష రోజు ఇలా

పరీక్ష రోజున అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా నిర్ణీత సమయాని కంటే ముందుగానే కేంద్రానికి వెళ్లాలి. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షకు..సంబంధిత పోర్టల్‌లో నిర్దిష్ట స్లాట్‌కు 20 నిమిషాల ముందుగానే లాగిన్ అయ్యే అవకాశం ఉంది. అభ్యర్థులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఫలితంగా పరీక్షకు సంబంధించి ముఖ్యమైన నిబంధనలు చదివే సమయం లభిస్తుంది.

- పరీక్ష రాసేందుకు సిద్ధమయ్యే ముందు.. ఆన్‌లైన్ విండోలో 'వ్యూ ఆల్ కొశ్చన్స్' ట్యాబ్ పై క్లిక్ చేయాలి. దీనివల్ల మొత్తం అన్ని ప్రశ్నలను చదివే అవకాశం ఉంటుంది. తద్వారా ఏ ప్రశ్న లేదా సెక్షన్‌ను ముందుగా ప్రారంభించాలి అనే అంశంపై స్పష్టత వస్తుంది. ముందుగా సులువైన లేదా తమకు బాగా అవగాహన ఉన్న సెక్షన్‌ను ఎంచుకుని.. వాటిని త్వరగా పూర్తి చేసుకోవాలి. ఆ తర్వాత క్లిష్టమైన సెక్షన్‌ల సాధన దిశగా అడుగులు వేయాలి.
- గేట్ పరీక్షలోని విభాగాల్లో.. ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్ సెక్షన్స్ కొంత సులభంగా ఉంటాయి. అభ్యర్థులు ముందుగా వీటికి సమాధానాలు గుర్తించడం మేలు. ఫలితంగా ఈ సెక్షన్లను తక్కువ సమయంలో పూర్తి చేసుకుని.. ఆ తర్వాత సబ్జెక్ట్ ఆధారిత సెక్షన్లకు ఎక్కువ సమయం కేటాయించేందుకు వీలవుతుంది.
- మూడు గంటల పరీక్ష సమయంలో మొదటి గంటన్నరలో బాగా సులువైన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఏదైనా క్లిష్టమైన ప్రశ్న కనిపిస్తే దాన్ని వదిలేసి.. వేరే ప్రశ్నకు వెళ్లాలి. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది కాబట్టి సమాధానం తెలియని ప్రశ్నలను వదిలేయడమే మేలు. అభ్యర్థులు సమాధానాల రివ్యూకు కూడా కొంత సమయం కేటాయించాలి. చివరల్లో అన్ని సమాధానాలను సరి చూసుకుని.. అవి సరైనవా? కాదా? అని పరిశీలించాలి. సమాధానాలిచ్చే క్రమంలో రఫ్ వర్క్ చేయడం కూడా మేలు చేస్తుంది. ముఖ్యంగా ఫార్ములా ఆధారిత ప్రశ్నలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్‌లోనే ప్రశ్నను చూస్తూ.. కేవలం ఆలోచన ఆధారంగా సమాధానాలివ్వడం ఒక్కోసారి తప్పు సమాధానాలకు దారి తీస్తుంది. కాబట్టి ఎగ్జామ్ హాల్లో అందించే స్క్రిబిల్ ప్యాడ్‌పై ప్రశ్నను సాల్వ్ చేసి.. ఆ సమాధానం కరెక్ట్ అనుకున్నప్పుడే దానికి సంబంధించిన ఆప్షన్ బటన్‌ను క్లిక్ చేయాలి.

నిబంధనలు-జాగ్రత్తగా

గేట్ అభ్యర్థులు పరీక్ష హాల్లోకి తీసుకెళ్లాల్సిన డాక్యుమెంట్స్‌ను ముందుగానే సిద్ధం చేసుకోవాలి. ముఖ్యంగా సాధ్యమైనంత త్వరగా అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. గేట్ నిర్వాహక కమిటీ నిబంధనల ప్రకారం-అప్లికేషన్ సమయంలో పేర్కొన్న వ్యక్తిగత ఫోటో ఐడెంటిటీ కార్డ్ ఒరిజినల్ కాపీని పరీక్ష హాల్లో చూపించాల్సి ఉంటుంది. వాటిని ముందుగానే సిద్ధం చేసుకోవాలి. చివరి నిమిషంలో టెక్నికల్ ఎర్రర్స్, వెబ్‌సైట్ ట్రాఫిక్ పెరిగి వెబ్‌సైట్ ఓపెన్ అవకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. కాబట్టి వీలైనంత ముందుగా దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకోవాలి.



గేట్‌తో ప్రయోజనాలెన్నో!

గేట్ స్కోర్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఐఐటీలు, ఎన్ఐటీలు, రాష్ట్రాల స్థాయిలోని యూనివర్సిటీల్లో ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో చేరే అవకాశం లభిస్తుంది. దీంతో పాటు రాష్ట్రాల స్థాయిలో పీజీఈసెట్ కౌన్సెలింగ్‌లో గేట్ ర్యాంకర్లకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. గేట్ ర్యాంకు ఆధారంగా ఎంటెక్ సీటు ఖరారు చేసుకుంటే నెలకు రూ.12,400 స్టయిపండ్ అందుతుంది. ఇంటిగ్రేటెడ్ ఎంటెక్, పీహెచ్‌డీ అభ్యర్థులకు నెలకు రూ.28 వేల స్కాలర్‌షిప్ లభిస్తుంది. గేట్ స్కోర్ ఆధారంగా నవరత్న, మహారత్న, మినీరత్న తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇంజనీర్లుగా కొలువులు సొంతం చేసుకోవచ్చు.

గేట్-2024 ముఖ్య తేదీలు

- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: జనవరి 3 నుంచి ప్రారంభం
- గేట్-2024 తేదీలు: ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో (ప్రతి రోజు రెండు సెషన్లు. మొదటి సెషన్ ఉదయం 9-12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 2-5 గంటల వరకు).
- గేట్ పరీక్ష ఫలితాల వెల్లడి: మార్చి 16, 2024
- స్కోర్ కార్డ్ డౌన్‌లోడ్: మార్చి 23, 2024
- వెబ్‌సైట్: https://gate2024.iisc.ac.in

ఎన్నికలపై ఏఐ క్రీనీడ!

తప్పుడు సమాచారం వ్యాప్తి.. గెలుపోటములపై ప్రభావం

ఫలితాలపై జనరేటివ్ ఏఐ ప్రభావంపై ఆందోళన

కొత్త టెక్నాలజీలతో ముప్పు ఉందన్న డబ్ల్యూఈఎఫ్ నివేదిక

సోషల్ మీడియాలోని సమాచారంపై జాగ్రత్తగా ఉండాలని నిపుణుల హెచ్చరికలు

(కంచర్ల యాదగిరిరెడ్డి)

కీడెంచి మేలెంచాలంటారు పెద్దలు! అక్షర సత్యమిది. కానీ చాలా అంశాల్లో మనకు బోధపడని విషయమూ ఇదే. దానికి తాజా ఉదాహరణ కృత్రిమ మేధ ఆధారిత 'జనరేటివ్ ఏఐ'. ఇటీవల నిత్యం వార్తల్లో కనిపిస్తున్న చాట్‌జీపీటీ, బింగ్, కోపైలట్, డాలీ వంటి తిమ్మిని బమ్మి చేయగల ఆధునిక టెక్నాలజీలు ఇవి. ఏడాదిగా ప్రపంచాన్ని కుదిపేసి, అన్ని రంగాల్లోకీ చొరబడ్డ ఈ టెక్నాలజీ మరో పార్శ్వం ఇప్పుడిప్పుడే అందరికీ అర్థమవుతోంది. మరెందుకు ఆలస్యం చదివేయండి!

నిన్నమొన్నటివరకు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు, నకిలీ వార్తల హవా నడిచింది. దీని వల్ల ఎలాంటి నష్టం జరుగుతుందో చాలా సందర్భాల్లో గమనించే ఉంటాం. స్వప్రయోజనాల కోసం కొందరు తమకిష్టం లేని నేతలు, పార్టీలు, వ్యక్తులపై వదంతులు పుట్టించి తీరని నష్టం చేసిన సంఘటనలూ ఎన్నో ఉన్నాయి. వాస్తవాలు, అసలు విషయాలేమిటో తెలుసుకునేందుకు బోలెడన్ని ఫ్యాక్ట్ చెకింగ్ కోర్సులు, ట్రైనింగ్‌లు, పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయంటేనే పరిస్థితి తీవ్రత ఏమిటన్నది అర్థమైపోతుంది. మంచి చెడుల విచక్షణ, వివేకం ఉన్న మనుషులు సొంతబుద్ధితోనే ఇంత చేయగలిగితే... అందిన సమాచారాన్ని బట్టి కొత్త విషయాలను నేర్చుకుని వాడుకునే 'జనరేటివ్ ఏఐ'తో ఇంకెంత ప్రభావం ఉంటుందనేది ఆందోళన రేపుతోంది. ఇప్పటికే డీప్‌ఫేక్ టెక్నాలజీల సాయంతో హీరోయిన్ల తలలు మార్చేసి అశ్లీల వీడియోలు, నేతల గొంతులు అనుకరించి వివాదాస్పద ఆడియోలు తయారు చేసి వైరల్ చేసిన ఘటనలు పెరుగుతున్నాయి.

అమెరికా ఎన్నికల సమయంలో..

➤ నాలుగేళ్ల క్రితం జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికలతో తప్పుడు ప్రచారం ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరిగింది. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల సాయంతో అమెరికా ఎన్నికలను రష్యా ప్రభావితం చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. నకిలీ వార్తలను నియంత్రించడంలో విఫలమైందని ఫేస్‌బుక్‌పై విమర్శలు వచ్చాయి. ఆన్‌లైన్ అడ్వకసీ గ్రూప్ 'ఆవాజ్'అంచనాల ప్రకారం.. దాదాపు వంద ప్రముఖ ఫేస్‌బుక్ పేజీల్లో పెద్ద ఎత్తున తప్పుడు సమాచారం ప్రసారమైంది. కనీసం 101 కోట్ల పేజ్ వ్యూస్‌ను నివారించే అవకాశం ఉన్నా.. విఫలమైన కారణంగా ఫేస్‌బుక్ అమెరికా అధ్యక్ష ఎన్నికలను తీవ్రంగా ప్రభావితం చేసిందని ఆ సంస్థ చెప్తోంది. అంతేకాదు.. డీప్‌ఫేక్స్ ద్వారా వీడియోలను మార్చేయడం, పోటీలో ఉన్న అభ్యర్థులు ఏవేవో తప్పుడు పనులు చేసిన భ్రమ కల్పించడం.. మాటలు తడబడినట్టు చేయడం ద్వారా వారు అభ్యర్థులుగా పనికిరారన్న అభిప్రాయాన్ని కలిగించేందుకు సోషల్ మీడియా కారణమైందన్న వివాదాలు చెలరేగాయి. అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న బైడెన్‌పై వ్యక్తిగత దాడులతోపాటు ఎన్నికల ప్రక్రియ సమర్థతను ప్రశ్నిస్తూ తప్పుడు సమాచారం ప్రచారంలోకి వచ్చింది. జనరేటివ్ ఏఐ లేదా చాట్‌జీపీటీ వంటి టెక్నాలజీలు అందుబాటులోకి రాకముందే అంత జరిగితే.. వీటి సాయంతో ఇంకెంత ప్రభావం ఉంటుందన్నది ఆందోళనకరం.

మరేం చేయాలి?

➤ ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. కాకపోతే అమలు చేసేందుకు చిత్తశుద్ధి, నిబద్ధత అవసరమవుతాయి. జనరేటివ్ ఏఐతో వస్తున్న నకిలీ వార్తల సమస్యను అధిగమించేందుకు మన ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌ను సరిచేసుకోవాల్సి ఉంటుందని 'ది సెంటర్ ఫర్ కౌంటరింగ్ డిజిటల్ హేట్'చెబుతోంది. ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారం, విద్వేషపూరిత అంశాల వ్యాప్తిని అడ్డుకునేందుకు తాము 'స్టార్'పేరుతో ఒక ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేశామని.. దాన్ని అమలు చేయడం ద్వారా పరిస్థితిని మెరుగుపర్చవచ్చని ఈ సంస్థ చెబుతోంది. స్టార్ ఫ్రేమ్‌వర్క్ అమలు చేస్తే డిజిటల్ ప్రొడక్ట్స్ తయారీలో వాడే అల్గారిథమ్స్‌లో పారదర్శకత పెరుగుతుందని.. ప్రకటనలు, సమాచార ప్రసారానికి సంబంధించి నిబంధనలను కఠినంగా అమలు చేయడం సాధ్యమవుతుందని అంటోంది. మరోవైపు యూరోపియన్ దేశాల సమాఖ్య (ఈయూ) 'డిజిటల్ సర్వీసెస్ యాక్ట్'పేరుతో ఆన్‌లైన్ కార్యకలాపాల పర్యవేక్షణకు చట్టాలు చేయడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం. ఆ చట్టం ద్వారా స్వతంత్ర సంస్థలు, పరిశోధకులు సామాజిక మాధ్యమ సంస్థలను పర్యవేక్షించేందుకు వీలు ఏర్పడింది. యూకే కూడా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల పర్యవేక్షణ, నియంత్రణకు విధానపరమైన చర్యలు తీసుకుంటోంది. కాకపోతే ఈ ఏర్పాట్లన్నీ అమల్లోకి వచ్చేందుకు కొంత సమయం పడుతుంది. ఆ లోపుగా 2024లో జరగాల్సిన నష్టం జరిగిపోతుందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు.



త్వరలోనే కీలక దేశాల్లో ఎన్నికలు..

➤ ఈ ఏడాది భారత్‌తోపాటు అమెరికా, మెక్సికో, ఇండొనేషియా, యూకే వంటి కీలక దేశాల్లో ఎన్నికలు జరగనున్నాయి. అన్నిచోట్లా తీవ్ర పోటీ ఉంది. ఆవాజ్ వంటి కొన్ని స్వతంత్ర సంస్థలు ఇప్పటివరకు సామాజిక మాధ్యమాల్లో నకిలీ వార్తలు, వార్తల తారుమారు వంటి కార్యకలాపాలపై ఓ కన్నేసి ఉంచేవి. హింస, విద్వేషాలను ప్రేరేపించే వార్తలు, అంశాలను పరిశీలిస్తూ.. సంబంధిత ప్రభుత్వాలు, సామాజిక మాధ్యమ సంస్థలను హెచ్చరించేవి. అయితే ఈ ఏడాది పరిస్థితులు మారిపోయాయి. జనరేటివ్ ఏఐ పుట్టించే తప్పుడు సమాచారం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. ఫలితంగా ఆవాజ్ వంటి సంస్థలు, పరిశోధకులు, జర్నలిస్టులు ఆన్‌లైన్ కార్యకలాపాల పర్యవేక్షణకు చేసుకున్న ఏర్పాట్లు, టెక్నాలజీలేవీ పెద్దగా పనిచేయకుండా పోయే పరిస్థితి. వార్తల్లో విశ్వసనీయతను పరీక్షించేందుకు 'ఏఐ4ట్రస్ట్'పేరుతో కొన్ని టెక్నాలజీలను అభివృద్ధి చేసుకున్నవారు కూడా ఇప్పుడు చేతులెత్తేస్తుండటం గమనార్హం. వచ్చే వారం స్విట్జర్లాండ్‌లో జరగనున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) సమావేశాల్లో కృత్రిమ మేధ కారణంగా పెరిగిపోయిన తప్పుడు సమాచారంపై చర్చ జరగనుంది. డబ్ల్యూఈఎఫ్ ఇప్పటికే ఈ విషయానికి సంబంధించి ఒక నివేదికను సిద్ధం చేసింది. ఏఐ టూల్స్ సాయంతో తప్పుడు, నకిలీ సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని.. ఫలితంగా ఈ ఏడాది వివిధ దేశాల్లో జరగనున్న ఎన్నికల ఫలితాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆ నివేదిక చెబుతోంది. ''ఒక రకంగా ఇది చాలా గందరగోళ పరిస్థితి. ఓ పెద్ద పాత్రలోని నూడుల్స్‌లా చాలా అంశాలు కలగలిసిపోయి ఉన్నాయి''అని మార్ష్ మెక్‌లీనన్ అనే స్ట్రాటజీ గ్రూపునకు చెందిన కారొలీనా క్లింట్ చెప్పారు. డబ్ల్యూఈఎఫ్‌తో కలసి ఈ సంస్థ వార్షిక రిస్క్ ర్యాంకింగ్ నివేదికను తయారు చేసింది. ఈ పరిణామాల వల్ల సమాజంలో అశాంతి పెరిగిపోతుందని క్లింట్ అభిప్రాయపడ్డారు.

గవర్నర్ 'ఎక్స్' ఖాతా హ్యాక్



- పాస్‌వర్డ్ మార్చి.. డీపీ తీసేసిన ఆగంతకుడు
- సైబర్ ఠాణాలో రాజ్‌భవన్ వర్గాల ఫిర్యాదు
- ఎమ్మెల్సీ కవిత అకౌంట్ హ్యాకింగ్‌కు యత్నం
- సంబంధం లేని వీడియో పోస్ట్ చేసిన సైబర్ నేరగాళ్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అధికారిక 'ఎక్స్'(ట్విట్టర్) ఖాతా హ్యాక్ అయింది. ఖాతాను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు ఆమె డిస్‌ప్లే పిక్చర్ (డీపీ) తీసేయడంతో పాటు పాస్‌వర్డ్‌ను సైతం మార్చేశారు. దీనిపై రాజ్‌భవన్ వర్గాలు మంగళవారం హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు.. హ్యాకర్‌కు సంబంధించిన వివరాలు ఇవ్వాల్సిందిగా కోరుతూ 'ఎక్స్'కు ఈ–మెయిల్ చేశారు. గవర్నర్‌కు చెందిన అధికారిక 'ఎక్స్'ఖాతా (ఎట్ డీఆర్ తమిళిసై జీయూవీ) 2011 జనవరి నుంచి పని చేస్తోంది. దీనికి ప్రస్తుతం లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఈ ఖాతాను రాజ్‌భవన్ వర్గాలు పర్యవేక్షిస్తుంటాయి. దీనికి అనుసంధానించి ఉన్న ఈ–మెయిల్ ఐడీకి ఆదివారం సాయంత్రం ఓ మెయిల్ వచ్చింది. ఎక్స్‌కు చెందిన సపోర్ట్ టీమ్ నుంచి వచ్చినట్లు ఉన్న ఆ మెయిల్‌లో గవర్నర్‌కు చెందిన ఖాతాలో ఉన్న కొన్ని పోస్టులు తమ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు ఫిర్యాదులు అందాయని సైబర్ నేరగాళ్లు రాశారు. ఆ ఆరోపణలకు సమాధానం ఇవ్వాలనుకుంటే లింకు క్లిక్ చేసి, ఓపెన్ అయ్యే పేజీలో వివరాలు నింపాలని సూచించారు. రాజ్‌భవన్ వర్గాలు లింకును క్లిక్ చేయడంతో ఖాతా సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోయింది. లింక్‌ను ఫోన్‌ద్వారా ఓపెన్ చేయడంతో ఆ నంబర్‌కు సంబంధించిన వాట్సాప్ ఖాతాను సైతం సైబర్ నేరగాళ్లు ఆధీనంలోకి తీసుకున్నారు. అయితే విషయం రాజ్‌భవన్ వర్గాలు గుర్తించలేదు. అలా గవర్నర్ 'ఎక్స్'ఖాతాను తమ అధీనంలోకి తీసుకున్న సైబర్ నేరగాళ్లు డీపీగా ఉండే గవర్నర్ ఫొటోను తొలగించారు. ఆ ఖాతా పాస్‌వర్డ్ మార్చేసి అటు గవర్నర్‌కు, ఇటు రాజ్‌భవన్ వర్గాలకు యాక్సస్ లేకుండా చేశారు. డీపీ డిలీట్ అయిన విషయాన్ని గుర్తించిన రాజ్‌భవన్ వర్గాలు ఖాతాలోకి ప్రవేశించే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. దీంతో మంగళవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ప్రస్తుతానికి గవర్నర్ ఖాతాను 'ఎక్స్' సస్పెన్షన్‌లో ఉంచి ఎవరికీ యాక్సెస్ లేకుండా జాగ్రత్తలు తీసుకుంది. ప్రాథమిక విచారణ అనంతరం ఖాతాను పునరుద్ధరించే అవకాశం ఉంది.

వైద్య మంత్రి ఖాతా కూడా...

వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఫేస్‌బుక్ ఖాతా రెండు రోజుల క్రితం హ్యాక్ అయింది. దీన్ని హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు బీజేపీ, టీడీపీ, తమిళనాడుకు చెందిన పార్టీల పోస్టులు పెట్టాడు. దీనిపై సంగారెడ్డి జిల్లా పార్టీ శ్రేణులు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశాయి. ఇలా వరుస పెట్టి ప్రముఖుల సోషల్ మీడియా ఖాతాలు హ్యాక్ కావడం వెనుక ఏదైనా లింకు ఉందా అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ కవిత సోషల్ ఖాతాలు హ్యాక్



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోషల్ మీడియా ఖాతాలు హ్యాక్ అయ్యాయి. ఇన్‌స్టాగ్రామ్, 'ఎక్స్'ఖాతాలపై నేరగాళ్లు మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకు పలుమార్లు హ్యాకింగ్‌కు యత్నించారు. అనుమానాస్పదంగా లాగిన్ అయిన హ్యాకర్లు ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో సంబంధం లేని వీడియోను పోస్టు చేశారు. వెంటనే గుర్తించిన కవిత తన ఖాతాలు హ్యాకింగ్‌కు గురైనట్లు డీజీపీకి, సైబర్ సెక్యూరిటీ విభాగానికి ట్యాగ్ చేశారు.

తెలంగాణకు ఆరుగురు, ఏపీకి ముగ్గురు ఐపీఎస్‌లు

- 9మంది ఐపీఎస్‌లను 2 రాష్ట్రాలకు కేటాయిస్తూ కేంద్రం ఉత్తర్వులు
- వీరిలో సొంత రాష్ట్రాలకు చెందిన అధికారులు ముగ్గురు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు ఆరుగురు, ఆంధ్రప్రదేశ్‌కు ముగ్గురు ఐపీఎస్ అధికారులను కేంద్రం కేటాయించింది. దేశవ్యాప్తంగా 2022 బ్యాచ్‌కు చెందిన 200 మంది ఐపీఎస్‌లను వివిధ ప్రాంతాలకు కేటాయిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కార్యదర్శి అంజన్ సర్కార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అయోషా ఫాతిమా, మహారాష్ట్రకు చెందిన మంధారే సోహం సునీల్, జమ్మూకశ్మీర్‌కు చెందిన మనాన్ భట్, జార్ఖండ్‌కు చెందిన రాహుల్‌కాంత్‌లతో పాటు తెలంగాణ క్యాడర్‌కు చెందిన రుత్విక్ సాయి కొట్టె, పత్తిపాక సాయికిరణ్‌లను తెలంగాణకు కేటాయించింది. తమిళనాడుకు చెందిన ఆర్.సుష్మిత, రాజస్తాన్‌కు చెందిన ఉమేశ్ మీనాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొడ్డు హేమంత్‌లను ఏపీకి కేటాయించారు. వీరిలో రుత్విక్ సాయి కొట్టె, పత్తిపాక సాయికిరణ్, బొడ్డు హేమంత్‌లు సొంత రాష్ట్రాలకు చెందిన అధికారులు.

చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం

చౌటుప్పల్, సూర్యాపేట: సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లిన ప్రజలంతా హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కావడంతో హైదరాబాద్‌–విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం సైతం రద్దీ కొనసాగింది. హైవేపై వాహనాలు పెద్ద సంఖ్యలో బారులు తీరాయి. మధ్యాహ్నం తర్వాత రద్దీ ఒక్కసారిగా పెరిగింది. సూర్యాపేట శివారులోని జనగామ క్రాస్‌రోడ్డు వద్ద, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ట్రాఫిక్ జామ్ అయింది. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద మొత్తం 16 టోల్‌బూత్‌లకుగాను హైదరాబాద్ వైపునకు 12 బూత్‌లను కేటాయించారు. హైవేపై రద్దీ కారణంగా పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేశారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.